TEXT PROBLEM WITHIN THE BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_206193
UNIVERSAL LIBRARY

బ్రహ్మపురాణము

(రెండవసంపుటము.)

సంపాదకుడు.

నడకుదుటి వీరరాజు పంతులు.

రాజపోషకులు.

మహారాజరాజశ్రీ

బ్రహ్మపురాణము

(రెండవసంపుటము.)

మహా[illegible] ప్రణీతము.

నడకుదుటి వీరరాజు పంతులు

సంపాదకుడు.

వెల రు ౧-౮-౦ లు

పి ఠా పు ర ము

విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాల.

౧౯౨౮.

విజ్ఞాపనము.

చాలమంది చందాదారులును, మిత్రులును మమ్ముఁ గోరుటఁ చే మే మిదివఱకుఁ బ్రకటించినట్లుగా శివపురాణము 5 వ సంపుటమును బంపుట మాని యీబ్రహ్మపురాణము 2 వ సంపుటము నీ నెలలో మా చందాదారుల కందించినారము. మార్చి నెలలో శివపురాణము 5 వ సంపుటమును బంపనిశ్చయించినారము.

సనాతనధర్మనిధానంబులగు నీపురాణములను బ్రకటించు విషయమునందు వ్యయప్రయాసములకోర్చి పనిచేయుచున్న మాకు ఆంధ్రభాషాభిమానులెల్లరు నుచితరీతిని బ్రోత్సాహము గూర్చుచు నిమ్మహోద్యమము నిరంతరాయముగాఁ గొనసాగునట్లు సాహాయ్యముం గావింపవలయునని యాంధ్రదేశభాషోద్ధారకులగు ప్రభువులను, ఉదారహృదయులగు శ్రీమంతులను భాషాపోషకులగు ప్రముఖులను, పత్రికాప్రోత్సాహకులగు చందాదారులను బ్రార్థించుచున్నారము.

పురాణగ్రంథమాలిక,
పిఠాపురము.
6-12-1926.

నడకుదుటి వీరరాజుపంతులు,
సంపాదకుఁడు.

విషయసూచిక.

౧ దక్షయజ్ఞధ్వంసము ౧
౨ ఏకామ్రక్షేత్రమాహాత్మ్యము ౯
౩ ఉత్కలక్షేత్రవర్ణనము ౧౩
౪ అవంతికావర్ణనము ౧౬
౫ ఇంద్రద్యుమ్నుని క్షేత్రదర్శనము ౨౧
౬ పురుషోత్తమక్షేత్రపూర్వవృత్తాంతము ౨౫
౭ పురుషోత్తమక్షేత్రవర్ణనము ౩౦
౮ పురుషోత్తమప్రాసాదనిర్మాణము ౩౨
౯ ప్రతిమానిర్మాణచింతనము ౩౮
౧౦ కారుణ్యస్తవము ౩౯
౧౧ ప్రతిమోత్పత్తి ౪౬
౧౨ పురుషోత్తమవర్ణనము ౫౦
౧౩ మార్కండేయవటదర్శనము ౫౫
౧౪ ప్రళయసందర్శనము ౫౭
౧౫ భగవద్గర్భపరివర్తనము ౬౦
౧౬ భగవద్దర్శనము ౬౪
౧౭ శ్రీకృష్ణసందర్శనమాహాత్మ్యము ౬౯
౧౮ నృసింహమాహాత్మ్యము ౭౩
౧౯ శ్వేతమాధవమాహాత్మ్యము ౭౮
౨౦ సముద్రస్నానవిధి ౮౫
౨౧ పూజావిధి ౯౦
౨౨ సముద్రస్నానమాహాత్మ్యము ౯౬
౨౩ పంచతీర్థమాహాత్మ్యము ౯౮
౨౪ మహాజ్యేష్ఠాప్రశంస ౯౯
౨౫ కృష్ణస్నానమాహాత్మ్యము ౧౦౧
౨౬ గుండిచాయాత్రామాహాత్మ్యము ౧౦౮
౨౭ ద్వాదశయాత్రామాహాత్మ్యము ౧౧౦
౨౮ విష్ణులోకసంకీర్తనము ౧౧౩
౨౯ పురుషోత్తమమాహాత్మ్యము ౧౧౭
౩౦ తీర్థభేదవర్ణనము ౧౧౯
౩౧ శంభువివాహసంభవము ౧౨౨
౩౨ గంగోత్పత్తి ౧౨౬
౩౩ వామనావతారము ౧౩౦
౩౪ గంగాదేవికి హరజటాజూటప్రాప్తి ౧౩౫
౩౫ గౌతమచరిత్రము ౧౩౭
౩౬ గౌతమ్యానయనము ౧౪౬
౩౭ గౌతమీమాహాత్మ్యము ౧౫౧
౩౮ భాగీరథీనద్యవతరణము ౧౫౫
౩౯ వరాహతీర్థవృత్తాంతము ౧౬౨
౪౦ కపోతతీర్థమాహాత్మ్యము ౧౬౪
౪౧ కుమారతీర్థప్రశంస ౧౭౫
౪౨ కృత్తికాతీర్థవృత్తాంతము ౧౭౮
౪౩ దశాశ్వమేధతీర్థసంకీర్తనము ౧౮౦
౪౪ పైశాచికతీర్థప్రస్తావము ౧౮౩
౪౫ క్షుధాతీర్థోత్పత్తికథనము ౧౮౫
౪౬ చక్రతీర్థచరిత్రము ౧౮౮
౪౭ అహల్యాసంగమతీర్థమాహాత్మ్యము ౧౯౯
౪౮ జనస్థానతీర్థవర్ణనము ౨౦౧

శ్రీరామచంద్ర.

బ్రహ్మపురాణము

ద్వితీయసంపుటము.

రూపగుణరహితు, నజు, ని
ర్లేపుని, గూటస్థు, నచలు, లీలామయు, స
ర్వోపాధిముక్తు, సర్వో
ద్దీపితు, నచ్యుతుని బ్రస్తుతింతుము భక్తిన్.

దక్షయజ్ఞధ్వంసము.

బ్రహ్మదేవుం డిట్లనియెను. సుమేరుశైలంబున నానారత్నవిరాజితంబును, విచిత్రంబును, త్రిలోకపూజ్యంబును, అప్రమేయంబును, సర్వజనపూజితంబును నగుజ్యోతిష్కలం బనుశృంగమునందు సర్వధాతుచిత్రితంబును, పర్యంకముంబోలి విశాలంబునగుతటంబునందు పూర్వమొకప్పుడు దేవదేవుండగుశంకరుం డేకాకియై కూర్చుండియుండెను. నిత్యానపాయినియగుగిరికుమారియు నమ్మహాదేవునిపార్శ్వమునం దుపవిష్టయై యుండెను. మహాత్ములగునాదిత్యగణంబులును, తేజోనిధులగువసుగణంబులును, భిషగ్వరులగునశ్వినీకుమారులును, గుహ్యకగణపరివృతుండగుయక్షరాజు వైశ్రవణుండును పరమేశ్వరుండగునాతని నుపాసించుచుండిరి. ఆసమయంబున మహామునియగునుశనుండును, సనత్కుమారప్రముఖమహర్షులును, అంగిర ఆదిదేవర్షులును, పర్వతనారద

దులును, గంధర్వాప్సరోగణంబులును నచ్చటికేతెంచిరి. వివిధకుసుమ పరిమళంబులతో మందమారుతంబులు వీతెంచుచుండెను. తరులతాదులు సర్వర్తుకుసుమసమూహంబులచే విరాజిల్లుచుండెను. సిద్ధవిద్యాధరాదితపోధనులును, నానారూపధరు లగుభూతగణంబులును, మహాకామ్రిలగురాక్షసగణంబులును, పిశాచసంఘములును, వివిధాయుధధరులై, వివిధాకారులైన దేవానుచరులును, శూలధరుండును, భగవానుండు నగునందీశ్వరుండును, సర్వతీర్థమయియై మూర్తీభవించియున్నగంగాదేవియు పశుపతి యగునమ్మహాదేవు నుపాసించుచుండిరి.

ఇట్లు సకలదేవతాసమూహంబులచేతను భగవానుండగుశంకరుండు సంపూజితుండై యున్నసమయంబునఁ బ్రజాపతి యగుదక్షుండు పూర్వోక్తవిధానంబున యజ్ఞముం గావించుట కారంభించి యుండెను. స్వర్గమునుండి యింద్రాదిదేవతలందఱును దక్షాలయంబునకుఁ జేరియుండిరి. వారందఱును దివ్యవిమానారూఢులై నానాద్రుమలతాకీర్ణంబగు గంగాద్వారమునఁ బరివేష్టించి యుండిరి. యజ్ఞభాగులగునాదిత్యవసురుద్రసాధ్యాదిదేవగణంబులందఱును విష్ణుదేవునితోఁగూడ వచ్చియుండిరి. యజ్ఞకర్తలగుఋషిగణంబులును విచ్చేసియుండిరి. అనలతేజులగుదేవతాగణంబులు కళత్రసహితముగా విమానారూఢులై వచ్చియుండిరి.

యజ్ఞదర్శనార్థులై యిట్లువచ్చియున్నవారినందఱిం గాంచి దధీచిమునీంద్రుండు దక్షప్రజాపతి నుద్దేశించి సక్రోధంబుగా నిట్లనియెను. అపూజ్యులఁ బూజించుటవలనను, పూజ్యులఁ బూజింపకుండుటవలననుగూడ మహాపాపము సంభవించు ననుటకు సందియము లేదు. పశుపతి సర్వపూజ్యుండు. నీవాతనిఁ బూజింపక యేలయుపేక్షింతువు? అనుటయు దక్షుండు నాకిచ్చటఁ ద్రిశూలధరులును, గపర్దులు నగునేకా

దళరుద్రులున్నారు. వీరికిభిన్నుండగుమహేశ్వరు నేనెన్నండును నెఱుంగ ననియెను. అంత దధీచిమునీంద్రుండు క్రోధముతో సకలలోకారాధ్యుండగుశంకరుని నీవీయజ్ఞమునకాహ్వానింపవైతివి. నేను నిశ్చయముగా, నమ్మహాదేవునికంటె నితరదైవతంబుల నెఱుంగనివాఁడనైతినేని నాసత్యబలంబుచే నీదక్షయజ్ఞము సుస్థిరంబు గాకుండుఁగాక! అని పలుకుటయు దక్షుండు నేను విష్ణుదేవునకు వివిధంబు లగుయాగభాగంబుల నర్పించితిని. రుద్రాదులును, దక్కినదేవతలునుగూడఁ దమతమభాగములం గైకొనిరి. నేను శంకరునకుమాత్రము యజ్ఞభాగము నర్పింపఁదలఁచుకొనలేదు. అని చెప్పెను.

ఇట నుమాదేవి దక్షయజ్ఞమునకుఁ బోవుచున్న దేవతలం గాంచి తనపతి యగుపశుపతినుద్దేశించి దేవా! ఈయింద్రాదిదేవతలందఱు నెచ్చటికిఁ బోవుచున్నారో యానతీయవలయునని ప్రార్థించుటయు మహేశ్వరుండో దేవీ! ప్రజాపతి యగుదక్షుం డశ్వమేధయాగము చేయుచున్నాఁడు. వీరందఱు నచ్చటికే పోవుచున్నారని చెప్పెను. అంతఁ బార్వతీదేవి మహాదేవా! ఆయజ్ఞమునకు మీరేల పోలేదని ప్రశ్నించుటయు మహేశ్వరుండు ప్రియా! సర్వయజ్ఞములందును నాకు భాగము లేకుండునట్లు దేవతలచేతనే కల్పింపఁబడియెను. నేనట్లే పూర్వాగతపథము నవలంబించి సంచరింపవలయును. దేవతలు నాకు యజ్ఞభాగముల నర్పింపరు. అనుటయు గౌరీదేవి దేవా! గుణప్రభావములచే సకలదేవతలయందును మీరేప్రధానులు. తేజోయశశ్శ్రీలచే మీరెల్లవారికి నజేయులు. అట్టిమీకు యజ్ఞభాగము లేకుండుట నాకు విచారముగానున్నది. ఈదుఃఖముచే నాదేహమంతయుఁ గంపించిపోవుచున్నది. ఓ భూతనాథా! ఇంద్రాదిదేవగణంబులతోఁగూడ నీకును యజ్ఞభాగము లభించుటకు నేనెట్టిదానతపోనియమాదులఁ గావింపవలయునో చెప్పు

పలికెను. సతీమణి యగుగౌరి యిట్లు సంక్షుభితహృదయముతోఁ బ్రశ్నించుటయు మహాదేవుం డించుకచింతించి యోదేవీ! నీవిట్లనుట యుక్తము గాదు. ఓవిశాలాక్షీ! ఇంద్రాదిదేవతాగణంబులు ధ్యాన మూలంబున నాతత్త్వము నెఱింగియే యున్నారు. నేను గోపించిన చోఁ ద్రిభువనంబులును దగ్ధములై పోవును. బ్రహ్మవేత్త లగుసాధుపురుషులు నన్ను యజ్ఞేశ్వరునిగాఁ బ్రస్తుతించుచుందురు. రథంతరసామగీతము నన్నుద్దేశించియే గానము చేయఁబడుచున్నది. యజమానులు బ్రహ్మమంత్రములతో నన్నర్చించుచుందురు. నాకొఱకు యజ్ఞభాగము కల్పింపఁబడియున్నది.

అని యుపలాలించుటయు దేవి యిట్లనియెను. ఓశర్వా! నీవు సాధారణస్త్రీజనంబునుంబోలి యాత్మస్తుతి చేసికొని గర్వపడుచున్నావని యెత్తిపొడుచుటయు, భగవానుం డోదేవీ! నేనూరకయాత్మస్తవము చేసికొనుట లేదు. ఇదిగో! నాభాగరక్షణంబునకై యొక్కని సృష్టించెదను చూడుము! అని చెప్పిమహాదేవుండు తనక్రోధానలంబుచే వక్త్రమునుండి యొకభూతమును సృజించి నీవు సత్వరంబుగఁ బోయి దక్షాధ్వరధ్వంసనముం గావించిరమ్మని యాజ్ఞాపించెను. సింహవేషముం దాల్చియున్నయాభూతము తీవ్రవేగంబున బయలుదేఱినప్పుడే దక్షమఖంబు విధ్వస్తంబైనట్లు తోఁచెను. భీమవిగ్రహయు మహేశ్వరియు నగుభద్రకాళి సాక్షిరూపంబున నాతని ననుసరించి పోయెను. శ్మశానవాసనిరతుండును, శివక్రోధమూర్తియు నగునాభూతము వీరభద్రనాముంబున విఖ్యాతిం గాంచెను. ఆవీరభద్రుండును స్వయముగాఁ దన రోమకూపంబులనుండి రుద్రవీర్యులగుబహుసహస్రరుద్రానుచరులను సృజించెను. అగణేశ్వరు లందఱును రుద్రానుచరులును, రుద్రపరాక్రములునై రి. వారందఱును గిలకిలారావంబులచే భూనభోంతరములఁ

ప్రతిధ్వనింపఁజేయుచు నత్యుత్సాహముతో బయలుదేఱిరి. వారిభీషణారావంబులచే స్వర్గవాస్తవ్యులందఱును విత్రస్తులగుచుండిరి. పర్వతములు బ్రద్దలై పోవుచుండెను. వసుంధర కంపించిపోవుభీకరఝంఝూసమీరములు చెలరేఁగిపోవుచుండెను. సాగరములు సంక్షుభితములగుచుండెను. అగ్నులు దీప్తిహీనము లగుచుండెను. భాస్కరప్రభలు పరిమ్లానము లగుచుండెను. గ్రహతారకాగణంబు లప్రకాశము లగుచుండెను. దేవదానవమానవాదిసకలజీవులును నిస్తేజులై పోయిరి. ఈవిధముగా జగంబంతయు నిబిడాంధకారబంధురముగాఁ జేయుచు యథేఛ్ఛాగమనంబులచే గణేశ్వరు లందఱును విజృంభించుచుండిరి. వారు యజ్ఞశాలం బ్రవేశించినంతనే యూపంబుల నన్నిటిని పెల్లగించి పాఱవైచి యొక్కసారిగా సింహనాదములం గావించుచు భీకరాకారంబులతో నుద్ధతులై చిందులుద్రొక్కుటయు యజ్ఞపాత్రంబు లన్నియును జూర్ణీభూతములై పోయెను. యజ్ఞశాలయంతయు విధ్వస్తమై పోయెను. పర్వతోపమంబు లగుదివ్యాన్నంబులును, పానీయంబులును, భక్ష్యంబులును, మఱియు నాయజ్ఞంబునకు సంపాదింపఁబడిన పాలు, నేయి, తేనె, పాయసము, షడ్రసములు, మాంసములు, దివ్యంబులగుచోష్యలేహ్యపేయపదార్థంబులునుగూడ నారుద్రానుచరులచేఁ గబళితములై యపవిత్రములై వినష్టములై పోయెను.

రుద్రకోపసంభవులును, రౌద్రమూర్తులును, కాలాగ్నిరుద్రతేజులును, పర్వతాకారులునగు ప్రమథగణంబులు భయంకరవిహారంబులఁ గావించుచు, వివిధభక్ష్యంబుల భుజియించుచు, సురసుందరీమణులం బట్టి నలుదెసలకు విసరివైచుచు ననేకవిధంబుల యజ్ఞశాలయంతయును జిందఱవందఱగఁ జేసివైచిరి. ఈవిధముగా రుద్రకోపప్రేరితుండును, ప్రతాపవంతుఁడు నగువీరభద్రుఁడు దుర్ధర్షులగురుద్రాను

చరులతోఁ గలసి సర్వదేవరక్షితంబగు దక్షయజ్ఞమును భద్రకాళీసమ క్షంబున దగ్ధంబు గావించివైచెను. రుద్రానుచరులందఱును విజయో ల్లాసముచే సింహనాదములం గావించుచుండిరి. అప్పుడింద్రాదిదేవత లందఱును దక్షప్రజాపతిసహితులై నిటలతటంబుల నంజలిబంధంబు గావించుకొని వీరభద్రునుద్దేశించి మహాత్మా! నీవెవ్వఁడవో యెఱింగిం పు మని ప్రార్థించుటయు వీరభద్రుం డిట్లనియెను.

ఓసురవరులారా! నేను దేవదానవులలో నెవ్వండను గాను. నే నెద్దియైన ననుభవింపఁగోరి యిచ్చటికి వచ్చియుండలేదు. నాకుఁ జూ డఁదగిన దేదియును లేదు. నేనింద్రుఁడనుగాను. ఇటకు వచ్చుటకు నాకెట్టికోరికయును లేదు. దక్షమఖధ్వంసము చేయుటయే నాయుద్దేశ ము. అందుకొఱకే వచ్చితిని. నేను రుద్రకోపమువలన జనించితిని. నాపేరువీరభద్రుఁడు. దేవీకోపసంజనిత యగునీమె భద్రకాళి. ఈమె దేవదేవుని యాదేశముచే నిటకు వచ్చినది. కావున నోదేవతలారా! మీరుసత్వరంబుగ మహాదేవునిశరణముం గాంచుఁడు. ఏమనిన— శివానుచరులయనుగ్రహముకంటె నుమాపతికోపమే యించుకప్రి యమైనది. అనిప్రబోధించెను.

మునివరులారా! దక్షమఖశాలయందలి సకలవస్తువులును జెల్లా చెదరై పోయెను. శివానుచరులెల్లకడల నమంగళారావములం గావిం చుచుండిరి. అప్పుడు యజ్ఞము మృగరూపముం దాల్చి యాకాశమా ర్గమునఁ బలాయితం బగుచుండుటయు గణేశ్వరుండగువీరభద్రుండు శ రముంగొని ధనుర్బాణధారియై యామృగంబు ననుసరించెను. అప్పుడు క్రోధయుండగువీరభద్రునికోపమువలన నొకస్వేదబిందువుపతితం బై దానినుండి కాలానలసన్నిభంబగు నొకయగ్నిజ్వాల యుదయించె ను. ఆయగ్నిమధ్యమునుండి హ్రస్వాకారుండును, రక్తాక్షుండును, హ

రీతశ్మశ్రుండును, ఊర్ధ్వరోముండును, భయంకరుండు నగునొకపురు షుండుదయించెను. ఆతనిశరీరమంతయును రోమరాజిచే నిండియుండె ను. కృష్ణవర్ణుండును, రక్తకర్ణుండును, రక్తవసనధారియు మహాసత్త్వశాలి యు నగునాపురుషుఁ డగ్నింబోలి పాఱిపోవుచున్నయజ్ఞమృగమును ద గ్ధముచేసినవాఁడాయెను. అప్పుడు దేవతలందఱును భయభ్రాంతులై దశది శలఁ బలాయితు లగుచుండిరి. ఆపురుషునివిక్రమవిహారంబునకు స ప్తద్వీపవతి యగుపృథ్వి యంతయును గంపింపసాగెను. దేవలోకభ యాకరంబులగుమహాభూతంబులు నలుదెసలఁ బరుగులెత్తుచుండెను. అప్పుడు నేను మహాదేవుని బూజించి మహాదేవా! సకలదేవతలును నీకు యజ్ఞభాగమును సమర్పించెదరు. నీవు క్రోధము నుపసంహరింపు ము. ఈసకలదేవతలును, ఋషులును నీక్రోధమువలన శాంతిలాభము ను బడయఁజాలకున్నారు. మహాత్మా! నీస్వేదమునుండి జనియించిన మహాపురుషుఁ డింతటినుండి జ్వరనామంబున విఖ్యాతిం గాంచఁగలఁ డు. నీతేజమునందలియీయంశమును లోకమంతయు నేకమైనను భ రింపఁజాలదు. కావున దీనిననేకరూపములుగా విభజింపుమని ప్రార్థిం చుటయుఁ బినాకపాణి నావిన్నపమును మన్నించి సంప్రీతుండై యా క్రోధజ్వరము ననేకభాగములుగా విభజించెను. అప్పుడు దేవదేవున కు యజ్ఞభాగము నిర్ధారితమయ్యెను.

అప్పుడు దక్షుఁడు ప్రాణము లుగ్గఁబట్టుకొనివచ్చి మహాదేవుని శరణముం గాంచెను. శరణ్యదమనుండగు నద్దేవుం డందఱ నవలోకిం చుచు మందహాసవదనముతో దక్షునుద్దేశించి నీకేమికావలయునో కోరు కొను మనియెను. దక్షుండును బ్రాంజలియై భయముతో సబాష్ప నయనుండై మహాదేవా! నీవు నాయెడలఁ బ్రసన్నుండవైతివేని, నేను నీదయకుఁ బాత్రుండ నగుదునేని చిరకాలమునుండి యతిప్రయాసము

తో సంపాదింపఁబడి నీయనుచరగణంబులచే విధ్వస్తంబులై పోయిన సకలయజ్ఞపరికరంబులును, అన్నాదిదానులును, వివిధభక్ష్యభోగ్యద్రవ్యంబులునుగూడ నీయనుగ్రహంబుచే సఫలసంపన్నంబులగుంగాక! యని ప్రార్థించెను. అంత మహాదేవుండు [illegible] గ్రహించెను.

దక్ష [illegible] సాష్టాంగనమస్కారంబు గావిం[illegible] నామంబుల నుచ్చరించుచు సంస్తవంబు గావించెను. అప్పుడు మహాదేవుండు సుప్రసన్నుండై యోసుప్రతా! నీసంస్తవంబునకు నేను సంతుష్టుండనైతిని. నీకు సాలోక్యము నొసంగితినని యాశ్వాసించి యోప్రజాపతీ! నీవు నీయజ్ఞము విధ్వస్తంబయ్యె నని విచారింపకుము. నాయనుగ్రహముచే నీకు సహస్రాశ్వమేధయజ్ఞఫలంబును, శతవాజపేయయజ్ఞఫలంబును లభింపఁగలదు. దేవదానవదుర్లభంబును, నిగూఢంబును, అనిందితంబును, వర్ణాశ్రమధర్మావిరుద్ధంబును, పశుపాశవిమోక్షణంబును, సర్వాశ్రమసమ్మతంబును, సర్వపాపహరంబును, శుభకరంబునగు ద్వాదశవర్షపాశుపతవ్రతఫలలాభంబు నీకు సిద్ధించుఁగాక! నీవు విచారమును విడువు మని యనుగ్రహించి గణసహితంబుగా నంతర్ధానుం డయ్యెను.

ఆసమయమునందు మహాదేవుఁడు యథోచితముగా యజ్ఞభాగమును బడసి సర్వభూతశాంతికొఱకు శైవజ్వరమును బహురూపములుగా విభజించెను. అందు నాగగణంబులకు శిఖాభితాపంబును, పర్వతంబులకుశిలాజత్తును, జలంబులకు నీలికయు, భుజగంబులకు నిర్మోకంబును, సురభిగణంబులకు ఖోరకంబును, భూతలంబున నూషరంబును, శునకంబులకు దృష్టిప్రతిరోధంబును, అశ్వంబులకు రంధ్రాగతంబును, బర్హిగణంబులకు శిఖోద్భేదంబును, కోకిలంబులకు నేత్రరోగంబును, మహాత్ములకు ద్వేషంబును, శుకంబులకు హిక్కయు, శార్దూలంబుల

కు శ్రమము జ్వరంబులయ్యెను. మానవులలో నిది జ్వరంబనియే విఖ్యాతంబగుచున్నది. ఈజ్వరము జనించినదిమొదలుమరణించువఱకును మానవదేహముల నధిష్ఠించి యుండును. జ్వరనామకంబగునీమహేశ్వరతేజము సర్వజనసన్మాన్యంబును వంద్యంబు నైనది. నిశ్చలచిత్తుండై యీశ్వరచరిత్రమును నిత్యమునుబఠించువాఁడు ముక్తరోగియై పరమానందముతో సర్వాభీష్టసిద్ధుండగును.

—♦ ఏకామ్రక్షేత్రమాహాత్మ్యము. ♦—

మహర్షులందఱును బ్రహ్మచేఁ జెప్పంబడినయీపుణ్యచరిత్రము నాలకించి యానందపులకితులై పితామహునుంగాంచి దేవా! నీవుమహాదేవుండగుశంకరునిమాహాత్మ్యమును వర్ణించితివి. దక్షయజ్ఞధ్వంసకథను వింటిమి. మాకిఁక నేకామ్రక్షేత్రమాహాత్మ్యముంగూర్చి బోధింపుమని ప్రార్థించిరి. అప్పుడు బ్రహ్మదేవుం డిట్లుచెప్పందొడంగెను.

మునివరులారా! మహాదేవునకుఁ బ్రియంబగునేకామ్రక్షేత్రము సర్వపాపహరంబును, పుణ్యప్రదంబును, సర్వజనదుర్లభంబు నైనది. దానింగూర్చిసంక్షేపముగాఁ జెప్పెద నాలకింపుఁడు. అది యష్టతీర్థసమన్వితమైనది. కోటివిలసితంబగువారణాసింబోలి యది యతిపవిత్రమైనది. ఆక్షేత్రమునందుఁ బూర్వమొకయామ్రవృక్షముండెడిది. ఆవృక్షమువలననే యాక్షేత్రమున కాపేరు గలిగినది. ఆదివ్యక్షేత్రము నిత్యసంతుష్టులగునరనారీగణంబులచేతను, విద్వజ్జనంబులచేతను, ధనధాన్యసమృద్ధులచేతను మనోహరగృహగోపురంబులచేతను, అమూల్యమణిగణంబులచేతను, రాజహంససన్నిభంబులగుశుభ్రప్రాసాదమాలికలచేతను, వివిధరాజమార్గంబులచేతను, విచిత్రప్రాకారంబులచేతను, విరాజిల్లుచుండును. వివిధవర్ణపతాకాభిశోభితంబగునానగర మగాధంబులగునగడ్తలచేతను, ఆయుధపాణులగుభటులచేతను సర్వదా పరిరక్షి

తమై యుండును. అందెల్లప్పుడు నానందోత్సవములు పూర్ణీభవించి యుండును. వీణావేణుమృదంగాదివివిధవాద్యంబులు దశదిశలయందు మ్రోగుచుండ నాక్షేత్రము దివ్యోద్యానంబులచేతను, దేవభవనంబులచేతను శోభిల్లుచుండును. అందు రత్నహారాలంకృతలును, బద్మపత్రాయతాక్షులును, పీనోన్నతవక్షోభాగలును, యువతులును, బూర్ణచంద్రాననలును, సూక్ష్మావలగ్నలును నగు రమణీమణులు సర్వదా ప్రఫుల్లహృదయులతో విహరించుచుందురు. అందలిరమణీమణు లందఱును విమలీమణులే. అందఱును బ్రియదర్శినులే. అందఱును సౌభాగ్యవతులును, బ్రియవాదినులు, స్థిరయౌవనగర్వితలు, సుచరిత్రలు దివ్యమాల్యాలంకృతలు నై యుండుదురు. అందుస్త్రీలేకాక పురుషులుగూడ రమణీయాకారులె. అందు చతుర్వర్ణంబులవారును స్వధర్మనిరతులై వాసము చేయుచుందురు అందు దుర్వృత్తులుగాని, పరద్రోహకారులుగాని, నిర్ధనులుగాని, మూర్ఖులుగాని, మలినులుగాని, రోగులుగాని, మాయావులుగాని యెవ్వరునులేరు.

అచ్చటివారందఱును నిత్యసుఖులే. అచ్చటిసర్వక్షేత్రములును సస్యపరిపూర్ణములై యుండును. కుసుమఫలభరితంబు లగువివిధతరులతాదులచే నందలివనంబులు విరాజిల్లుచుండును. అందలి కమలేందీవరషండమండితంబు లగుసరోవరంబులు జలవిహంగమకలకూజితంబులచే నతిమనోహరంబులై యుండును. ఈవిధముగా నేకామ్రక్షేత్రము సర్వసంపత్సమృద్ధంబై పుణ్యజలాశయంబులచేఁ బరిశోభితంబగుచుండును. ఆక్షేత్రముసంతు భుక్తిముక్తిప్రదాయకుండును, కృత్తివాసుండును, వృషధ్వజుం డగుసదాశివుండు సర్వలోకహితార్థమై స్వయముగా వేంచేసియుండును.

భూమండలమునందలిసమస్తపుణ్యతీర్థములు, నదములు, నదు

లు, ప్రాసాదములు, పుష్కరిణులు, తటాకములు, వాపీకూపములు, ప్రాకారములు మొదలగువానినుండి మహాదేవుం డొక్కొక్కబిందువును సంగ్రహించి లోకహితంబుగాను దేవతాసహితుండై యాక్షేత్రంబు ననేకతీర్థంబులను నిర్మించియుండెను. ఆతీర్థము బిందుసరనామంబుచేఁ బ్రఖ్యాతం బగుచున్నది. మార్గశీర్షబహుళాష్టమీతిథియందును, విషువంబులయందును బిందుసరతీర్థంబునఁ జితేంద్రియుండై సందర్శించి యథావిధిగ నందు స్నానంబు గావించి దేవర్షిపితృతర్పణంబులు చేసి మౌనియై తిలోదకప్రదానంబు శ్రద్ధతోఁ గావించువాఁ డశ్వమేధఫలలాభంబు నందఁగలఁడు. చంద్రసూర్యగ్రహణంబులయందును, విషువసంక్రాంతులయందును, యుగాదులయందును, అయనసంక్రాంతులయందును, మఱియునితరపుణ్యదినంబులయందును, నచ్చట దానములం గావించుట యితరతీర్థదానంబులకంటె శతగుణాధికఫలదాయకం బగును. ఆబిందుసరస్తీరంబునఁ బితృదేవతలకుఁ బిండప్రదానంబు గావించినచో వారికక్షయసంతృప్తి కాఁగలదు.

అనంతరము జితేంద్రియుండును మౌనియునై మహాదేవమందిరంబునఁ బ్రవేశించి శంకరునకు మువ్మాఱు ప్రదక్షిణంబు చేసి ఘృతక్షీరాదులచేఁ నభిషేకంబు చేసి చందనము, కుంకుమాదిసుగంధద్రవ్యములు, వివిధపుష్పములు, బిల్వదళములు, అర్కపత్రములు, ఆమలకఫలములు మొదలగువానిచే నాగమోక్తమంత్రవిధానంబునఁ జంత్రి శౌరి యగురుమూర్తి నర్చింపవలయును. దీక్షారహితుం డగువాఁడు శివనామోచ్చారణమాత్రంబుననే పూజింపవలయును. ఈవిధముగా గంధపుష్పధూపదీపనైవేద్యాదులచే నర్చించి పిమ్మట సాష్టాంగప్రణామం బాచరించి నృత్తగీతవాద్యాదులతోడను, స్తోత్రపాఠములతోడను, జయధ్వనులతోడను బ్రదక్షిణంబు సేయవలయును. ఇట్లువిధివి

ధానంబున దేవదేవు నర్చించువారు సర్వపాపవిముక్తులును, రూపయౌవనశోభితులును, సర్వాభరణభూషితులు నై, మణిమయ హేమవిమానంబు నధిరోహించి గంధర్వాప్సరోగణంబులచేఁ గీర్తింపఁబడుచు దిగంతంబులఁ దమతేజముచే వెలింగించుచు శివలోకప్రాప్తు లగుదురు. అట్టివారు శివలోకంబున నభీష్టసుఖభోగంబు లనుభవించుచుఁ గల్పాంతమువఱకును నివసించి యనంతరము మరల నీభూమండలంబునఁ జతుర్వేదవిదులగు యోగివరులగృహంబున జన్మించి పాశుపతయోగప్రాప్తులై తుదకు మోక్షలాభముం గాంతురు.

శయనైకాదశి, సంక్రాంతి, అయనములు, అశోకాష్టమి మొదలగు పవిత్రదివసములందు కృత్తివాసుం డగు నమ్మహాదేవుని సందర్శించువారుసూర్యసన్నిభంబగువిమానము నధిరోహించి శివలోకముం జేరఁగలరు. ఆదేవదేవుని నిత్యమును సందర్శించుధీమంతు లెల్లరును శివలోకప్రాప్తు లగుదురు. ఆదేవునకు నలువంకలను సార్ధయోజనద్వయపరిమితంబగు ప్రదేశంబంతయును భుక్తిముక్తిప్రదాయకం బైనది. ఆక్షేత్రంబున భాస్కరేశ్వరలింగంబు గలదు. పూర్వకాలంబున నాదిత్యుం డదాని నర్చించి యుండెను. అందు గల కుండంబునందు స్నానంబుచేసి యాశివలింగమును దర్శించువారు సర్వపాపవిముక్తులై దివ్యవిమానారూఢులై గంధర్వాప్సరస్సంస్తుత్యులై శివలోకంబుఁ జేరి, యందు నిఖిలభోగంబుల ననుభవించుచుఁ గల్పాంతమువఱకు నుండి యనంతర మిహలోకంబున యోగికులంబున వేదవేదాంగవిదులును, సర్వభూతహితులును, మోక్షదర్శులును, సద్వ్రతములును, ద్విజశ్రేష్ఠులు నై జన్మించి శాంభవయోగసిద్ధులై మోక్షప్రాప్తు లగుదురు. ఆక్షేత్రమునందలి సకలవనంబులయందును రథ్యలయందును చతుష్పథంబుల యందును, శ్మశానాదులయందును, మఱియు నెల్లప్రదేశంబులయందు

దును గల పూజ్యంబులు, నపూజ్యంబులు నగులింగంబు లన్నియును మానవులకు దర్శనీయంబు లైనవి. అవ్యగ్రచిత్తుండును, సమాహితుండును, శ్రద్ధాహితుండును నై తల్లింగంబుల నభిషేకించి గంధపుష్పధూపదీపనైవేద్యనమస్కారస్తవప్రదక్షిణాదులచేతను, నృత్తగీతాదులచేతను యథావిధిగ నర్చించువాఁడు శివలోకప్రాప్తుం డగును. స్త్రీజనంబు లైనను శ్రద్ధాసహితంబుగ శివపూజం గావించినచోఁ బూర్వోక్తఫలలాభంబు గలుగు ననుటకు సందియం బేమాత్రంబును లేదు. ఆదివ్యక్షేత్రంబునందలి సకలగుణంబులను వర్ణించుటకు పరమేశ్వరుండు గాక మఱియెవ్వండు సమర్థుం డగును? వైశాఖాదిమాసంబులయందే తిథియం దైనను శ్రద్ధతో నైన నశ్రద్ధతో నైన స్త్రీ యైనఁ బురుషుం డైన నయ్యుత్తమక్షేత్రంబునకుం బోయి బిందుసరోవరంబున స్నానంబు సేసి యందున్న దేవదేవుండగు విరూపాక్షుని దేవి యగు వరదాభవానిని చండాఖ్యుండగు గణముఖ్యుని, కార్తికేయుని, గణేశ్వరుని, నందీశ్వరుని, కల్పద్రుమంబును, సావిత్రిని సందర్శించినచో నట్టివారికి శివలోకప్రాప్తి యగును. అట్లే పాపహరం బగు కపాలతీర్థంబున విధిపూర్వకంబుగ స్నానంబు సేయువారికి నభిమతఫలలాభంబు చేకూరుటయే కాక శివలోకావాసంబుకూడ సిద్ధించును. జితేంద్రియుండై యాదివ్యక్షేత్రంబున స్తంభారోపణంబు గావించువాఁడు తనకులంబున నేకవింశతిపురుషుల నుద్ధరించి శివలోకసాయుజ్యంబు సేకూర్పంగలఁడు. శివప్రియంబగు నీయేకామ్రక్షేత్రంబు వారాణసీతుల్యపవిత్రంబు. అందు స్నానపూజనంబులఁ గావించువానికి మోక్షలాభంబు ధ్రువంబు.

ఉత్కలక్షేత్రవర్ణనము.

బ్రహ్మదేవుం డిట్లనియెను. మహర్షిశేఖరులారా! బ్రహ్మ

యు, జగన్మాతయు నగువిరజాదేవిచేఁ బ్రతిష్ఠితంబగువిరజాక్షే దర్శించినమాత్రమునసే సప్తపురుషాంతరంబులన [illegible] త్రం బగును. ఒక్కసారి యాక్షేత్రమును సం[illegible] బుగ పూజాప్రణామాదులు గావించువారు [illegible] బ్రహ్మలోకప్రాప్తు లగుదురు. ఆక్షేత్రమునం దనేకదేవమూర్తులు ప్రతిష్ఠింపఁబడి యున్నవి. వానినారాధించుటచే సర్వపాపహారంబును, నభీష్టఫలలాభంబును నగును. అందు సర్వపాపహారిణి యగువైతరణీనది కలదు. ఆనదియందు స్నానముచేయువారు సర్వపాపవిముక్తు లగుదురు. ఆక్షేత్రంబున విష్ణుదేవుండు స్వాయంభువంబగువరాహమూర్తితో విరాజిల్లుచుండును. ఆదేవుని దర్శించుటవలనను, బూజించుటవలనను విష్ణులోకప్రాప్తి యగును. ఆవిరజాక్షేత్రంబున కాపిలంబును, గోగ్రహంబును, సోమతీర్థంబును, అలాబుతీర్థంబును, మృత్యుంజయంబును, క్రోడతీర్థంబును, వాసుకంబును, సిద్ధేశ్వరంబును, ననునష్టతీర్థంబులు గలవు. ఆతీర్థంబులయందు విధిపూర్వకంబుగా స్నానంబుచేసి యందలిదేవతాగణంబుల నర్చించునారికి సర్వపాపవిముక్తియు నంతంబున బ్రహ్మలోకప్రాప్తియునగును.

మదీయం బగువిరజాక్షేత్రంబునఁ బిండప్రదానంబుగావించినచోఁ బితృదేవతలు పరితృప్తు లగుదురు. ఆదివ్యక్షేత్రంబున మరణించువారికి మోక్షలాభంబు సిద్ధించును. సాగరతీర్థంబున స్నానముచేసి కపిలదేవుని సందర్శించి వరాహమూర్తి నారాధించువానికి స్వర్గలోకప్రాప్తియగును. ఆవిరజాతీర్థంబున నింకను ననేకపుణ్యతీర్థంబులును, బుణ్యాయతనంబులునుగలవు. సముద్రంబున నుత్తరతీరంబునఁ బరమగుహ్యంబును, పాపహారంబును, ముక్తిప్రదంబు నగునొకక్షేత్రముగలదు. అచ్చటిప్రదేశంబు లన్నియును వాలుకామయంబులై

యుండును. ఆక్షేత్రము సర్వకామప్రదం బైనది. దశయోజనపరిమి తంబగునది మానవులకు దుర్లభంబైనది.

ఆక్షేత్రమునకు నలువంకలను ఫలవృక్షభరితంబులగునానాత రులతాభిశోభితంబులగుమనోహరవనంబులు విరాజిల్లుచుండును. ఆవన కలపాదపంబులయందును గిరశారికాకోకిలాదివిహంగములు కలకలధ్వ నులచే వీనులవిందు చేయుచు విహరించుచుండును. కమలేందీవరశో భితంబు లగుజలాశయంబును, పుష్కరిణులును, దీర్ఘికలును, తటాక ములును నందందు విలసిల్లుచుండును. అవియన్నియును నిర్మలజల పూరితంబులై యుండును. కాదంబ, చక్రవాక, జలకుక్కుట, కారం డవ, ప్లవ, మరాళాదిజలవిహంగములును, మత్స్యకూర్మాదిజలచరం బులును వానియందు విహరించుచుండును. ఆక్షేత్రమునందుఁ జతు ర్వర్ణాశ్రమనిష్ఠులును, స్వధర్మనిరతులునగు చతుర్వర్ణములవారు వం దు నివసించియుందురు. అందలిస్త్రీపురుషు లెల్లరును నిత్యసంతుష్టు లై యుందురు. సకలవిద్యలకు నాధారమై సకలధర్మములకు నా కరమై సకలగుణంబులకు నిధానమై జగంబునఁ బరమదుర్లభం బగు నాక్షేత్రముశోభిల్లుచుండును.

మునివరులారా! ఆదివ్యక్షేత్రమునందు విఖ్యాతుండగుపురు షోత్తమదేవుఁడు విరాజిల్లుచుండును. భగవానుం డగుపురుషోత్తమదే వుని సంస్థానంబగునుత్కలదేశమంతయును శ్రీకృష్ణదేవు ననుగ్రహంబు చే నతిపవిత్రంబైనది. జగద్వ్యాపకుండగుజగన్నాథుం డందే సుప్రతి ష్ఠుండై యుండును. నేనును, రుద్రేంద్రాగ్నిప్రముఖదేవగణంబులు ను సర్వదా యందు నివసించి యుందుము. గంధర్వులు, అప్సరలు, పితృదేవతలు, దేవమానవగణంబులు, యక్షులు, విద్యాధరులు, సిద్ధు లు, నియమవంతులగుమునిగణంబులు, వాలఖిల్యాదిఋషిగణంబులు,

కశ్యపాదిప్రజాపతులు, సుపర్ణులు, కిన్నరులు మొదలగువారందఱును, సాంగకంబులగు చతుర్వేదంబులును, వివిధశాస్త్రంబులును, సకలేతిహాసంబులును, పుణ్యపురాణసమూహంబులును, బహుదక్షిణాన్వితయజ్ఞంబులును, వివిధపుణ్యనదీగణంబులును, నానాతీర్థంబులును, నానాయతనంబులును, సాగరసమూహంబులును, శైలబృందంబులును సర్వంబు నందు విలసిల్లుచుండును. దేవర్షిపితృసేవితంబును, సర్వోపభోగమయంబును పావనంబు నగునాదేశమునందు వసించుట కెవ్వరభిలషింపకుందురు? ఆదేశముకంటె శ్రేష్ఠతమం బగుదేశ మింకెచ్చట నున్నది?

ఆపుణ్యదేశంబున ముక్తిప్రదాత యగుపురుషోత్తముఁడు స్వయముగా నివసించి యుండును. ఉత్కలదేశంబున నివసించుభాగ్యముం గాంచిన విబుధసదృశులగుమానవులే జగంబున ధన్యులు. అచ్చటఁ దీర్థస్నానంబు చేసి పురుషోత్తముని దర్శించువారికి యమాలయసందర్శనంబు లేదు. వారు స్వర్గమునే చేరఁగలరు. పవిత్రమగు నుత్కలదేశమునందలి పవిత్రపురుషోత్తమక్షేత్రంబునందు వసించువారిజీవితము సఫలమైనది. సుప్రసన్నాయతలోచనాన్వితంబును, మనోహరభ్రూలతావిలసితంబును, వినీలకుంతలవిరాజితంబును, సువర్ణమణిమకుటశోభితంబును, మందహాససుందరంబును, కర్ణకుండలాలంకృతంబును, సుకపోలలలాటనాసాభిశోభితంబును, సులక్షణాన్వితంబును, త్రిలోకానందజనకంబు నగుశ్రీకృష్ణదేవునిప్రసన్నవదనమండలమును సందర్శించుమహాత్ములే ధన్యులు.

అవంతికావర్ణనము.

అని చెప్పి లోకపితామహుండు మఱియునిట్లనియెను. మునివరులారా! కృతయుగంబున శ్రీమంతుండును, మహేంద్రపరాక్రమశాలి

యు, సత్యవాదియు, సర్వశాస్త్రవేదియు, యజ్వియు, శుచియు, దక్షుండును, బ్రహ్మనిష్ఠుండును, దృఢప్రతిజ్ఞుండును, రూపవంతుండును, సౌభాగ్యవంతుండును, శూరుండును, దాతయు, భోగియు, ప్రియంవదుండును, పూర్ణచంద్రునివలె నఖిలలోకమనోహరుండును, సూర్యదేవునివలెఁ దేజోమయుండును, శత్రుభీకరుండును, విష్ణుభక్తుండును, సత్యసంపన్నుండును, జితక్రోధుండును, జితేంద్రియుండును, ధర్మతత్పరుండును సుప్రసిద్ధుండు నగునింద్రద్యుమ్నుం డనుమహారాజు భూమండలమును ధర్మపద్ధతిని బరిపాలించుచుండెను. సకలగుణాకరుం డగు నారాజేంద్రుండు భూపాలననిరతుం డై నంతనే యాతనియందు విష్ణుదేవునారాధింపవలయు ననుబుద్ధివృత్తి వికసితం బయ్యెను. అప్పుడాతఁడు నేనేవిధముగా నేక్షేత్రమునం దేతీర్థమునందు జనార్దను నారాధింపవలయు నని యాలోచించి సకలమహీమండలము దిరిగి సకలనదీతీర్థక్షేత్రంబులను, సకలనగరంబులను సందర్శించి క్రమముగా ముక్తిప్రదంబును, సువిఖ్యాతంబు నగుపురుషోత్తమక్షేత్రమునకుం బోయెను.

నరనాథుండగునింద్రద్యుమ్నుండు తనసకలపరివారంబుతోడను నాదివ్యక్షేత్రమునందుఁ బ్రవేశించి యచ్చటబహుదక్షిణాన్వితం బగు నశ్వమేధయాగమును యథావిధిగననుష్ఠించెను. క్రమముగా నారాజచంద్రుఁ డచ్చట మహోన్నతం బగుదివ్యప్రాసాదమును నిర్మింపఁ జేసి యందు సంకర్షణుని, శ్రీకృష్ణభగవానుని, సుభద్రాదేవిని బ్రతిష్ఠించి యథావిధిగఁ బంచతీర్థంబుల నేర్పఱించి నిత్యంబును స్నానదానతపోహోమదేవదర్శనాదికంబులఁ గావించుచు నందుఁ జిరకాలం బుండి పురుషోత్తము నారాధించి తదీయానుగ్రహంబున మోక్షలాభంబును జూఱఁగొనియెను. అందుఁ బ్రతిష్ఠితుఁడై యున్న మార్కండేయమూర్తిని, శ్రీకృష్ణభగవానుని, బలరామస్వామిని సందర్శించి యింద్రద్యు

మ్నసాగరంబున స్నానంబు సేయువారికి మోక్షలాభం బగును.

అని చెప్పుటయు మునివరులో దేవా యింద్రద్యుమ్నుం డెంత కాలమునకు ముక్తిప్రదం బగుపురుషోత్తమదివ్యక్షేత్రంబునకుఁ బోయెనో, యాతఁ డచ్చట నశ్వమేధంబు లెట్లు నిర్వర్తించెనో, యథావిధిగఁ బురుషోత్తమదేవు నెట్లర్చించెనో, సర్వకామప్రదంబగు నాక్షేత్రముఁ దైలోక్యవిశ్రుతం బగుప్రాసాదము నెట్లు నిర్మించెనో, కృష్ణబలరామసుభద్రామూర్తుల నెట్లు నిర్మింపఁజేసి యాప్రాసాదమధ్యంబునం దెట్లు ప్రతిష్ఠించెనో సవిస్తరంబుగ నెఱింగింపవలయు నని ప్రార్థించుటయు బ్రహ్మదేవుండిట్లనియెను.

మునివరులారా! సర్వపాపహరంబును, భోగమోక్షప్రదంబును, పౌరాణికంబునగునీపుణ్యచరిత్రముంగూర్చి తెలిసికొననిచ్ఛగించినమీ కనేకసాధువాదములు. మీరునిశ్చలచిత్తములతో నీపవిత్రేతిహాసము నాలకింపుఁడు. మాళవదేశమునందు భువనవిశ్రుతం బగునవంతీనగరము గలదు. అది యింద్రద్యుమ్నునకు రాజధానియై యుండెను. ఆనగరము నిత్యతృప్తులగుజనంబులతోడను, దృఢంబులగుప్రాకార, తోరణ, యంత్రార్గళద్వారపరిఖాసమూహంబులతోడను, సుశోభితమై సురక్షితమై యుండెను. అచ్చట వివిధదేశములనుండి యేతెంచినవర్తకులవివిధవస్తు భరితంబులగునంగడులచే వీథులన్నియునురాజిల్లుచుండును. రాజహంసంబులంబోలి శుభ్రవర్ణంబులై విచిత్రంబులును, మనోహరంబులు నగుప్రాసాదములం దనేకములు గలవు. అందలి రథగజతురగపదాతిసేనలకును, వివిధవర్ణంబులగుపతాకలకును, నానాదేశసమాగతవీరయోధులకును లెక్కయే లేదు. ఆనగరంబు నిరంతరమును యజ్ఞోత్సవంబులచే నామోదితమై, మనోహరగీతవాద్యంబులచే ముఖరితంబగుచుండును. బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రాదినానావర్ణంబుల

వారు నందు నివసించియుందురు. ఆపట్టణంబున విద్వాంసులెందఱో క లరు. మలినులును, మూర్ఖులును, నిర్ధనులును, రోగులును, హీనాంగు లును, ద్యూతాదివ్యసనలంపటులును నందు లేరు. అందలిస్త్రీపురు షులు నిత్యానందులై సర్వదా విహరించుచుందురు. పురుషులందఱు ను సుందరవేషభూషణాలంకృతులును, కందర్పకాంతిసంపన్నులును, సు గుణులును, రూపవంతులును, సర్వశాస్త్రజ్ఞులును, శతృమర్దనులు ను, దాతలును, భోగులునై యుందురు. రమణీమణులు మదమాతం గమరాళగమనలును, వికచారవిందనయనలును, సుందరకటిజఘనలును, చారువదనలును, సుకపోలలును, స్థిరాలకలును, హావభావవిలాసవిభ్రమవ తులును, తాంబూలరాగరంజితాధరలును, అమూల్యమణిసువస్త్రాలం కారవిభూషితలును, దివ్యమాల్యాలంకృతలును, దివ్యాంబరధారిణులు ను, దివ్యగంధానులేపితలును, చతురలును, సౌభాగ్యవతులును, కాం తలును, ప్రియదర్శినులును, రూపలావణ్యవతులును, మందహాసవిలసిత లును, విలాసవిరితలును, మదాలసలు నై యుందురు. వారందఱును సభలయందును, ప్రాంగణములయందును, క్షేత్రంబులయందును గీత వాద్యమధురాలాపంబులచే హృదయాకర్షణంబు గావించుచుందురు. అటనున్ననానావిధదివ్యకుసుమశోభితంబులగుదేవాలయంబులకును, ప విత్రంబులగుమనోజ్ఞనవోపవనంబులకును లెక్కయేలేదు. అవియన్ని యును బహువిధకుసుమఫలభరితంబులగు లతాతరుసంతతులచే గ న్నులపండువుగా నుండును.

ఈరీతిగా బహువిధప్రియదర్శనీయంబులగు లతాపాదపరాజం బులచేతను, నానాపుష్పమయజలాశయంబులచేతను, ననేకోద్యానం బులచేతను, స్థలజలవిహంగకలకలాలాపంబులచేతను, దివ్యదేవాయత నంబులచేతను నమ్మహానగరము శోభిల్లుచుండును. అందుఁ ద్విపుర్హా

రియుఁ,ద్రిలోచనుండును, సర్వకామప్రదుండును, భగవానుండు నగు శివుండు మహాకాలనామంబున విరాజిల్లుచుండును. ధర్మవిదుం డగు నరుం డాశివకుండంబున నవగాహనంబు చేసి దేవర్షిపితృతర్పణంబులం దీర్చి శివాలయంబునఁ బ్రవేశించి మువ్మాఱు ప్రదక్షిణంబు చేసి ధౌతవసనుండును, జితేంద్రియుండునునై శివమందిరంబుఁ జేరి పుష్పగంధధూపదీపనైవేద్యోపహారగీతవాద్యప్రదక్షిణప్రణామంబులచే నమ్మహాదేవు నర్చించి యభిషేకంబు గావించిన వో సహస్రాశ్వమేధఫలలాభంబు నందఁగలఁడు. అతనిసకలపాపంబులును విదూరితంబు లగును. అట్టివానికి దివ్యవిమానలాభంబును శివలోకప్రాప్తియు నగును. మానవరులారా ! శివలోకంబు చేరినమానవులకు జరామరణంబులు లేవు. పుణ్యక్షయం బైనంతనే వారు మరల మర్త్యలోకంబున విశుద్ధబ్రాహ్మణకులంబున జన్మించి చతుర్వేదవిదులును, సకలశాస్త్రజ్ఞులు నై పాశుపతవ్రతావలంబనముచేఁ దుదకు మోక్షముం గాంచఁగలరు.

మునిశ్రేష్ఠులారా ! ఆనగరసమీపంబున విశ్వవిశ్రుతంబగు శిప్రానదిప్రవహించుచుండును. అందు స్నానమాచరించి దేవర్షిపితృతర్పణంబులఁ గావించువారు సర్వపాపవిముక్తులై దివ్యవిమానమునధిరోహించి స్వర్గలోకముం జేరి యందు బహువిధదివ్యభోగంబుల ననుభవించుచుందురు. ఆక్షేత్రంబున భుక్తిముక్తిప్రదుండును, దేవదేవుండు నగుజనార్దనుండు గోవిందస్వామినామంబున విరాజిల్లుచుండును. ఆదేవునిదర్శించినంతమాత్రమునసే మానవులు తమకులమునం దిరువదిపురుషాంతరములను దరింపఁజేయుదురు. అట్టివారు దివ్యవిమానారూఢులై విష్ణులోకంబు నధిగమించి యందు నిరాతంకులును, గతజ్వరులును, సౌభాగ్యవంతులును, రూపవంతులును, సుఖులునై ప్రళయకాలపర్యంతమును వివిధాభీష్టఫలభోగముల ననుభవించుచుఁ బూజితులై యుం

దురు. మఱియునాక్షేత్రమునందు విష్ణుదేవుండు విక్రమస్వామినామంబున సుప్రతిష్ఠుండై యుండును. ఆదేవునిసందర్శించుమానవులకుఁగూడఁ బూర్వోక్తఫలలాభం బగును. ఆదివ్యక్షేత్రమునం దింద్రాదిసకలదేవతలును, మాతృగణంబులును నివసించియుందురు. వేఱువేఱుగ వారినిదర్శించి పూజాప్రణిపాతాదిసకలారాధనంబులంగావించువారు సర్వపాపవినిర్ముక్తులై స్వర్గప్రాప్తు లగుదురు.

సంతతమా సిద్ధసంకీర్తనంబులచేఁ బ్రముదితమై యష్టాదశపురవరిష్ఠమై విలసిల్లు నారమణీయనగరరాజము రాజశ్రేష్ఠుండగునింద్రద్యుమ్నునిచేఁ బరిపాలితం బగుచు దేవేంద్రునియమరావతింబోలి శోభిల్లుచుండును. అందలివిశాలంబులును, దీర్ఘంబులు నగుచతుష్పథంబు లన్నియును ధనుర్గుణనినాదంబులచే మాఱుమ్రోఁగుచుండును. బహుసిద్ధసమాగమసమలంకృతంబును, విద్వద్గణవిభూషితంబును, నిరంతరవేదనినాదితంబును, పురాణేతిహాసకావ్యాలాపముఖరితంబునునగునప్పురవరంబు భూలోకనాకపురంబునుంబోలి తేజరిల్లుచుండును.

—♦ ఇంద్రద్యుమ్నునిక్షేత్రదర్శనము. ♦—

మతిమంతుం డగునింద్రద్యుమ్నుం డానగరంబునందుండి యత్యుత్తమపద్ధతిని రాజ్యశాసనంబుగావించుచుఁ బ్రజలను దనబిడ్డలుగా భావించి పాలించుచుండెను. సత్యవాదియు, మహాప్రాజ్ఞుండును, శూరుండును, సర్వగుణాకరుండును, ధార్మికుండును, బ్రశస్తబుద్ధియు, శస్త్రధారులయందు శ్రేష్ఠుండును, సత్యశీలుండును, దాంతుండును, శ్రీమంతుండునగు నారాజేంద్రుండు పరపురంజయుండై విఖ్యాతిం గాంచెను. ఆతఁడు తేజమునం దాదిత్యునివలెను, రూపమునం దశ్వినీకుమారులపోల్కిని, ప్రజ్ఞయందు సురాచార్యునికైవడిని, పరాక్రమంబున శ

క్రమవిధంబునను, సులక్షణంబున శరత్సుధాకరునికైవడిని విరాజిల్లుచుండెను. ఆభూపాలచంద్రుఁ డశ్వమేధాదివివిధయజ్ఞాహరణకర్తయై యుండెను. దానమునందును, యజ్ఞానుష్ఠానమునందును, తపంబునందును, మఱి యేవిషయంబునందునుగూడ నాతనింబోలినమహీపాలుఁ డింకొకఁ డెవ్వఁడును లేఁడు. ఆప్రభుండు యజ్ఞంబులయందు దక్షిణలుగా బ్రాహ్మణులకు బహుసువర్ణమణిమౌక్తికమహాధనవాహనాదులను దానము చేయుచుండెను. అతనికిఁగల యేనుఁగులు, గుఱ్ఱములు, రథములు, కంబళములు, అజినములు, వస్త్రములు, రత్నరాసులు, ధనధాన్యములు మొదలగువానికి బరిమితిలేదు. ఈవిధముగా నానరనాథుండు సర్వసంపన్నుండై నిష్కలంకభావంబున మహీపాలనంబు గావించుచుండెను.

ఇట్లుండఁగా నొకప్పు డమ్మహారాజునకు భుక్తిముక్తిప్రదాయకుండును, సర్వయోగేశ్వరుండు నగుశ్రీహరి నారాధింపవలయు నను ద్దేశము గలుగుటయు, నాతఁడు సకలశాస్త్రములను, తంత్రములను, ఆగమంబులను, పురాణములను, ఇతిహాసములను, వేదాంగములను సమగ్రంబులగుధర్మశాస్త్రములను బాగుగ శోధించి యతిప్రయత్నంబున వేదపారగులగుబ్రాహ్మణుల నుపాసించి కృతకృత్యుండయ్యెను. మఱియుఁ బరమంబును నవ్యయంబు నగుతత్త్వమును గ్రహించుటకును, భ్రాంతిజ్ఞానరాహిత్యమునకును, జితేంద్రియత్వమునకును, మోక్షప్రాప్తికిని బీతవాసుండును, చతుర్బాహుండును, శంఖచక్రగదాధరుండును, వనమాలాలంకృతుండును, పద్మపలాశలోచనుండును, శ్రీవత్సలాంఛనుండును, మకుటాంగదభూషితుండును, సనాతనుండు నగుదేవదేవు నెట్లర్చింపవలయు నని చింతించుచు నాతఁడు ప్రచురబలవాహనభృత్యపురోహితపరివృతుండై తనరాజధానినుండి బయలుదేఱెను.

ఆయుధపాణులగుమహారథులనేకులుచిత్రధ్వజవిలసితంబులును, విమానప్రతిమానంబులు నగుమహారథంబుల నధిరోహించియమ్మహీపాలు ననుసరించి వెడలిరి. ప్రాసతోమరహస్తు లగుపాదిగణంబులు గూడఁ బవనజవంబులగునశ్వంబుల నధిరోహించి యానరనాథుని వెంబడించిరి. హిమగిరిసంజనితంబులును, బ్రమత్తంబులును, బ్రచండంబులును, షష్టివర్షవయస్సంపన్నంబులును, హేమకక్షంబులును, పతాకాభిశోభితంబులు నగుగజంబులనధిరోహించి యనేకులగుగజయుద్ధనిపుణులును, శరశరాసనకృపాణధారులై దివ్యమాల్యాలంకృతులై దివ్యగంధానులేపితులై మహావీరులగు నసంఖ్యపదాతిసైనికులును, సర్వశస్త్రాస్త్రవిదులును, నిత్యరణోత్సాహులును, శౌర్యధనులు నగుయువకదళంబులును, బింబాధరలు, చారుదరశనలు, సర్వాభరణభూషితలు, దివ్యవసనలు, దివ్యగంధానులిప్తలు, శరచ్చంద్రనిభాననలు, తనుమధ్యలు, మనోజ్ఞవేషలు, తాంబూలరాగాధరలు, రక్షకభటసురక్షితలు, మణికాంచనాలంకారశోభితలు, ఉత్తమమధ్యమ యానాధిరూఢలు, గాయకస్తుతిపాఠకోపగీయమానలు, పద్మపత్రలోచనలు, నగునంతఃపురరమణీమణులును, బ్రహ్మక్షత్రియవైశ్యగణంబులును నారాజేంద్రుననుసరించిరి. ఇంతియకాక నగరవాస్తవ్యులగు సువర్ణరత్నవర్తకులును, అస్త్రవిక్రయులును, తాంబూలవిక్రయులును, తృణకాష్ఠవస్త్రతైలమాంసాదిబహుపదార్థవిక్రయులును, సస్త్రీకులై యాభూపాలునితో బయలుదేఱిరి. మఱియు గాయకులు, నర్తకులు, మంగళపాఠకులు, శైలూషులు, పురాణపండితులు, కథకులు, కవులు, కావ్యకర్తలు, నానాకళాకోవిదులు, గారుడవిషఘ్నులు, రత్నపరీక్షకులు, లోహకారకులు, చిత్రకారకులు, కుంభకారకులు, దండకారకులు, మల్లయుద్ధనిపుణులు, కాయస్థులు, తంతువాయులు, రూపకారులు, వార్తికులు, తైలకారులు,

తైత్తిరికులు, మృగవిహంగోపజీవులు, గోగజాశ్వనరవృక్షవైద్యులు, భేదకులు, దాహకులు, మొదలగువారందఱు మహారాజు ననుసరించి తండ్రితో బిడ్డలవలె పరమానందముతో బయలుదేఱిరి.

ఈరీతిగా నింద్రద్యుమ్నమహీపాలుఁడు మహావైభవముతో సపరివారముగఁ బ్రయాణము సాగించి చాలదినంబులకు దక్షిణసాగరతీరముం జేరి బహుసహస్రతరంగమాలికలతో నృత్యము చేయుచున్నట్లున్న సముద్రమును సందర్శించెను. మఱియు నమ్మహోదధి వివిధరత్నాకరంబును, అగాధజలపూర్ణంబును, వివిధజీవసమాకులంబును, మహాశ్చర్యమయంబును, తీర్థప్రధానంబును, గభీరారావసంకలితంబును, అపారంబును, భయంకరంబును, బహువిధజలచరజీవసమన్వితంబును నై యుండెను. ఆమహాసాగరము శ్రీమన్నారాయణునకు శయనస్థానము. సర్వపాపహరమైనది. పవిత్రమైనది. సర్వకామప్రదమైనది. అనేకావర్తములచే గంభీరమైనది. దానవులకు నివాసము. అమృతంబున కరణి. దేవయోని. జలపతి. నిఖిలజంతువులకును జీవనాధారము. పవిత్రంబులకెల్లఁ బవిత్రమైనది. మంగళంబుల కెల్ల మంగళమైనది. తీర్థంబులకెల్ల నుత్తమతీర్థము. సకలభూతంబులకు నభేద్యంబును, దేవగణంబుల కమృతాలయంబును, సకలజీవోపజీవ్యంబును, నుత్పత్తిస్థితిసంహారహేతుభూతంబును, సనాతనంబును, సకలనదీనదంబున కాధారంబును నగులవణసముద్రమును సందర్శించి యింద్రద్యుమ్నుండు పరమాద్భుతప్రమోదకలితుండై యాతీరంబున శిబిరంబుల స్థాపించి నివసించియుండెను.

అనంతర మారాజేంద్రుం డాసమీపంబున సముద్రముం బోలి విశాలమై సారవంతమై పవిత్రమై మనోహరమై యపూర్వంబును త్రిలోకవందితంబు నగునీక్షేత్రమును గాంచెను. అదికదంబపున్నాగనారి

కేర, పనస, నారంగ, వకుళకపిత్థనాగకేసరబిల్వఖర్జూరబదరీనీపనింబా మ్రాతకకోవిదారభల్లాతకామలకవటదేవదారుచందనజంబీరాది వివిధఫలభూరుహంబులచే విరాజిల్లుచుండెను. అందుఁ బ్రతివృక్షశాఖయందును శుకశారికాహారీతభృంగరాజచాతకబహుపుత్రిక జీవంజీవక కలకంఠకలవంకకపోతాదివిహంగములు శ్రుతిమనోహరంబుగ గానము జేయుచుండెను. మఱియు నందు నిరంతరపుష్పశోభితంబులగు కేతకీమల్లికాదిలతావనఖండంబులు వేర్వేఱుగ విరాజిల్లుచుండెను. ఆలతలన్నియును సురభికుసుమగుచ్ఛంబులచే ఘ్రాణతర్పణంబు గావించుచు నాలోకరమణీయములై యుండెను. ఇట్లు సుందరతరుషండంబులచేతను, కుసుమలతానికుంజములచేతను, నిర్మలసరోవరంబులచేతను, స్థలచరంబులును, జలచరంబులును, ఆకాశసంచరులు నగుననేకజీవసంఘములచేతను నతిరమణీయమైయున్న యాదివ్యక్షేత్రము దశయోజనవిస్తీర్ణంబును, బంచయోజనాయతంబునై యాశ్చర్యమయంబును, బరమదుర్లభంబునై యుండెను.

—♦ పురుషోత్తమక్షేత్రపూర్వవృత్తాంతము. ♦—

అని బ్రహ్మదేవుండు చెప్పుటయు మునివరులో ప్రభూ! ఇంద్రద్యుమ్నభూపాలుం డచ్చటికి సపరివారంబుగ వచ్చి యందు బలరామకృష్ణమూర్తులను, సుభద్రామూర్తిని బ్రతిష్ఠించువఱకును బవిత్రంబును బుణ్యక్షేత్రంబునగు నాపురుషోత్తమస్థానంబునం దెట్టివిష్ణుప్రతిమయుఁ బ్రతిష్ఠింపఁబడనేలేదా? యని ప్రశ్నించుటయు లోకపితామహుం డిట్లని చెప్పం దొడంగెను. మునివరులారా! పాపనాశనం బగునీప్రాచీనచరిత్రము నాకర్ణింపుఁడు. పూర్వకాలంబున లక్ష్మీదేవి భగవానుం డగుశ్రీహరిని బ్రశ్నించినయీవిషయమును సంక్షేపంబుగఁ జెప్పెదను. సుమేరుశైలంబున సర్వైశ్వర్యమయం బగుకాంచనశృంగమునందు

లోకవిఖ్యాతు లగు సిద్ధవిద్యాధరయక్షకిన్నరదేవదానవగంధర్వాప్సరో స్సౌపర్ణమునిగుహ్యకమరుద్గణంబులును, గశ్యపాదిప్రజాపతులును, వాలఖిల్యాదిమహర్షులును జేరియుండి యాకాంచనభూధరంబునకు శోభాసంపాదనంబు చేయుచుండిరి. సర్వర్తుకుసుమవిలసితంబులును, వివిధవర్ణవిరాజితంబులు నగులతాతరువనంబులాగిరిశృంగము నలంకరించుచుండెను. వివిధకుసుమపరిమళంబులచేతను, విహంగకలకూజితంబులచేతను విలసిల్లుచున్నయాసువర్ణశృంగంబున నొకప్పుడు జగద్విధాతయు, జగన్నాథుండు నగువాసుదేవుండు నివసించి యుండఁగా భగవతి యగు కమలవాసిని యమ్మహాదేవునకు సాష్టాంగప్రణామంబు గావించి సర్వలోకహితంబు గోరి యోసర్వలోకేశ్వరా! నాహృదయంబున నొక సంశయంబు గలదు. దానిని నీవు నివారింపవలయును. మహాశ్చర్యమయంబును, సుదుర్లభంబును, గర్మభూమియు నగుమర్త్యలోకము కామక్రోధలోభమోహాదులచే జలజంతుపూర్ణం బగుమహాసాగరముంబోలి విరాజిల్లుచున్నది. ఈసంసారసాగరమునుండి లోకులకు ముక్తిలాభం బెట్లు గలుగునో నాయందు దయయుంచి యెఱింగింపవలయునని ప్రార్థించెను.

అంతజనార్దనుండు శ్రీదేవివచనంబుల నాకర్ణించి ప్రీతచేతస్కుండై యమృతోపమంబులును, బరమంబులును, సారవంతంబులు నగు వచనంబులతో నిట్లనియెను. దేవీ! ప్రధానంబులగుతీర్థము లన్నిటియందును పురుషోత్తమక్షేత్రమే ముఖ్యోపాస్యమైనది. అది సుసాధ్యంబును, మనోరమంబును, సత్ఫలదాయకంబునై జగద్విఖ్యాతంబైనది. పురుషోత్తమంబునకుఁ దుల్యంబగుతీర్థము త్రిభువనంబులయం దెందును లేదు. ఆతీర్థనామకీర్తనంబుననే సకలపాపహారం బగును. సమస్తదేవదైత్యదానవులకును, మరీచ్యాదిమహర్షులకును గూడ నాతీర్థమహిమం

బు సువిదితంబు గాదు. ఓవరాననా! అదియే గుహ్యంబగుమదీయ క్షేత్రము. ఆక్షేత్రమహిమంగూర్చివర్ణించెద నాకర్ణింపుము.

పూర్వము ప్రళయకాలమునందు చరాచరంబు లగుసకలపదార్థములును వినష్టంబు లయ్యెను. దేవదైత్యవిద్యాధరోరగాదు లందఱును విలీనులైపోయిరి. విశ్వమంతయును దమోమయంబై యుండెను. జ్ఞానగమ్యంబగువస్తు వేదియును లేకుండఁబోయెను. అప్పు డేకమాత్రభూతాత్మకుండును, బరమాత్ముండును, జగద్గురుండును, జగత్కర్త్రియుఁ, ద్రిమూర్తిధరుఁడును, మహేశ్వరుండును, వాసుదేవుండు నగుశ్రీహరియొక్కఁడే సాక్షిభూతుఁడై యుండెను. ఆతఁడు మోగనిద్రావసానంబునఁ దననాభికమలమునుండి పద్మకేసరసంకాశుఁడును, అవ్యయుండు నగుబ్రహ్మదేవుని సృష్టించెను. సర్వలోకేశ్వరుం డగువిరించి యప్పుడయించి క్రమక్రమముగాఁ బంచభూతాత్మకం బగుసమస్తచరాచరసృష్టిని గావించుటకుఁ బ్రవృత్తుండై స్థూలసూక్ష్మస్థావరజంగమంబులనుచతుర్విధభూతబృదంబులను దన్మాత్రలనుండి సృష్టించెను. అనంతరము ప్రజాసృష్టి కారంభించి మరీచి ప్రభృతి మునిబృందములను, సమస్తదేవతలను, అసురులను, పితృదేవతలను, యక్షవిద్యాధరాదులను, గంగాదినదులను, నరవానరసింహాదులను, విహంగమంబులను, జరాయుజములను, అండజములను, స్వేదజములను, భూజములను వరుసగాఁ బుట్టించెను. ఈవిధముగాఁ దృణగుల్మలతాదులను, పిపీలికాపర్యంతసకలజీవ బృందంబులను, సృష్టించి మహాత్ముండగువిధాత మఱియు నాత్మచింతనంబు చేసి తనదక్షిణాంగంబునుండి పురుషుని వామాంగమునుండి స్త్రీని సృష్టించెను. అంతటినుండి యమ్మిథునసంబంధమువలన నుత్తమమధ్యమాధమ శ్రేణులుగాఁ బ్రజాగణంబుసముద్భూతం బయ్యెను.

పూర్వకాలంబునఁ బద్మసంభవుం డీరీతిగా సృష్టిసంకల్పనంబు చేసి ధ్యానావలంబనంబున వాసుదేవమూర్తినే చింతింపఁదొడంగెను. అతఁ డట్లుధ్యానంబు సేయుటయు సహస్రాక్షుండును, సహస్రపాదుం డును, సహస్రశీర్షుండును, బుండరీకాక్షుండును, నీలనీరదసంకాశుండు ను, శ్రీవత్సలాంఛితుండును, శ్రీమంతుండు నగుజనార్దనుండు స్వయ ముగ నావిర్భూతుం డయ్యెను. అట్లు సాక్షాత్కరించిన దేవదేవుం గాంచి వినతించి యర్ఘ్యపాద్యాసనాదిప్రదానంబులచే నాతని నర్చించి సమాహితచిత్తుండై స్తోత్రము చేయనారంభించెను. ఓదేవీ! అప్పుడు నేను ప్రీతుండనై యోపద్మసంభవా! నీవు నన్ను ధ్యానించుటకు ని మిత్తం బేమని ప్రశ్నించుటయు లోకపితామహుం డోదేవా! స్వర్గ ద్వారంబునకు మార్గరూపంబు లగునకలయజ్ఞంబులను, దానంబులను, వ్రతంబులను, యోగంబులను, సత్యమును, తపంబును, శ్రద్ధను, వివి ధతీర్థసేవనంబును, బరిత్యజించియైనను దేనినాశ్రయించినచో ననాయా సంబుగ సకలఫలలాభంబును సిద్ధించునో, జగంబునం దేస్థానమునర్వో త్కృష్టంబని భువనవిఖ్యాతిం గాంచెనో, మర్త్యలోకదుర్లభంబగునట్టి పవి త్రక్షేత్రం బేదియో, లోకహితంబుకొఱకు నాకెఱింగింపవలయు నని ప్రార్థించెను.

దేవీ! అప్పుడు నేను బ్రహ్మదేవుని కిట్లు ప్రబోధించితిని. ఓవి ధాతా! సర్వక్షేత్రంబులయం దుత్తమంబును, సంసారతారకంబును, ధన్యంబును, బుణ్యదాయకంబును, గోబ్రాహ్మణహితకరంబును, చతు ర్వర్ణసుఖవర్ధకంబును, మానవులకుఁ బరమదుర్లభంబును, భోగమో క్షప్రదంబును, సర్వసిద్ధిప్రదంబును, నగుక్షేత్రముంగూర్చి చెప్పెదను వినుము. పూర్వకాలమునందే సర్వలోకవిఖ్యాతంబును, జతుర్యుగనిషే వితంబును, సనాతనంబును, సకలతీర్థప్రధానంబు నగునొకదివ్యక్షేత్ర

మాహాత్మ్యాతంబై యున్నది. ఆక్షేత్రము దేవదానవగంధర్వాదులయం దును, సకలచరాచరవస్తుసముదాయమునందును నుత్తమపురుషునివలె విరాజిల్లుచుండుటంజేసి పురుషోత్తమనామంబునఁ బ్రఖ్యాతంబైనది. దక్షిణసాగరతీరంబునం దెచ్చట వటమహీరుహంబు గలదో యటనుండి దశయోజనవిస్తీర్ణంబగు పురుషోత్తమక్షేత్రము తేజరిల్లుచుండును. ఆవటభూజము ప్రళయకాలమునందలి మహోల్కాపాతంబులచేనైన ను వినష్టంబు గాదు. స్వయముగా నేనచ్చట నివసించియుండును అఘనతరుసందర్శనంబునను,దానిచాయసోఁకుటవలనను సకలపాపములు ను నశింపఁగలవు. దానికిఁ బ్రదక్షిణంబు సేయుమానవులు పాపవిముక్తులగుదురు. ఆవృక్షంబునకుత్తరంబునఁ గలకేశవాలయమునకుఁ గొంచెముదక్షిణముగాఁ బురుషోత్తమప్రాసాదము విరాజిల్లుచుండును. అదియే ధర్మమయం బగుస్థానము. అందు దేవతలచేఁ బ్రతిష్ఠితమై యున్న దివ్యప్రతిమను సందర్శించువా రనాయాసముగా మదీయం బగుస్థానమును బొందఁగలుగుదురు.

ప్రియా! మానవులందఱును నాలోకమును జేరుచుండుటం గాంచి యొకప్పుడు ధర్మరాజగుయముండు నాసన్నిధికి వచ్చి ప్రణామము గావించి యోలోకనాథా! జగత్పతీ! క్షీరసాగరనిలయా! శేషభోగిశాయీ! వరా! వరేణ్యా! నీకునమస్కారము. వరదుండవు, కర్తవు, అకారణుండవు, ప్రభుండవు, విశ్వేశ్వరుండవు, అజుండవు, సర్వజ్ఞుండవు, అపరాజితుండవు,నీలోత్పలనిభుండవు, పుండరీకాక్షుండవు, విష్ణుండవు, నిర్గుణుండవు, శాంతుండవు, జగద్విధాతవు, అవ్యయుండవు, సర్వలోకమయుండవు, పురాణపురుషుండవు, వ్యక్తావ్యక్తస్వరూపుండవు, సనాతనుండవు, పరాపరుండవు, లోకనాథుండవు, జగద్గురుండవు, శ్రీవత్సాంకితవక్షుండవు, వనమాలాధరుండవు, పీతాంబరుండవు, చతు

ర్భావహుండవు, శంకచక్రగదాధరుండవు, హారకేయూరభూషితుండవు, ముకుటాంగదమండనుండవు, సర్వలక్షణసంపన్నుండవు, సర్వేంద్రియవి రహితుండవు, భావాభావవిముక్తుండవు, సర్వవ్యాపివి, ప్రకృతిపరుండవు, సుఖదుండవు, ఈశ్వరుండవు జగన్నాథుండవు, ప్రభుండవు, దేవదేవుం డవు, కూటస్థుండవు, అచలుండవు నగు నీకు నమస్కారము.

అని స్తోత్రము చేయుచు నంజలిబద్ధుండై నిలిచియున్నయమధ ర్మరాజుం గాంచి యోగాత్మావస్వాతా! మహాభాగా! నీరాకకుఁ గతంబే మి యని నేనడుగుటయు యముం డిట్లనియెను. ఓపుండరీకాక్షా! వి ఖ్యాతంబును, పవిత్రంబు నగుపురుషోత్తమక్షేత్రంబున సర్వకామ ప్రదంబును, ఇంద్రనీలమయంబు నగునుత్తమప్రతిమ విరాజిల్లుచున్న ది. ఏకాగ్రచిత్తముతో దానిని దర్శించి యారాధించుమానవులు నిశ్చ యముగా విష్ణులోకప్రాప్తు లగుచున్నారు. అందువలన నాయధికా రమున కుచితంబులగుకార్యముల నాచరించుటకు నాకవకాశము లేకుం డఁబోవుచున్నది. కావున నోమధుసూదనా! నీవు నాయెడలఁ బ్రస న్నుండవై యాప్రతిమ నటనుండి యపసారితంబు గావింపవలయు నని ప్రార్థించుటయు నేను కరుణించి యవ్వాప్రతిమను వాలుకాచ్ఛ న్నంబుగాఁ జేసితి నని.

ఓదేవీ! స్వర్ణవాలుకారాశిచే నాప్రతిమ లోకదుర్లభంబుగాఁ జేసితి నని చెప్పినంతనే యముండును సంతోషముతోఁ దననగరంబునకుంబో యి విధాయకకృత్యముల నిరాతంకముగ దీర్చికొనుచుండెను.

—♦ పురుషోత్తమక్షేత్రవర్ణనము. ♦—

అని చెప్పి బ్రహ్మదేవుండిట్లనియెను. ఓమునివరులారా! అట్టి దివ్యక్షేత్రంబును జేరి మహీపాలుం డగునింద్రద్యుమ్నుం డందలిరమ ణీయప్రదేశములను, నదీనమూహంబులను సందర్శింప నారంభించెను.

అచ్చట వింధ్యపాదమునుండి విర్గతంబైన సర్వపాపహరం బగుమహా నది శివజటాజూటనిర్గతంబగుగంగానదింబోలి దక్షిణసాగరాభిముఖం బుగాఁ బ్రవహించుచుండెను. ఆనదిమఱల్లి చిత్రోత్పలానామంబునఁ గూడఁ గీర్తింపఁబడుచుండును. అది దక్షిణాబ్ధిమధ్యంబునం బ్రవేశిం చి మిగుల శోభిల్లుచుండును. ఆమహానది యుభయతీరంబులయందును నెన్నియోనగరంబులును గ్రామంబులును గానవచ్చుచుండును. ఆగ్రా మము లన్నియును సస్యపరిపూర్ణములై మనోహరములై, నిత్యతృప్తు లగుజనులచే నాక్రమకములై యుండును. అందు స్వధర్మనిరతులును, శాం తులును, సుందరవేషభూషణాలంకృతులు నగుచతుర్వర్ణములప్రజలుం ను వాసము చేయుచుందురు. అచ్చటివారివదనములు తాంబూలరా గరంజితములును, గ్రీవములు, సురభికుసుమమాలికాలంకృతములునై యుండును. అగ్నిహోత్రనిరతులును, వేదశాస్త్రనిపుణులును, యా గశీలురును, భూరిదాతలు నగునందలిబ్రాహ్మణులవాణి వేదమయంబై యుండును. ఆనగరంబులయందలిచత్వరంబులును, రాజమార్గములును, వనోపవనంబులును, సభామండపములును, ప్రాసాదమాలికలును, దే వాలయములును బహుజనసమాకీర్ణములై యుండును. ఎచ్చట నాల కించినను బురాణేతిహాసప్రశంసలును, వేదశాస్త్రపాఠంబులును, వినవ చ్చుచుండును. అందలిరమణీమణులు సర్వాంగసుందరులును, సర్వా లంకారభూషితలునై సకలజనహృదయనయనానందకారిణులై విలసి ల్లుచుందురు. అంతటను వేణువీణామృదంగపణవగోముఖశంఖాదిమ ధురనాదంబులు శ్రవణమనోహరంబుగ వినవచ్చుచుండును. ప్రజలం దఱును నిత్యానందులై విలాసవిహారములం గావించుచుందురు. ఆ గ్రామంబులయందనేకులు భిక్షులు, వైఖానసులు, సిద్ధులు, స్నాతకు లు, మంత్రసిద్ధులు, తపస్వులు, సోమయాజులు, మొదలగుసాధుపుఱు

షులు గానవచ్చుచుండురు.

ఈవిధముగాఁ బరమమంగళమయం బగునాదివ్యక్షేత్రమును సందర్శించి యింద్రద్యుమ్నభూపాలుండు తానచ్చటనేయుండి భగవానుండును, సనాతనుండును, జగద్గురుండును, పరాత్పరుండును, పరమపదుండును, సర్వేశ్వరుండును, అపరాజితుండు, అనంతుఁడు నగువిష్ణుదేవు నారాధింపవలయునని సుస్థిరసంకల్పుండయ్యెను. అతఁడు పరమోత్సాహముతో మానసతీర్థం బగుపురుషోత్తమక్షేత్రమును నేను దర్శింపఁగలిగితిని. ఇదియే యాదివ్యతీర్థము. విశాలంబును, సాంద్రంబు నగునివ్వటభూజముచెంగటనే దేవదేవుని యింద్రనీలమయం బగుదివ్యప్రతిమ శ్రీమన్నారాయణునిచే నతిగోప్యముగ దాఁపఁబడినది. ఇచ్చట నిఁక నేవిధమగువైష్ణవప్రతిమయుఁ గానవచ్చుట లేదు. కావున నేనిచ్చట సత్యపరాక్రముండును, దేవదేవుండును, జగన్నాథుండు నగువిష్ణుండు నాకుఁ బ్రత్యక్షుంబగునట్లు సాధ్యమైనంతవఱకుఁ బ్రయత్నించి చూచెదను. నేనిఁక నిశ్చలచిత్తుండనై యింతటినుండి యీదివ్యక్షేత్రంబున, యజ్ఞదానతపోహోమాధ్యయనార్చనోపవాసాదులను విధిపూర్వకంబుగ నాచరించుచు దేవదేవసాక్షాత్కారంబునకు వేచియుండెద నని నిశ్చయించుకొనియెను.

పురుషోత్తమప్రాసాదనిర్మాణము.

మునివరులారా! పృథ్వీపాలుం డగునింద్రద్యుమ్నుం డిట్లు దృఢసంకల్పుఁడై ముందుగఁ బురుషోత్తమమందిరమును నిర్మింపఁదలంచి బహుశాస్త్రజ్ఞులగుగణకులను, ఆచార్యులను బిలిపించి భూశోధనంబు చేయించి జ్ఞానసంపన్నులగుబ్రాహ్మణులు, అమాత్యులు, మంత్రులు, వాస్తువిద్యావిశారదులు మొదలగువారితో నాలోచించి చంద్రతారాగ్రహబలసంపన్నం బగుశుభదినంబున శుభముహూర్తం

బున జయమంగళధ్వనులతోడను, వివిధమనోజ్ఞవాద్యంబులతోడను, మధురసంగీతంబులతోడను బూర్ణకుంభదీపస్థాపనంబు నేయించి పుష్పములు, లాజలు, అక్షతలు, చందనము మొదలగువానితో శ్రద్ధాసహితుఁడై యర్ఘ్యం బొసంగి యుత్కళకళింగకోసలాధిపతులను బిలిపించి వారితో నిట్లనియెను.

ఓప్రభువరులారా! మీరు స్వామికార్యతత్పరులై మీయనుచరులతోఁగూడి యతిశీఘ్రముగ శిలాసంగ్రహంబు గావింపుఁడు. శిలాకర్మనిపుణులగుశిల్పిశ్రేష్ఠులను బిల్పించి బహుకందరవిలసితంబును, సువిస్తీర్ణంబును నగువింధ్యాచలమునకుం బంపి సానుదేశంబులం గల యుత్తమశిలాఫలకంబులఁ దీయించి శకటంబులమీఁదను, నౌకలమీఁదను వేయించి తీసికొని రండు! ఆలస్యము చేయవలదు. అని యాజ్ఞాపించి వారిని బంపి పిదప నమాత్యులను, బురోహితులను బిలిపించి మహాభాగులారా! ఈభూమండలంబునం గలరాజులందఱికడకును దూతలను బంపి యెల్లవారును దమతమరథగజతురగపదాతిసైన్యంబులతో నిచ్చటికి వచ్చునట్లు చేయుఁడనియాదేశించెను. ఆమహారాజునానతిం దలఁదాల్చి దూతలందఱును రాజులకడకుం బోయి యింద్రద్యుమ్నమహీపతియాదేశము నెల్లవారికిని దెలియఁజేయుటయుఁ బూర్వపశ్చిమోత్తరదక్షిణభాగంబులం గలరాజన్యులందఱును, బర్వతద్వీపభూపాలురందఱును సపరివారంబుగ బహుధనరత్నరాసులంగొని పురుషోత్తమక్షేత్రమునకు వచ్చిచేరిరి.

వారినందఱిం గాంచి యింద్రద్యుమ్నుండు సంప్రీతుండై యాదరపూర్వకముగా నృపవరులారా! నేను భోగమోక్షప్రదంబగు దివ్యక్షేత్రంబున నశ్వమేధమహాయజ్ఞంబును, వైష్ణవప్రాసాద నిర్మాణంబును గావింపఁదలంచితిని. ఇక్కార్యంబెట్లుసంపన్నంబగునని చింతిం

చుచున్నాఁడను. మీరందఱును నాకు సాహాయ్యంబు గావించినచో నిరంతరాయంబుగ సకలకార్యంబులును సఫలంబులగునని యాశపడు చున్నాను. అని చెప్పుటయు వచ్చినరాజులెల్లరును సంతుష్టులై ధనకనకరత్నవర్షంబులు గురియింప నారంభించిరి. ఉత్తమోత్తమంబులగు కంబళాజినంబులు, రత్నరాంకవాస్తరణంబులు, వజ్రవైడూర్యాదినవరత్నములు, గజములు, అశ్వములు, ధనధాన్యాదులు, వివిధద్రవ్యములు, నవభాశ్యములు, దధిక్షీరఘృతాదులు మొదలగు సమస్తవస్తువులతోడను యజ్ఞస్థలం బంతయును నిండిపోయెను.

అప్పుడు శ్రీమంతుం డగునింద్రద్యుమ్నుండు సకలసంభారంబులను, యజ్ఞధర్మజ్ఞులును, శాస్త్రజ్ఞులును, సర్వకర్మక్షములు నగుభూసురులను, ఋషులను, మహర్షులను, తపస్వులను, బ్రహ్మచారులను, గృహస్థులను, వానప్రస్థులను, యతులను, స్నాతకులను, ద్విజులను, మఱియు నితరాగ్నిహోత్రులను, తపస్స్వాధ్యాయసంపన్నులగు నాచార్యులను, ఉపాధ్యాయులనుగాంచి పరమానందముతోఁ దనపురోహితునింబిలిచి వేదపారీణులగు నీబ్రాహ్మణగణంబులతోఁగూడ నశ్వమేధయాగక్రియానిర్వాహణంబునకై యజ్ఞస్థలంబును సంశోభితంబుగఁ జేయుమని చెప్పుటయుఁ బురోహితుండు ప్రముదితుండై మంత్రులతోఁగూడ నాతని యాదేశములను బరిపాలించెను.

అప్పుడు ప్రాజ్ఞుం డగుపురోహితుండు యజ్ఞక్రియాదక్షులగు భూసురోత్తముల నగ్రవర్తులం జేసికొని వచ్చినమహారాజులతోఁగూడ యజ్ఞస్థానమునఁ బ్రవేశించి యచ్చట యథావిధిగ యజ్ఞవాటమును నిర్మాణంబు సేయించెను. అచ్చట మహేంద్రప్రాసాదసన్నిభంబులగు ననేకమణియసౌధంబులును, గనకచిత్రితస్తంభంబులును, నతివిశాలోన్నతంబులగుతోరణంబులును, నిర్మితంబు లయ్యెను. ధర్మాత్ముండగుపు

రోహితుండు కనకమయం బగుయజ్ఞాయతనంబు నట్లు నిర్మింపఁజేసి నానాదేశాగతులగురాజన్యగణంబుల కంతఃపురంబులును, వివిధదేశవాసులగు బ్రహ్మక్షత్రియవైశ్యాదులకు నికేతనంబులును నందు యథోచితంబుగ నేర్పఱిచెను.

నరనాథుం డగునింద్రద్యుమ్నుని సంప్రీతుం గావించుటకై దేశదేశంబులనుండి ప్రధానులగుమహారాజులును, రమణీగణంబులును బహురత్నంబులం గైకొని యయ్యుత్సవంబునకు విచ్చేసి యుండిరి. వారందఱును సపరివారంబుగఁ దమతమశిబిరంబులఁ బ్రవేశము గావించునప్పుడు సాగరఘోషముంబోలినయొకమహాగభీరారావము భూనభోంతరముల వ్యాపించిపోయెను. మహారాజగునింద్రద్యుమ్నుఁడు స్వయముగా వారి కందఱకును యథోచితస్థానంబుల నేర్పఱచి యథాయోగ్యాసనశయ్యాదులనొసంగి, యుత్తమంబులగుపానభోజనాదులనందించునట్టియేర్పాటులను గావించెను. ఆమహాయజ్ఞంబునకు బ్రహ్మవాదులగునేకభూసురశ్రేష్ఠులు తమతమశిష్యులతోఁగూడ వచ్చియుండిరి. మహామతియగునమ్మహీపతి వారికందఱకును దగినవసతుల నొసంగి సన్మానసత్కారాదులం గావించెను. ఆమహీపాలుండు గర్వంబించుకంతయును లేక వినీతభావంబున నెల్లవారిని దానెయెదుర్కొని యజ్ఞసందర్శనాగతులగువారినందఱను సన్మానించుచుండెను.

అనంతరము శిల్పిగణంబులు తమతమకార్యములను బూర్తిచేసి యజ్ఞవిధులంగూర్చి విజ్ఞాపనంబు సేయుటయు మహారాజు మంత్రిగణంబులతోఁగూడఁ బ్రహృష్టహృదయుండై యజ్ఞారంభంబు గావించెను. నానాదేశాగతులగునరపతులందఱును మహేంద్రవిభవుండగు నింద్రద్యుమ్నునింపర్శించి యజ్ఞశాలయందలికనకతోరణశయ్యాసనాదులను, రత్నకంబళములను, రత్నకుంభంబులను, రత్నపాత్రలను, రత్నక

ట్టాహంబులను, ననేకంబులగు మంగళకలశంబులను దిలకించి యాశ్చ ర్యంపడసాగిరి. ఆయజ్ఞపరికరంబులలో సువర్ణమయంబుగాని వస్తు వొక్కటియును లేకుండెను. హేమమయంబులగుయజ్ఞయూపంబులన్ని యును, మంత్రపాఠపూర్వకంబుగా స్థాపింపఁబడియెను. స్థలజంబులును, జలజంబులునగుపశువు లన్నియును సమానీతంబు లయ్యెను. ధనధా న్యాదులతోడను, సమస్తయజ్ఞపరికరంబులతోడను నిండియున్నయజ్ఞ శాలం గాంచి రాజులందఱును మహాశ్చర్యభరితులైరి. బ్రాహ్మణా దిజనంబులు బహువిధంబులగుమృష్టాన్నంబుల నారగించుచుండిరి. ల క్షబ్రాహ్మణభోజనానంతరంబున మాటిమాటికిని మేఘగంభీరంబగు దుందుభిధ్వానము వినవచ్చుచుండెను. అట్టిదుందుభి, దినమున కెన్ని యోసారులు మ్రోగుచుండెను. సహస్రసహస్రంబులగునన్నపర్వతం బులను, దధికుల్యలను, దుగ్ధకుల్యలను, ఆజ్యనదులను దిలకించినవా రందఱును బరమాశ్చర్యభరితు లగుచుండిరి.

నానాజనపదపరివృతంబగుజంబూద్వీపమునందలిబ్రాహ్మణు లె ల్లరు నాయజ్ఞంబునకు విచ్చేసి యుండిరి. ఎచ్చటఁజూచినను వేలకొలఁ దివప్రజలు గానవచ్చుచుండిరి. అందఱును రాజభోగ్యంబు లగునన్న పానాదులచేఁ బరితృప్తు లగుచుండిరి. భూపాలచంద్రుం డగునింద్ర ద్యుమ్నుఁడు బ్రహ్మవిదులగుబ్రాహ్మణులను భూరిదక్షిణలచేతను, నా నాదేశాగతులగురాజన్యులను యథాయోగ్యసత్కారంబులచేతను బరి తుష్టులం గావించుచుండెను. ఆరాజేంద్రునకు సర్వాంగసుందరులును, సర్వాలంకారవిభూషితలునగుపదునొకండువందలమంది భార్యలు గల రు. వా రెల్లరును బ్రత్యేకమణిమందిరములయం దుచితపరివారములతో నివసించియుండిరి. పర్వతోపమానంబులగుమదగజంబులును, బవన జవసంబులగుసుందరాశ్వంబులును, దేవకుమారప్రతిమ లగుపదాతిసై

నికులున, నంము నివసించియుండ నాయజ్ఞశాల కన్నులపండువుగా నుండెను.

అప్పుడు మహారాజు తనకర్మచారులం బిలిచి సర్వలక్షణసంపన్నం బగుమఖాశ్వము నతిశీఘ్రముగ భూపర్యటనంబు సేయింపవలయును. ఆయశ్వరక్షణంబునకై జితేంద్రియులగురాజపుత్రులను బంపవలయును. విద్వాంసులగుధర్మజ్ఞులు హోమకార్యములందుఁ బ్రవృత్తులు గావలయును. ద్విజగణంబులు, కృష్ణచ్ఛాగకృష్ణసారాదియజ్ఞపశువుల నన్నింటిని సంసిద్ధములుగఁ జేయవలయును. విష్ణుప్రాసాదనిర్మాణంబునకుఁ ద్వరపడవలయును. స్త్రీ, రత్న, గ్రామ, నగర, ధనాదులను బ్రాహ్మణుల కభీష్టానుసారంబుగ దానము సేయింపవలయును. ఎవ్వరికి నేదియు లేదనుమాట చెప్పఁగూడదు. మహాదేవుండగు పురుషోత్తముండు సాక్షాత్కరించువఱకు నేనిచ్చటనేయుండి నిరంతరయజ్ఞకార్యాచరణంబున నిమగ్నుఁడనై యుండెదను. అని యాజ్ఞాపించి యాభూవరుండప్పుడు కోటికోటిసువర్ణంబులను దానముచేయనారంభించెను. అతఁడు వేదవిదు లగుబ్రాహ్మణులకు వేలకొలఁది యేనుంగులను, నియుతసంఖ్యాకంబులగునశ్వములను, అర్బుదంబులకొలఁదివృషభంబులను, రూపవంతములును, పయస్వినులును, స్వర్ణశృంగసమంచితంబులు నగుననేకధేనువులను దానము గావించెను. మఱియు నమూల్యవస్త్రంబులను, రత్నకంబళంబులను, నవరత్నంబులను, సర్వాలంకారశోభితలై త్రిలోకసుందరీమణులగుకన్యలనుగూడ బ్రాహ్మణులకు దానంబు గావించెను సర్వజనులకును నిరంతరమృష్టాన్నసంతర్పణంబులఁ గావించుచుండెను. ఆమహారాజు దానముచేసినధనమునకుఁ బరిమితి లేదు.

ఇదియంతయుం గాంచి, దేవగంధర్వాప్సరోగణంబులును, సి

ద్ధచారణదైత్యదానవాదులును, ఋషులును, ప్రజాపతులునుగూడ బ
రమాశ్చర్యనిమగ్నులై పోయిరి. ఆయజ్ఞంబిట్లు నిరంతరాయముగఁ గొ
నసాగుచుండుటంగాంచి పురోహితులును, మంత్రులును, మహారాజు
నుగూడఁ బరమానందభరితులైరి. ఆస్థలంబున మలినులును, దీనులు
ను, క్షుధార్తులు నగువారొక్కరును లేకయుండిరి. ఆధివ్యాధిభయా
దు లందుఁ జేరవచ్చుటలేదు. ఆయజ్ఞంబునకు వచ్చినమహాత్ములంద
ఱును బరమానందనిమగ్నులై యుండిరి. అంతటిమహావైభవముతో
నట్టి యజ్ఞము మఱి యేకాలమునందును జరుగలేదు. ఈవిధముగా
నమ్మహారాజు హయమేధయాగంబును, బురుషోత్తమప్రాసాదనిర్మాణం
బును నిర్విఘ్నపరిసమాప్తిం గావించెను.

—♦ ప్రతిమానిర్మాణచింతనము. ♦—

ఇట్లు మహారాజచంద్రుం డగునింద్రద్యుమ్నుండు యజ్ఞంబును,
బ్రాసాదంబును బూర్తి గావించి ప్రతిమావిషయంబున నేయింబవ
లాలోచింపనారంభించెను. సర్వదేవతాధీశ్వరుండును, సర్వలోకపావ
నుండును, సృష్టిస్థితిసంహారకారణుండును నగుపురుషోత్తము నేవిధముగా
సందర్శింపవలయు నని యారాజేంద్రుండు దివారాత్రంబులు నిద్రాహా
రంబులులేక విచారించుచుండెను. అతఁ డాహారమును బరిత్యజించెను;
ఎట్టిభోగ్యవస్తువును గైకొనుట లేదు. తుద కానృపాలుఁడు స్నానభూ
షణాదులనుగూడఁ బరిత్యజించివైచెను. వాద్యములు, గానములు,
గంధద్రవ్యములు, వర్ణికములు, మదమాతంగములు, ఉత్తమాశ్వము
లు, పద్మరాగములు, ఇంద్రనీలములు, సువర్ణములు, వజ్రములు, మౌ
క్తికములు మొదలగునేపదార్థము లైనను, అంతరిక్షచరంబులును, వన
చరంబులు నగు నెట్టివిహంగమాదు లైనను నాతనిమనంబునకు సంతు
ష్టిం గూర్పఁజాలకుండెను. శిలామయంబును, మృత్తికామయంబును

దారుమయంబు నగుప్రతిమలయందే మూర్తి సర్వలక్షణసంపన్నంబ
గు విష్ణుదేవు నారాధించుటకు యోగ్యమైనదిగా నుండునో, ఈత్రివిధ
మూర్తులయందును దేనిని బ్రతిష్ఠించి యర్చించుటచే సర్వదేవార్చి
తుండును, సకలలోకపిత్రుండును నగువిష్ణుదేవునకుఁ బ్రీతిలాభం బగు
నో యని యాలోచించుకొనుచు దివారాత్రము లాభూపాలుండు పరి
తపించిపోవుచుండెను.

—♦ కారుణ్యస్తవము. ♦—

ఇట్లుండి యొకనాఁ డమ్మహీపాలుండు పాంచరాత్రవిధానంబున
విష్ణుదేవార్చనంబు గావించి యుంచుక సేపు ధ్యానినిమగ్నుండై యనం
తర మీరీతిగా జగన్నాథు నుద్దేశించి స్తోత్రము సేయ నారంభించెను.
ఓవాసుదేవా! మోక్షకారణా! నీకు నమస్కారము. సర్వలోకేశ్వరుం
డవగు నీవు దయామయుండవై నన్నీభవసాగరమునుండి తరింపఁజేయు
ము. పురుషోత్తమా! నిర్మలాంబరసన్నిభుండవు, సంకర్షణుండవు, ధరణీ
శ్వరుండవు నగునీకు నమస్కరించెదను. నన్ను రక్షింపుము. ఓమకర
ధ్వజా! హేమగర్భాభా! రతికాంతుండవు, శంబరాంతకుండవు నగు
నీకు మాటిమాటికిని నమస్కరించెదను. నాకుఁ బరితాణంబు గూ
ర్పుము. భక్తవత్సలా! అంజనసంకాశుఁడవు, అనిరుద్ధుఁడవు నగునీకు
వందనములు. నన్నుఁ గరుణించి నాకు వరప్రదానంబు సేయుము. విబు
ధప్రియా! నారాయణా! నీకనేక సాష్టాంగప్రణామములు. నీకు శర
ణాగతుండ నగునన్ను రక్షింపుము. బలిశ్రేష్ఠా! లాంగలాయుధుఁడవు,
చతుర్ముఖుండవు, జగద్ధాముండవు, ప్రపితామహుండవు నగునీకు నమ
స్కారము. నన్నుఁ గరుణింపుము. నీలమేఘశ్యామా! త్రిదశార్చితా!
జగన్నాథా! విష్ణుదేవా! భవసాగరనిమగ్నుండ నగునన్నుద్ధరింపుము.
ప్రళయానలసంకాశుఁడవు, దితిజాంతకుండవు, మహావీర్యుండవు, దీప్త

లోచనుండవు, నరసింహుండవు నగునీకు నమస్కారము. నాయెడలఁ బ్రసన్నుండ వగుము. పూర్వకాలంబున రసాతలమునుండి యీభూతలమును వరాహరూపధారివై నీవే యుద్ధరించితివి. అట్టినీవు నన్నీదుఃఖసాగరమునుండి దరిఁజేర్పుము. ఓకృష్ణా! సకలాభీష్టప్రదంబగు నీదివ్యమూర్తి నిగీర్తించెదను. బలదేవాదిసకలదేవతలును నీవే. నీవే యీసకలరూపంబులతోడను వేఱువేఱువిధంబులఁ గానంబడుచుందువు.

అచ్యుతా! జగన్నాథుండవును, సౌమ్యదర్శనుండవును, బ్రసన్నుండవు నగు నీకు విద్వాంసులు నిర్ణయించినవిభిన్నమూర్తుల నన్నిటిని భావించి యర్చనాస్తవప్రణామంబులఁ గావించుచుంటిని. నీవా సకలదివ్యమూర్తులతోడను సాక్షాత్కరించి నాకు ధర్మార్థకామమోక్షంబులఁ బ్రసాదింపుము. శ్రీహరీ! నిన్నర్చించుకొఱకు భిన్నరీతులఁ గల్పింపంబడిన భవదీయంబులగు సంకర్షణాదిదివ్యమంగళమూర్తు లన్నియును నీయందే ప్రతిష్ఠితములై యున్నవి. కాని దేవేశా! పరమార్థదృష్టిచే నీకట్టిభేదభావంబును లేదు. నీకుపచారంబులఁ గావించుటకే నీవిషయంబున వివిధమూర్తులు కల్పితంబు లయ్యెను. నీవు కేవల మద్వితీయుండవు. నిన్ను ద్వైతమూర్తిగా మానవు లెట్లు నిర్దేశింపఁగలుగుదురు? శ్రీహరీ! నీవేకమూర్తివి. అద్వయుండవు. సర్వవ్యాప్తుండవు, చిత్స్వభావుండవు, నిరంజనుండవు, పరమంబగు నీదివ్యమూర్తి భావాభావవిరహితంబును, నిర్లేపంబును, నిర్గుణంబును, శ్రేష్ఠంబును, కూటస్థంబును, అచలంబును, ధ్రువంబును సర్వోపాధివినిర్ముక్తంబును సత్తామాత్రంబునై విరాజిల్లుచుండును. అట్టి నీరూపతత్త్వమును దేవతలైనను గ్రహింపఁజాలరు.

ప్రభూ! నేను మానవుఁడను. అట్టి నీదివ్యమంగళస్వరూపము నెట్లు భావింపఁగలుఁగుదును? మహాదేవా! పీతాంబరవిలసితంబును,

చతుర్బాహుసమన్వితంబును, శంఖచక్రగదాఖడ్గసంకలితంబును, ముకుటాంగదాద్యలంకారవిభూషితంబును, శ్రీవత్సలాంఛితంబును, వనమాలాలంకృతంబు నగు దివ్యమూర్తి నీసహస్రమూర్తులలో నేకతమంబైనది. విబుధగణంబులును నిన్నాశ్రయించిన మానవగణంబులునుగూడ నట్టి నీమూర్తినే యారాధించుచుందురు. దేవదేవా! సురశ్రేష్ఠా! భక్తజనాభయప్రదా! పద్మపత్రాక్షా! విషయార్ణవనిమగ్నుండ నగు నన్నుఁ గటాక్షింపుము.

లోకేశ్వరా! శరణాగతుండ నగు నేను నీకంటె నితరదైవతంబుల నెఱింగినవాఁడను గాను. కావున నోకమలాకాంతా! మధుసూదనా! కృపాళుండవై నాయెడలఁ బ్రసన్నుండవగుము. మహాత్మా! నేననేకంబులగు నాధివ్యాధిజరాజాలంబులచే బడితుండనై నానాదుఃఖంబులచే నిపీడితుండనై, హర్షవిషాదంబులచే విమూఢుండనై, అసంఖ్యంబులగు కర్మపాశంబులచే బంధితుండనై డస్సియున్నాఁడను. మఱియు నతిభీషణంబగు సంసారసాగరంబునఁ బతితుండనై కొట్టుకొనుచున్నాఁడను. ఈ సంసారపారావార మతివిషమంబులగు దుఃఖతరంగములచే నపారమైనది. రాగద్వేషాదిజలచరంబులచే నాకులమైనది. ఇంద్రియావర్తములచే గంభీరమైనది. తృష్ణాశోకవీచికలచే సంక్షుభితంబైనది. ఇందెట్టి యాశ్రయమును లేదు. ఎట్టియవలంబనమును లేదు. ఎట్టిసారమును లేదు. ఇది నిరంతరమును జంచలమైనది. ప్రభూ! నేను నీమాయచే మోహితుండనై చిరకాలమునుండి యీసంసారజలధియందుఁ బడి భ్రమించుచుంటిని. అనేకపర్యాయము లనేకగర్భాంతరముల నవతరించుచుంటిని. ఈసంసారమునందు నే నెన్నివేల లక్షలకోట్ల జన్మముల నెత్తితినో వానికి లెక్కయేలేదు.

ఓ జనార్దనా! నేను సాంగంబులగు సమస్తవేదములను, వివిధశా

స్త్రములను, అనేకేతిహాసములను, బురాణములను, బహువిధశాస్త్రము లను గూడ నధ్యయనంబు చేసితిని. జగన్నాథా! ఎన్నియోక్షయం బులును, వృద్ధులును, స్థితులును, శీలంబులును, సంతోషములును, దుఃఖములును, సంచయంబులును, అపచయంబులును, వ్యయంబులు ను నాకుఁ బ్రాప్తించినవి. ఎందఱో భార్యలును, మిత్రులును, శత్రులును, బుత్రులును, బంధువులు మొదలగువారితో సంయోగవియోగములు నాకనుభవంబులైనవి. ఎన్నియోపర్యాయము లెందఱో తల్లిదండ్రులు నాదృష్టిపథంబునసంచరించిరి. నేననేకదుఃఖంబులను, సుఖములనుగూడ ననుభవించితిని. భార్యలు, పుత్రులు, బాంధవులు, జ్ఞాతులు మొదలగువారనేకులు నాకు లభించిరి. నేననేకపర్యాయములనేకయువతుల విష్ఠామూత్రపిచ్ఛిలంబులగు గర్భకుహరంబులయందు వాసము చేసితిని. ఆగర్భవాససమయంబులం దనేకదుఃఖంబుల ననుభవించితిని.

ప్రభూ! నేను బాల్యయౌవనకౌమారములయం దేయేదుఃఖముల ననుభవించితినో యవియన్నియును వార్ధకంబునఁగూడఁ దటస్థించినవి. హృషీకేశా! మరణానంతరంబునఁగూడ యమాలయమార్గంబునం గలదుఃఖముల నన్నిటిననుభవించితిని. మఱియు నరకలోకంబునం దెంతటిభీషణయాతనలుగలవో యవియన్నియు నే నెఱుంగనివి లేవు. క్రిమికీటాదులు, మృగములు, పక్షులు, గోమహిషాదిజంతువులు, మొదలగువానిగర్భంబులయందును, బ్రాహ్మణులు, శూద్రులు, ధనాఢ్యులు, దరిద్రులు, క్షత్రియులు, దీనులు, గృహస్థులు,నృపాలురు, రాజసేవకులు, మొదలుగాఁగల యనేకులగృహస్థులయిండ్లయందు నేను మాటిమాటికిని జన్మించుచునే యుంటిని.

దేవా! నేననేకపర్యాయములు దాసజాతులకు దాస్యత్వముం

గావించితిని. ఒకప్పుడు దరిద్రపదంబునను మఱియొకప్పుడు ధనాఢ్యపదంబునను, వేఱొకప్పుడు ప్రభుపదంబునను నేను బ్రతిష్ఠితుండనైతిని. ఒక్కొకప్పుడు నేనొక్కఁడ, బలువురనుగూడ సహతులం గావించితిని. మఱియు ననేకులచే ననేకులను నిహతులగునట్లు సేయించితిని. అనేకులు నాకు దానంబులఁ గావించి యుండిరి. నేనుగూడ ననేకులకు భూరిదానములం గావించితిని.

జనార్దనా! నేను కేవలమును సిగ్గువిడిచి తండ్రులు, తల్లులు, మిత్రులు, భ్రాతలు, భార్యలు మొదలగువారికొఱకు కొన్నియోసారులు ధనికులు మొదలు దరిద్రులవఱకునుగల యెందఱో పురుషులయొద్దననేకవిధంబులగు దైన్యోక్తులను బచరించితిని. ప్రభూ! సచరాచరంబగు నీప్రపంచమునందుఁ గలతిర్యగ్జాతిమానవ జాతులలో నేను జన్మింపనిస్థాన మేదియును లేదు. జగన్నాథా! ఈరీతిగా నేనొకప్పుడు నరకమునందును, మఱియొకప్పుడు స్వర్గమునందును నివసించుచుంటిని. ఒకప్పుడు మానవలోకమునందును, మఱియొకప్పుడు తిర్యక్సంఘమునందును సంభ్రమించుచుంటిని. జలయంత్రమునందు రజ్జునిబద్ధంబగు ఘటంబు క్రమముగా నూర్ధ్వమధ్యమనిమ్నాభిముఖంబుగాఁ బరిభ్రమించునట్లే నేనును గర్మపాశబద్ధుండనై యూర్ధ్వాధోమధ్యభాగంబులకు యాతాయాతంబులఁ గావించుచుంటిని. ఇట్లే నేనిభయంకరసంసారచక్రంబునఁ బడి చిరకాలమునుండి సంచరించిపోవుచుంటిని. దీనికంతం బెట్టుటను గనుంగొనఁజాలకుంటిని.

మహాప్రభూ! నేనిప్పుడు వ్యాకులితేంద్రియుండనై పడియుంటిని. కర్తవ్యం బేమియు నాకు బోధపడుట లేదు. శోకతృష్ణాదులచే నభిభూతుండనై యున్న నాకుఁ జైతన్యము లేకుండఁబోవుచున్నది. ఇప్పుడు నేను కింకర్తవ్యతావిమూఢుండనై యున్నాఁడను. దుఃఖవిహ్వ

ఖుండనగు నేనిప్పుడు నీశరణంబు గోరి యున్నవాఁడను. ఓ శ్రీకృష్ణా ! దుఃఖితుండను, సంసారసాగరనిమగ్నుండను నగునన్ను నీవు నీభక్తునిగా నంగీకరించెదవేని జగన్నాథా ! అట్లయినచో నీకృపాకటాక్షములను నావంకకు మరలింపుము. దేవా ! నాకు నీకంటెఁ బ్రాణబంధువు లెవ్వరును లేరు. నాకొఱకుఁ జింతించువా రెందును లేరు.

వాసుదేవా ! నీవంటిపరిత్రాణకర్తను బడయఁ గలిగిననాకు జీవితమరణములంగూర్చి గాని, యోగక్షేమములంగూర్చి గాని యెట్టిభయంబును లేదు. ప్రభూ ! నిన్ను యథావిధిగ నర్చింపఁజాలనినరాధములకు సంసారబంధమునుండి విముక్తిలాభం బెట్లు సంఘటిల్లును ? జగద్ధారణకర్తయగు కేశవునియందు భక్తిభావంబు గలుగనివిమూఢులకుఁ గులశీలవిద్యాధనజీవనంబులవలనఁ బ్రయోజన మేమున్నది ? అసురప్రకృతులై విమూఢభావంబున జగన్నాథుండ వగునిన్ను నిందించువారు మాటిమాటికిని జననమరణంబులం గాంచుచు ఘోరనరకంబునఁ బతితు లగుచుందురు. నిర్గుణుండవగునీయందు దోషారోపణముం గావించునరాధముల కెన్నటికిని నరకార్ణవమునుండి నిష్కృతిలాభంబు చేకూరదు.

శ్రీహరీ ! నేను నిన్ననేకవిధంబులఁ బ్రార్థించుచున్నాఁడను. కర్మానుసారంబుగ నేనెచ్చట నేరూపంబున జన్మించినను, నాకు నిరంతరమును నీయందు సుదృఢంబగు భక్తిభావంబు గలుగునట్లనుగ్రహింపుము. దేవదానవమానవాదు లెల్లరును సంయతచిత్తంబులతో నిన్నారాధించుటవలన బరమసిద్ధిలాభముం గాంచఁ గలుగుచుందురు. కావుననోస్వామీ ! అట్టినిన్నెవ్వరారాధింపకుందురు ? బ్రహ్మాదిదేవగణంబులైనను నిన్ను సంపూర్ణముగ నన్నుతింపఁజాలరు. ప్రభూ ! అట్టిచో నజ్ఞానుండ నగునేను నిన్నుస్తోత్రము చేయుచున్నాను. ఈభక్తునిసంస్తు

తివచనంబులయం దపరాధము లేమైన నున్నవో దయయుంచి క్షమింపుము.

గోవిందా! సాధువులగుమహాత్ము లపరాధులను దయతోక్షమించుచునే యుందురు. అట్లే భక్తవత్సలుండ వగునీవు నాయెడలఁ బ్రసన్నుండ వగుము. భక్తిపూర్వకంబుగ నిన్నుంగూర్చి కావించిన యీనాస్తోత్రము భవత్ప్రసాదంబుచే సర్వసంపన్నం బగుఁగాక! ఓవాసుదేవా! నీకిదేనానమస్కారము.

అనియిట్లు మహారాజేంద్రుం డగునింద్రద్యుమ్నుండు స్తోత్రముచేయుటయు సర్వాత్ముం డగుగరుడధ్వజుండు సాక్షాత్కరించి యమ్మహారాజునకు సకలాభీష్టంబులను బ్రసాదించెను. పవిత్రంబగునీస్తవరాజమును శ్రీజగన్నాథపూజాసమయంబునఁ బఠించువారు నిశ్చయముగా మోక్షలాభంబు నందుదురు. అభిజ్ఞులగువారు త్రిసంధ్యలయందును శ్రేష్ఠంబగునీస్తవంబును బఠించి ధర్మార్థకామమోక్షఫలంబులం గాంచఁగలరు. ఈస్తోత్రపాఠమువలన సర్వపాపనాశనంబై, విష్ణులోకంబున స్థిరనివాసభాగ్యంబు సిద్ధించును. ధన్యంబును, పాపఘ్నంబును, భుక్తిముక్తిప్రదంబును, మంగళమయంబును, గోపనీయంబును, దుర్లభంబునగు నీపుణ్యస్తవంబును నాస్తికులు, మూర్ఖులు, కృతఘ్నులు, అభిమానులు, దుష్టబుద్ధులు, భక్తిరహితులు నగువారికెన్నఁడును బోధింపరాదు. భక్తియుక్తులును, సత్యశీలురును, శాంతులును, శ్రద్ధాసమంచితులును, ఆస్తికులు నగువారిచే నీస్తోత్రము నధ్యయనంబు సేయింపవలయును. ఇది సర్వపాపహరం బగుపురుషోత్తమస్తోత్రము. అశేషాభీష్టఫలదంబును, సుఖమోక్షప్రదంబును, వరిష్ఠంబు నగునిది కారుణ్యస్తవనామంబున విఖ్యాతంబైనది.

ఈస్తోత్రరాజమును నిర్మలచిత్తంబుతోఁ బఠించుచు నూత్స్మం

ఘును, నిత్యుండును, పురాణపురుషుండును, నగుమురారిని ధ్యానము చేయు మహాభాగులు ముక్తిభాగులై యజ్ఞాగ్నియందు మంత్రాహుతం బగునాజ్యముంబోలి విష్ణుదేవుని దివ్యమంగళతేజమునందు విలీనులగుదురు. పరాత్పరుండగు శ్రీహరియొక్కఁడే భవదుఃఖములను హరించువాఁడు. అతనికంటె సర్వకర్త యగువాఁ డెవ్వఁడును లేఁడు. అతఁడే సృష్టియు, పాతయు, వినాశకుండును, నిఖిలసంసారమునందును సారభూతుండు నగువిష్ణుదేవుఁడు. మోక్షప్రదుండును జగద్గురుండు నగు శ్రీకృష్ణదేవునందు భక్తిలేనివానికి విద్యాగుణయజ్ఞదానతపంబులు నిష్ఫలంబులై పోవును. పురుషోత్తముం డగునాపరమపురుషునియందు భక్తిగలవారే ధన్యులు. వారే శుచిమంతులును, విద్వాంసులును, యజ్ఞతపోదానాదిగుణగణంబులచే వరిష్ఠులును, జ్ఞాతలును, దాతలును, సత్యవంతులు నగుచున్నారు.

ప్రతిమోత్పత్తి.

మహీపతి యగు నింద్రద్యుమ్నుం డివిధముగా సనాతనుండును, జగన్నాథుండును, వాసుదేవుండు నగు పురుషోత్తముని స్తుతించి ప్రణామంబు చేసి ధ్యానమగ్నుండై భూతలంబునఁ గుశాసనంబున శయనించి జనార్దనుండు తనకు సాక్షాత్కరింపవలయునను సంకల్పముతోఁ దదేకచిత్తంబున భావించుచుండెను. ఆసమయంబున జగద్గురుండును, శంఖచక్రగదాధరుండును, నగు వాసుదేవుం డాతనికి స్వప్నంబున సాక్షాత్కరించెను. గరుడారూఢుండును, ప్రళయకాలాదిత్యసంకాశుండును, అష్టభుజుండును, నీలవైడూర్యకాంతివిలసితుండును, జ్యోతిర్మూర్తియు నగు దేవదేవుం డిట్లు సాక్షాత్కరించి యోమహారాజేంద్రా! నీవు ధన్యుఁడవు. నీవు గావించిన యీదివ్యయజ్ఞకార్యనిర్వహణంబునకును, నీ నిశ్చలభక్తికిని నేను సంతుష్టుండనైతిని. రాజచంద్రా! ఊరక నీవి

ళ్లల పరితపించెదవు? ఈస్థానంబున జగత్పూజ్యం బగు సనాతనదివ్య ప్రతిమ నీకు లభించు నుపాయంబు చెప్పెదను వినుము. మహాభాగా! నేఁటినిశావసానంబున వినిర్మలమార్తాండమండలం బుదయించునప్పుడు లవణజలధితీరంబున నానాద్రుమవిభూషితం బగు జలప్రాంతంబున నేకతరంగపరిప్లుతంబగు మహాజలరాశి సందృష్టంబు గాఁగలదు. ఆజలస్థలసమీపంబున నించుక జలంబును స్థలంబును గలసియున్నచోట మహాభూరుహము నిలిచియుండును. ఆపాదపరాజము సాగరతరంగములచే నాహతంబగుచుండియు నిష్కంపితమై యుండును. నీవు కుఠారహస్తుండవై యొక్కండవు నాతరంగమధ్యంబునకుం బోయినచో నావృక్షము నీకు దృగ్గోచరంబు గాఁగలదు. ఈలక్షణములనుబట్టి నీవాభూరుహమును గనిపెట్టి నిశ్శంకచిత్తముతో దానిని ఛేదింపుము. అట్లు చేసినచోఁ దెల్లవాఱునప్పటికి భిన్నంబగు నావృక్షము పరమాద్భుతంబగు నొకరూపముం దాల్పఁగలదు. దానివలన నీకుఁ బ్రతిమాలాభంబు సిద్ధింపఁగలదు. విమోహనంబగు నీహృదయవిచారము నిప్పుడే పరిత్యజింపుము.

అని యిట్లు శ్రీమన్నారాయణుం డాభూపాలుని కుపదేశించి యంతర్హితుం డగుటయు రాజేంద్రుండు మేల్కాంచి తాను గాంచిన శుభస్వప్నంబునకుఁ బరమవిస్మయాక్రాంత చిత్తుండై నిశావసానంబున కెదురుచూచుచు, విష్ణుమంత్రంబులను, విష్ణుసూక్తంబులను బఠించుచు నారాత్రిని వేగించి ప్రాతఃకాలంబున లేచి యనన్యహృదయంబుతో సాగరజలంబుల నవగాహనంబు చేసి బ్రహ్మణ్యులగు బ్రాహ్మణుల కభీష్టదానంబు లాచరించి పూర్వాహ్ణికకృత్యంబులం దీర్చికొని యేకాకియై సాగరతీరంబునఁ బ్రవేశించి యన్వేషించుటయుఁ దే* జోమయంబగు నమ్మహావృక్షమాతనికి దృగ్గోచరం బయ్యెను. అది

మహోన్నతంబును మహాకాయంబును, విశాలంబును, నానాజాతివిరహితంబును, గాఢాంజనసన్నిభంబునై జలమధ్యంబున నిదురించుచున్నదియుంబోలె విరాజిల్లుచుండెను.

నరనాథుండును బరమానందంబున నమ్మహీరుహరాజమును సందర్శించి సమీపించి నిశితకుఠారంబుతో దానిని ఖండించెను. అనంతర మావృక్షఖండమును రెండుభాగములుగాఁ జేయవలయు నని యాభూపాలుండాతరుఖండమువంకఁ జూచుచుండఁగాఁ దేజోమయమూర్తులును, దివ్యపుష్పమాలికాలంకృతులును, దివ్యగంధానులిప్తులు విష్ణుదేవ విశ్వకర్మలు బ్రాహ్మణరూపధారులై యాకస్మికముగా మహేంద్రసఖుండగు నమ్మహీపాలుని యెట్టయెదుటఁ బ్రత్యక్షంబై మహారాజా! ఏమిచేయుచున్నావు? ఈవనస్పతి నిట్లు ఛేదించుటకు నిమిత్తమేమి? ఈమహాసింధుతటంబున దుర్గమంబును, నిబిడంబును, నిర్జనంబునగు నీ కాననమునందిట్టి వనస్పతి యిది యొక్కటియే యున్నది. దీని నూరక యేలఖండించెదవు? అని ప్రశ్నించుటయు మహారాజు ప్రముదితహృదయుండై చంద్రసూర్యసదృశులై యున్న యవ్విప్రవరుల నీక్షించి నతమస్తకుండై వారికి నమస్కరించి మృదుమధురస్వరంబున నిట్లనియెను.

మహాత్ములారా! దేవదేవుండును, అనాదియు, అనంతుండును, జగన్నాథుండును నగుపురుషోత్తము నారాధించుటకై నేనీస్థానమునందుఁ బ్రతిమానిర్మాణమును జేయవలయు నని యభిలషించుచున్నాను. మఱియు నేనివ్విషయంబున దేవదేవుండగుపరమాత్మునిచే నిట్లాజ్ఞాపింపఁబడితిని. అని చెప్పుటయు విశ్వవిధాతయగు విష్ణుదేవుండు మందహాసవిలసితవదనుండై యారాజచంద్రుం గాంచి మహీపాలా! నీకిట్టిసత్సంకల్పంబు గలిగినందులకు నిన్ననేకవిధంబుల నభినందించుచున్నాను. కదళీదళచంచలం బగునీసంసారసాగర మతిభయానకమైనది.

దీనియం దెట్టిసారంబును లేదు. కామక్రోధదుఃఖపరంపరలచే సమాకు లంబై యుండును. మఱియు నిది యింద్రియంబులను నావర్తంబుల నిండి దుస్తరమై, జలబుద్బుదంబులంబోలి యస్థిరమై, వివిధవ్యాధి పూర్ణంబై యుండును. ఇట్టిసంసారమునందుండియు విష్ణుదేవు నారా ధింపవలయు ననునుత్సాహము గలవాఁడవగుటచే నీవు సంస్తవనీయుఁడ వు. సర్వగుణాలంకృతుండవగు నిన్నుఁ బ్రజాపాలకునిగాఁ బడసిన పుర నగరప్రజాసమన్వితంబగునీభూమండలము ధన్యమైనది. మహాభాగా! లెమ్ము! మాతోఁగలసి మధురసంభాషణంబు సేయుచు సుఖశీతలం బగునీతరుచ్ఛాయ నుపవసింపుము. నా వెంటవచ్చినయీబ్రాహ్మణుఁ డు విశ్వకర్మంబోలి సకలకార్యకరణదక్షుండైనవాఁడు. నాయాజ్ఞచే నీతఁడు ప్రతిమానిర్మాణంబు చేయఁగలఁడు.

అని చెప్పుటయు నింద్రద్యుమ్నుండు సాగరతీరమును వదలి యాసమీపమునందున్న శీతలవృక్షచ్ఛాయను గూర్చుండియుండెను. అప్పుడు బ్రాహ్మణవేషధారి యగువిశ్వాత్ముండు విశ్వకర్మం బిలిచి యి ట్లని యాజ్ఞాపించెను. ఓవిప్రశ్రేష్ఠా! నీవీదారుఖండంబులతోఁ బ్రతి మానిర్మాణంబు సేయవలయును. అందు ముందుగాఁ బరమశాంతుం డును, బద్మపత్త్రాయతలోచనుండును, శ్రీవత్సకౌస్తుభశంఖచక్రగదాధ రుండును నగుశ్రీకృష్ణదేవునిప్రతిమను నిర్మింపవలయును. తరువాత గౌరాంగుండును, క్షీరవర్ణుండును, స్వస్తికాంకితుండును, లాంగలధరుం డును దేవదానవగంధర్వాదుల కవిదితుండు నగుననంతుని ప్రతిమను గావింపవలయును. పిమ్మట శుభలక్షణసంపన్నయు, శోభనాంగియు, సువర్ణవర్ణయు వాసుదేవభగినియు నగుసుభద్రాదేవిప్రతిమను నిర్మిం పవలయును. అని యాజ్ఞాపించెను.

సకలకర్మదక్షుం డగువిశ్వకర్మ దేవదేవునియాజ్ఞమైనంతనే ప్రతి

మూనిర్మాణంబున కారంభించి ముందుగా శుక్లవర్ణుండును, శరచ్చంద్రసమతేజుండును, ఆరక్తనేత్రుండును, మహాకాయుండును, ఫణిఫణాకులమస్తకుండును, గదాముసలపాణియు నగు బలదేవమూర్తిని, పిమ్మట నీలజీమూతశ్యాముండును, పుండరీకనయనుండును, అతసీపుష్పసంకాశుండును, పీతాంబరుండును, శ్రీవత్సవక్షుండును, సౌమ్యవిగ్రహుండును, చక్రధరుండును, సర్వపాపహరుండును నగు శ్రీహరిదివ్యమూర్తిని, తదనంతరము శుద్ధకాంచనాభవర్ణయు, పద్మపలాశనయనయు, విచిత్రవసనాలంకృతయు, హారకేయూరభూషితయు, విచిత్రాలంకారిణియు, రత్నమాలాధారిణియు, సమున్నతవక్షోభాగయు, మనోహారిణియు నగు సుభద్రామూర్తిని యథావిధిగ నిర్మాణంబు గావించెను.

అట్లు విశ్వకర్మచే నిర్మింపఁబడిన దివ్యవసనాలంకృతంబులును, నానారత్నాలంకారశోభితంబులును, సర్వలక్షణసంపన్నంబులును, మనోరమంబులు నగుమూఁడుప్రతిమలను గాంచి మహీపాలశేఖరుం డగునింద్రద్యుమ్నుండు పరమాశ్చర్యనిమగ్నుండై మహాత్ములారా! మీరు బ్రాహ్మణరూపులై వచ్చిన దేవతలో, పరమాద్భుతదేవచరిత్రుల గుమానవులో యెఱుంగఁజాలకున్నాఁడను. దేవమానవయక్షగంధర్వవిద్యాధరసంఘంబులలో మీ రెవ్వరైననగుదురుగాక! మాయారూపులై వచ్చియున్న మీతత్త్వము నాకు సుబోధంబు గాకున్నది. పరమపురుషులారా! శరణాగతుండ నగు నాయెడలఁ బ్రసన్నులై నిజస్వరూపంబులతో సాక్షాత్కరింపుఁడు.

పురుషోత్తమవర్ణనము.

అని యమ్మహారాజశేఖరుండు ప్రార్థించుటయు దేవదేవుం డిట్లనియెను. రాజేంద్రా! దేవదానవయక్షగంధర్వాదులు, మహేంద్రుఁడు, బ్రహ్మ, రుద్రుఁడు మొదలగు వారిలో నేనెవ్వండను గాను.నన్ను

సకలాగ్రాహారుం డగు పురుషోత్తమునిగా నెఱుంగుము. నేను సర్వభూతంబులకు నారాధనీయుండను. అనంతుండను. సర్వశాస్త్రప్రకీర్తితుండను. నిగమాంతప్రతిపాద్యుండను. యోగిజనులు నాకు స్థాన... మ్యుం డనియు, వాసుదేవుం డనియు నామధేయంబులు గా నిడియున్నారు. స్వయముగా బ్రహ్మయు, విష్ణుండును, శివుండును, దేవరాజగు నింద్రుండును, జగత్సంయమనుం డగు యముండును నేనే. పృథివ్యాది సకలభూతంబులును, దేవతాగ్నులును, జలపతియగు వరుణుండును, ధరిత్రియు, మహీధరాదిసమస్తంబును నాకంటె నన్యంబులు గావు. ఈ త్రిభువనంబులయందును వాఙ్మయంబులగునవి యన్నియును, స్థావరజంగమాత్మకంబగు విశ్వంబంతయును, నేనే. నాకు భిన్నంబుగ దేనికినిగూడ నస్తిత్వంబు లేదు. ఓ నృపాలా! నేను నీమీదఁ బ్రసన్నుండ నైతిని. నీయభీష్టవరప్రదానంబు గావించెదను. అకృతపుణ్యులగువారికి స్వప్నంబులయందైనను నాదర్శనలాభంబు గలుగదు. నీవు దృఢభక్తిసంపన్నుండవు. కావుననే నీకు నేను సాక్షాత్కరించితిని.

అని మహాదేవుం డనుగ్రహించుటయు మహీపాలుండు హర్షపులకాంచితసర్వావయవుండై యో శ్రీకాంతా! శ్రీపతీ! పీతాంబరధరుండవు, శ్రీదుండవు, శ్రీశుండవు, శ్రీనివాసుండవు, శ్రీనికేతనుండవు నగు నీకు నమస్కారము. ఆద్యుండును, ఈశానుండును, సర్వేశ్వరుండును, సర్వతోముఖుండును, నిష్కలుండును, సనాతనుండును, పరమేశ్వరుండు నగునీకుఁ బ్రణామంబులు. దేవా! నీవు శబ్దాతీతుండవు, గుణాతీతుండవు, భావాభావవిరహితుండవు, నిర్లేపుండును, నిర్గుణుండును, సూక్ష్ముండును, సర్వజ్ఞుండును, సర్వభావనుండును, నీలజలదసంకాశుండును, గోబ్రాహ్మణహితరతుండును, సర్వరక్షకుండును, సర్వవ్యాపియు, శంఖచక్రధరుండును, గదాముసలధారియు, నీలోత్పలదళసన్నిభుం...

దంపను, దేవదేవుండును, నగు నీకు శతసహస్రవందనములు. క్షీర సాగరమధ్యంబున భుజగపర్యంకశయనుండ వగు నో హృషీకేశా! నీకు నమస్కారము. సర్వపాపహరుండవగు శ్రీహరీ నీకుఁ బ్రణామము! దేవా ! నీవు విభుండవును, వరదుండవును, సర్వలోకేశ్వరుండవును, మోక్షకారణుండవును, అవ్యయుండవు నగు విష్ణుదేవుఁడవు. నీకు నమస్కారము.

అని యనేకవిధంబుల వినుతించుచు సాష్టాంగప్రణామంబు గావించి యంజలిబద్ధుండై యింద్రద్యుమ్నుండు వినయమధురవచనంబులతో జగన్నాథా ! నీవు నాయెడలఁ బ్రీతుండవైతివేని దేవతలు, అసురులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, సిద్ధసాధ్యవిద్యాధరాదులు, పరివ్రాజకులు, యోగులు, తత్త్వచింతకులు, మోక్షదర్శనులు, నగు మనీషివరులు నిరంతరమునేపరమపదముంగూర్చి ధ్యానించుచుందురో యట్టి యసతదదుర్లభంబగు పరమపదంబు నీయనుగ్రహముచే నాకు లభించుఁగాక! అని మహారాజు ప్రార్థించుటయు మహాదేవుండు మహాభాగా! నీకు సర్వశుభంబులును బ్రాప్తించుఁగాక! నాప్రసాదంబుచే నీసకలాభీష్టంబులును సిద్ధించుఁగాక ! నీవు పదివేలతొమ్మిదివందలవత్సరంబులవఱకును మహామహీరాజ్యభోగంబుల ననుభవించి యనంతరము దుర్లభంబగు దివ్యపదప్రాప్తుండ వయ్యెదవు. పూర్ణంబును, శాంతంబును, గుహ్యంబును, వ్యక్తావ్యక్తంబును, పరాత్పరంబును, సూక్ష్మంబును, నిర్లేపంబును, నిష్కళంబును, ధ్రువంబును, చింతాశోకవిరహితంబును, క్రియాకారణవర్జితంబును, పరమానందమయంబును, జ్ఞేయాఖ్యంబు నగు పరమపదంబును, నీవు సందర్శింపఁగలవు. మఱియు నాకాశంబును, మేఘంబులును, రవిచంద్రతారాగణంబులును, సప్తసముద్రంబులును, మేరుమందరాదిపర్వతంబులును, నెంతకాలంబుండు

నో, స్వర్గలోకంబున దేవత లెంతకాలంబు నివసించి యుందురో యంతకాలంబువఱకు నీమహీమండలమునందు సర్వస్థానములందును కక్షయంబగు నీకీర్తి ఘోషితంబగుచుండుంగాక! నీచేఁగావింపంబడిన యజ్ఞమునుండి సంభూతంబై యింద్రద్యుమ్నసరోవరనామంబున నొక దివ్యతీర్థము విఖ్యాతంబు గాఁగలదు. ఆతీర్థజలంబుల నవగాహనంబు సేయుమానవులు స్వర్గలోకంబునఁ బదునలువురింద్రులు పరిపాలించునంతకాలంబువఱకును సుఖోపభోగంబుల ననుభవింపఁగలరు.

ఆసరోవరంబునకు దక్షిణభాగంబున నైఋతికోణంబునందొక వటవృక్షంబు గలదు. దాని సమీపమునందున్న మండపము కేతకీవనాచ్ఛన్నంబై బహువిధఫలభూరుహలతావేష్టితంబై యున్నది. ఆషాఢంబున శుక్లపక్షంబున మఘానక్షత్రసంకలితం బగు పంచమీ తిథియందు నామూర్తి నామండపమునందు స్థాపించి శుభాకాంక్షులగు మానవులు అమూల్యంబులును, సుందరంబులు నగు వేషభూషణాదులచే నన్నలంకరించి మనోహరనృత్యగీతవాద్యంబులచేతను, రత్నభూషణ స్వర్ణదండ చామరాదిపరిదానంబులచేతను సప్తదివసంబులవఱకును నన్నారాధించి మహోత్సవంబులు గావింపవలయును. అందుఁ జతుశ్శాస్త్రమనిరతు లగుబ్రాహ్మణులు నానావిధస్తోత్రంబులను, వేదపారంబులను గావింపవలయును. అనంతరము బలరామకేశవమూర్తులను సందర్శించి ప్రణామంబులు చేసి భక్తిపూర్వకంబుగ స్తోత్రంబు గావించినచో నట్టివారు దివ్యాయుతవర్షంబులు విష్ణుమందిరనివాసులై నారాయణానుచరరూపంబులతో గంధర్వాప్సరోగణంబులచే సంకీర్తితులగుచు శ్రీమన్నారాయణసమీపమునందు నివసింపఁగలరు. అట్టివా రాదిత్యభువనంబున నాదిత్యసన్నిభవిమానారూఢులై సంచరించుచు సకలాభీష్టభోగంబుల ననుభవించుచుందురు.

అని చెప్పి భగవంతుండగు పురుషోత్తముం డింద్రద్యుమ్న మహీపాలునకు వరప్రదానంబు గావించి విశ్వకర్మసహితుండై యంతర్హితుం డయ్యెను. అప్పు డింద్రద్యుమ్నుండు భగవద్దర్శనంబున సంప్రీతుండై తన్నుఁ గృతార్థునిగాఁ దలంచుకొని యుప్పొంగుచు నమాత్య పురోహితసహితుండై సుభద్రాకృష్ణబలరామమూర్తులను మణికాంచనవిచిత్రవిమానప్రతిమంబులగు రథంబులపై నధిష్ఠింపఁజేసి మహాసమారోహముతో, మంగళగీతవాద్యములతోఁ దీసికొని వచ్చి వేదఘోషంబులతోఁ బవిత్రం బగుశుభస్థానమునందు నిలిపి ద్విజసహితుండై యథావిధిగ శుభతిథియందు, శుభనక్షత్రమున, శుభముహూర్తమునం దాదివ్యప్రతిమలను బ్రతిష్ఠించెను. ఈవిధముగా నమ్మహీపతి యాచార్యమతానుసారంబుగా సకలకార్యంబులను నిర్వర్తించి విధిపూర్వకంబుగా నాచార్యులకు బహుదక్షిణలనొసంగి యమ్మహోత్సవ సందర్శనార్థులై వచ్చిన యతిథిసంఘంబులకందఱకును యథేష్టధనదానంబులం గావించెను. ఇట్లు విధివృష్టవిధానంబున నుత్తమప్రాసాదమునం దాప్రతిమలను బ్రతిష్ఠించి నానాసుగంధపుష్పంబులను, స్వర్ణరత్నాదులను, శోభనవస్త్రములను సమర్పించి యథావిధిగ నర్చించుచు నమ్మహారాజు నిరంతరవివిధదానక్రియలతోడను, వివిధయజ్ఞానుష్ఠానంబులతోడను గాలక్షేపంబు సేయుచు ధర్మరాజ్యపాలనంబునఁ గృతకృత్యుండై సకలపరిగ్రహపరిహారపూర్వకంబుగఁ దుదకు విష్ణుదేవుని పరమపదలాభంబుగాంచి కృతార్థుండయ్యెను.

మునివరులారా! నృపశ్రేష్ఠుండగు నింద్రద్యుమ్నుని పుణ్యచరిత్రమును, పవిత్రపురుషోత్తమక్షేత్రమాహాత్మ్యంబును సంక్షేపముగఁ గీర్తించితిని. ఇంకను నేమివినఁగోరెదరో చెప్పుఁడు! అని బ్రహ్మదేవుం డానతిచ్చుటయుఁ బరమాశ్చర్యనిమగ్నులగు మునులు పరమానందముఁ

తో నిట్లనిరి. ఓసురశ్రేష్ఠా ! పురుషోత్తమయాత్రయెప్పుడు చేయవలయునో, యేవిధిననుసరించి పంచతీర్థకృత్యంబుల నిర్వహింపవలయునో, అందొక్కొక్కతీర్థస్నానంబువలనను, దానములవలను, దేవతాసందర్శనంబువలనను నేయేఫలలాభంబగునో వేఱువేఱుగ వక్కాణింపవలయును. అని ప్రార్థించుటయు బ్రహ్మదేవుండు మహర్షిశేఖరులారా! ఒక్కసారి జ్యేష్ఠశుక్లద్వాదశీదినంబున నుపవాసియై భక్తిపూర్వకంబుగఁ బురుషోత్తముని దర్శించువానికిఁ గురుక్షేత్రంబునఁ సప్తాయుతవత్సరంబులు జితేంద్రియుండై జితక్రోధుండై తపంబు గావించినఫలము సిద్ధించును.

కావున స్వర్గాపవర్గకాంక్షితులగుమానవులు ప్రయత్నపూర్వకంబుగా జ్యేష్ఠశుక్లద్వాదశీదినంబునఁ బురుషోత్తమసందర్శనంబు గావింపవలయును. తీర్థసేవనులగుపుణ్యాత్ములు పంచతీర్థంబులను సేవించి పురుషోత్తము నర్చించినచో శాశ్వతవిష్ణులోకనివాసంబు లభించును. మహాజ్యేష్ఠసమయంబునఁ బురుషోత్తమంబునకుం బోయి పంచతీర్థకృత్యంబులనిర్వహించి పురుషోత్తమదర్శనంబు గావించుట శుభాకాంక్షులగువారి కవశ్యకర్తవ్యము. దూరమునందుండియైనను, నిర్మలచిత్తముతో భక్తిభావంబునఁ బురుషోత్తనామసంకీర్తనంబు సేయువానికి యాత్రాఫలంబును, విష్ణులోకనివాసంబును లభించును. పురుషోత్తమప్రాసాదముపైనున్నచక్రమును దూరమునుండియైనను భక్తియుక్తులై సందర్శించి ప్రణామంబు గావించుమానవులు సర్వపాపవిముక్తు లగుదురు.

మార్కండేయవటదర్శనము.

మునులారా ! పూర్వకాలంబున మహాప్రళయము తటస్థించినప్పుడు కాల మతిభయంకరమయ్యెను. చంద్రసూర్యాదిగ్రహంబులును, స్థావరజంగమాదివస్తువులు నేవియు లేకయుండెను. ప్రళయాది

7 968

త్యుండు వెలుంగుచుండెను. ప్రచండఘనగర్జనంబులు వినవచ్చుచుండె ను. ఉల్కాపాతంబులచేఁ దరుపర్వతాదులన్నియును జూర్ణీభూతము లై పోయెను. సకలజీవగణంబులును, వినష్టంబులై పోయెను. మహత్తరం బులగుసుల్కాపాతము లగుచుండెను. సమస్త జలాశయములును శుష్కీ భూతము లయ్యెను. అట్టిసమయంబునఁ బవనప్రభాకరసాహాయ్యము చే నతిభీషణంబగుసంవర్తకానలం బుద్భూతంబై పృథ్వీతలంబును భే దించుకొని రసాతలంబునఁ బ్రవేశించి దేవదానవయక్షగంధర్వాదుల కు మహాభయోత్పాదనంబు గావించుచుండెను. ఆయగ్నిజ్వాలాపరం పరలచే నాగలోకమంతయును దగ్ధమైపోయెను. క్షితిమండలంబునం గలసమస్తపదార్థములును భస్మీభూతము లయ్యెను. ఊర్ధ్వాధోభాగం బులంగలయెల్లవస్తువులును నిమిషమాత్రమున వహ్నిజ్వాలలకాహుతి యైపోయెను.

అప్పుడు ప్రబలవేగవంతం బగుప్రభంజనంబును, సంవర్తకాన లంబును శతసహస్రసహస్రయోజనంబులప్రదేశమంతయు నల్పకాల ములోనే దగ్ధీభూతంబుగాఁ జేసివైచెను. దేవాసురగంధర్వాదులును, సకలజీవులును నమ్మహానలంబున దగ్ధులైపోయిరి. ఆకల్పానలజ్వాలలు ప్రదీప్తములై, ఘోరారావంబు సేయుచుఁ గోటిసూర్యసంకాశములై సురాసురనరగంధర్వాదిపరివృతంబులగుత్రిలోకములను నిమిషములో దహించివైచెను. అంతటిమహాఘోరంబును, భీభత్సంబునగుప్రళయ కాలమునందుఁ బరమధార్మికుం డగుమార్కండేయమునివరుం డొ క్కఁడుమాత్రమే ధ్యాననిష్ఠుండై యుండెను. కాని మోహపాశనిబ ద్ధుండగునాతఁడు క్షుత్తృష్ణాకులితేంద్రియుండై పరితపించిపోవుచుండె ను. దారుణవహ్నిజ్వాలాదర్శనంబున నాతని కంఠోష్ఠతాలువులు శుష్కీ భూతము లైపోయెను. భయవిహ్వలుం డగునాతఁ డప్పుడు తృష్ణా

త్తుండై తపంబు సాలించి యచేతనప్రాయుండై యేమియుం దోఁచక సమస్తభూమండలమును బరిభ్రమింపనారంభించెను. కాని యాతని కెందును రక్షకుండు కానఁబడకుండుటచే నిటునటుఁ బరుగు లెత్తుచుండెను.

ఆతని కెందును విశ్రమస్థానము కానంబడదయ్యెను. అప్పు డాతఁడువిభ్రాంతుండై యేమిచేయుదును ? ఎక్కడకుఁ బోవుదును ? ఎవ్వరి నాశ్రయింతును ? నాకేమియుం దోఁచుట లేదు. సనాతనుండును బురుషోత్తముండును నగుదేవదేవునిదివ్యదర్శనంబు నాకెట్లు సిద్ధించును ? అని యనేకవిధంబులఁ దలపోయుచు మార్కండేయుం డేకాగ్రచిత్తంబున మహాప్రళయకారణుండును, సనాతనుండును, బరమపదస్వరూపుండు నగు జగన్నాథునింగూర్చి చింతించుచు ననతిదూరంబునఁ బురుషోత్తమనామంబుచే విఖ్యాతంబగు వటవృక్షమును దర్శించి యతిత్వరితంబుగ దానిసమీపమునకుం బోయి యాచెట్టుమొదటఁ గూర్చుండెను. ఆస్థానంబునఁ గాలానలజ్వాలాభయంబుగాని, యంగారవర్షణంబుగాని, ఉల్కాశనిపాతంబుగాని యేమియు లేకయుండెను.

—♦ ప్రళయసందర్శనము. ♦—

అనంతరము తటిన్మాలాభీలంబులును, అద్భుతాకారంబులు నగుమేఘంబు లన్నియు నాకాశమునం దలముకొనియెను. నీలోత్పలశ్యామలంబులును, కుముదప్రతిమంబులును, కింజల్కవర్ణంబులును, పీతహారిద్వర్ణంబులును, పద్మపలాశసంకాశంబులును, కాకాండసన్నిభంబులు నగుజలదబృందంబులు పురపర్వతాకారంబులతో నలముకొని గభీరగర్జనంబులుగావించుచుఁ గుంభవృష్టితో సకలదిశలను ముంచివైచుచుండెను. బ్రహ్మాండమంతయును గ్రమముగా జలప్లావితమై పో

మెను. ఈవిధముగా బ్రళయానలంబును జల్లార్చి యేకధారగా ద్వాదశవర్షంబులు మహావర్షపాతం బగుచుండెను. అప్పుడు సముద్రంబులన్నియు వేలాతిక్రమణంబు గావించి భూమండలమునంతను ముంచివై చెను. తుదకాసాగరంబులన్నియును, ప్రబలఝంఝామారుతాహతులచే సంక్షుభితంబులై చెదరిపోవుచుండ నాదిపద్మాలయుండగువిష్ణుదేవుండు భయంకరప్రభంజనమునంతను బానము చేసి యేకార్ణవమధ్యంబున శయనించియుండెను. దేవాసురయక్షరాక్షసాదులపేరైన లేకుండఁ బోయెను. స్థావరజంగమంబులగుసకలవస్తువులును వినష్టంబులయ్యెను.

అప్పుడు మార్కండేయుండు తానాశ్రయించియున్నవటవృక్షమును, భూమిని, దిక్కులను, చంద్రసూర్యులను, వాయువును, మహానలమును, మఱియేవస్తువునుగూడఁ జూడఁజాలకపోయెను. ఘోరంబగునయ్యేకార్ణవంబున నేయాశ్రయంబును లేకుండెను. అంతటను తమోరాశి యాక్రమించుకొని యుండెను. ఆసమయంబున జలార్ణవమగ్నుం డగునాతఁ డెట్లో యుత్తీర్ణుం డగుటకుఁ బ్రయత్నించెను. కాని లాభము లేకపోయెను. ఆర్తుం డగునాతఁడు జలంబులం దేలియిందందుఁ గొట్టుకొనుచుఁ బరిభ్రమించుచుండెను. అతని దరిఁజేర్చుటకు దిక్కెవ్వరును గానవచ్చుట లేదు. అట్లు శరణ్యంబులేక యతివిహ్వలుండై యున్నమార్కండేయుం గాంచి దయాళుం డగుపురుషోత్తముండు మధురగంభీరస్వరంబున వత్సా! సువ్రతా! బాలుండవగు నీవు చాలడస్సితివి. నీవు నాభక్తుఁడవు. మార్కండేయా! లెమ్ము! నీకేమియును భయము లేదు. నాసమీపమునకు రమ్ము! అని యానతిచ్చెను.

ఆవాక్యంబుల నాలించి మార్కండేయుండు కుపితుండై యతి

విస్మయంబుతో దెసల నవలోకించి బిగ్గఱగా నాతపోబలంబున కీవిధ ధముగా నవజ్ఞతం జూర్చి నాపేరుపెట్టి నన్నుఁ బిలుచుచున్నవారెవ్వరు? నన్ను బాలుండని నిర్దేశించి బహుసహస్రవర్షంబులు గడపినవా జీతకాలమును గూడఁ దృణీకరించుచున్నవా రెవ్వరు? దేవతలయందీట్టివ్యవహారమెన్నఁడును గానంబడుట లేదు. దేవదేవుండగుబ్రహ్మదేవుండు నన్ను దీర్ఘాయుష్కునిగా నేర్పఱించియున్నాఁడు. నన్నిప్పుడిట్లు పిలిచి స్వయముగా మృత్యువును గోరి తెచ్చుకొనుచున్నవిగతజీవుండెవ్వఁడు? అని యిట్లు మార్కండేయుండు, చింతావిష్టుండై యిది యేమిస్వప్నమా? కాక నాకజ్ఞానము గలిగినదా? అని యనేకవిధంబుల వితర్కించుకొని నిశ్చలచిత్తంబున ధ్యానించుటయునాతనికి సకల దుఃఖవిధ్వంసిని యగుమహాశక్తి యావిర్భూతం బయ్యెను.

అప్పు డాతఁడు భక్తిపూర్వకంబుగఁ బురుషోత్తమదేవునిశరణంబు నాశ్రయింపవలయు నని నిశ్చయించుకొని యమ్మహాదేవునిధ్యానంబునఁ దన్మయుం డగుటయు నవ్వటభూరుహంబు మరలలో సలిలోపరిభాగంబున నెప్పటియట్ల తేలుచున్నట్లాతనికి గోచరించెను. ఆభూరుహావిశాలశాఖోపరిభాగంబున విశ్వకర్మనిర్మితంబును, నవరత్నఖచితంబును, నానారత్నాలంకారభూషితంబును నానాస్తరణాచ్ఛన్నంబును, ఆలోకరమణీయంబును, ప్రభామయంబు నగుసౌవర్ణపర్యంకము పరమాద్భుతంబుగ నమ్మునీంద్రునకుఁ గానవచ్చెను. ఆపర్యంకోపరిభాగంబునఁ గోటిసూర్యప్రభాభాసమానుండును, చతుర్భుజుండును, సుందరాంగుండును, పద్మపత్త్రాయతలోచనుండును, శంఖచక్రగదాధరుండును, శ్రీవత్సవనమాలాలంకృతుండును, దివ్యకుండలధరుండును నగు శ్రీకృష్ణుండు బాలకాకారంబునఁ బవళించి యుండెను.

మునివరుం డగుమార్కండేయుండు దేవదేవుండగుశ్రీకృష్ణుం

గాంచి విస్మయోత్ఫుల్లనయనుండును, ఆనందపులకితసర్వాంగుండు నగు నై సాష్టాంగప్రణామంబు గావించి ఆహా! ఘోరంబగునీయేకార్ణవంబున సర్వంబును నిమగ్నంబై పోయిన యీసమయమునం దీబాలుండొంటిగా నిర్భయంబుగ నిం డెట్లున్నాఁడు? అని భావించుకొనుచు భూతభవిద్వర్తమానవిదుండయ్యును మార్కండేయుండు మాయామోహంబుచే నేమియు నెఱుంగనివాఁడయ్యెను. ఆతఁ డట్లజ్ఞానుండై తనతపోబలంబును, జ్ఞానంబును, గర్మంబులును, దీర్ఘజీవనంబును, మానత్వంబునుగూడ నిరర్థకంబు లయ్యె ననియు, నీమణిపర్యంకశాయియగు బాలకుం డెవ్వఁడో యెఱుంగఁజాలకుంటి ననియు నచేతప్రాయుండై చింతించుచు నేకార్ణవంబునఁ దేలిపోవుచుండెను. ఎందును శరణ్యంబు లేకుండుటచే నాతనికి నిర్వేదంబు గలిగెను. స్వమహిమాధిష్ఠితుండును, బాలార్కసదృశుండును, దివ్యతేజోమయుండు నగునామాయాబాలకుని మార్కండేయుండు దర్శింపఁజాలకపోయెను.

జలంబుల నఱ్ఱీఁదుకొనివచ్చుచున్నమార్కండేయునిం గాంచి యాబాలకుండు మందహాసవదనుండై మేఘగంభీరస్వరంబున వత్సా! నీవు చాలఁ బరిశ్రాంతుండవైన ట్లగపడుచున్నావు. సంరక్షణంబుకొఱకు నన్నాశ్రయింపఁజూచుచుంటివి. రమ్ము! శీఘ్రముగ వచ్చి నాశరీరంబునఁ బ్రవేశింపుము. అందువలన నీకు విశ్రాంతి గలుగును. అని ప్రబోధించుటయు మార్కండేయుండు మాఱుమాట చెప్పక మోహావేశవివశుండై వివృతంబగునాబాలకునివదనంబునఁ బ్రవేశించెను.

భగవద్గర్భపరివర్తనము

అట్లు మార్కండేయుం డాబాలకునియుదరంబునఁ బ్రవేశించి యందు నానాజనపదపరివృతంబగు సమస్తభూమండలమును, సప్తసము

ద్రింబులను, సప్తద్వీపంబులను, భారతాదివర్షంబులను దర్శించెను. మఱియు సర్వరత్నమయంబును, బహుకందరయుతంబును, నానామునిజనాకీర్ణంబును, నానాతరులతాశోభితంబును, నానాసస్యసంపన్నంబును, నానాశ్చర్యమయంబును, వ్యాఘ్రసింహాదినానాజంతుపరివృతంబును, శక్రాదిబృందారకసేవితంబును, సిద్ధచారణయక్షకిన్నరోరగాధిష్ఠితంబును, బహువిధదేవతాయతనసమలంకృతంబును, మనోహరంబునగు మేరుపర్వతమును దర్శించెను. ఈవిధముగా మార్కండేయుం డాబాలునియుదరంబున సంచరించుచు మేరుశితశైలహేమకూటాది సకలపర్వతంబులును, కురుక్షేత్రంబును, పాంచాలమద్రకేకయాదిసకలదేశంబులను, భూమండలమునందలి సకలతీర్థములను, గ్రామనగరకృషిగోరక్షావాణిజ్యక్రయవిక్రయాదిస్థానంబులను, ఇంద్రాదిదేవతలను, మహర్షులను, రాక్షసులను సకలజీవులనుగూడ నత్యాశ్చర్యముతోఁ గనుంగొనుచుండెను. బ్రహ్మాదితృణపర్యంతముంగల చరాచరప్రపంచమంతయు నయ్యుదరంబునం దమ్మునీంద్రునకు దృగ్గోచరం బయ్యెను.

అప్పు డాతని కవ్యాహతంబగుమనశ్శక్తియు, నద్భుతంబగుస్మృతిశక్తియుఁ బరమేశ్వరానుగ్రహంబున లభించుటయు నమ్మునివరుండు భగవద్గర్భస్థంబగుబ్రహ్మాండమునం దంతటను బరిభ్రమింపఁ దొడంగెను. కాని యావిష్ణుదేవునిదివ్యోదరంబున కంతం బెచ్చటను నాతఁడు గనుంగొనఁ జాలఁడయ్యెను. అతఁ డెంతతిరిగినను నంతంబు గానలేక వరదుండగు నాదేవదేవునకు శరణాగతుం డయ్యెను. ఇట్లు పరమేశ్వరశరణంబు గోరినంతనే యావిష్ణుదేవుని వివృతవదనగహ్వరమునుండి యమ్మునీంద్రుండు బహిర్గతుం డయ్యెను.

— పరమేశ్వరస్తవము —

మార్కండేయమునీంద్రుం డాబాలకునిగర్భంబునుండి బహిర్గతుండై మరల నేకార్ణవీకృతం బై యున్న భూమండలమును, మఱియు వటశాఖాంతరంబునఁ బర్యంకముపై మునుపటివలెనే శిశురూపియై శయనించియున్న దేవదేవుని గనుంగొనియెను. ఆపుండరీకాక్షుండును, శ్రీవత్సవక్షుండును, పీతాంబరధరుండును, చతుర్భుజుండు నగుదేవుఁడే సకలజగత్కబళనంబు గావించియుండెను. అప్పు డాబాలకాకారుండగు దేవదేవుండు జలార్ణవంబునం దేలియాడుచున్న మార్కండేయునిం గాంచి మందహాసము చేయుచు వత్సా! నాయుదరంబున నివసించుటవలన నీకించుక యాయాసము తీఱినదా? అందు సంచరించుచు నీ వెట్టివింతలను గనుంగొంటివి? మునిశ్రేష్ఠా! నీవు నాభక్తుఁడవు. ఆయాసపడి నీవు నన్నాశ్రయించితివి. కావున నొకసారి నన్నవలోకింపుము! అని ప్రబోధించుటయు మార్కండేయుండు హర్షపులకితాంగుండై రత్నాలంకారభూషితుండును, దుర్నిరీక్ష్యుండు నగునాపురుషోత్తమునివంక దృష్టిపాతంబు గావించెను.

అంతలోనే యమ్మునిశ్రేష్ఠునిదృష్టి విపులంబును బ్రసన్నంబు నయ్యెను. దేవదేవానుగ్రహముచే నాతనికభినవచక్షుశ్శక్తి లభించినట్లయ్యెను. అప్పుడు మార్కండేయుండు సురసేవితంబులగు నామహాదేవునిపాదపంకజంబులకుఁ బ్రణమిల్లి యంజలిబద్ధుండై పరమాశ్చర్యనిమగ్నచిత్తంబుతో, హర్షగద్గదస్వరంబుతో నిట్లుస్తుతింప నారంభించెను. ఓజగన్నాథా! మాయాబాలకరూపా! పద్మాక్షా! దేవదేవా! దుఃఖితుండనై శరణాగతుండ నగునన్ను రక్షింపుము. స్వామీ! నేను సంవర్తానలజ్వాలలో సంతప్తుండనై, యంగారవర్షణంబునకు భీతుండనైతిని. మఱియు నతిప్రచండవాయువేగముచే శోషితుండను, విహ్వ

లుండను, శాంతుండను నైతిని. ప్రళయాదిత్యప్రతాపంబునకును, పుష్కలావర్తమేఘవర్షంబునకును గకునుడివడిపోయితిని. పురుషోత్తమా! నాకుఁ బరిత్రాణంబు గావింపుము. జగత్ప్రభూ! తృషితుండను, క్షుధితుండను, దుఃఖతుండనునై యనన్యశరణ్యుండనై పరితపించుచున్నాను. దేవా! నీయుదరంబున సమస్తప్రపంచమును గాంచి విస్మితుండనై విషణ్ణుండ నైతిని. పురుషోత్తమా! నన్ను రక్షింపుము. ఆశ్రయరహితంబగునీసంసారమునందు నాకుఁ బ్రసన్నుండవగుము.

విబుధశ్రేష్ఠుండవు, విబుధప్రియుండవు, విబుధనాథుండవు, విబుధాలయుండవు, సర్వలోకేశ్వరుండవు,జగత్కారణకారణుండవు నగునీవు నాకుఁ బ్రసన్నుండవగుము. సర్వజగత్కర్తవు, భూధరుండవు, సలిలాశయుండవు, మధుసూదనుండవు, కమలాకాంతుండవు, త్రిదశేశ్వరుండవు, కంసకేశిఘ్నుండవు, అరిష్టనాశకుండవు, దైత్యాంతవు, దనుజాంతకుండవు, కృష్ణుండవు నగునీవు ప్రసన్నుండవగుము. మథురావాసా! యదునందనా !ఇందిరావరజా! వరదా! అవ్యయా! ప్రసన్నుండవగుము. దేవా! పంచభూతంబులును, మనంబును, అహంకారంబును, బుద్ధియు, ప్రకృతియు, సత్వాదిగుణంబులును, జగద్వ్యాపి యగుపురుషుండును, పురుషోత్తముండును, సకలేంద్రియంబులును, శబ్దాదివిషయంబులును, దిక్కులును, కాలంబును, ధర్మంబును, వేదంబులును, సదక్షిణంబు లగుయజ్ఞంబులును, ఇంద్రుండును, శివుండును, హరియు, హుతాశనుండును, యముండును, రాక్షసేశ్వరుండును, జలపతి యగు వరుణుండును, వాయువును, ధనేశ్వరుండును, ఈశానుండును, అనంతుండును, గణేశ్వరషణ్ముఖవసురుద్రాదిత్యులును, ఖేచరులగు యక్షగంధర్వాదులును, మరుద్గణంబులును, ఋషిగణంబులును, వాలఖిల్యగణంబులును, అశ్వినీకుమారులును మఱియు జీవసంజ్ఞకంబులగుసకలం

బును నీస్వరూపంబులు. బ్రహ్మాదితృణపర్యంతంబునుగలసమస్తముసం దును నీకంటె భిన్నంబగువస్తు వేదియును లేదు. భూతభవిష్యద్వర్త మానాదిసకలకాలంబులును, కాలికవ్యవహారంబులును నీకంటె నన్యం బులు గావు. కూటస్థుఁడవు, అచలుఁడవు, ధ్రువుండవు నగు నీపరమప దస్వరూపమును బ్రహ్మాదిదేవతలుగూడ నెఱుంగఁజాలరు. అల్పబుద్ధి నగునాకెట్లు విదితం బగును? దేవా! నీవు శుద్ధస్వభావుఁడవు. నిత్యుం డవు. ప్రకృతికతీతుండవు. అవ్యక్తుండవు, శాశ్వతుండవు, అనంతుఁడ వు, సర్వవ్యాపివి, ఆకాశమూర్తివి, అజుండవు, అవ్యయుండవు, విభుం డవు, నిర్గుణుండవు, నిరంజనుండవు నిన్నుస్తవంబు సేయుటకు సమర్థుం డగువాఁ డెవ్వఁడు? అల్పచేతస్కుండ నగునేను గావించినయీస్తవం బునందుగలలోపంబుల నన్నిటిని క్షమింపుము.

—♦ భగవద్దర్శనము. ♦—

మార్కండేయమునీంద్రుఁ డిట్లు సంస్తుతుండై పరమేశ్వరుం డగువిష్ణుదేవుండు మేఘగంభీరస్వరంబుతో వత్సా! నీయభీష్టంబు దె లుపుము. నీసకలమనోవాంఛితంబులను సఫలంబు గావించెదను. అని బాలకుండగునా దేవదేవునిమందహాసవదనమునుండి యనుగ్రహపూర్వక ముగా వెలువడినయమ్మధురవచనంబుల నాకర్ణించి మార్కండేయము నీంద్రుండు, పరమప్రీతుండై తన్మయచిత్తంబున నిట్లనియెను. దేవా! సర్వోత్తమంబగు నీమాయాశక్తి నెఱుంగఁగోరుచున్నాను. నీప్రసా దంబుచే నాస్మృతిశక్తికి లోపంబు లేకుండున ట్లనుగ్రహింపుము. నేను నీశరీరాలోదరంబున నతివేగపరిభ్రమణంబు గావించితిని. పుండరీకాక్షా! నీవెవ్వండవో యెఱింగింపుము. సకలజగంబును గబళితంబు గావించి యిచ్చట నిట్లుబాలకరూపంబున శయనించియుండుటకుఁ గారణమేమో తెల్పుము.

అనియిట్లు మునిముఖ్యుం డగుమార్కండేయుండు ప్రార్థించుట యు మహావక్త్రయు, మహాద్యుతిమంతుండును నగుదేవదేవుం డాతని నాదరించి వత్సా! దేవతలుగూడ నాతత్త్వమును సంపూర్ణముగా నెఱుంగఁజాలరు. నేను నీయెడలఁ బ్రీతుండ నైతినిగావున సకలజగత్కర్త నగునాతత్త్వమును బోధించెదను వినుము. విప్రర్షీ! పితృభక్తుండవును, శరణాగతుండవు నగు నీయెడలఁ బరితుష్టుండనైతిని. నీయసాధారణబ్రహ్మచర్యంబు నేనెఱుంగుదును. పూర్వకాలంబున నేను జలంబునకు నారసంజ్ఞను నిర్దేశించితిని. అందుచేతనే నాకు నారాయణనామంబు గలిగెను. నేనవ్యయుండను, శాశ్వతుండను, సర్వభూతవిధాతను, సృష్టికర్తను. విష్ణుదేవుండును, బ్రహ్మేంద్రయమవైశ్రవణులును, శివసోమప్రజాపతులును, కశ్యపుండును, ధాతయు, విధాతయు నేనే. నాకగ్నిదేవుండు ముఖంబును, భూమి పాదంబులును, చంద్రార్కులు లోచనంబులును, గగనంబు మస్తకంబును, దిక్కులు శ్రోత్రంబులును, సముద్రంబులు స్వేదసంచయంబును, దిఙ్నభంబులు కాయంబును, వాయువు చిత్తంబును నై యుండును. అనేకదక్షిణాన్వితంబులగుక్రతుసమూహంబులచే నేనర్చింపఁబడుచుండుదు. వేదవిదులగువారు నన్నే యారాధించుచుందురు. స్వర్గాపవర్గకాంక్షితు లగుక్షత్రియులును, వైశ్యులు నన్నుఁ బూజించుచుందురు. చతురుదధివలయితంబగునీధరామండలమును శేషమూర్తినై నేనే ధరించియుందును. పూర్వకాలంబున నేనే వరాహరూపముతో వసుంధర నుద్ధరించితిని. బాడబస్వరూపంబున నేనే జలరాశియందలిజలంబులను బానము చేయుచుందును. మరల జలంబులను గల్పించుచుందును. బ్రాహ్మణులు నాముఖంబును, క్షత్రియులు భుజంబులును, వైశ్యులూరువులును, శూద్రులు పాదంబులు నై యున్నారు. ఋగ్యజుస్సామాథర్వవేదంబు

లునాయందే ప్రాదుర్భూతంబులై నాయందే ప్రవేశించుచున్నవి. సమగుణావలంబనులును, నియతాత్ములును, తత్త్వచింతకులును, కామక్రోధద్వేషవిరహితులును, సంగహీనులును, పాపరహితులును, సాత్వికులును, నిరహంకారులును, నియతాధ్యాత్మకోవిదులు నగు బ్రాహ్మణులు సర్వదా తన్మయచిత్తంబులతో నన్నుపాసించుచుందురు. సంవర్తకజ్యోతిని, సంవర్తకానలంబును నేనే.

నభోమండలంబున జ్యోతిర్మయంబు లగునక్షత్రంబులన్నియు నారోమకూపంబు లని యెఱుంగుము. రత్నాకరంబు లగుసముద్రంబులును, దిక్చతుష్టయంబును, వసనశయననిలయాదులును, కామక్రోధహర్షమోహాదులును నాస్వరూపంబులు. మానవులచేఁ గావింపఁబడునసత్యదానతపంబులకును,అహింస మొదలగుసత్కర్మంబులకును నేనే మూలకారణుండను. దేహధారులగు వారందఱును నావిధానంబుననే విహితు లగుచుందురు. నామాయచే వారితత్త్వజ్ఞానము తిరోహితం బగుచుండును. నాయిచ్ఛానుసారంబుగనే వారు మెలంగుచుందురు. వేదజ్ఞానసంపన్నులై వివిధయజ్ఞానుష్ఠానంబులఁ గావించుజితక్రోధులును, శాంతచిత్తులునగుబ్రాహ్మణులు నన్నే యనుగమించుచుందురు. లోభాభిభూతులును, కృపణులును, అనార్యులును, అకృతాత్ములును, నగువారు నన్నుఁ జేరఁజాలరు. ధర్మగ్లానియు, అధర్మాభ్యుత్థానంబు నగుకాలములయందు లోకహితంబునకై నేనవతరించుచుందును. దైత్యులు హింసాపరాయణులై, దేవతల కవధ్యులై దారుణప్రకృతులై విజృంభించుచున్నకాలములందు నేను పుణ్యాత్ములగృహంబున మానవమూర్తినై యవతరించి సర్వబాధానివారణంబు గావించుచుందును. నేను దేవమానవగంధర్వాదులను, చరాచరవస్తుప్రపంచమును సృజించి మరలమాయచే సంహారంబు చేయుచుందును. కర్మకాలంబున మరల

సృష్టి చేయుచుందును. ధర్మసంస్థాపనంబుకొఱకై నేను మానవావతారంబు నెత్తుచుందును.

మునికులతిలకా! మదీయం బగుధర్మమూర్తి సత్యయుగంబున శ్వేతవర్ణంబును, త్రేతాయుగంబున శ్యామవర్ణంబును, ద్వాపరంబున రక్తవర్ణంబును, కలియుగంబునఁ గృష్ణవర్ణంబునై యుండును. కలియుగంబున నధర్మము మూఁడుభాగము లుండును. ప్రళయకాలంబున నేనతిదారుణకాలరూపుండనై యొక్కండనే త్రిభువనంబులను సంహరించుచుందును. త్రిధర్ముండను, విశ్వాత్ముండను, సర్వలోకసుఖావహుండను, అభిన్నుండను, సర్వగుండను, అనంతుండను, హృషీకేశుండను, ఉరుక్రముండను నగునేను కాలచక్రంబును నడపించుచుందును. సర్వభూతహితుండనగు బ్రహ్మస్వరూపుఁడను నేనే—నన్నెవ్వరు నెఱుంగఁజాలరు. భక్తులు నిరంతరమును నన్నుఁ బూజించుచుందురు. ఓమునీంద్రా! నీవు నాయందుఁ బ్రవేశించి యనుభవించిన క్లేశం బంతయును నీశుభోదయంబుకొఱకే యైనది. స్థావరజంగమాత్మకంబగు ప్రపంచమునందు నీవుగాంచినయెల్లవస్తువులందును భూతభావనుండ నగునాతేజము విరాజిల్లుచునే యున్నది.

ఓవిప్రర్షీ! శంఖచక్రగదాధరుండనగునారాయణుండను నేనే. యుగసహస్రపరివర్తనం బగునంతవఱకును విశ్వాత్ముండ నగునేను విశ్వంబును మోహితంబుగాఁ జేసి శయనించి యుందును. మునిసత్తమా! బ్రహ్మదేవుండు బోధితుం డగునంతవఱకును శిశుత్వము నెఱుంగని నేను బాలకరూపంబున నిరంతరమును విరాజిల్లుచుందును. అట్టిబ్రహ్మస్వరూపుఁడ నగునేను నీయెడలఁ బరితుష్టుండనై నీకు వరప్రదానంబు గావించుచుంటిని. ఈయేకార్ణవజలంబున సమస్తంబును విధ్వస్తంబైనను నాయనుగ్రహంబుచే నీవు నిర్గతుండవై యఖిలంబును గాం

చుఁగలిగితివి. నీవు నాయుదరంబునఁ బ్రవేశించి యందును స్థావరజంగమాత్మకంబగు సమస్తప్రపంచమును దర్శించితివి. కాని యందువలనఁగూడ నీకు నాతత్త్వము సువిదితంబు గాలేదు. కావుననే నిన్నతిశీఘ్రముగ నాముఖవివరమునుండి బహిర్గతునిం గావించితిని. మదీయంబగునాత్మతత్త్వము సురాసురాదులకుఁగూడ నజ్ఞేయం బైనను ప్రసన్నుండనై సర్వంబును నీకెఱింగించితిని. బ్రహ్మదేవుండు ప్రబోధితుం డగునంతవఱకును నీవిచ్చటనే సుఖవిహారంబు గావించుచుండుము. బ్రహ్మదేవుండు ప్రబుద్ధుం డైనంతనే యేకాత్ముండనగునేను సమస్తప్రపంచమును యథారూపముగ మరల సృష్టింపఁజేయుదును.

అని భగవానుండగు మాధవుండు మార్కండేయు ననుగ్రహించి వత్సా! నీవెందుకొఱకు నన్ను స్తుతించితివో నీయభీష్టంబు దెల్పుము. నీకు వరప్రదానంబు గావించెదను. ఆయుష్మంతుండ వగునీవు నాభక్తుఁడవు. ఇంకను దీర్ఘాయుష్మంతుఁడ వయ్యెదవుగాక! అని శుభవచనంబులచే నాశ్వాసించుటయు మార్కండేయుం డద్దేవునకు సాష్టాంగప్రణామంబు గావించి మహాత్మా! నేను నీదివ్యమంగళస్వరూపంబును దర్శింపఁగలిగితిని. నీదివ్యదర్శనంబుచే నామాయామోహంబు విగతమైపోయినది. లోకహితార్థమై నీయనుగ్రహంబుచేఁ బుణ్యంబును, నిర్మలంబు నగునీపురుషోత్తమక్షేత్రమునందు శైవభాగవతాదులకు వివాదప్రతిషేధకంబునకై యొకశివాయతనంబును గల్పింపఁదలంచితిని. భవదీయం బగునీయుత్తమక్షేత్రమునందు శంకరమూర్తికూడఁ బ్రతిష్ఠితుండైనచో హరిహరులకభేదంబనియు, నిరువురు నేకమూర్తులే యనియు లోకులకందఱకును సంపూర్ణవిశ్వాసము గలుగఁగలదు.

అనివిన్నవించుటయు జగన్నాథుండు ప్రీతుండై మునినాథుంగాంచి వత్సా! నాయాజ్ఞానుసారంబుగా భిన్నభావప్రశమనంబుకొఱ

నును, సకలలోకారాధనంబుకొఱకును బరమకారణుండగుభువనేశ్వర దేవునిదివ్యలింగమును బ్రతిష్ఠించి సత్వరంబుగ నొకశివాలయంబును నిర్మాణంబు గావింపుఁడు. అందు శివలింగంబుగా, మదీయంబగుమూర్తినిగూడఁ బ్రతిష్ఠింపుము. హరిహరుల కెట్టిభేదంబును లేదు. నాయేకమూర్తియే ద్విరూపంబైనది. రుద్రుఁడే విష్ణుఁడు; విష్ణుఁడే మహేశ్వరుఁడు. పవనాకాశంబులకుంబోలి వీరికెట్టిభేదంబును లేదు. గరుడధ్వజుఁడే వృషభధ్వజుఁడనియుఁ, దిృపురాంతకుఁడే మురాంతకుఁడనియు మూఢమానవు లెఱుంగరు. నీవు నీనామంబుతో నొకశివాలయంబు నిర్మించి యాదేవదేవున కుత్తరదిగ్భాగంబున మార్కండేయహ్రదంబును గల్పింపుము. ఆదివ్యతీర్థము మానవలోకంబున సుప్రసిద్ధము గాఁగలదు. అది సర్వపాపనివారకం బగును. అని ప్రబోధించి భగవానుండును, సర్వవ్యాపియు నగుజనార్దనుండంతర్హితుం డయ్యెను.

—♦ శ్రీకృష్ణదర్శనమాహాత్మ్యము. ♦—

అని చెప్పి బ్రహ్మదేవుండు వెండియు నిట్లనియెను. మునివరులారా! తీర్థసేవాతత్పరుండగువాఁడు ముందుగ మార్కండేయహ్రదంబునకుఁ బోయి యందుఁ బ్రవేశించి యుదఙ్ముఖుండై —

“ సంసారసాగరే మగ్నం, పాపగ్రస్త మచేతనం
త్రాహి మాం భగనేత్రఘ్న, త్రిపురారే నమోస్తు తే.
నమః శివాయ శాంతాయ, సర్వపాపహరాయ చ
స్నానం కరోమి దేవేశ, మమ నశ్యతు పాతకమ్.”

అనుమంత్రమును బఠించుచు స్నానము చేసి విధిపూర్వకంబుగా దేవర్షిపితృతర్పణంబులు గావించి మరల స్నానము చేసి యాచమనపూర్వకంబుగ నటనుండి శివాలయంబునకుఁ బ్రవేశించి మున్మ్మా బు

ప్రదక్షిణం బాచరించి మూలమంత్రముతో మార్కండేయేశ్వరునకుఁ బూజాపరిణామంబులు గావించి—

" త్రిలోచన నమస్తేస్తు, నమస్తే శశిభూషణ
త్రాహి మాం త్వం విరూపాక్ష, మహాదేవ నమోస్తుతే. "

అను మంత్రమును బఠించుచు నమ్మహాదేవుని బ్రసన్నుం గావించుకొనవలయును. ఇట్లు స్నానసందర్శనార్చనంబులఁ గావించువాఁడు దశాశ్వమేధఫలలాభంబు గాంచి సర్వపాపవిముక్తుండై శివలోకంబునఁ బ్రవేశించి యందు దివ్యంబులగుసకలోపభోగంబుల ననుభవించుచుఁ బ్రళయకాలంబువఱకును సుస్థిరుండై యుండఁగలఁడు.

అనంతరము కల్పతరుసన్నిధికిం బోయి ముమ్మాఱు ప్రదక్షిణం బాచరించి—

" ఓంనమోవ్యక్తరూపాయ, మహాప్రళయకారిణే
అమరత్వం సదాకల్పే హారేశ్చాయతనం వట. "

అనుమంత్రముతోఁ బూజింపవలయును. అట్లు యథావిధిగ నవ్వటంబునకుఁ బూజాప్రణామప్రదక్షిణంబులఁ గావించువాఁడు జీర్ణనిర్మోకం బగునజగరంబునుం బోలి సర్వపాపవిముక్తుండై విరాజిల్లును. అవ్వృక్షచ్ఛాయ నాశ్రయించినవానికి బ్రహ్మహత్యాపాతకమునుండి నిష్కృతిలాభంబు గలుగును. కృష్ణాంగప్రభూతంబును, బ్రహ్మతేజోమయంబును, న్యగ్రోధరూపంబు నగువిష్ణుమూర్తి నారాధించుమానవులు రాజసూయాశ్వమేధంబులకంటె నుత్తమఫలలాభంబు నందుదురు. అట్టివారు స్వకులోద్ధారకులై విష్ణులోకప్రాప్తు లగుదురు. మఱియు శ్రీకృష్ణసమీపవర్తి యగువైనతేయునకు భక్తిపూర్వకంబుగఁ బ్రణమిల్లువారు సర్వపాపవిముక్తు లగుదురు. వటవృక్షంబును, వైనతే

యుని దర్శించినవెనుకఁ బురుషోత్తముని, బలరాముని, సుభద్రను ద
ర్శించువారికిఁ బరమగతిలాభంబు గలుగును.

విష్ణుమందిరంబునఁ బ్రవేశించి ముమ్మాఱు ప్రదక్షిణంబు చేసి భక్తిపూర్వకంబుగా—

" నమస్తే హలధృగ్రామ నమస్తే ముసలాయుధ
నమస్తే రేవతీకాంత, నమస్తే భక్తవత్సల.
నమస్తే బలినాం శ్రేష్ఠ, నమస్తే ధరణీధర
ప్రలంబారే నమస్తేస్తు, త్రాహి మాం కృష్ణపూర్వజ."

అనుమంత్రపాఠముతో నద్దేవునిఁ బ్రసన్నుం గావించుకొని, యనంతుండును, అజేయుండును, సురార్చితుండును, కైలాసశిఖరాకారుండును, చంద్రాధికమనోజ్ఞవదనుండును, నీలవసనధరుండును, ఫణాచ్ఛన్నమస్తకుండును, కుండలాలంకృతుండు నగుహలధరుని భక్తిపూర్వకంబుగ ధ్యానించువాఁ డభిమతఫలలాభంబు నందఁగలఁడు. అట్టివాఁడు సర్వపాపవిముక్తుండై ప్రళయకాలపర్యంతమును విష్ణులోకంబున సకలోపభోగంబుల ననుభవించుచుండును.

ఈవిధముగా హలధరుం డగుబలరాము నర్చించినపిమ్మట విచక్షణుండును, సమాహితచిత్తుండు నై ద్వాదశాక్షరమంత్రంబుతోఁ బురుషోత్తము నర్చించువాఁడు మోక్షప్రాప్తుం డగును. దేవతలకును, యోగులకును, సోమయాజులకునుగూడ లభింపని యుత్తమగతి యాతనికి లభించును. కావున ద్వాదశాక్షరమంత్రముతో భక్తిపూర్వకంబుగా శ్రీకృష్ణదేవునకుఁ బూజాప్రణామంబు లాచరించి—

" జయ కృష్ణ జగన్నాథ, జయ సర్వాఘనాశన,
జయ చాణూరకేశిఘ్న, జయ కంసనిషూదన.

జయ పద్మపలాశాక్ష, జయ చక్రగదాధర,
జయ నీలాంబుదశ్యామ, జయ సర్వసుఖప్రద.
జయ దేవ జగత్పూజ్య, జయ సంసారనాశన,
జయ లోకపతే నాథ, జయ వాంఛాఫలప్రద."

అని సంస్తుతించుచు, దేవేశుండును, వరదుండును, భక్తవత్సలుండును, సర్వపాపహరుండును, సర్వకామప్రదుండును, పీనవక్షుండును, ద్విభుజుండును, పద్మాక్షుండును, మహాబాహుండును, పీతాంబరుండును, శుభాననుండును, శంఖచక్రగదాధరుండును, ముకుటాంగదభూషితుండును, సర్వలక్షణసంపన్నుండును, వనమాలియు నగు శ్రీకృష్ణదేవునిఁ బ్రసన్నుం జేసికొని ప్రణామంబు చేసి యంజలిబద్ధుండై దర్శించువాఁడు సహస్రాశ్వమేధ ఫలలాభంబు నందును. సర్వతీర్థస్నానంబును, సర్వద్రవ్యదానంబును గావించినమహాఫల మొక్కసారి శ్రీకృష్ణసందర్శనంబువలన లభింపఁగలదు. బహుసువర్ణదక్షిణలతో సకలయజ్ఞంబుల ననుష్ఠించువారును, సర్వవేదాధ్యయనంబు సేయువారును, సకలదానంబుల నాచరించువారును, సకలవ్రతంబుల నిర్వర్తించువారును, నియమాచరణంబున వివిధకఠోరతపంబులఁ గావించువారును, బ్రహ్మచర్యవ్రతనిష్ఠులగువారును, శాస్త్రనిర్దిష్టాచారు లగుగృహస్థులును, వానప్రస్థధర్మప్రతిపాలకులును, సన్న్యాసులును బొందఁగలుగుసమస్తఫలంబులును శ్రీకృష్ణసందర్శనప్రణామంబులవలన లభింపఁగలవు. భక్తిభావంబున నద్దేవుని దర్శించుమానవులు మోక్షప్రాప్తులగుదురు. శ్రీకృష్ణదర్శనమాత్రంబునఁ గల్పకోటిసంభూతంబులగుసమస్తపాపంబులును నశించును.

అనంతరము విధివిహితంబుగా సుభద్రాదేవిని బూజించి ప్రణిపాతపురస్సరంబుగాఁ గృతాంజలియై,

"నమస్తే సర్వగే దేవి, నమస్తే శుభసౌఖ్యదే,
త్రాహి మాం పద్మపత్రాక్షి, కాత్యాయని నమోస్తుతే."

అనుమంత్రంబును జపించుచు బలదేవభగినియు, జగద్ధాత్రియు, భద్రదాయినియు, నగుసుభద్రాదేవిని బ్రసన్నురాలిం గావించుకొనుమానవులు కామగమనం బగువిమానము నధిరోహించి విష్ణులోకంబునఁ బ్రవేశించి యందుఁ బ్రళయకాలపర్యంతమును సుఖవిహారంబు సేయుచు మరల మర్త్యలోకంబున వేదవిదులగుబ్రాహ్మణులై జనించి వైష్ణవయోగంబు నాశ్రయించి నిశ్చయముగా మోక్షలాభంబు నందఁగలరు.

నృసింహమాహాత్మ్యము.

మునిశ్రేష్ఠులారా! ఇట్లు బలరామకృష్ణులను, సుభద్రాదేవిని సందర్శించి పూజించుమానవులు ధర్మార్థకామమోక్షంబు లను చతుర్విధఫలలాభంబులను గాంచఁగలరు. పిమ్మట దేవమందిరమునుండి బహిర్గతులై ధన్యులగుమానవులు మరల దేవాయతనంబునకు నమస్కరించి సమాహితచిత్తులై యిందనీలమయం బగువిష్ణుస్వరూపము వాలుకాచ్ఛన్నంబై యున్నప్రదేశమునకుం బోయి సందర్శించి ప్రణామాదులం గావించినచో విష్ణులోకప్రాప్తు లగుదురు. అచ్చట నసురవరుం డగుహిరణ్యకశిపుని సంహరించిన సర్వదేవమయుం డగునరసింహమూర్తి సుప్రతిష్ఠుండై యుండును. ఆనరకేసరిని దర్శించి భక్తిపూర్వకంబుగఁ బ్రణమిల్లువారు సర్వపాపవిముక్తు లగుదురు. ఆదేవునియందు భక్తిమంతులగువారి కెట్టిదుష్కృతంబులును బొరయవు. కావున మానవులు సర్వవిధములచేతను నరసింహదేవు నాశ్రయింపవలయును. ధర్మార్థకామమోక్షంబుల కాతఁడే యేకమాత్రప్రదాత.

అజితుండును, అప్రమేయుండును, భుక్తిముక్తిప్రదుండును, నగునాదేవదేవుని సర్వగుణంబులను వర్ణించి చెప్పుట కెవ్వరును సమర్థులు గాఁజాలరు. అయినను నరసింహదేవుని మాహాత్మ్యమును సంక్షేపముగ నెఱింగించెదను. దివ్యంబులును, మానుషంబులు నగుసిద్ధులన్నియు నాదేవుని ప్రసాదమువలననే సంఘటిల్లుచుండును. స్వర్గమర్త్యపాతాళంబులందును, దిక్కులను, జలంబునను, బురపర్వతంబులయందును నవ్యాహతగతి యాదేవుని యనుగ్రహంబుచేతనే సిద్ధించును. ఈచరాచరప్రపంచమున భక్తవత్సలుండగు నరసింహదేవుని కెట్టి యసాధ్యంబును లేదు. ఆదేవదేవుండు మానవులకుఁ బ్రసన్నుండగు విధానము నెఱింగించెదను. ఈవిషయంబు దేవతలకుఁగూడ నవ్యక్తంబైనది.

మునివరులారా! సాధకుం డగువాఁడు కౌపీనధారియై ధ్యాననిష్ఠుండును, జితేంద్రియుండును, నై యరణ్యంబునఁగాని, విజనస్థలంబునఁగాని, పర్వతప్రదేశంబునఁగాని, సింధుసంగమస్థానంబునఁగాని, నదీతీరంబునఁగాని శాకయావకమూలఫలపిణ్యాకాదు లాహారంబుగా నివసించి పవిత్రస్థానంబున నరసింహమూర్తిని బ్రతిష్ఠించి యథావిధిగఁ బూజించి శుక్లపక్షంబున ద్వాదశీతిథియం దుపవాసంబు చేయుచు నియతచిత్తంబుతో నృసింహమంత్రంబును లక్షజపంబు గావించినచో భగవదనుగ్రహంబుచే నట్టివానియుపపాతకంబులును, మహాపాపంబులునుగూడ నిశ్చయముగా నశింపఁగలవు.

అమ్మహాదేవునకుఁ బ్రదక్షిణంబు చేసి సుగంధదీపధూపాదులచేఁ బూజించి ప్రణామంబు చేసి యాదేవునిశిరోభాగంబునఁ గర్పూరంబును, జందనకలితంబగు జాతీపుష్పంబును సమర్పించి సాధకుండు సిద్ధుండు గాఁగలఁడు. నరసింహదేవుండు సర్వక్రియాసాధనదక్షుఁడును,

అప్రతిహతుండునై విలసిల్లుచుండును. బ్రహ్మరుద్రాదులుగూడ నా
తని తేజమును సహింపఁజాలరు. అసురోపద్రవనివారణంబుకొఱకు నృ
సింహమంత్రంబును జపించుటచే ననలాదిత్యసంకాశుండై విరాజిల్లు
చున్న సాధకునిం గాంచినంతనే యసురగణంబులు వినష్టంబులై పోవును.
ఒక్కసారి నృసింహకవచమును జపించినంతనే సర్వోపద్రవంబులును శాం
తింపఁగలవు. రెండుసారులు జపించినచో దానవోపద్రవంబులు తొలఁ
గిపోవును. గంధర్వులు, కిన్నరులు, యక్షాదులు, విద్యాధరులు, మహో
రగులు, భూతములు, పిశాచములు, రాక్షసులు, మొదలగువారిచేఁ
గావింపఁబడు ననిష్టంబులన్నియును మూఁడుసారులు నృసింహకవచము
ను జపించినంతనే విదూరితములై పోవును. మహాబలసంపన్నుండును,
భగవానుండు నగు నరసింహదేవుండు ద్వాదశయోజనపర్యంతమగు స్థాన
మును సురాసురోపద్రవంబులు లేకుండునట్లు కాపాడుచుండును.

అనంతరము బిలద్వారంబునకుం బోయి త్రిరాత్రోపవాసంబు
చేసి మోదుగుసమిధలచే హుతాశనుని బ్రజ్వలింపఁజేసి, త్రిమధుప
రిప్లుతంబు లగువిన్నూలుపలాశసమిధలచే వషట్కారమంత్రపూర్వకం
బుగ హోమము చేయవలెను. ఇట్లు గావించినచో నాబిలద్వారము
వివృతం బగును. అప్పుడు కవచధారియు, విచక్షణుండు నగుసాధకుఁ
డు నిస్సంశయముగా నందుఁ బ్రవేశింపవలయును. ఆతనికి మార్గము
నం దెట్టివిఘ్నంబులును గలుగవు. క్రమముగా నాతని మోహమోహంబు
వినష్టంబై విస్తీర్ణం బగు నాగరాజభవనము సంప్రాప్తం బగును. ఆమా
ర్గము ననుసరించి నరసింహదేవుని సంస్మరించుచు నాగాంతంబునకుఁ
బోయి యచ్చట నిశ్చలచిత్తముతో నవ్యయం బగు నృసింహమంత్ర
మును జపింపవలయును. అప్పుడు వీణావాదననిరతలగు వేలకొలఁది
రమణీమణులు స్వాగతసంభాషణంబు సేయుచుఁ బ్రవేశించి దివ్యరసా

యావఁబను సేవింపఁజేయుటచే సాధకుఁడు దివ్యశరీరధారియు, మహాబ లసంపన్నుండునై ప్రళయకాలపర్యంతమును రమణీమణులతోఁగలసి వి హరించుచు నంతంబున వాసుదేవునియందు విలీనుండగును.

సాధకున కందు నివసించుట కిష్టము లేకున్నచో నాతఁ డట నుండి బహిర్గతుండై పట్ట, శూల, ఖడ్గ, రోచనా, మణి, రస, రసా యన, పాదుకాంజన, కృష్ణాజిన, కమండలధారియై సంజీవనీయష్టిం దా ల్చి యథేచ్ఛావిహారియై యుండవచ్చును. అతనికి సర్వసిద్ధులును గర గతంబు లగును. సకలశాస్త్రంబులును వచోవిధేయంబు లగును. అ గ్నిస్ఫులింగవేష్టితం బగుత్రిశూలముం బోలినన్నసింహమంత్రము నొ క్కసారి హృదయంబున న్యస్తంబు గావించినచో శతకోటిజన్మార్జితం బు లగుసకలపాపంబులును నశించును. ఆమంత్రంబును విషంబునఁ బ్రయోగించినవిషంబును, దేహంబున న్యస్తంబు చేసినచోఁ గుష్ఠరో గంబును నిన్నష్టం బగును. స్వశరీరంబున నమ్మంత్రమును న్యస్తంబు గావించినచో భ్రూణహత్యాదిమహాపాతకంబు లాచరించినవాఁడైనను విశుద్ధుం డగును. అమ్మంత్రంబును హృదయాంతరంబున నుజ్జ్వలాకా రంబుగఁ జింతించినచో మహాగ్రహబాధలు వదలిపోవును.

ఈమంత్రంబుచే బాలకులకంఠములందు రక్ష గట్టినచో గండ పిండకాదిసకలశిశురోగంబులును శమించును. త్రిసంధ్యలయందును ఘృతక్షీరంబుల నిమ్మంత్రరాజంబుచే హోమంబు గావించినచో సర్వ రోగంబులును నశించును. ఈమంత్రంబున కసాధ్యం బగునది యీ త్రిభువనంబులయం దేదియును లేదు. ఇది సర్వాభీష్టదాయకంబైన ది. ఎవ్వరేదికోరి జపించిన వారికాకోరికలు సిద్ధించును. సాధకుం డ గువాఁడు, వల్మీకమునందుఁగాని, శ్మశానమునందుఁగాని, చతుష్పథ మునందుఁగాని సప్తముష్టిపరిమితం బగుమృత్తికను దీసి దానిని జందన

మిశ్రితంబు చేసి గోక్షీరములతో మర్దించి షడంగుళపరిమాణం బగున రసింహప్రతిమను నిర్మింపవలయును. మఱియు భూర్జపత్రంబున గోరోచనముచే నరసింహమంత్రమును లిఖించి కవచాకారంబుగఁ గంఠమున ధరించి మంత్రజ్ఞుం డగువాఁడు జలాశయమధ్యంబున నృసింహపూజనంబు గావించి సప్తాహపర్యంతమును జితేంద్రియుండై సంఖ్యాపరిగణనంబు చేయకుండ మంత్రమును జపింపవలయును. ఇట్లు చేసినచో ముహూర్తమధ్యంబున భూమండలమం దంతటను వర్షోదయంబు కాఁగలదు. మఱియు శుష్కవృక్షాగ్రంబునఁ గూర్చుండి నృసింహదేవు నర్చించి యష్టోత్తరశతపర్యాయములు మంత్రజపంబును గావించినచో సాధకుఁడు వారివర్షణమును నివారింపఁగలుగును. మఱియు సాధకుం డీదివ్యమంత్రజపప్రభావముచే వాయూత్పాదనంబు సేయుటకును, వంశప్రతిష్ఠచేయుటకును,శత్రునిర్మూలనంబుగావించుటకును సమర్థుండగును.

కావున నో మునీంద్రులారా! మహాప్రభావసంపన్నుండును, మహావీర్యుండును, సర్వకామఫలప్రదుండు నగునృసింహదేవుని భక్తిభావముతో సర్వదా పూజించుట యవశ్యకర్తవ్యము. నృసింహపూజనము సర్వపాపహరంబును, ముక్తిదాయకంబు నైనది. బ్రహ్మక్షత్రియవైశ్యులందెవ్వరైనను, స్త్రీలైనను, బురుషులైనను, శూద్రులైనను, అంత్యజులైనను భక్తిపూర్వకంబుగా నృసింహదేవుని బూజించినచో, కోటిజన్మార్జితంబులగుమహాపాపములనుండి విముక్తులగుదురు. సర్వాభీష్టఫలప్రదుండగు నృసింహదేవు నర్చించువారి కింద్రత్వమును, దేవత్వమును, గంధర్వత్వమునుగూడ దుర్లభంబులు గావు. నృసింహదేవుని సందర్శన, సంపూజన, సంస్తవంబులవలన మానవులకు సకలాభీష్టంబులును సిద్ధింపఁగలవు. అట్టివారికి రాజ్యంబును, స్వర్గంబును, మోక్షంబునుగూడ సిద్ధించును.

సంగ్రామంబునందును, విపత్తులందును, దుర్గమప్రదేశములం దును, చోరవ్యాఘ్రాదిపీడనంబులయందును, ప్రాణసంశయసమయం బులయందును, విషాగ్నిజలభయంబులయందును, రాజకోపసమయ ములయందును, గ్రహరోగాదిబాధలయందును నృసింహదేవుని సంస్మ రించువారు విపద్విముక్తు లగుదురు. సూర్యోదయంబుచేఁ దమంబు నుంబోలి, నృసింహప్రసాదముచే సకలోపద్రవంబులును నిర్మూలంబు లగును. నరసింహదేవునిభజించువారికోరికలన్నియును సిద్ధించును. ఆ దేవునియనుగ్రహంబుచే సకలసిద్ధులును గరతలామలకంబు లగును. నృసింహదేవునిఁ బూజించుటవలన శతాశ్వమేధఫలలాభంబు గలుగు ను. అట్టివానికి జరామరణభయంబులు గలుగవు. నృసింహోపవాస కుండగువాఁడు సకలాభీష్టసిద్ధుండై యంతంబున దివ్యవిమానమునధిరో హించి యప్సరోగణ సంకీర్తితుం డగుచు విష్ణులోకంబును జేరి చతు ర్భుజరూపంబుతోఁ బ్రళయకాలంబువఱకును సకలోపభోగంబుల నను భవించుచు నందుండి యనంతరము మర్త్యలోకంబున వేదపారగుం డగుబ్రాహ్మణుండై జన్మించి వైష్ణవయోగంబుచే మోక్షప్రాప్తుం డ గును.

—♦ శ్వేతమాధవమాహాత్మ్యము. ♦—

బ్రహ్మదేవుం డిట్లనియెను. ద్విజశేఖరులారా! అనంతుండగు వాసుదేవుని దర్శించుటవలనను, భక్తిపూర్వకంబుగఁ బ్రణమిల్లుటవల నను మానవమాత్రులందఱును సర్వపాపవిముక్తులై పరమపదప్రాప్తుల గుదురు. అమ్మహాదేవుండు మొట్టమొదట నాచేతను, తరువాతఁ గ్రమ ముగా నింద్రునిచేతను, విభీషణునిచేతను, శ్రీరామచంద్రునిచేతను నా రాధితుం డయ్యెను. అట్టిదేవదేవుం డెవ్వరి కారాధ్యుండు గాకుండును?

శ్వేతగంగయందు స్నానముచేసి, శ్వేత, మత్స్యమాధవులను దర్శించు వారు శ్వేతద్వీపగతు లగుదురు. శ్వేతమాధవవృత్తాంతమును సంక్షేపముగఁ దెలిపెద నాకర్ణింపుఁడు.

పూర్వము కృతయుగంబున మహాబలసంపన్నుం డగు శ్వేతుం డనురాజేంద్రుండు భూమండలమును బరిపాలించుచుండెను. ఆతఁడు బుద్ధిమంతుండును, ధర్మజ్ఞుండును, శూరుండును, సత్యప్రతిజ్ఞుండును, దృఢవ్రతుండు నై యుండెను. ఆతనిపరిపాలనకాలంబున మానవులకు దశసహస్రవర్షంబులు పరమాయువై యుండెను. బాల్యకాలంబున మృత్యుముఖపతితు లగువా రెవ్వరును లేకుండిరి. ఇట్లాతనిపరిపాలనము సకలజీవానందదాయకమై విలసిల్లుచుండెను. ఈవిధముగాఁ గొంతకాలంబు గడచుటయు నొకప్పుడు పరమధార్మికుండును, బ్రహ్మర్షియు నగుకపాలగౌతముని కుమారుండు దంతోద్గమంబైనను గానివయసునందే మృత్యుముఖపతితుం డయ్యెను.

అప్పుడమ్మునివరుండు తనపుత్రుని నరసాధునిచెంతకుం గొనిపోయి చూపించెను. మహీపాలుం డగుశ్వేతుండును చైతన్యవిహీనుండై సుప్తునింబోలి పడియున్నఋషినందనుం గాంచి «యీశమనసదనగతుం డగు బాలకుని సప్తరాత్రమధ్యంబున మరలఁ జీవితునిగాఁగొనిరాఁజాలనైతినేని నేనప్పుడే నిశ్చయముగాఁ బ్రజ్వలితచితారోహణంబు సేయంగలవాఁడ" నని ప్రతిజ్ఞపట్టి పదునొకండువందలనీలపద్మములతో మంత్రపారపూర్వకంబుగ మహాదేవు నర్చింప నారంభించెను. జగదీశ్వరుం డగుమహేశ్వరుం డప్పుడమ్మహారాజునిశ్చలభక్తిభావంబునకుఁ బ్రహృష్టహృదయుండై యుమాసహితంబుగ నాతనిచెంతకే తెంచి « వత్సా! నీయారాధనంబునకు సంతుష్టుండ నైతిని " అని వచించెను.

ఆశ్వాసపూర్వకంబు లగునమ్మధురవచనంబులు నాకర్ణించినంత,

నే మహీపాలుం డాకస్మికముగఁ గన్నులఁ దెఱచి మెట్టయెదుట విభూతిరుద్రాక్షమాలికాలంకృతుండును, విరూపాక్షుండును, శారదాభ్రకుందేందుసంకాశుండును, శార్దూలచర్మాంబరుండును, బాలశశాంకభూషణుండును, భగవానుండునగు మహేశ్వరుండు సాక్షాత్కరించి యుండుటం గాంచి భయభక్తివినయసంభ్రమంబులతో నద్దేవదేవునకుఁ బ్రణామం బాచరించి ప్రభూ! నీవు నాయెడల ననుగ్రహించి ప్రసన్నుండవై తివేని, నీకు నాయందుఁ బరిపూర్ణంబగుకరుణ గలదేని నాప్రార్థనము నంగీకరించి కాలగ్రస్తుండగు నీవిప్రకుమారుని బునరుజ్జీవితునిగాఁ జేసి యనుగ్రహింపుము. మహాత్మా! ఆకస్మికముగా మరణించిన యీబాలకుని బ్రదికించి యథాయోగ్యంబుగా నాయుష్మంతునిం జేయుము.

అని యాధరణీశ్వరుండు ప్రార్థించుటయు మహేశ్వరుండు హర్షావిష్టుండై నంతనే సర్వభూతభయంకరులగుయమకింకరులు మృత్యుముఖపతితుం డగు నవ్విప్రబాలకుని బునర్జీవితుం గావించి యమ్మహారాజున కర్పించి చనిరి. ఆసమయంబున మహేశ్వరానుగ్రహముచే సకలజగంబును మంగళమయం బయ్యెను. బ్రాహ్మణకుమారుండు సంజీవితుం డయ్యెను. అనంతర మాదేవదేవుం డుమాదేవీసహితుండై యంతర్హితుం డయ్యెను. శ్వేతుండను భూపాలచంద్రుం డీరీతిగా మునికుమారుని సంజీవితునిం గావించెను.

మహారాజగు శ్వేతుం డిట్లు సమస్తవైదిక లౌకికధర్మంబులను గ్రమంబుగఁ బరిపాలించుచు సహస్రవర్షంబులు రాజ్యంబు గావించి కేశవారాధనతత్పరుండై పురుషోత్తమక్షేత్రంబున కేతెంచి యందు శుభంబును, రమణీయంబు నగుప్రదేశంబున శ్రీకృష్ణదేవునిసమీపంబున శ్వేతగిరియందు, శతధనుర్విస్తృతం బగుప్రాసాదమును నిర్మింపఁజేసి

తేన్మధ్యంబునఁ జంద్రప్రతిమం బగుమాధవమూర్తిని యథావిధిగఁ బ్రతిష్ఠించెను. ఆసమయంబున వేదపారగులగుభూసురులకును, దీనులకును, దపస్వులకును బహుధనదానంబులం గావించెను. అనంతర మామ్మహీనాథుండు శ్వేతమాధవసన్నిధానంబునఁ బ్రణిపాతపూర్వకంబుగ ద్వాదశాక్షరమంత్రమును జపించుచు, సమాధియోగంబున మౌనియై, మాసపర్యంతము ననాహారుఁడై విష్ణుపదధ్యాననిమగ్నుండైయుండెను.

ఇమ్మెయి నాతఁడు నిర్మలభక్తిభావవిలసితుండై దేవదేవుండగు మాధవునుద్దేశించి యిట్లు స్తుతింప నారంభించెను. వాసుదేవా! సంకర్షణా! ప్రద్యుమ్నా! అనిరుద్ధా! నారాయణా! నీకు నమస్కారము. బహురూపుండును, విశ్వరూపుండును, వేధయు, నిర్గుణుండును, అప్రతర్క్యుండును, శుచియు, శుక్లకర్ముండును నగుదేవునకు వందనములు. పద్మనాభుండును, పద్మగర్భోద్భవుండును, పద్మవర్ణుండును, పద్మహస్తుండును, పుష్కరాక్షుండును, సహస్రాక్షుండును, సహస్రపాదుండును, సహస్రభుజుండును, వరాహుండును, వరదుండును, సుమేధయు, వరిష్ఠుండును, వరేణ్యుండును, శరణ్యుండును, అచ్యుతుండును, బాలరూపుండును, బాలపద్మప్రభుండును, బాలార్కసోమనేత్రుండును, ధీమంతుండును, కేశవుండును, నారాయణుండును, మాధవుండును, గోవిందుండు నగునీకుఁ బ్రణామసహస్రంబులు. ఓదేవా! నీవు విష్ణుండవు. వసురేతుండవు. మధుసూదనుండవు, శుద్ధతేజుండవు. అంశుమూర్తివి. అనంతుఁడవు. సూక్ష్మస్వరూపుఁడవు. శ్రీవత్సధారివి. త్రివిక్రముండవు. దివ్యపీతాంబరధరుండవు. సృష్టికర్తవు. గోప్తవు. ధాతవు. గుణభృతుండవు. నిర్గుణుండవు. ప్రభూ! నాయెడలఁ బ్రసన్నుండవగుము. వామనరూపుఁడవు, వామనకర్ముఁడవు, వామననేత్రుఁడవు, వా

మనవాహివి, రమణీయుండవు, పూజ్యుండవు, అవ్యక్తరూపుఁడవు, భయహరుండవు నగునీవు నన్నుఁ బరిత్రాణంబు సేయుము. సంసారసాగరపోతంబవు, ప్రశాంతస్వరూపుఁడవు, శివుఁడవు, సౌమ్యుఁడవు, రుద్రుండవు, ఉత్తారకుండవు, భవభంగకర్తవు, భవభోగప్రియుండవు, భవసంఘాతస్వరూపుఁడవు, భవస్సృష్టికర్తవు, దివ్యరూపుఁడవు, సోమాగ్నిశ్వసితుండవు, సోమసూర్యాంశుకేశుండవు, గోబ్రాహ్మణహితుండవు, ఋక్స్వరూపుండవు, పదక్రమమూర్తివి, ఋక్సుతుండవు, ఋక్సాధనుండవు, యజుర్ధారణకర్తవు, యజుర్మూర్తివి, యజుర్యాజ్యుండవు, జుష్టుండవు, యజుర్నాథుండవు, శ్రీపతివి, శ్రీధరుండవు, శ్రీకాంతుండవు, దాంతుండవు, యోగిజనచింత్యుండవు, యోగివి, సామస్వరూపుఁడవు, సామశ్వనివరుండవు, సామసౌమ్యుండవు, సామయోగవిదుండవు, సామగానవిలసితుండవు, సామధారివి, సామయజ్ఞవిదుండవు, సామకరుండవు, అథర్వశిరుండవు, అథర్వపాదుండవు, అథర్వకరుండవు, వజ్రశీర్షుండవు, మధుకైటభనిషూదనుండవు, మహోదధిజలశయనుండవు, వేదాహరణకారివి, హృషీకేశుండవు నగునీకు మాటిమాటికిని నమస్కరించుచున్నాను. ఓనారాయణా! నీవు వాసుదేవుఁడవు. లోకహితుండవు. మోహహరుండవు, భవభంగకరుఁడవు, గతిప్రదుఁడవు. త్రైలోక్యతేజఃకర్తవగునీవు నన్ను రక్షింపుము. ఓయోగీశ్వరా! శుద్ధుండును, కాముండును, తారకుండును, సుఖరూపుండును, సుఖనేత్రుండును, సుకృతధరుండును, వంద్యుండును, వామదేవుండును, దేహకర్తయు, భేదరహితుండును నగునీకు నమస్కారము. నిన్ను దేవతలు సన్నుతించుచుందురు. నీవు దేవపాలివి. వాసనివాసుండును, వాసవ్యవహారుండవు, వసుకర్తయు, వసువాసప్రదుండును, యజ్ఞస్వరూపుఁడును, యజ్ఞేశ్వరుండును, యతియు, యోగేశ్వరుండును, యజ్ఞధారియు, సంక్లి

ణుండును, ప్రలంబమధనుండును, మేఘగంభీరస్వరుండును, లాంగలధరుండును, జ్ఞానమూర్తియు నగునీకు వందనములు. స్వామీ! నాకు నీకంటె నరకమునుండి యుద్ధరించుశరణ్యు లెవ్వరును లేరు కావున నో భక్తవత్సలా! నీపాదపద్మంబులను సర్వాంతఃకరణంబులచేతను ధ్యానించుచుండెదను. కేశవా! అచ్యుతా! దేవేశా! మనోవాక్కాయకంబు లగుపాపంబులను, రూపుమాపఁగలప్రభువులు నీకంటె నెవ్వరును లేరు జనార్దనా! అపారంబగునీసంసారము దుఃఖబహుళం బనియు, విపత్సంకలితంబనియు, భావించుచుంటిని. నేనీసంసారమునం బడి తాపత్రయంబుచే నిరంతరమును బరిక్లిష్టుండ నగుచున్నాఁడను. అవశ్యశరణ్యుండనై నీయాశ్రయమును నపేక్షించి యున్నాను. ఈవిశ్వంబంతయును భవన్మాయామోహిత మైనది. ఈప్రపంచమునందు నేను సర్వదా లోభాదులచే నాకృష్యమాణుండ నగుచు నీశరణంబు నభిలషించుచుంటిని. విష్ణుదేవా! సంసారు లగువారి కెందును నెట్టిసుఖంబును లేదు. భవదీయపదధ్యాననిమగ్నంబగు చిత్తనైర్మల్యంబుకొఱకును, ఫలవిహీనం బగునాత్యంతికసుఖలాభంబుకొఱకును నేనభిలషించుచున్నాఁడను. ఓగోవిందా! నావివేకంబంతయును వినష్టంబై పోయినది. ఆర్తుండ నగునాకీజగం బంతయు నవసన్నం బగుచున్నట్లు గోచరించుచున్నది. మహాదేవా! మాధవా! నన్నీసంసారసాగరమునుండి సముద్ధరింపుము. నేనీయపారంబగుభవార్ణవంబున మోహజలనిమగ్నుండనై యున్నాఁడను. పుండరీకాక్షా! నన్నుద్ధరించుకర్తలు నీకంటె నితరు లెవ్వరును లేరు. ప్రభూ! నన్ను రక్షింపుము.

అని యివ్విధంబుగా శ్వేతమహీనాథుండు సంస్తవంబు గావించుటయు జగద్గురుండగు జనార్దనుండు రాజేంద్రుని నిశ్చలభక్తిభావంబునకు సంప్రీతుండై సకల దేవగణసహితంబుగా నవ్వటమహీరుహస

మిగాంబున నీలజీమూతసంకాశుండును, పద్మపత్రాయతాక్షుండును, సుపర్ణధరుండును, క్షీరసాగరసన్నిభుండును, పాంచజన్యధరుండును, మహాద్యుతిమంతుండును, గరుడధ్వజుండును, శ్రీమంతుండును, శార్ఙ్గహాసిధరుండును, నై సాక్షాత్కరించి మహారాజా! నీయుత్తమభక్తిభావంబునకు మెచ్చి నీయెడలఁ బ్రసన్నుండ నైతిని. నీయభీష్టవరప్రార్థనంబు గావింపుము. అని యనుగ్రహించుటయు శ్వేతభూనాథుండు దేవదేవుని యమృతోపమానంబులగు నాదరవచనంబుల నాకర్ణించి యానందపులకితసర్వాంగుండై సాష్టాంగప్రణామంబు గావించి తద్గతంబగు నిశ్చలహృదయంబుతో స్వామీ! నన్ను నీభక్తగణంబులలో నొక్కనిగాఁ బరిగణించియనుగ్రహించితివేని, మదభీష్టప్రధానంబు గావింప నిచ్ఛగించితివేని, బ్రహ్మభవనంబున కూర్ధ్వంబును, అవ్యయంబును, విరజంబును, విశుద్ధంబును, సంసారసంగవివర్జితంబును, ఉత్తమంబు నగు వైష్ణవపదంబును నాకుఁ బ్రసాదింపుమని ప్రార్థించెను.

అప్పుడు భక్తవత్సలుం డగు జగన్నాథుండు సంప్రీతుండై మహీపాలశేఖరా! విబుధమునిగణంబులకును, సిద్ధయోగిజనంబులకునుగూడ నగమ్యంబును, అనామయంబును, పరమంబును, మనోరమంబును న గుమత్పదంబు నీకనాయాసంబుగ లభింపఁగలదు. నీవింకను గొంతకాలము రాజ్యసుఖోపభోగంబుల ననుభవించి యనంతరము సర్వలోకంబుల నతిక్రమించి మదీయంబగుదివ్యలోకమును జేరఁగలవు. త్రిలోకంబులయందును నీకీర్తి విస్తృతంబు గాఁగలదు. నీయెడల నాదరంబున జేసి నేనీప్రదేశంబున నిత్యసన్నిహితుండనై యుందును. దేవదానవగణంబు లందఱును నిరంతరమును శ్వేతగంగానామమును గీర్తించుచుండఁగలరు. రాజేంద్రా! ఈ శ్వేతగంగయందలి కుశాగ్రమాత్రంబగుజలకణంబునైనను స్పృశించుమానవులు నాభక్తశ్రేష్ఠులై స్వర్గలో

భంబు నందఁగలరు. మఱియు నీచేఁ బ్రతిష్ఠితంబై చంద్రమండలవిమలంబును, సకలదురితహారంబును, పుండరీకనయనవిలసితంబును నగుని మ్మాధవమూర్తి నొక్కసారియైనను దర్శించి భక్తిభావముతోఁ బ్రణమిల్లువారు నిశ్చయముగా విష్ణులోకంబున సకలజీవసంపూజితులై విరాజిల్లఁగలరు. ఈశ్వేతమాధవుని భక్తినిర్మలహృదయములతో యథావిధిగ నర్చించువారు మన్వంతరంబువఱకును విష్ణులోకంబున నభీష్టోపభోగంబుల ననుభవించుచునుండి యనంతరము మర్త్యలోకంబున విశుద్ధబ్రాహ్మణులై జన్మించి బహుళైశ్వర్యసంపన్నులై రూపవంతులును, భాగ్యవంతులును, పుత్రపౌత్రాదిబంధుజనపరివృతులును, సుఖవంతులును, దీర్ఘాయుష్మంతులునై సకలోపభోగంబులఁ బరితృప్తులై యంతంబున నీపురుషోత్తమక్షేత్రంబున వటమూలంబునఁగాని, సాగరజలంబునఁగాని హరిధ్యాననిమగ్నులై దేహపరిత్యాగంబు గావించి శాంతపదలాభముం గాంచఁగలుగుదురు.

—♦ సముద్రస్నానవిధి. ♦—

బ్రహ్మదేవుం డిట్లనియెను. మునీంద్రులారా! ఆశ్వేతమాధవునిసమీపమునం దొకపవిత్రస్థానమునందుఁ బూర్వమేకార్ణవమధ్యంబున మత్స్యాకారుండై యుదయించి వేదములనుద్ధరించిన యాద్యావతారమూర్తి సుప్రతిష్ఠితుండై యుండెను. శ్వేతమాధవదర్శనానంతరంబున, మత్స్యమాధవుని సందర్శించి భక్తియుక్తులై ప్రణామాద్యర్చనంబులఁ గావించుమానవులు సర్వదుఃఖవిముక్తులై విష్ణులోకప్రాప్తులగుదురు. అట్టివారు మరల మర్త్యలోకంబున మహారాజులై జనింతురు. ఆమత్స్యమాధవసందర్శనమాత్రంబుననే సకలాభీష్టంబులును సిద్ధించును.

పుణ్యకాంక్షులగుమానవులకుఁ బ్రవృద్ధమంబుగఁ మార్కండే

యహ్రదంబునందు భక్తిభావముతో నవగాహనంబు సేయుట యవశ్యకర్తవ్యము. విశేషించి చతుర్దశీతిథియందు దాహ్రదంబున స్నానము సేయువారు సమస్తపాపంబులును నశింపఁగలవు. విశేషించి చతుర్దశీతిథియందు దీహ్రదంబున నవగాహనంబు సేయుట సర్వశ్రేష్ఠంబు. సముద్రస్నానము సర్వకాలములయందును, బ్రశస్తమైనదియే కాని పౌర్ణమాసియందు సముద్రస్నానంబు చేసినచో నశ్వమేధఫలలాభం బగును. మార్కండేయహ్రదంబును, అక్షయవటంబును, కృష్ణబలరాములును, మహోదధియు, ఇంద్రద్యుమ్నంబును బంచతీర్థములుగాఁ బ్రకీర్తితములైనవి. జ్యేష్ఠమాసంబున, జ్యేష్ఠానక్షత్రయుక్తం బగు పూర్ణిమను బురుషోత్తమక్షేత్రయాత్ర గావింపవలయును. అప్పుడు మనోవాక్కాయశుద్ధుండును, ఏకాగ్రచిత్తుండును, నిర్ద్వంద్వవిముక్తుండును, విమానరుండును, వీతరాగుండునై కల్పవృక్షసమీపమునకుం బోయి స్నానంబుచేసి, వటరూపి యగుజనార్దనునకు ముమ్మాఱు ప్రదక్షిణము గావించినచో సప్తజన్మార్జితమహాపాపంబులు నశించుటయే కాక మహాపుణ్యగతిలాభంబు కరతలామలకం బగును.

అమ్మహీరుహంబు చతుర్యుగంబులందును గ్రమముగా వటంబును, వటేశ్వరంబును, కృష్ణంబును, పురాణపురుషంబు ననునామంబులచే విరాజిల్లుచుండును. మఱియు దానిప్రమాణము యుగంబుల నుబట్టి క్రమముగా నేకయోజనంబును, పాదోనయోజనంబును, అర్ధయోజనంబును, పాదయోజనంబు నై యుండును. యథావిధిగ మంత్రపాతంబు సేయుచు నాకల్పవటంబునకుఁ బ్రణామంబు చేసి దక్షిణాభిముఖంబుగాఁ ద్రిశతధనుష్పరిమితదూరంబు పోయినచో నటనున్న భగవానుం డగువిష్ణుదేవుని స్వర్గద్వారమును, సాగరజలసమాకృష్టంబగు కాష్ఠంబును దృగ్గోచరం బగును. అచ్చట విష్ణుపూజాప్రదక్షిణంబు

లం గావించినవో సర్వపాపగ్రహదృష్టినుండి విముక్తుం డగును.

అనంతర ముగ్రసేనుని సందర్శించి యాస్వర్గద్వారపథంబున సముద్రమునకుం బోయి యాచమనపూర్వకంబుగా శుచియై, పరమపురుషుం డగుశ్రీమన్నారాయణుని ధ్యానించి తదీయం బగు అష్టాక్షర మంత్రముచే నంగన్యాసకరన్యాసంబులం గావింపవలయును. మనీషితులు “ఓంనమోనారాయణాయ” అనునీయష్టాక్షరమంత్రమే మంత్రరాజం బనియు, నితరమంత్రంబు లన్నియు మనోభ్రాంతికరంబు లనియుం జెప్పుదురు. ఈదివ్యమంత్రమే సర్వార్థ సాధకమైనది. ఉదకంబు నరునిసంతతి యగుటచే దానికి నారంబను నాఖ్య గలిగెను. ఆయుదకమే యయనముగా గలవాఁడగుటచే నరునకు నారాయణనామంబు గలిగెను. వేదంబులును, ద్విజులును, యజ్ఞంబులును, క్రియాసమూహంబులును, బంచభూతంబులును, మనంబునుగూడ నారాయణపరాయణంబు లైనవి. అహంకారమును, బుద్ధియు, నారాయణాత్మకములైనవి. భూతభవిష్యద్వర్తమానంబులును, జీవ, సంజ్ఞకంబు లగుస్థూలసూక్ష్మాదిసకలవస్తువులునుగూడ నారాయణాత్మకములే. జలస్థలపాతాళంబులయందును, స్వర్గమునందును, గగనమునందును, బర్వతములయందును ఎల్లయెడలను వ్యాపించి నారాయణుఁడు విరాజిల్లుచున్నాఁడు. వేయిమాట లేల? బ్రహ్మాదితృణపర్యంతమును గలయీసమస్తప్రపంచమును నారాయణాత్మకమైనది. ఈజగంబున నారాయణునికంటె శ్రేష్ఠమైన దేదియును లేదు. దృశ్యాదృశ్యంబును, జరాచరంబు లగునీసమస్తమునందు నాతఁడే వ్యాపించి యున్నాఁడు. జలంబును, జలపతియుఁగూడ నారాయణాయతనంబులు. కావునఁ బాపహరుం డగునారాయణుని యేకాగ్రమనస్కుండై స్మరింపవలయును.

విశేషించి విశుద్ధుం డగుమానవుండు స్నానకాలంబున నారాయణునిఁ బూజించి ధ్యానపూర్వకంబుగ నంగన్యాసకరన్యాసంబులఁ గావింపవలయును. అంగుష్ఠహస్తద్వయంబుల నోంకారమును, దక్షిణతర్జన్యాద్యంగుళిదళంబులయం దితరవర్ణంబులను విన్యసింపవలయును. వామపాదంబున "ఓం" కారమును, దక్షిణపాదమున "న" కారమును, వామకటియందు "మో" కారంబును, దక్షిణకటియందు "నా" కారంబును, నాభిదేశంబున "రా" కారమును, వామబాహువున "య" కారమును, దక్షిణబాహువున "ణా" కారమును మస్తకంబున "య" కారమును విన్యాసంబు చేసి, యూర్ధ్వాధోభాగంబులను, హృదయంబునను, పార్శ్వంబులను, పృష్ఠంబునను, అగ్రభాగమునను నారాయణుని ధ్యానించుచు నభిజ్ఞుం డగువాఁడు "గోవిందుండు నాపూర్వదిక్కునను, మధుసూదనుండు దక్షిణంబునను, శ్రీధరుండు పశ్చిమంబునను, కేశవుం డుత్తరంబునను, విష్ణుదేవుం డగ్నికోణంబునను, మాధవుండు నైఋతకోణంబునను, హృషీకేశుండు వాయవ్యకోణమునను, వామనుం డీశానకోణమునను, వరాహుండు భూతలంబునను, త్రివిక్రముం డూర్ధ్వంబునను నిల్చి నన్ను రక్షించుఁ గాక" అను కవచమును బఠించుచు నేనే శంఖచక్రగదాధరుం డగు నారాయణదేవుండ నని భావించుకొని ధ్యానించుచు:—

"త్వమగ్ని ద్విపదాం నాథ, రేతోధాః కామదీపనః,
ప్రధానః సర్వభూతానాం జీవానాం ప్రభు రవ్యయః.
అమృతస్యారణి త్వం హి, దేవయోని రపాంపతే,
వృజినం హర మే సర్వం, తీర్థరాజ నమోస్తు తే."

అనుమంత్రము నుచ్చరించుచు విధ్యుక్తముగ స్నాన మాచరింపవలయును. అన్యప్రకారంబున సాగరస్నానంబు సేయుట ప్రశస్తంబుగాదు.

నైదికమంత్రంబులచే నభిషేకంబును, మార్జనంబును గావించి యఘమర్షణమంత్రమును జపింపవలయును. అఘమర్షణసూక్త మశ్వమేధయాగమువలెనే యఖిలపాపహారమైనది. అనంతరము తీరమును జేరి విశుద్ధవసనధారియై ప్రాణాయామాచమనసంధ్యోపాసనంబునం దీర్చి భాస్కరారాధనంబు గావించి భాస్కరునుద్దేశించియూర్ధ్వంబుగాఁ బుష్పాంజలి నిక్షేపించి యూర్ధ్వబాహుండై యాదిత్యప్రీతికొఱ కష్టోత్తరగాయత్రీమంత్రజపంబును, సౌరమంత్రజపంబును, సమాహితచిత్తంబుతో గావించి ప్రదక్షిణనమస్కారంబు లాచరించి ప్రాఙ్ముఖుండై యుపవసించి స్వాధ్యాయపఠనంబును, దేవమానవపితృతర్పణంబులను, నామగోత్రోచ్చారపూర్వకంబుగాఁ దిలమిశ్రితంబులగునుదకములచే యథావిధిగఁ బితృతర్పణంబులను గావింపవలయును. దేవతర్పణానంతరముననే పితృతర్పణంబున కధికారి యగును.

శ్రాద్ధహోమాదికంబులగుక్రియ లన్నియు నేకహస్తంబుచేతనే నిర్వహింపవచ్చును గాని సర్వకాలంబులయందును దర్పణముమాత్ర ముభయహస్తములతోడను గావింపవలయును. నామగోత్రోచ్చారణంబు చేసి వామదక్షిణకరంబులతో "తృప్యతాం" అను మంత్రమున జలసేచనంబు గావింపవలయును. అజ్ఞానియై తనశరీరమునం దెచ్చటనైన నంటియున్నతిలలచేఁ దర్పణంబు చేయువానికిపితృదేవతలు త్వఙ్మాంసరుధిరాస్థిమూలంబున తర్పితులైనట్లుగా నసంతుష్టు లగుదురు. కావున స్వీయాంగస్థితంబు లగుతిలలతో నెన్నండును దర్పణంబు గావింపంజనదు. అందువలనఁ గర్తకుఁగూడ మహాపాపంబు సంభవించును. భూతలంబుననుండి జలంబులయందుగాని, జలంబులయందుండి భూతలంబునఁ గాని పితృతర్పణంబు గావించుట నిషిద్ధము. అందువలనఁ బితృదేవతలకుఁ దృప్తి గలుగఁజాలదు. జలంబులయందు గాని,

పాత్రింబులయందు గాని తర్పణంబు సేయంజనదు. శుద్ధుండై కాని, యేకహస్తంబుతోఁ గాని చేయఁగూడదు. శ్రద్ధాయుక్తుం డగువాఁడు తీరంబున నుపవసించి భూతలంబుననే తర్పణంబు విడువవలయును.

ద్విజవరులారా ! నేను పితృగణంబుల కీభూమండలము నక్షయ స్థానముగా దానము చేసి యున్నాను. కావునఁ బితృప్రీతికొఱకు భూతలంబుననే తర్పణంబు సేయవలయును. భూతలమందే జనించి యందే నివసించి, యందే లయంబు గాంచుచుందురు గావున భూమియందే జలదానంబు చేయవలయును. తర్పణకాలంబున సాగ్రంబు లగు కుశలను బఱచి మంత్రంబులతో నావాహనపూర్వకంబుగా దేవపితృతర్పణంబుల గావింపవలయును. ప్రాచీనాగ్రంబులగుకుశలయందు దేవతలకును, దక్షిణాగ్రంబులగుకుశలయందుఁ బితృదేవతలకును దర్పణంబులు విడువవలయును.

—♦ పూజావిధి. ♦—

అని చెప్పి బ్రహ్మదేవుండు వెండియు నిట్లనియెను. ఓవిప్రవరులారా ! ఇట్లు దేవర్షిపితృతర్పణాదుల నిర్వర్తించి యాచమనంబు చేసి వాఙ్నియతుండై మహోదధితీరంబున హస్తమాత్రంబును, జతుష్కోణంబును, జతుర్ద్వారమయంబును సుశోభనంబు నగునొకమండలమును జిత్రించి యందుఁ గర్ణికాయుతంబుగ నష్టదళపద్మంబును లిఖించి యష్టాక్షరమంత్రంబుచే విభుండగునారాయణు నందుఁ బూజింపవలయును. ఇఁకఁ గాయశుద్ధివిధానంబు దెలిపెదను. ఉపాసకుండగువాఁడు హృదయంబునఁ జక్రరేఖాన్వితంబగునోంకారమును ధ్యానించుచు, ఉజ్జ్వలంబును, త్రిశిఖాన్వితంబును, పాపహారంబును, చంద్రమండలమధ్యస్థితంబును నగురాకారమును మస్తకంబున, శుక్లవర్ణంబును, సు

ధావళ్యంబును, మహీమండలప్లావితంబునైనదిగా భావింపవలయును. ఈవిధముగా నిష్పాపుండును దివ్యదేహధారియు నై వామపాదమునుం డి క్రమముగా సర్వాంగంబులయందు నష్టాక్షరమంత్రంబుచే న్యాసం బు గావించి వైష్ణవంబు లగుపంచాంగములను, జతుర్వ్యూహంబుల ను నిర్వర్తించి మూలమంత్రముతోఁ గరశోధనంబు సేయవలయును.

మఱియు నోంకారమునందలి యొక్కొక్క-వర్ణమును బ్రత్యేకాం గుళియందును న్యసించుచు శుక్లవర్ణం బగుపృథ్వీబీజమును వామపా దమునందును, శ్యామవర్ణంబును, శాంభవీబీజమును నగునకారమును దక్షిణపాదమునందును, కాలబీజం బగుమోకారమును వామకటితె టంబునను, సర్వబీజం బగునాకారమును దక్షిణకటియందును, తైజసా ఖ్యంబగురాకారము నాభియందును, వాయవ్యబీజంబగుయకారమును వామస్కంధమునందును, సర్వంబగుణాకారమును దక్షిణస్కంధమునం దును, సర్వలోకప్రతిష్ఠానం బగుయకారమును శిరోదేశమునందును వి న్యాసంబు చేయవలయును. పిమ్మట “ ఓంవిష్ణవే నమః శిరః ” ఇ త్యాదిమంత్రంబులతో *యథాస్థానంబుల విన్యాసంబు చేసి “ నాయ గ్రంబున విష్ణుండును,పృష్ఠంబునఁ గేశవుండును, దక్షిణపార్శ్వంబున గో విందుండును, వామభాగంబున మధుసూదనుండును, ఉపరిభాగంబున వైకుంఠుండును, భూతలంబున వరాహుండును, సముద్రాంతరదిశల యందు మాధవుండును రక్షకులై నిలిచెదరుగాక ! నాగమనావస్థానం

---

* ఓమ్ విష్ణవే నమః శిరః ఓమ్ జ్వలనాయ నమః శిఖా. ఓమ్ విష్ణవే నమః కవచమ్, ఓమ్ విష్ణవే నమః స్ఫురణమ్ దిశో బన్ధాయ, ఓ హుమ్ ఫట్ అస్త్రమ్, ఓమ్ శిరసి శుక్లో వాసుదేవ ఇతి ; ఓమ్ ఆమ్ లలాటే రక్తః సంకర్షణో గరుత్మా న్ వహ్ని స్తేజ ఆదిత్య ఇతి ; ఓమ్ ఆమ్ గ్రీవాయామ్ పీతః ప్రద్యుమ్నో వాయుః మేఘ ఇతి; ఓమ్ ఆమ్ హృదయే కృష్ణో నిరుద్ధః సర్వశక్తిసమన్విత ఇతి.

బులయందును, జాగ్రత్స్వప్నంబులయందును నృసింహుఁడు నన్ను ర క్షించుఁగాక ! నేను వాసుదేవమయుండను.” అని భావించుచు విష్ణుమ యుండై కర్మారంభంబు చేయవలయును. తనశరీరము దేవశరీరముగా సర్వతత్త్వములను సంయోజింపవలయును.

తదనంతరము ప్రణవమంత్రముచేఁ బ్రోక్షణంబు చేసి, సర్వవి ఘ్నహారంబును, శుభంబు నగువస్త్రమంత్రముతో నుచ్చరించుచు సూ ర్యచంద్రవహ్ని మండలంబులను ధ్యానింపవలయును. పద్మమధ్యంబు న విష్ణుదేవుని న్యాసంబు చేసి హృదయంబున జ్యోతిస్స్వరూపం బగు నోంకారమును జింతించుచుఁ గర్ణికాస్థితంబును, సనాతనంబును నగు నష్టాక్షరమంత్రమును యథాక్రమంబుగ విన్యాసంబు గావింపవలయు ను. పిమ్మట నమ్మంత్రరాజంబుచే వ్యస్తసమస్తభావంబునసనాతనుం డగు దేవదేవుని బూజింపవలయును. మఱియు ద్వాదశాక్షరమంత్ర ముచేఁ గూడఁ బూజింపవలయును. అనంతర మమ్మహాదేవుని మూర్తి ని హృదయంబున నవధారణంబు గావించి కర్ణికాబహిర్భాగంబున విన్య సించి చతుర్భుజుండును, మహాసత్త్వుండును, కోటిసూర్యసమప్రభుండు ను, జ్యోతిర్మూర్తియు, సనాతనుండు నగుదేవదేవుని ధ్యానించుచు—

“ మీనరూపో వరాహశ్చ, నరసింహోథ వామనః,
ఆయాతు దేవో వరదో, మమనారాయణోగ్రతః.
ఓంనమో నారాయణాయనమః. ”

అనుమంత్రముతో నావాహనంబు గావించి—

“ కర్ణికాయాం సుపీఠేత్ర, పద్మకల్పిత మాసనం
సర్వసత్త్వహితార్థాయ, తిష్ఠ త్వం మధుసూదన.
ఓంనమో నారాయణాయ నమః. ”

అనుమంత్రముతో సంస్థాపనంబును,

"ఓం త్రైలోక్యపతీనాంపతయే దేవదేవాయ
హృషీకేశాయ విష్ణవే నమః.
ఓంనమో నారాయణాయ నమః."
అను మంత్రముతో నర్ఘ్యప్రదానంబును,
"ఓం పాద్యం పాదయో ర్దేవ, పద్మనాభ సనాతన,
విష్ణో కమలపత్రాక్ష, గృహాణ మధుసూదన.
ఓంనమో నారాయణాయ నమః."
అనుమంత్రముతోఁ బాద్యప్రదానంబును,
"మధుపర్కం మహాదేవ, బ్రహ్మాద్యైః కల్పితం తవ,
మయా నివేదితం భక్త్యా, గృహాణ పురుషోత్తమ.
ఓంనమో నారాయణాయ నమః."
అనుమంత్రముతో మధుపర్కసమర్పణంబును,
"మందాకిన్యాః సితం వారి, సర్వపాపహరం శివం,
గృహాణాచమనీయం త్వం, మయా భక్త్యా నివేదితం.
ఓంనమో నారాయణాయ నమః."
అనుమంత్రముతో నాచమనీయసమర్పణంబును,
"త్వమాపః పృథివీ చైవ, జ్యోతి స్త్వం వాయు రేవచ,
లోకేశ వృత్తిమాత్రేణ, వారిణా స్నాపయా మ్యహమ్.
ఓంనమో నారాయణాయ నమః."
అను మంత్రముతో స్నానకల్పమును,
"దేవతత్త్వసమాయుక్త, యజ్ఞవర్ణసమన్విత,
స్వర్ణవర్ణప్రభే దేవ, వాససీ తవ కేశవ.
ఓంనమో నారాయణాయ నమః."
అనుమంత్రముతో వస్త్రసంప్రదానమును,

" శరీరం తే నజానామి, చేష్టాం చైవ చ కేశవ,
మయా నివేదితో గంధః, ప్రతిగృహ్య విలిప్యతాం.
ఓంనమో నారాయణాయ నమః."

అనుమంత్రముతో విలేపనంబును,

" ఋగ్యజుస్సామమంత్రేణ, త్రివృతం పద్మయోనినా,
సావిత్రీగ్రంధిసంయుక్త, ముపవీతం తవార్పయే.
ఓంనమో నారాయణాయ నమః."

అనుమంత్రముచే యజ్ఞోపవీత కల్పనంబును,

" దివ్యరత్నసమాయుక్త, వహ్నిభానుసమప్రభ,
గాత్రాణి తవ శోభంతు, సాలంకారాణి మాధవ,
ఓంనమో నారాయణాయ నమః."

అనుమంత్రముతో నలంకారభూషణంబును,

" వనస్పతి రసో దివ్యో, గంధాఢ్యః సురభిశ్చ తే,
మయా నివేదితో భక్త్యా, ధూపోయం ప్రతిగృహ్యతాం.
ఓంనమో నారాయణాయనమః."

అను మంత్రముతో ధూపసేవనంబును,

" సూర్యచంద్రసమో జ్యోతి, ర్విద్యుదగ్న్యో స్తథైవ చ,
త్వమేవ జ్యోతిషాం దేవ, దీపోయం ప్రతిగృహ్యతాం.
ఓంనమో నారాయణాయ నమః."

అనుమంత్రముతో దీపదానంబును,

" అన్నం చతుర్విధం చైవ, రసైః షడ్భిః సమన్వితం,
మయా నివేదితం భక్త్యా, నైవేద్యం తవ కేశవ.
ఓంనమో నారాయణాయ నమః."

అనుమంత్రముతో నైవేద్యంబును సమర్పించి విధిపూర్వకంబు

గా నర్చింపవలయును. మఱియుఁ బూర్వదళంబున వాసుదేవుని, దక్షిణదళంబున సంకర్షణుని, పశ్చిమదళంబునఁ బ్రద్యుమ్నుని, ఉత్తరదళంబున ననిరుద్ధుని, అగ్నికోణంబున వరాహుని, నైఋతికోణంబున నరసింహుని, వాయవ్యకోణంబున మాధవుని, ఈశానకోణంబునఁ ద్రివిక్రముని విన్యాసంబుచేసి వాసుదేవసమ్ముఖంబున గరుడుని, వామపార్శ్వంబునఁ జక్రమును, దక్షిణభాగమునఁ జక్రమును, గదను అట్లే వామభాగంబున శార్ఙ్గధనువును, దక్షిణభాగంబునఁ దూణీరద్వయమును, వామంబున ఖడ్గమును, దక్షిణమున శ్రీదేవిని, ఉత్తరభాగంబునఁ బుష్టిని విన్యసింపవలయును. మఱియు సమ్ముఖంబున వనమాలికను, శ్రీవత్సమును, కౌస్తుభమును, జతుర్దిశలను, జతుష్కోణంబులను దేవదేవునిదివ్యాస్త్రంబులను విన్యాసంబు చేయవలయును. అనంతర మూర్ధ్వాధోదిశలయం దష్టదిక్పాలకులను, అనంతుని విన్యాసంబు చేసి పూజింపవలయును.

ఈరీతిగా మండలంబునందు దేవదేవుం డగుజనార్దనుని బూజించువాఁడు నిశ్చయముగా నభిమతార్థసిద్ధుం డగును. ఇట్లు విధివిధానంబునఁ బూజింపఁబడుచున్నజనార్దనదేవుని దర్శించువాఁడు గూడ నవ్యయుం డగువిష్ణుదేవుని యందు విలీనుఁడు గాఁగలఁడు. ఇట్లొక్క నారి కేశవు నర్చించువాఁడు జన్మజరామృత్యువిజయుండై విష్ణుపదోపనీతుం డగును. అశ్రద్ధ సేయక నిరంతరమును నారాయణస్మరణంబు గావించువాఁడు శ్వేతద్వీపనివాసుం డగును. ప్రణవాదిః మోంతంబును, సర్వతత్త్వమయంబునగువాసుదేవనాముమే యాతనిదివ్యమంత్రంబుగా నిర్దిష్టం బయ్యెను. ఆమంత్రముచేతనే యథాక్రమంబుగ గంధపుష్పాదుల నర్పింపవలయును. అనంతరము యథావిహితక్రమంబున ముద్రాప్రదర్శనంబు గావించి మంత్రజ్ఞుం డగువాఁ డష్టాక్షరంబుగా

ని యష్టావింశతికంబుగాని, యష్టోత్తరశతకంబుగాని యథాశక్తిని మూలమంత్రజపంబు చేయవలయును. పద్మము, శంఖము, శ్రీవత్సము, గద, గరుడము, చక్రము, శార్ఙ్గము, ఖడ్గమునను నివి యష్టముద్రలు ఈముద్రల నన్నిటిని బ్రదర్శించి యనంతరము:—

"గచ్ఛ గచ్ఛ పరం స్థానం, పురాణపురుషోత్తమ,
యత్ర బ్రహ్మాదయో దేవా, విందంతి పరమం పదం"

అనుమంత్రముతో విసర్జనంబు గావింపవలయును.

యథాక్రమంబుగ నర్చనావిధుల నెఱుంగని వారు మూలమంత్రముతోనే యర్చింపవచ్చును.

—♦ సముద్రస్నానమాహాత్మ్యము. ♦—

ఈవిధముగాఁ బురుషోత్తమదేవుని బూజించి సాష్టాంగప్రణామంబు చేసి యనంతరము—

"ప్రాణ స్త్వం సర్వభూతానాం, యోనిశ్చ సరితాంపతే,
తీర్థరాజ నమస్తేస్తు, త్రాహి మాం మచ్యుతప్రియ."

అను మంత్రమును బఠించుచు సముద్రిని బ్రసన్నుం జేసికొని స్నానము చేసి తీరంబున ననామయుం డగునారాయణుని, బలరాముని, సుభద్రను, సాగరుని బూజించి ప్రణామంబు లాచరించిన దోశతాశ్వమేధఫలలాభం బగును. అట్టివాని సర్వపాపంబులును నశించును. వాఁడు శ్రీమంతుండును, నిత్యయౌవనవంతుండును, దివ్యవిమానారూఢుండునై తనకులమునం దేకవింశతిపురుషాంతరంబులవఱకును నుద్ధరించి విష్ణులోకప్రాప్తులం గావించును. అట్టివాఁడు శతమన్వంతరంబులవఱకును జరామరణవర్జితుండై విష్ణులోకంబున నఖిలభోగంబుల ననుభవించు నుండి పిమ్మట మర్త్యలోకంబున విశిష్టకులంబున రూప

సౌభాగ్యశాలియు, సత్యవాదియు, జితేంద్రియుండును, వేదశాస్త్రవిదుండును, యోగశీలుండు నగువైష్ణవబ్రాహ్మణుఁడై జనించి యంతంబున వైష్ణవయోగంబుచే మోక్షప్రాప్తుం డగును.

గ్రహణములు, సంక్రాంతులు, అయనపుణ్యకాలములు, వత్సరాదులు మొదలగు పర్వదినంబులయందును, ఆషాఢకార్తికమాఘమాసంబులయందలిశుభదినంబులను బురుషోత్తమక్షేత్రంబునందు దానంబులు గావించినచో సర్వతీర్థంబులం గావించినవానికంటె సహస్రగుణఫలప్రాప్తియగును. అచ్చటఁ బితృదేవతలకుఁ బిండప్రదానంబు చేసినచోఁ బితృదేవత లక్షయతృప్తిం గాంతురు. ఈమాహాత్మ్యప్రస్తావము పురుషార్థప్రదంబును, ఆయుష్కీర్తికరంబును, భుక్తిముక్తిప్రదంబును, ధన్యంబును, పుణ్యంబును, సర్వకామప్రదంబును, సర్వపాపహరంబును, దుస్స్వప్ననాశకంబు నై యది. ఈపుణ్యవృత్తాంతమును నాస్తికుల కెన్నఁడు నెఱిఁగింపఁదగదు. ఈపవిత్రక్షేత్రమాహాత్మ్యము లోకంబునఁ బ్రచారితంబు గానంతవఱకే సకలతీర్థంబులును సన్మానితంబు లగుచుండును. పుష్కరాదిసర్వతీర్థంబులును దమతమకనురూపంబు లగుఫలంబులఁ బ్రసాదించుచుండును గాని యీపురుషోత్తమక్షేత్రము సకలతీర్థఫలంబులను బ్రసాదింపఁగలదు.

భూతలమునందలి సకలనదీజలంబులును సాగరంబునఁ బ్రవేశించుటచే సరిత్పతి యగుసముద్రుఁడు సర్వతీర్థశ్రేష్ఠుం డగుచున్నాఁడు. కావున సర్వకామప్రదంబగుసాగరమే తీర్థరాజము. భాస్కరాభ్యుదయంబునఁ దమఃపటలముంబోలి సముద్రస్నానంబునఁ బాపసమూహంబంతయు వినష్టం బగును. ఈతీర్థరాజంబుతో సమంబగుతీర్థం బెందును లేదు. ప్రభుం డగునారాయణుండు సర్వదా సంస్థితుండై యుండు నీతీర్థరాజమునందలి గుణగణంబులను వర్ణించుటకు సమర్థు

వ్వరున్నారు? ఈతీర్థరాజంబునందుఁ దొంబదితొమ్మిదికోట్ల తీర్థంబులు విరాజిల్లుచుండును. ఇందుఁ గావించు స్నాన, దాన, జప, హోమ, దేవార్చనాదు లక్షయఫలదాయకంబులైనవి.

పంచతీర్థమాహాత్మ్యము.

మునివరులారా! సముద్రస్నానానంతరంబున యజ్ఞాంగసంభవంబగుతీర్థంబును సేవింపవలయును. అందుఁ బరమపావనం బగునింద్రద్యుమ్నసరోవరము గలదు. ధీమంతుం డగువాఁడు శుచియై, యాచమనంబుచేసి మనంబున హరిధ్యానంబును, జలస్పర్శంబును గావించుచు—

"అశ్వమేధాంగసంభూత, తీర్థ సర్వాఘనాశన,
స్నానం త్వయి కరో మ్యద్య, పాపం హర నమోఽస్తు తే."

అను మంత్రము నుచ్చరించుచు విధిపూర్వకముగ స్నానంబును, దేవర్షిపితృగణంబులకుఁ దిలతర్పణంబును, పితృదేవతలకుఁ బిండప్రదానంబును, బురుషోత్తమునకుఁ బూజనంబును గావించినచో శతాశ్వమేధఫలలాభంబు నందుటయే కాక, తనకులమునందు సప్తపురుషాంతరములపూర్వులను, సప్తపురుషాంతరములవఱకును దనతరువాతివారిని విష్ణులోకప్రాప్తులం గావించును.

ఈవిధముగా నేకాదశీదినంబున నుపవసించి పంచతీర్థకృత్యంబులను నిర్వర్తించి జ్యేష్ఠపూర్ణిమయందు పురుషోత్తమసందర్శనంబు గావించుటవలనఁగూడఁ బూర్వోక్తఫలలాభం బగును. మాఘాదిపుణ్యమాసంబులకంటె నిందు జ్యేష్ఠమాసమును విశేషించి చెప్పుటకుఁ గారణమేమనిన—ఈభూతలమునందలి సరిత్తులు, సరోవరములు, పుష్కరిణులు, తటాకములు, వాపీకూపహ్రదులు, నదులు, సముద్రములు మొ

దలగు సకలతీర్థంబులును జ్యేష్ఠశుక్లదశమి మొదలుగ నొకసప్తాహంబువఱకును, బురుషోత్తమక్షేత్రంబున సర్వదా విరాజిల్లుచుండును. కావున స్నాన, దాన, దేవతాదర్శనాదిపుణ్యకార్యము లన్నియు నాకాలమునందే యచ్చట నిర్వర్తించుట యక్షయఫలదాయకంబు. జ్యేష్ఠశుక్లదశమి దశపాపములను హరించునది గావున దశహర యనునామముచే విఖ్యాతం బైనది.

సర్వోత్తమంబగు జ్యేష్ఠశుక్లదశమియందు నియమితచిత్తంబుతో బలరామకృష్ణులను, సుభద్రాదేవిని, సేవించువాఁడు సర్వపాపవిముక్తుండును, విష్ణులోకప్రాప్తుండు నగును. ఉత్తరాయణంబునను, దక్షిణాయనంబునను గూడఁ దద్దర్శన మనంతఫలదాయక మైనది. ఫాల్గునమాసంబునఁ బురుషోత్తముఁ డగుగోవిందుని డోలారోహణోత్సవమును దర్శించువాఁడు గోవిందలోకోపగతుం డగును. విషువంబులయందు యథావిధిగ నిశ్చలభక్తిచిత్తుండై బలరామకృష్ణులను, సుభద్రాదేవిని సందర్శించువానికి సమస్తయజ్ఞంబులకును దుర్లభంబగు నుత్తమఫలలాభంబు గలుగును. వైశాఖకృష్ణతృతీయాతిథియందుఁ జందనచర్చితుండగుశ్రీకృష్ణదేవు నవలోకించువాఁ డచ్యుతలోకప్రాప్తుండగును. జ్యేష్ఠమాసంబున, జ్యేష్ఠానక్షత్రయుక్తంబగుదినంబునఁ బురుషోత్తముని సేవించువాఁడు తనకులంబున నేకవింశతిపురుషాంతరములవారి కూర్ధ్వగతిని గల్పించి తాను విష్ణులోకప్రాప్తుం డగును.

మహాజ్యేష్ఠాప్రశంస.

మునివరులారా! రాశినక్షత్రాదియోగానుసారంబుగా మహాజ్యేష్ఠాపుణ్యకాలము తటస్థించినప్పుడు ప్రయత్నపూర్వకముగాఁ బురుషోత్తమక్షేత్రయాత్ర నిర్వర్తించుట మానవుల కందఱకు నవశ్యకర్త

వ్వము. ఆదిసంబుంకుఁ బురుషోత్తమయాత్రి చేసి రామకృష్ణులను సుభద్రాదేవిని దర్శించువాఁడు ద్వాదశయాత్రా ఫలము కంటె నధికఫలలాభంబు నందఁగలఁడు. ప్రయాగయు, కురుక్షేత్రము, నైమిశారణ్యము, పుష్కరము, గయ, గంగాద్వారము, కుశావర్తము, గంగాసాగరసంగమము, కోకాముఖము, సూకరము, మథుర, మరుస్థానము, సాలగ్రామము, వాయుతీర్థము, మందరము, సింధుసాగరము, పిండారకము, చిత్రకూటము, ప్రభాసము, కనఖలము, శంఖోద్ధారము, ద్వారక, బదరికాశ్రమము, లోహకుండము, అశ్వతీర్థము, సర్వపాపప్రమోచనము, కమలాలయము, కోటితీర్థము, అమరకంటకము, లోహార్గళము, జంబుమార్గము, సోమతీర్థము, పృథూదకము, ఉత్పలావర్తకము, పృథుతుంగము, కుబ్జకము, ఏకామ్రకము, కేదారము, కాశి, విరజ, కాలంజరము, గోకర్ణము, శ్రీశైలము, గంధమాదనము, మహేంద్రము, మలయము, వింధ్యము, పారియాత్రము, హిమాలయము, సహ్యము, శుక్తిమంతము, గోమంతము, అర్బుదము, గంగ, యమున, సరస్వతి, గోమతి, బ్రహ్మపుత్రి, గోదావరి, భీమరథి, తుంగభద్ర, నర్మద, తాపి, పయోష్ణి, కావేరి, శిప్ర, చర్మణ్వతి, వితస్త, చంద్రభాగ, శతద్రు, బాహుద, ఋషికుల్య, కుమారి, విపాశ, దృషద్వతి, సరయు, నాకగంగ, గండకి, మహానది, కౌశిక, కరతోయ, త్రిస్రోత, మధువాహిని, వైతరణి మొదలుగా గల భూతలమునందలి యెల్లతీర్థంబులును, సర్వక్షేత్రములును, సర్వసాగరంబులును, సర్వశైలంబులును, సర్వనదీనదంబులును సందర్శించి సేవించినఫలంబును, సూర్యగ్రహణాదులయందుఁగావించు మహాదానాదులవలనఁ గలుగుపుణ్యఫలంబునుగూడ నొక్కసారి మహాజ్యేష్ఠాపుణ్యకాలంబున శ్రీకృష్ణసందర్శనము గావించినంతనే సిద్ధింపఁగలదు.

కావుననే యట్టిసర్వోత్తమపుణ్యకాలంబునఁ శ్రేయోభిలాషుల గు మానవు లెల్లరును బురుషోత్తమయాత్ర గావింపవలయును. ఆదినం బున శ్రీసుభద్రారామకృష్ణులను సేవించినవారికి విష్ణుసాయుజ్యంబు గ లుగును. అట్టిపుణ్యాత్ముఁడు ప్రళయకాలంబువఱకు విష్ణులోకంబున సకలభోగంబుల ననుభవించుచునుండి యనంతరము మర్త్యలోకంబు నఁ జతుర్వేదపారగుండును, స్వధర్మనిరతుండు నగు బ్రాహ్మణుండై పుట్టి శాంతుండును, శ్రీకృష్ణభక్తుండునై యంతంబున వైష్ణవయోగా వలంబనంబుచే ముక్తుం డగును.

—♦ కృష్ణస్నానమాహాత్మ్యము. ♦—

అని చెప్పి బ్రహ్మదేవుండు మఱియు నిట్లనియెను. మునిశ్రే ష్ఠులారా! సర్వపాపహరంబును, బుణ్యప్రదంబునగు శ్రీకృష్ణబలరాముల యు, సుభద్రయొక్కయు స్నానవృత్తాంతమును జెప్పెద నాకర్ణింపుఁడు. జ్యే ష్ఠమాసంబునఁ బూర్ణిమాతిథియందుఁ జంద్రదైవతం బగు నక్షత్రమున హరిస్నానము ప్రశస్తమైనది. తత్కాలంబున నందున్నకూపము సర్వ తీర్థమయంబును, నిర్మలంబు నై యుండును. అప్పు డచ్చట భోగవతి సాక్షాత్కరించి యుండును. కావున శ్రీరామకృష్ణులను సుభద్రాదేవిని నభిషేకించుటకై యాకూపమునుండి హేమకలశంబులచే జలంబులను గొని తెచ్చి పిమ్మట దేవతామూర్తులకు స్నానార్థమై పతాకాభిశోభి తంబును, సుదృఢంబును, సుఖసంచారంబును, వస్త్రపుష్పాలంకృతం బును, విస్తీర్ణంబును, ధూపధూపితంబును, శ్వేతవస్త్రావృతంబును, మౌక్తికహారాలంకృతంబు నగు మంచెపై, శ్రీరామకృష్ణులను, వారి నడుమ సుభద్రాదేవిని సంస్థాపించి వివిధంబగు మంగళధ్వనుల ఘోషము, బ్రహ్మక్షత్త్రియవైశ్యశూద్రాది శతసహస్రసహస్ర స్త్రీపురుషజనంబుల

తోడను, స్నాతకులు, యతులు, బ్రహ్మచారులు మొదలగు వారితోడను సమ్మిళితులై కృష్ణబలరాములకును, సుభద్రాదేవికి నభిషేకంబు గావింతురు.

ఆసమయంబున సకలతీర్థంబులును బుష్పమయంబులును, బవిత్రంబులు నగు తమయుదకంబులచే వేర్వేఱుగా నద్దివ్యమూర్తుల నభిషేకింపఁగలవు. అనంతరము పటహశంఖభేరీమురజకాహళకరతాళమృదంగాదివివిధవాద్యంబులును, ఘంటాదివివిధధ్వనులును, స్త్రీజనమంగళశబ్దంబులును, స్తుతిగీతములును, జయధ్వనులును, స్తోత్రములును, వేణువీణారవంబులును, సాగరఘోషంబునుంబోలి దశదిశలఁ బ్రతిధ్వనితంబులుగాఁ జేయంగలవు. మునిగణోచ్చారితంబు లగు వేదనామములును, మంత్రపాఠములును, స్తవంబులును, పవిత్రసామగానంబులును మొదలగువారిచే నాస్థానంబంతయు ముఖరితంబగుచుండును.

ఎందఱో స్నాతకులును, యతులును, బ్రహ్మచారులును గలసి యారామకృష్ణుల స్నానసమయంబున స్తోత్రపాఠములం గావించుచుందురు కుచభారవినమ్రలును, నవయౌవనవతులును, నగు వారవనితలు వివిధవస్త్రభూషణాలంకృతలై వచ్చి యద్దేవతామూర్తుల కిరుగడలనిల్చి చామరంబుల వీచుచుందురు. అప్పుడు యక్షకిన్నరసిద్ధవిద్యాధరులును, అచ్చరలును, దేవగంధర్వచారణులును, ఆదిత్యవసురుద్రాదులును, సాధ్యవిశ్వేదేవగణంబులును, మరుద్గణంబులు, లోకపాలకులును గగనభాగంబున నిలిచి పురుషోత్తమదేవుని దర్శించి “ఓపురాణపురుషా! దేవదేవా! సృష్టిస్థితిసంహారకారణా! లోకనాథా! జగత్పతీ! త్రైలోక్యధారీ! సర్వకామప్రదా! మోక్షనిదానా! బ్రహ్మణ్యదేవా! నీకు నమస్కారము” అని యనేకవిధంబుల స్తోత్రపాఠములను గావించుచుందురు.

అప్పుడు దేవగంధర్వాదులు గానము జేయుచుందురు. అప్స రోగణంబులు నృత్యము చేయుచుందురు. దేవదుందుభులు శబ్దాయ మానము లగుచుండును. సురభిశీతలానిలంబులు వీతెంచుచుండును. మేఘములు గగనమునుండి పుష్పంబుల వర్షించుచుండును. మునులును సిద్ధచారణాదులును, జయధ్వనులు గావించుచుందురు. ఇంద్రాదిదేవ తలును, సకలర్షులును, పితృగణంబులును, బ్రజాపతులును, మఱి యు స్వర్గవాసులగు సకలదేవతలును మంగళమయంబు లగు నభిషేక ద్రవ్యములతోఁగూడ నచ్చటికి వచ్చి యుందురు.

ఇంద్రుఁడు, విష్ణుదేవుఁడు, సూర్యచంద్రులు, ధాతయు, విధా తయు, అనలుఁడు, అనిలుఁడు, పూషుండును, భగుండును, అర్యముం డును, త్వష్టయు, అంశుండును, వివస్వంతుండును, పత్నీసహితులగు మిత్రావరుణులును, రుద్రులును, వసువులును, ఆదిత్యులును, అశ్వినీ కుమారులును, విశ్వేదేవతలును, మరుత్తులును, సాధ్యులును, పితృగ ణంబులును, గంధర్వులును, యక్షరాక్షసపన్నగులును, అప్సరోగణం బులును, దేవర్షులును, బ్రహ్మర్షులును, వైఖానసులును, వాలఖిల్యు లును, భృగ్వంగిరాది సర్వవిద్యావిదులగు మహర్షులును, విద్యాధరు లును, యోగసిద్ధులును, మొదలగువారితోఁ గలసి బ్రహ్మదేవుండును, సప్తర్షులును, ప్రజాపతులును, గ్రహగణంబులును, ఋతువులును, మూర్తిమంతంబు లగు సకలనదీనదంబులును, సర్వతీర్థంబులును, సము ద్రంబులును, హ్రదంబులును, పృథివియు, దిక్కులును, వనస్పతులును దేవమాతయగునదితియు, శ్రీహ్రీస్వాహాసరస్వతీదేవులును, ఉమాశచీ దేవులును, సినీవాలి, అనుమతి, కుహు, రాక, ధిషణ మొదలగు దేవ పత్నీగణంబులును, హిమవంతంబును, వింధ్యంబును, మేరువును, సా నుచరం బగు నైరావతంబును, కళాకాష్ఠామాసపక్షంబులును, ఋతు

పులును, దివారాత్రిబులును, సంవత్సరంబులును, ఉచ్చైశ్శ్రవంబును, నాగేంద్రుండును, వామనుండును, అరుణుండును, గరుడుండును, సకలంబులగు నోషధులును, భగవానుం డగు ధర్మదేవుండును, కాలుండును, యముండును, మృత్యువును, యమానుచరులును దత్కాలంబునఁ బురుషోత్తమదేవుని యభిషేకదర్శనార్థం బిచ్చేసి యుందురు.

వారందఱును మంగళకరంబులగు నభిషేచనద్రవ్యములం గైకొని భూతలగతులై వచ్చి సపుష్పంబులగు కాంచనకలశంబులతోఁ బవిత్రసరస్వతీజలంబులచేతను, దివ్యంబులగునాకాశగంగాజలంబులచేతను, రామకృష్ణుల కభిషేకంబు గావింతురు. అప్పుడు వివిధంబులగు ననేకదివ్యవిమానములు వరుసలుతీరి యంబరభాగంబున సంచారము సేయుచుండును. అవియన్నియును దివ్యపతాకాభిశోభితంబులును, నృత్యగీతవాద్యాదులచే విలసితంబులునై శోభిల్లుచుండును. ఈవిధముగా నప్పుడు శ్రీరామకృష్ణులకును, సుభద్రాదేవికిని గూడ నభిషేకంబు గావించి హర్షోత్ఫుల్లహృదయములతో నింద్రాదిదేవతలందఱును పురుషోత్తమదేవునిం గూర్చి

“ జయ జయ లోకపాల భక్తరక్షక, జయజయ ప్రణతవత్సల,
జయజయ భూతచరణ జయజయాదిదేవ బహుకారణ,
జయజయ వాసుదేవ, జయజయాసురసంహరణ,
జయజయ దివ్యమీన, జయజయత్రిదశవర,
జయజయ జలధిశయన, జయజయ యోగివర,
జయజయ సూర్యనేత్ర, జయజయ దేవరాజ,
జయజయ కైటభారే, జయజయ వేదవర,
జయజయ కర్మరూప, జయజయ యజ్ఞవర,
జయజయ కమలనాభ, జయజయ శైలచర,

జయజయ యోగశాయిన్, జయజయ యోగధర,
జయజయ విశ్వమూర్తే, జయజయ చక్రధర,
జయజయ భూతనాథ, జయజయ ధరణీధర.
జయజయ శేషశాయిన్, జయజయ పీతవాసో,
జయజయ సోమకాంత, జయజయ యోగవాస,
జయజయ దహనవక్త్ర, జయజయ ధర్మవాస,
జయజయ గుణనిధాన, జయజయ శ్రీనివాస,
జయజయ గరుడగమన, జయజయ సుఖనివాస,
జయజయ ధర్మకేతో, జయజయ మహీనివాస,
జయజయ గహనచరిత, జయజయ యోగిగమ్య,
జయజయ మఖనివాస, జయజయ వేదవేద్య,
జయజయ శాంతికర, జయజయ యోగిచింత్య,
జయజయ పుష్టికర, జయజయ జ్ఞానమూర్తే,
జయజయ కమలాకర, జయజయ భవవైద్య,
జయజయ ముక్తికర, జయజయ విమలదేహ,
జయజయ సత్త్వనిలయ, జయజయ గుణసమృద్ధ,
జయజయ యజ్ఞకర, జయజయ గుణవిహీన,
జయజయ మోక్షకర, జయజయ భూశరణ్య,
జయజయ కాంతియుత, జయజయ లోకశరణ,
జయజయ లక్ష్మీయుత, జయజయ పంకజాక్ష,
జయజయ సృష్టికర, జయజయ యోగయుత,
జయజయ అతసీకుసుమశ్యామదేహ,
జయజయ సముద్రవిష్టదేహ,
జయజయ లక్ష్మీపంకజ షట్చరణ,

జయజయ భక్తవశ, జయజయ శ్రీకాంత,
జయజయ పరమశాంత, జయజయ పరమసార,
జయజయ చక్రధర, జయజయ భోగియుత,
జయజయ నీలాంబర, జయజయ శాంతికర,
జయజయ మోక్షవర, జయజయ కలుషహార.
జయ కృష్ణ జగన్నాథ, జయసంకర్షణానుజ
జయ పద్మపలాశాక్ష, జయ వాంఛాఫలప్రద.
జయ మాలావృతోరస్క, జయ చక్రగదాధర,
జయ పద్మాలయాకాంత, జయ విష్ణో నమోస్తుతే. ”

అని యనేకవిధంబుల స్తోత్రపారంబు గావించుచు నంబరతలంబునందుండి శ్రీకృష్ణబలరాములకును, సుభద్రాదేవికిని బ్రణామంబులం గావించి తమతమనివాసములకుం బోవుదురు. అప్పుడు గగనభాగంబంతయుఁ దివ్యపతాకాభిశోభితంబులును, రత్నకాంత్యుజ్జ్వలంబులు నగు సువర్ణవిమానములచే నిండి యుండును. ఆసమయంబున భూలోకవాసులందఱును, బురుషోత్తమబలరామసుభద్రలను దర్శించి యవ్యయపదప్రాప్తు లగుదురు. మంచముపై బలరామసుభద్రాసహితుండై యున్నపురుషోత్తముని దర్శించువారికి నిరామయపదంబు లభించు ననుట కెట్టిసంశయమును లేదు.

మునివరులారా! సుభద్రాబలరామసహితుండగు శ్రీకృష్ణుని దర్శించినచోఁ బుష్కరక్షేత్రంబున శతసహస్రగోదానములు గావించినఫలంబు సిద్ధించును. మంచస్థుండగు శ్రీకృష్ణదేవుని దర్శనమాత్రంబున శతకన్యాదానఫలంబు లభించును. శతనిష్కపరిమితంబగుసువర్ణదానంబును, సహస్రగోదానంబును, విధివిహితం బగు భూదానమును, అతిథుల కన్నదానంబును, వృషోత్సర్జనంబును, గ్రీష్మకాలంబున జలదా

సంబును, తిలాధేనుదానంబును, గజాశ్వరథదానంబులును, చాంద్రాయణవ్రతానుష్ఠానంబును, జలధేనుదానంబును, ఏకమాసోపవాసంబును గూడ శ్రీకృష్ణసందర్శనంబుతో సమానములు గాఁజాలవు.

వేయిమాట లేల ? సమస్తతీర్థంబులును, సమస్తవ్రతంబులును, సమస్తదానంబులును గావించుటకంటె నొక్కసారి మంచస్థులగు శ్రీకృష్ణబలరాములను సుభద్రాదేవిని దర్శించుటయే యధికఫలప్రదం బగుచున్నది. స్త్రీపురుషు లెల్లరును బురుషోత్తమసందర్శనంబు సేయవలయును. అట్టివారికి సర్వతీర్థసంసేవనఫలంబు సిద్ధించును. కృష్ణాభిషేకానంతరమున నాజలంబును శిరములం దాల్చినచో, వంధ్యలును, మృతాపత్యలును, దుర్భగలును, గ్రహపీడితలును, భూతావిష్టలును, రోగాక్రాంతలును నగురమణీమణు లభీష్టఫలలాభంబు నొందుదురు. ఆజలంబుల నభిషిక్తులగువారి కోరినకోరిక లన్నియును సిద్ధించును. భూతలమునం గలయెల్లతీర్థజలంబులును గలసి యాస్నానశేషజలంబున షోడశాంశఫలంబునైనను గల్గింపఁజాలవు. కావున శ్రీకృష్ణస్నానావశిష్టజలంబులచే నెల్లప్పుడు నభిషేచనంబు చేసికొనుట శ్రేయోదాయకము.

స్నానాంతరంబు దక్షిణాభిముఖుండై వేంచేయుచున్న శ్రీకృష్ణదేవుని దర్శించువారు బ్రహ్మహత్యాదిసర్వపాపంబులనుండియు ముక్తులగుదురు. అట్టివారికి ముమ్మారు భూప్రదక్షిణంబు గావించినఫలంబు లభించును. భూతలమునందలి సకలతీర్థములను సేవించుట, బదరికాశ్రమంబు పోయి నారాయణుని దర్శించుట, కురుక్షేత్రంబునను, గంగాద్వారమునందును, స్నానాదానాదులంగావించుట, మాఘమాసంబునఁ బ్రయాగయాత్ర గావించుట, మహాభిధానం బగుకార్తికంబునఁ బుష్కరగమనంబు సేయుట, గంగాసాగరసంగమంబున స్నానదానం

ములాచరించుట, గంగాయమునాసరస్వత్యాది పుణ్యనదులయందును, బుణ్యసరోవరంబులయందు నవగాహనం బొనరించుట సూర్యచంద్రాదిగ్రహణంబులయందు వివిధదానంబులు సేయుట మొదలగువాని వలన లభించుపుణ్యఫలంబంతయును, శ్రీకృష్ణదేవునిదక్షిణాభిముఖయాత్రాదర్శనమువలన లభింపఁగలదు. వేయేల? వేదశాస్త్రపురాణములయందు మహర్షులచేఁ బ్రశంసితంబులగు సకలపుణ్యకర్మంబులకును లభించుఫలంబంతయును బలరామసుభద్రాసహితంబుగా దక్షిణాభిముఖయాత్రం గావించు శ్రీకృష్ణుని దర్శించినంతమాత్రమునఁ గరతలామలకంబు గాఁగలదు.

—♦ గుండివాయాత్రామాహాత్మ్యము. ♦—

శ్రీకృష్ణబలరాములును, సుభద్రాదేవియు రథారోహణంబు గావించి గుండివాయాత్ర చేయుచుండఁగా దర్శించువారు విష్ణులోకప్రాప్తు లగుదురు. ఆగుండివామండపంబున సప్తాహపర్యంతము వేంచేసియున్నయాదివ్యమూర్తులను సేవించువారికి సర్వాభీష్టసిద్ధి యగును.

మునివరులారా! పూర్వకాలంబున నింద్రద్యుమ్నమహీపాలుండు తనకు సాక్షాత్కరించియున్నపురుషోత్తమదేవుం గాంచి దేవా! మదీయంబగుసరోవరతీరంబునఁ బ్రతివర్షంబును సప్తాహపర్యంతంబును భవదీయం బగుయాత్రోత్సవంబు గుండివాయాత్ర యనునామంబున సువిఖ్యాతం బగుంగాక! అని ప్రార్థించుటయుఁ బ్రసన్నుం డగుపురుషోత్తమదేవుండు మహారాజా! నీసరోవరతీరంబున సప్తాహంబువఱకును మదీయంబగుగుండివాయాత్రోత్సవంబు గాఁగలదు. అప్పుడు మండపస్థితుండ నగునన్నును, బలరామదేవుని, సుభద్రాదేవిని సమాహితచిత్తులై గంధపుష్పధూపదీపనైవేద్యాదులతోడను, ప్రణామప్రదక్షిణజయ

శబ్దస్తవంబులతోడను, గీతవాద్యాదులతోడను యుక్తముగాఁ బూజించువారు బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రాదులం దెవ్వరైనను, స్త్రీయైనను, బురుషుఁడైనను సర్వాభీష్టసిద్ధు లగుదురు. అట్టివారికి దుర్లభంబగు వాంఛిత మేదియు నుండదు.

అని దేవదేవుండగుపురుషోత్తముం డనుగ్రహించుటయు, రాజశేఖరుండును, శ్రీమంతుండు నగు నింద్రద్యుమ్నుండు కృతార్థుండయ్యెను. కావున సర్వవిధంబులను బ్రయత్నించి శ్రేయస్కాముం డగువాఁడు గుండిచామండపంబున సర్వకామప్రదాత యగుపురుషోత్తమదేవుని సేవింపవలయును. ఆసమయంబున బురుషోత్తమసందర్శనంబువలన నపుత్రునకు సంతానంబును, నిర్ధనునకు ధనంబును, రోగి కారోగ్యంబును, గన్యకు ననుకూలవరప్రాప్తియు నగుటయే కాక, ఆయువును, గీర్తియు, యశంబును, మేధయు, బలంబును, విద్యయు, ధృతియు, పశుసంతానధనసంపత్తులును పరోత్తమాభీష్టభోగంబులునుగూడ లభించును. ఆషాఢంబున, శుక్లపక్షంబున గుండిచాయాత్రోత్సవసమయంబునఁ బురుషోత్తముని సేవించువారి కశ్వమేధాధికఫలలాభంబు సిద్ధించును. అట్టివారు [illegible] నేకశతంబులవారిని, వెనుక [illegible]గుటయే కాక దివ్యవిమానారూఢులై దివ్యాప్సరస్సమూహ[illegible] విష్ణులోకంబునఁ బ్రవేశించి యందు సకలభోగంబుల ననుభవించుచుఁ బ్రళయకాలంబువఱకు నుండి యనంతరము మర్త్యలోకంబునఁ జతుర్వేదులగుబ్రాహ్మణులై మరల జనించి వైష్ణవయోగంబుచే మోక్షముం గాంచఁగలరు.

— ద్వాదశయాత్రామాహాత్మ్యము. —

మునిశేఖరులారా ! ఉత్థానంబునందును, ఫాల్గుణంబునందును, విషువంబునందును, గుండిచాయాత్రాసమయమునందును బురుషోత్తము

ని సేవించువారు సర్వాభీష్టసిద్ధులై పదునల్వురింద్రులు పరిపాలించునంతకాలమువఱకును విష్ణులోకంబున సమస్తభోగంబుల ననుభవింపఁగలరు. జ్యేష్ఠమాసంబునఁ బురుషోత్తమయాత్రం జేయించువారు కల్పాంతంబువఱకును విష్ణులోకంబున సుఖనివాసులై యుందురు.

మాసవ్రతంబు విధ్యుక్తముగా ద్వాదశయాత్రలను గావించి యనంతరము యథావిధిగఁ బాపనాశినిప్రతిష్ఠం గావింపవలయును. జ్యేష్ఠమాసంబున, శుక్లపక్షంబున నేకాదశియందు నిర్మలచిత్తంబుతోఁ శుచియై పవిత్రంబగుజలాశయంబునకుం బోయి శుద్ధుండై యాచమనంబు చేసి సర్వతీర్థావాహనం బాచరించి నారాయణుని ధ్యానించుచు విధివిహితముగా స్నానము చేసి దేవర్షిపితృతర్పణాదులం దీర్చి లేచి ధౌతవసనధారియై సూర్యాభిముఖంబుగ నిలిచి నిశ్చలహృదయంబున నిఖిలపాపహారిణియు, పావనియు, వేదమాతయు, నగుగాయత్రీదేవిం గూర్చి యష్టోత్తరశతపర్యాయములు మంత్రజపంబు గావించి శ్రద్ధాసహితుండై పుణ్యమయంబు లగుసౌరమంత్రములను బఠించుచు నాదిత్యునకు ముమ్మాఱు ప్రదక్షిణంబును, ప్రణామంబును గావింపవలయును.

బ్రాహ్మణాదివర్ణత్రయంబునకును స్నానజపవిధానంబులు వేదమునందు నిర్దేశింపఁబడి యుండెను. కాని స్త్రీశూద్రాదులకుమాత్ర మట్టివేదోక్తవిధులు లేవు. ఏమైననేమి. మహాభావముతోఁ బురుషోత్తమస్థానమునఁ బ్రవేశించి కరపాదప్రక్షాళనంబును, ఆచమనంబును ఘృతక్షీరమధుగంధోదకంబులచేతను, జందనజలంబులచేతను భక్తిపూర్వకంబుగాఁ బురుషోత్తమదేవు నభిషేకించి, వస్త్రసమర్పణంబు చేసి చందనాగురుకర్పూరకుంకుమాదులచే విలేపనంబును, కమలమల్లికాదికుసుమంబులచేఁ బూజనంబును, ధూపసేవనంబును, ఘృతతైలాదులచే

ద్వాదశదీపదానంబును, పాయసాపూపమోదకాది శ్రేష్ఠపదార్థంబుల చే నైవేద్యంబును, ఫలదానంబును గావింపవలయును. ఈవిధముగాఁ బంచోపచారంబులచేతను దేవదేవు నర్చించి "నమఃపురుషోత్తమాయ" అనుమంత్రమును, అష్టోత్తరశతపర్యాయములు జపంబు చేయవలయును.

అనంతరము భక్తిపూర్వకంబుగా

"నమస్తే సర్వలోకేశ, భక్తానా మభయప్రద
సంసారసాగరే మగ్నం, త్రాహి మాం పురుషోత్తమ.
యాస్తే మయా కృతా యాత్రా, ద్వాదశైవ జగత్పతే,
ప్రసాదా త్తవ గోవింద, సంపూర్ణా స్తా భవంతు మే."

అని ప్రార్థించుచుఁ బురుషోత్తమదేవుని బ్రసన్నుం గావించుకొని దండప్రణామంబు గావించి దేవగురుదేవుల కెట్టిభేదంబును లేదు గావున గురుదేవునిగూడఁ బుష్పవస్త్రానులేపనాదులచే భక్తిభావంబున నర్చింపవలయును.

పిమ్మట శ్రద్ధాసహితుండై దేవదేవోపరిభాగంబున వివిధపుష్పంబులచే నొకవిచిత్రమండపమును గల్పించి నానాదేవసంకీర్తనంబులచేతను, ధ్యానస్తోత్రాదులచేతను రాత్రియంతయును జాగరణంబుచేసి నిర్మలప్రభాతంబున ద్వాదశియందు వేదపారగులును, వ్రతస్నాతులును, ఇతిహాసపురాణజ్ఞులును, జితేంద్రియులును, శ్రోత్రియులు నగు ద్వాదశబ్రాహ్మణులను నిమంత్రించి పూర్వదినంబువలెనే పురుషోత్తమదేవున కభిషేకారాధనంబుల నిర్వర్తించి యనంతరము బ్రాహ్మణులను బూజించి శ్రద్ధాభక్తులతో వారికి గోసువర్ణచ్ఛత్రపాదుకావస్త్రధనాదులను దానము చేయవలయును. బ్రాహ్మణు లెల్లు సంతుష్టులైన చో గోవిందుండును సంతుష్టుం డగును. పిమ్మట నాచార్యునిగూడ

నిట్లు యర్చించి కాంస్యపాత్రంబున సంతర్పితునిం గావింపవలయును. అనంతరము నిమంత్రితు లగుబ్రాహ్మణులకు పాయసములు, పక్వాన్న ములు, గుడఘృతమిశ్రితంబు లగువివిధభక్ష్యభోజ్యపదార్థంబులను స మర్పించి వారిని సంతర్పితులం గావించి యథాశక్తిదక్షిణలతో వారికి జలపూర్ణకుంభదానంబులు చేయవలయును. అట్లు విప్రవర్గంబును బూజించిపిమ్మట విష్ణుతుల్యుండును, జ్ఞానప్రదుండును నగుగురుని గూడ నట్లు పూజించి—

“ సర్వవ్యాపీ జగన్నాథః. శంఖచక్రగదాధరః
అనాదినిధనో దేవః, ప్రీయతాం పురుషోత్తమః. ”

అను మంత్రమును బఠించుచు గురుబ్రాహ్మణులకు మువ్మారు ప్రదక్షిణంబును, ప్రణామంబులను గావించి భక్తిభావంబుతో వారిని వీడుకొలుపుచు సీమాంతంబువఱకును వారి ననుగమించి మరల నమ స్కారంబు చేసి సెలవుగైకొని వచ్చి దీనులను, భిక్షుకులు, నన్నార్థు లు నగువారిం దనిపి, బంధువులు, స్వజనులు, సహోపాసకులు నగు వారితోఁ గలసి తాను భుజింపవలయును.

ఇట్లు నిశ్చలభక్తిభావముతోఁ బురుషోత్తము నారాధించు స్త్రీ లైనను, బురుషులైనను సహస్రాశ్వమేధఫలంబును, శతరాజసూయ ఫలంబును గాంచుటయేకాక తమవంశమునం దతీతానాగతశతపురు షాంతరంబుల నుద్ధరించి స్వర్గప్రాప్తులై సర్వలక్షణసంపన్నులును, సర్వ కామసంసిద్ధులును, దివ్యమూర్తులును, నిత్యయౌవనసమంచితులును, సద్గుణాలంకృతులును, గంధర్వాప్సరోగణస్తూయమానులునై యాది త్యసన్నిభంబగు దివ్యవిమానము నధిరోహించి యనాయాసంబుగ న ఖిలలోకసంచారంబు గావించుచు శతకల్పంబులవఱకును, విష్ణులోకం బున సకలోపభోగంబుల ననుభవించుచుందురు. అట్టివారు విష్ణుచే

విష్ణుంబోలి శంఖచక్రగదాధరులును, చతుర్భుజులునై పరమానందంబున దేవతాసహితంబుగ యథేచ్ఛావిహారంబు గావించుచుఁ జిరకాలంబుండి యనంతరము సిద్ధవిద్యాధరసురకిన్నరసంశోభితం బగుబ్రహ్మపదంబుఁ జేరి యచ్చట నవతికల్పంబులవఱకును వివిధభోగంబుల ననుభవించుచు ననంతరము సర్వకామఫలదంబును, మోక్షదాయకంబును, బహుదివ్యవిమానసంకులంబును, సిద్ధవిద్యాధరాదిసకలదేవతాసేవ్యంబును నగురుద్రలోకంబునఁ బ్రవేశించి యశీతికల్పంబులవఱకు ననేకభోగంబుల ననుభవించి క్రమముగా గోలోకంబున సప్తతికాలపర్యంతమును, ప్రాజాపత్యలోకమున షష్టికాలపర్యంతమును, ఇంద్రలోకంబునఁ బంచాశత్కల్పకాలపర్యంతమును, సురలోకంబునఁ జత్వారింశత్కాలపర్యంతమును, నక్షత్రలోకంబునఁ ద్రింశత్కల్పకాలంబును, జంద్రలోకంబున నిరువదికల్పంబులును, ఆదిత్యలోకంబునఁ బది కల్పంబులును, గంధర్వలోకంబున నొకకల్పంబును నుండి త్రిలోకదుర్లభంబులగు సకలభోగంబుల ననుభవించి యనంతరము ధరణీతలంబున ధార్మికుండును, చక్రవర్తియు, మహావీర్యుండును, సద్గుణాలంకృతుండు నగురాజై పుట్టి ధర్మపాలనంబు చేయుచు, భూరిదక్షిణాన్వితంబులగుబహుయజ్ఞంబుల నిర్వర్తించి మోక్షప్రదంబగుశివలోకంబుఁ జేరి యిష్టోపభోగంబుల ననుభవించి మరలమర్త్యలోకంబున సర్వోత్తమగుణసంపన్నుండగు బ్రాహ్మణుండై పుట్టి వైష్ణవయోగంబు నాశ్రయించి ముక్తుండగును. మునివరులారా! ఇది భుక్తిముక్తిప్రదం బగుయాత్రాఫలప్రస్తావంబు.

— విష్ణులోకసంకీర్తనము. —

మునిశేఖరులారా! భక్తగణంబులకు వాంఛనీయంబును, ధన్యంబును, బుణ్యంబును, సంసారతారకంబునగుపరాత్పరునిపరమపద

ముంగూర్చి చెప్పెదను. సర్వైశ్వర్యమయంబును, త్రైలోక్యపూజి తంబును, బుణ్యస్థానంబు నగువిష్ణులోకము సర్వలోకంబులయందును శ్రేష్ఠమైనది. అందుఁ బారిజాతాశోకపనసనారికేళపున్నాగచందనవకు ళసహకారచందనాదివృక్షంబులును, మాలతీమల్లికాద్రాక్షాదిలతలును సర్వర్తుఫలపుష్పసమంచితంబులై శోభిల్లుచుండును. మఱియు ననేకవి ధంబులగుపుష్పపరిమళంబులచేతను, కలవిహంగకలాలాపంబులచేతను మందమలయానిలంబులచేతను నందలియుపవనంబులు విలసిల్లుచుండు ను. కమలేందీవరమండితంబులగుజలాశయములయందు హంసకారం డవచక్రవాకాదిజలవిహంగములు మధురాలాపంబులు సేయుచు విహ రించుచుండును. అందలి కాంచనమయంబు లగుదివ్యవిమానశ్రేణుల కు లెక్కయేలేదు. అవియన్నియు నానారత్నభూషితంబులును, అ ప్సరోగణాలంకృతంబులును, గంధర్వగీతవిలసితంబులునై, హేమమయ శయ్యాసనంబులతోడను, నానాభోగ్యపరికరంబులతోడను దరుణాది త్యప్రభల దెసల వెల్లివిరియఁజేయుచు శోభిల్లుచుండును. అవి సము న్నతచిత్రపతాకాలంకృతంబులును, ముక్తాహారభూషితంబులును, వివి ధకుసుమగంధామోదితంబులును, చందనాగురుధూపితంబులును, మం గళవాద్యముఖరితంబులును, కింకిణీజాలశోభితంబులును, మనోజవంబు లు నాలోకరమణీయములు నై యుండును.

అట్టివిమానములనధిరోహించి లోకపూజ్యంబగునవ్విష్ణులోకం బున సుందరీసహితు లగుసురగణంబులు సర్వదా సుఖవిహారంబులు గావించుచుందురు. పీనోన్నతవక్షోభాగలును, సూక్ష్మావలగ్నలును, చంద్రవదనలును, మదమాతంగగమనలు నగుగంధర్వకామినులును, అ ప్సరోయువతులును బురుషోత్తముని బరివేష్టించి రత్నఖచితంబు లగుస్వ ర్ణదండములు గలచామరంబులచే వీచుచుందురు. యక్షవిద్యాధరసి

ద్ధగంధర్వాదులమనోజ్ఞగీతములచే నాభువనోత్తమంబు సర్వదా ప్రతి ధ్వనితం బగుచుండును. పుణ్యాత్ములగుమహాభాగుల కందఱకు నది నిత్యనివాసంబై నది.

దక్షిణోదధితీరంబునం గలవటమహీరుహంబుచెంత భగవానుం డును, బుండరీకాక్షుండును, విశ్వధాతయు నగుశ్రీకృష్ణదేవుని సందర్శిం చి సేవించువారు సూర్యచంద్రులున్నంతకాలము నప్సరోగణపరివేష్టి తులై యావిష్ణులోకంబున సుఖవిహారంబు గావించుచుందురు. తప్త కాంచనసన్నిభదివ్యమూర్తులగు నామహాత్ములు జరామరణవివర్జితులై సకలదుఃఖదూరులై, చతుర్భుజులును, మహావీర్యసంపన్నులును, వన మాలికాధారులును, శ్రీవత్సాంకితులును, శంఖచక్రగదాధరులును నై సాక్షాద్విష్ణుస్వరూపంబున విరాజిల్లుచుందురు. ఇట్టి మహైశ్వర్యమ యం బగువిష్ణులోకంబుతో సమానంబగు లోకం బేదియును లేదు.

అందుఁ జేరఁగలిగినమహాత్ముల కెక్కడఁ బునరావృత్తి లేదు. అప రమపదంబును జేరినవారు దేవదేవప్రభావంబున నిత్యరూపయౌవనగ ర్వితులై యందు సుఖవిహారంబు సేయుచుందురు. ఆభువనమధ్యంబు నఁ దప్తకాంచనమయంబును, దరుణప్రభాకరసంకాశంబును, రత్నమం డితంబును, శతసహస్రపతాకాలంకృతంబును, అయుతయోజనవిస్తీర్ణం బును, హైమప్రాకారవేష్టితంబు నగువిష్ణుమందిరంబు విరాజిల్లుచుండు ను. అది వివిధవర్ణంబులగు విచిత్రధ్వజంబులచే నలంకృతంబై తార కాగణపరివృతంబగు శరత్సుధాకరమండలముంబోలి ప్రతిభాసిల్లుచుం డును.

అందలి చతుర్ద్వారములును సువిస్తీర్ణంబులును, కంచుకిగణసుర క్షితంబులును, సప్తపురసమంచితంబులును, మహోన్నతంబులును, మ నోహరంబులు నై యుండును. అందుఁ బ్రథమపురంబు కాంచనమయం

బును, రెండవది మరకతమయంబును, మూఁడవది యింద్రనీలమయం బును, నాల్గవది మహానీలమయంబును, ఐదవది ప్రదీప్తపద్మరాగమయం బును, ఆఱవది హిరణ్మయంబును, ఏడవది వైదూర్యమయంబు నై యుండును. ఆమహాభవనము రత్నమయంబులును, హేమప్రవాళాం కురభూషితంబులును, అద్భుతంబులునగు నున్నతస్తంభంబులచే శోభిల్లు చుండును. ఆమందిరమునం దెల్లయెడల సిద్ధగణంబులు విహరించుచుం డఁ దారకాగణపరివృతుం డగుపూర్ణిమాసుధాకరునింబోలి పీతాంబరుం డును, శ్యామసుందరుండును, శ్రీవత్సలాంఛితుండును, సుదర్శనచక్రధ రుండు నగువిష్ణుదేవుండు విభాసిల్లుచుండును.

ఆతఁడు కుందేందురజతసంకాశంబును, హారగోక్షీరసదృశంబును సముజ్జ్వలంబు నగుచక్రమును దక్షిణకరంబునం దాల్చి యుండును. ఆతనిసవ్యహస్తంబున మహాశబ్దసమన్వితంబును, సహస్రావర్తమయం బును, విఖ్యాతంబు నగుపాంచజన్యము శోభిల్లుచుండును. దుష్కృత వినాశకంబును, దైత్యదానవనిర్దళనామోఘప్రభావసంపన్నంబును, జ్వ లదగ్నిశిఖాసంకాశంబు నగుకౌమోదకియు, సూర్యసన్నిభంబగు శార్ఙ్గం బును నాతనిదక్షిణవామకరంబుల విరాజిల్లుచుండును.

సూర్యసదృశంబులును, జ్వాలామాలాకులంబులు నగుశరనికరం బులచేఁ ద్రిభువనసంహారంబు గావింపఁగలవాఁడును, సర్వానందకరుం డును, శ్రీమంతుండును, సర్వశాస్త్రజ్ఞుండును, సర్వజగద్గురుండును, సర్వదేవతావంద్యుండును, సహస్రశీర్షుండును, సహస్రాక్షుండును, సహ స్రచరణుండును, సహస్రాభిధానుండును, సహస్రాంగుండును, సహస్ర బాహుండును, సింహాసనగతుండును, పద్మపత్త్రాయతనయనుండును, విద్యుత్కాంతిమంతుండును, సురసిద్ధసేవితచరణారవిందుండును, చరా చరగురుండును, జగన్నాథుండు నగునాతఁడు యక్షవిద్యాధరగంధర్వాది

సకలదేవతాసంస్తూయమానుండై ప్రతిభాసిల్లుచుండును.

ఆదివ్యమందిరంబునఁ గీర్తి, ప్రజ్ఞ, మేధ, సరస్వతి, మతి, బుద్ధి, సిద్ధి, క్షాంతి, మూర్తి, ద్యుతి, గాయత్రి, సావిత్రి, మంగళ, సర్వమంగళ, ప్రభ, కాంతి, నారాయణి, శ్రద్ధ, కౌశికి, విద్యుత్తు, సౌదామని, నిద్ర, రాత్రి, మాయ, మొదలగునమరకామినీమణులు యథేచ్ఛావిహారంబులఁ గావించుచుందురు. మఱియు ఘృతాచి, మేనక, రంభ, సహజన్య, తిలోత్తమ, నిమ్లోచ, వామన, మందోదరి, సుభగ, విశ్వాచి, విపులానన, భద్రాంగి, చిత్రసేన, ప్రమ్లోచ, మనోహర, మునిమనోమోహిని, రామ, చిత్రమధ్య, శుభానన, సుకేశి, నీలకుంతల, మన్మథోద్దీపిని, అలంబుష, మిశ్రకేశి, ముంజికస్థల, క్రతుస్థల, వరాంగి, పూర్వచిత్తి, పరావతి, మహారూప, శశిలేఖ మొదలగు హంసలీలాగమనలును, సుందరీశిరోమణులు నగుదేవరమణీమణులు సర్వాలంకారవిభూషితలై నృత్యగీతవినోదంబులచే నిత్యానందవిహారంబులు గావించుచుందురు.

ఆపురుషోత్తమమందిరంబున రోగగ్లానిమృత్యుభయంబులును, హిమాతపంబులును, క్షుత్పిపాసలును, జరావైరూప్యంబులును, అశాంత్యుపద్రవంబులును గానరావు. దివ్యతమం బగునావిష్ణులోకంబు పరమానందజనకంబును, సర్వకామప్రదంబును నై యుండును. దీనికంటె శ్రేష్ఠంబగులోకం బేదియును లేదు. పుణ్యప్రదంబు లనిప్రసిద్ధిం గాంచిన స్వర్గాదిలోకంబులన్నియును, దీనియందలి షోడశాంశము నైనను బోలఁజాలవు. సర్వగుణాన్వితంబును, సర్వసౌఖ్యజనకంబును, బవిత్రంబును, సర్వైశ్వర్యమయంబు నగుహరిపురంబును, నాస్తికులును, విషయలంపటులును, కృతఘ్నులును, పిశునులును, చోరులును, ఇంద్రియాసక్తులు నగువారు చేరఁజాలరు. నిరంతరభక్తిభావంబునఁ జరాచరగు

రుం డగువాసుదేవు నారాధించుచుండు వైష్ణవశిఖామణులకుమాత్రమే విష్ణులోకము సుగమంబై యుండును.

మునివరులారా! దక్షిణసముద్రతీరంబునఁ బరమదుర్లభంబగు పురుషోత్తమక్షేత్రంబున శ్రీకృష్ణబలరాములను, సుభద్రాదేవిని, సందర్శించి సేవించుచుఁ గల్పవృక్షనికటంబునఁ గళేబరమును ద్యజించువారు విష్ణులోకగతు లగుదురు. వటవృక్షాంతరాళంబునను, సముద్రమధ్యంబునను నిలిచి పురుషోత్తముని స్మరించుచుఁ బురుషోత్తమక్షేత్రంబున మరణించువారును విష్ణులోకంబుఁ జేరఁగలుగుదురు.

—♦ పురుషోత్తమమాహాత్మ్యము. ♦—

మునివరులారా! ఈభూమండలంబునం గలపుణ్యాయతనంబులన్నియును, బురుషోత్తమక్షేత్రమున షోడశాంశమునైనను బోలఁజాలవు. సర్వలోకంబులయందును, సర్వేశ్వరుం డగువిష్ణుదేవునివలెనే సమస్తతీర్థములయందును బురుషోత్తమక్షేత్రము శ్రేష్ఠంబైనది. ఆదిత్యగణంబులలో విష్ణుండును, నక్షత్రంబులలోఁ జంద్రుండును, జలాశయంబులలో సాగరంబును, వసువులలోఁ బావకుండును, రుద్రులలో శంకరుండును, వర్ణంబులలో బ్రాహ్మణుండును, విహంగంబులలో వైనతేయుండును, శిఖరంబులలో సుమేరువును, పర్వతంబులలో హిమవంతంబును, రమణీమణులలో లక్ష్మియు, సరిత్ప్రవాహంబులలో జాహ్నవియు, గజేంద్రంబులలో నైరావతంబును, మహర్షులలో భృగుండును, సేనానులలోఁ గుమారుండును, సిద్ధులలోఁ గపిలుండును, అశ్వంబులలో నుచ్చైశ్శ్రవంబును, కవులలో నుశనుండును, మునులలో వ్యాసుండును, యక్షరాక్షసాదులలోఁ గుబేరుండును, ఇంద్రియంబులలో మనంబును, భూతంబులలో భూమియు, వృక్షంబులలో నశ్వత్థంబును,

ప్లవమానంబులగువానిలోఁ బవనంబును, సర్వాలంకారములలోఁ జూడామణియు, గంధర్వులలోఁ జిత్రరథుండును, శస్త్రాస్త్రంబులలో వజ్రాయుధంబును, సర్వవర్ణంబులలో " అ " కారంబును, ఛందంబులలో గాయత్రియు, అంగంబులలో నుత్తమాంగంబును, స్త్రీగణంబులలో సతీశిరోమణియగునరుంధతియు, సమస్తవిద్యలలో మోక్షవిద్యయు, మానవులలో మహీపాలుండును, ధేనువులలోఁ గామధేనువును, లోహంబులలో సువర్ణంబును, సర్పంబులలో వాసుకియు, దైత్యగణంబులలోఁ బ్రహ్లాదుండును, ధనుష్మంతులలో శ్రీరామచంద్రుండును, మీనాదులలో మకరంబును, మృగంబులలో సింహంబును, సముద్రంబులలో క్షీరాంబుధియు, యాదోగణంబులలో వరుణుండును, సంయములలో యముండును, దేవర్షులలో నారదుండును, ధాతునిచయంబులలోఁ గాంచనంబును, పవిత్రసమూహంబులలో దక్షిణయు, ప్రజాపతులలో దక్షుండును, ఋషిగణంబులలోఁ గశ్యపుండును, గ్రహంబులలో భాస్కరుండును, మంత్రంబులలోఁ బ్రణవంబును, యజ్ఞంబులలో నశ్వమేధంబును, ఓషధులలో ధాన్యంబును, తృణంబులలోఁ దృణరాజంబును శ్రేష్ఠంబులైనట్లే తీర్థంబు లన్నిటియందును, సంసారతారకంబగుపురుషోత్తమక్షేత్రము సర్వశ్రేష్ఠమైనది.

— తీర్థభేదవర్ణనము. —

విప్రవరులారా! పుణ్యదాయకం బగుపురుషోత్తమక్షేత్రముతోఁ దుల్యంబగుక్షేత్రము నీభూమండలమునందు నేనెందును గాంచియుండలేదు. ఈవిషయమై మాటిమాటికి నేమని చెప్పుదును? ఈపురుషోత్తమమాహాత్మ్యము ముమ్మాటికిని సత్యమైనది. సాగరజలప్లావితం బగుపురుషోత్తమక్షేత్రము నొక్కసారిసందర్శించి సేవించినవారో,

బ్రహ్మజ్ఞానమొక్కసారి లభించినక్లో మానవులకుఁ బునర్జన్మంబు లేకుం డఁబోవును. శ్రీహరిసన్నిధానం బగుపురుషోత్తమస్థానంబునం దొక్క వత్సరంబుగాని, యొక్కమాసంబు గాని నివసించి యద్దేవు నుపాసించు వానికి క్షేత్రమాహాత్మ్యంబువలన జపహోమతపోదానాదులవలనంగ లుగు సంపూర్ణఫలంబు సంప్రాప్తంబు గాఁగలదు. అట్టివానికి సర్వ యోగేశ్వరుం డగుశ్రీహరిపరమపదంబు లభించును.

కల్పవృక్షంబును, బలరాముని, శ్రీకృష్ణుని, సుభద్రాదేవిని, మార్కండేయుని, ఇంద్రద్యుమ్నుని, మాధవుని, స్వర్గద్వారంబును గూర్చి సవిస్తరంబుగఁ బ్రశంసించి తన్మాహాత్మ్యంబును, సాగరస్నానమార్గనాదివిధులను, యథాకాలంబున భాగీరథీసమాగమసంకీర్తనంబును మీహృదయంబులకు సువిదితం బగునట్లుగావించితిని. సుప్రసిద్ధం బగు పురుషోత్తమక్షేత్రమునందలి సరహస్యంబులగువిషయంబుల నన్నిటిని మీకెఱింగించితిని.

మునివరులారా! పూర్వకాలంబునం దొక్కప్పుడు నారదుండు నన్ను సందర్శించి ఓలోకపితామహా! జగత్పతీ! తపోయజ్ఞదానతీర్థసమూహంబులలోఁ బవిత్రంబగు నుత్తమతీర్థముంగూర్చి నాకెఱిగింపవలయునని ప్రార్థించుటయు నేనిట్లు వర్ణించి చెప్పితిని. వత్సా! నారదా! స్వర్గమర్త్యరసాతలంబులయందు దైవంబును, అసురంబును, ఆర్షంబును, మానుషంబు నని చతుర్విధంబులగుతీర్థంబులు విరాజిల్లుచుండును. అందు మానుషతీర్థంబులకంటె నార్షంబులును, వానికంటె నాసురంబులును, వానికంటె దైవతీర్థంబులును శ్రేష్ఠఫలదాయకము లైనవి. బ్రహ్మవిష్ణుమహేశ్వరులచే దైవతీర్థములు సర్మితంబులయ్యెను. ఇతరదైవతంబులచేఁ బ్రకల్పితంబులగు నన్యతీర్థంబులు వానికంటెఁ బ్రధానంబులు గావు. దేవత్రయనిర్మితంబులగునాతీర్థంబులే త్రిభువనపావనం

బులై యుండును. అట్టితీర్థంబు లన్నిటికంటెను సమగ్రంబగుజంబూద్వీపము శ్రేష్ఠంబైనది. అందును గర్మభూమి యగుభరతవర్షము సర్వతీర్థప్రధానం బైనది.

అట్టిభారతవర్షంబునందలి సకలతీర్థంబులం గూర్చియు బ్రశంసించియుంటిని. అందు హిమవంతంబునకును, వింధ్యాచలంబునకును నడుమ బ్రవహించుచున్న దేవనదులాఱును, దక్షిణార్ణవవింధ్యాచలమధ్యస్థంబులును, దేవసంభవంబు లగునాఱునదులును, మాత్రమే ప్రధానంబులుగాఁ బ్రశంసింపఁబడుచున్నవి. దేవతలచేఁగూడఁ గర్మభూమిగాఁ బరిగణింపఁబడుచున్న భారతవర్షమునందుఁ బ్రవహించుచుండుటచే నీపండ్రెండునదులును దేవతీర్థములుగాఁ బ్రఖ్యాతంబు లయ్యెను. మఱియు నందందుగల యార్షదైవతీర్థంబు లాసురతీర్థంబులచే నావృతంబు లగుటంజేసి యన్నియు నాసురతీర్థంబు లై పోయెను.

మహర్షులగువారనేకదివ్యాయతనంబులయందు మహాతపంబు గావించి దైవబలంబునను, దపస్సాహాయ్యంబువలనను ననేకంబులగు నార్షతీర్థములను గల్పించి యుండిరి. ఆత్మమార్గణంబును, మోక్షంబును, ఐశ్వర్యమును, దేవతార్చనమును, ఫలమును, మహాయశంబును గాంక్షించి మానవులుగూడ నందందుఁ దీర్థప్రతిష్ఠలం గావించి యున్నారు. అవి యన్నియు మానుషతీర్థంబులు. ఇది చతుర్విధతీర్థప్రశంసనంబు. ఈభేదంబు నితరు లెవ్వరు నెఱుంగఁజాలరు. దీనిని గ్రహించుటకు నీవర్హుండవు. అనాయాసంబుగా నభీష్టఫలసిద్ధిం గాంచఁగోరు మానవులకు తీర్థసేవనంబుకంటె నన్యోపాయంబు లేదు.

గోదావరి, భీమరథి, తుంగభద్ర, వేణిక, తాపి, పయోష్ణి యనునదులు వింధ్యాచలదక్షిణభాగమునుండియు, భాగీరథి, నర్మద, యమున, సరస్వతి, విశోక, వితస్త, యనునదులు హిమాలయమునుండి

యు వినిర్గతంబు లగుచుండును. పుణ్యాశ్రమంబులగు నీనదులు దేవతీర్థంబులుగాఁ బ్రఖ్యాతము లగుచున్నవి. గయుఁడు, కోల్హాపురుఁడు, వృత్రుఁడు, త్రిపురాసురుఁడు, అంధకుఁడు, హయగ్రీవుఁడు, లవణుఁడు, నముచి, శృంగకుఁడు, యముఁడు, పాతాళకేతుఁడు, మయుఁడు, పుష్కరుఁడు మొదలుగాఁ గల యసురగణంబులచేఁ గల్పింపఁబడిన శుభకరంబులగు తీర్థంబు లాసురతీర్థంబులు. ప్రభాస, భార్గవ, అగస్తి, నర, నారాయణ, వసిష్ఠ, భరద్వాజ, గౌతమ, కశ్యప, మను ప్రభృతిమునిగణంబులచే సేవితంబులగు స్థానంబు లార్షతీర్థములు. అంబరీషుఁడు, హరిశ్చంద్రుఁడు, మాంధాత, మనువు, పురువు, కనఖలుఁడు, భద్రాశ్వుఁడు, సగరుఁడు, అశ్వయూపుఁడు, నాచికేతుఁడు, వృషాకపి మొదలగుమహారాజులచే నిర్మితంబు లగునవి మానుషతీర్థంబులు. మానవులు యశోలాభంబుకొఱకుఁ దీర్థనిర్మాణంబు గావించిరి. కాని, త్రిజగంబులయందును దైవతీర్థంబులు తమంతటనే సముద్భూతంబు లయ్యెను. ఈసకలతీర్థంబులును పుణ్యజనకంబులుగ నిర్దిష్టంబు లయ్యెను. ఇది తీర్థభేదప్రకారంబు.

—♦ శంభువివాహసంభవము. ♦—

అని బ్రహ్మదేవుండు సెప్పుటయు, నారదుం డిట్లనియె. లోకపితామహా! దేవత్రయనిర్మితంబు లగుతీర్థంబులు సర్వతీర్థశ్రేష్ఠంబులని వచించితివి. వానిస్వరూపభేదంబు సవిస్తరంబుగా నెఱింగింపుమని వేఁడుటయు సురజ్యేష్ఠుం డిట్లనియె. దేవత్రయనిర్మితంబు లగుతీర్థంబులు దృష్టిగోచరంబులు గానంతవఱకును అన్యతీర్థంబులును, అన్యక్షేత్రంబులును, అన్యంబు లగు యజ్ఞములును ప్రశస్తంబులై యుండును. నిఖిలాభీష్టప్రదాయినియు, సరిద్వరయు నగు గంగాదేవి త్రిదైవత్యనామంబున విఖ్యాత యైనది. ఇప్పుడు తదుత్పత్తిచారిత్రంబు వ

ర్ణించెద నాకర్ణింపుము. అయుతవర్షంబులకుఁ బూర్వము దే
ర్యంబుల కంతరాయంబుగాఁ దారకుం డను నసురనాయకుండు
యవఃప్రభావంబుచే దర్పితుండై దేవగణంబుల సకలైశ్వర్య
నపహరించుచుండ నింద్రాదిదేవతలు నిరుపాయులై క్షీరోదశాయిఁ
జగత్పితామహుండును నగు విష్ణుదేవుని శరణంబు గాంచి కృ
తులై యనన్యమనంబులతో నిట్లని నుతింపందొడంగిరి.

దేవదేవా! కీర్తివర్ధనా! జగత్కారణా! వేదమూర్తీ!
జగంబులకు రక్షకుండ వగునీకు నమస్కారము. జగన్మయా! లోక
స్రష్టవు, అసురహంతవు, జగత్పతివి, సృష్టిస్థితిలయకారణభూతుండవు
నీకంటె విపన్నజనరక్షకు లగువా రీత్రిభువనంబులయం దెవ్వరును
రు. పుండరీకాక్షా! తాపత్రయోపశమనంబునకు నీపాదకమలసేవనం
బుకంటె నాధారం బేదియును లేదు. కృష్ణా! నీవఖిల జగంబునకుఁ
దండ్రివి; తల్లివి. కేవలసేవామూలంబుననే నీసాక్షాత్కారంబు లభిం
చును. ఈశ్వరా! ప్రసన్నుండవై మహాభయంబునుండి మమ్ముద్ధ
రింపుము. సర్వాగ్రగణ్యుండ వగు నీకంటె మాకు దిక్కెవ్వ రున్నారు?
నీ వాదికర్తవు. విపత్సమయంబులయందు మత్స్యకూర్మవరాహాద్యవ
తారంబుల నెత్తి మమ్ము రక్షించితివి. ఇప్పుడు దేవతాగణంబు ప్ర
భుత్వముతో దారపుత్త్రాదులుగూడ నపహృతులై పోయిరి. నీభక్తు
లగు దేవత లిప్పుడు సంపూర్ణముగ విపన్నులై యున్నారు. శ్రీహరీ!
అనన్యశరణ్యు లగు నీభక్తుల నేల రక్షింపకున్నావు?

అని యనేకవిధంబులఁ బ్రార్థించుటయు శేషశాయియు జగ
త్పతియు నగు భగవానుండు సురశ్రేష్ఠులారా! నెమ్మది నొంది మీ
కెవ్వరివలన భయోత్పాదనం బైనదో యెఱింగింపుఁ డనుటయు దేవ
తాగణంబులు శ్రీపతి నుద్దేశించి దేవదేవా! తారకాసురునివలన మా

కు నతిభీషణంబును లోమహర్షణంబును నగు భయోత్పాదనం
. యుద్ధంబునఁ గాని తపోబలమ్మునఁగాని శాపమ్మునఁ గాని
ానికి వినాశంబును గూర్చుట మాకు నెట్టిసామర్థ్యంబును లేదు.
నంబులకంటెఁ దక్కువవయస్సు గలబాలకునివలననే యాతండు
కుం డగును. ఇఁక నెట్టియుపాయంబుచేతనుగూడ నాతనికి మర
ఋ గలుగనేరదు. ఎట్టినీతి నుపయోగించుట కర్తవ్యమో యట్లు
పుము. అని దేవతలు ప్రార్థించుటయు నారాయణదేవుండు విబు
వతులారా! నేను బలోత్కటుండను గాను. నావలనఁగాని నాసంతా
ువలనఁగాని మఱియేదేవతలవలనఁగాని యయ్యసురవధంబు గానే
ఱు. ఈశ్వరుండు ప్రసన్నుండై శక్తియుక్తం బగు నపత్యంబు నుద్భ
ంపఁజేసినచో నయ్యపత్యంబువలన లోకభయంకరుఁ డగు తారకుం
డు నిధనప్రాప్తుండు గాఁగలండు. కావున నోసురవరులారా! రండు.
మనము ఋషిగణసమేతులమై పోయి యీశ్వరుండు దారపరిగ్రహ
ంబు గావించున ట్లొనరింతము. అని విష్ణుదేవుం డాశ్వాసించుటయు
రగణంబులు వెళ్లి యని రత్నమయం బగుహిమాలయంబునకుం జని
హిమాలయుప్రియ యగు మేనను, హిమవంతుని సందర్శించి యేకవా
క్యంబుగా దక్షనందినియు జగజ్జననియు శంభుప్రణయినియు బుద్ధి, ప్ర
జ్ఞ, ధృతి, మేధ, లజ్జ, పుష్టి, సరస్వతి మొదలుగాఁ గల బహురూపం
బులచే జగంబులఁ బవిత్రంబుసేయుచు జగద్ధాత్రియై విరాజిల్లు నమ్మ
హాదేవి దేవకార్యార్థంబుగా మీయపత్యంబై యవతరించి జగన్మాత
యగునామె మరల నీశ్వరుని వరించి మీకును మాకును రక్షకురాలు
గాఁగలదు. అని బోధించుటయు హిమవంతుండును, మేనయుఁ బర
మానందంబున మహాప్రసాదం బని వక్కాణించిరి.

పిమ్మట జగజ్జనని యగు గౌరీదేవి హిమాలయగృహంబున

జన్మించి శివధ్యాననిరతయు, తదేకాంతపరాయణయు, తన్నిష్ఠ పయునై కాలక్షేపంబుసేయుచుండెను. దేవతలామె నీ గూర్చి తపంబునొనరింపు మని ప్రార్థించిరి. గౌరియు నట్లే హి తంబున మహాతపంబుసేయుచుండెను. అప్పుడు దేవతలెల్లరున గౌరీదేవి శివలాభార్థమై తపంబుసేయుచున్నది గాని శివుం డ గూడ ధ్యానించుటకు దగినయుపాయంబు గానరాకున్నది. నుం డగుభవుండు హిమవన్నందన యగు గౌరీదేవిని గామించున్ట పాయంబు గావించుట యవశ్యకర్తవ్యంబు. అందువలననే మన లోకంబునకును గల్యాణంబు గాఁగలదు. అని యాలోచించు మహాబుద్ధియు, నుదారచిత్తుండు నగుబృహస్పతి సురవరులారా! ష్పచాపధరుండును, ధీశాలియు, కందర్పుండు నగునీమన్మథుండు తన ష్పబాణంబులచే శాంతుండగు శివుని వేధింపవలయును. మదనశరవి ర్భిన్నహృదయుం డగు మహేశ్వరుం డప్పుడు గౌరీదేవియందు మనస్సు యోగంబు సేసి యామెపాణిగ్రహణంబును వాంఛింపఁగలండు. త్రిభు వనవిజయుం డగు నీపంచబాణుని కుసుమశరం బెందును నకుంఠితం గదా! శంకరుం డప్పుడు జగన్మాతయగు గౌరిం బెండ్లియాడి యామె గర్భంబున నొకకుమారు నవతరింపఁజేయంగలండు. ఆత్రినేత్రునిపు త్రుఁడే తారకాసురనిధనసాధనంబు సేయంగలఁడు. కావున నిమ్మహ నునిసాహాయ్యంబునకుఁ గుసుమాకరుండగు వసంతునునుపవలయును. అని చెప్పుటయు దేవతలు సమ్మతించి మదనవసంతులను శివాంతికం బున కనుపుటయు మదనుం డప్పుడు రతిమాధవసహితుండై ధనుర్బా ణధారియై త్వరితగమనంబుల దుష్కరకర్మసాధనార్థము ప్రయాణము సాగించెను.

శరశరాసనధారియై మదనుం డట్లుపోవుచు చరాచరగురుం డగు

డనేధ్యుం డైనను నేనాతని నిశ్చయముగా వేధింపవలయును. విజయంబు లగునాబాణము లాతనిమేనం దమపరిభావమును ...లకుండునా యని దృఢముగ భావించుకొనియెను. ఈవిచిత్ర ...మును దిలకించుటకై దేవతలందఱును గుమిగూడి వచ్చి ...డిరి. కాని త్రిలోచనుని యేకమాత్రదృష్టిపాతంబు ...రతికాంతుండును నిలువున భస్మీభూతుం డయ్యెను. ఆదున్న ...టనముం గాంచి యఖిలదేవతలును భయాతురులై చేతులు ...ంచుకొని యమ్మహాదేవునింగూర్చి దేవా! తారకాసురపీడనంబు ...ముందఱము నరింతెరము నల్లాడుచున్నారము. భక్తవత్సలుండ ...నవు లోకానుగ్రహంబుకొఱకుం బార్వతీపాణిగ్రహణంబు గావింపు నిప్రార్థించిరి.

మదనశరవినిర్భిన్నహృదయుం డగుహరుండును సురగణంబుల ...ర్థనంబునకుం దక్షణమందే తనయంగీకారమును సూచించెను. అ ...ము దేవతాగణంబులును, అరుంధతీవశిష్ఠులును, చక్రపాణియగువి ...దేవుండును, నేనును శివునిచే నాజ్ఞాపింపంబడి హిమవంతంబునకుం బోయి ప్రబోధించి పర్వతేశ్వరునకును బరమేశ్వరునకును వియ్యమును గల్పించితిమి.

—♦ గంగోత్పత్తి. ♦—

మునివరులారా! నానారత్నచిత్రితంబును, నానాతరులతాకీర్ణంబును, నానాద్విజగణనిషేవితంబును, నదీనదసరోవరకూపతటాకాది నానాజలాశయపరివృతంబును, దేవగంధర్వసిద్ధచారణాది సకలసుమనోవిహారస్థానంబు నగుహిమాలయము పరమానందనిమగ్నంబై యుండెను. హర్షోత్కర్షంబునకుం బ్రధానకారణంబులగు సుఖసమీరణంబులు వీచుచుండెను. మేరుమందరకైలాసమైనాకాదిగిరినిచయంబు లాహిమ

వంతుని బరివేష్టించి యుండెను. వశిష్ఠాగస్త్యపౌలస్త్యరోమశాదిమహా ర్షులందఱును నచ్చట వేంచేసి యుండిరి. పార్వతీపరమేశ్వరులకల్యాణ మహోత్సవంబు లారంభములయ్యెను. వజ్రస్తంభసమంచితంబును, ముక్తాహారాలంకృతంబును, నానారత్నఖచితంబు నగువివాహవేదిక నిర్మింపఁబడియెను. జయ, లక్ష్మి, శుభ, కాంతి, కీర్తి, తుష్టి మొదలు గాఁగలశోభనదేవతలు వివాహమండపము నలంకరించి యుండిరి. మేరుమందరకైలాసాదిశైలంబులచేతను, స్వయముగ విష్ణుదేవునిచేతను సన్మానింపఁబడి హేమమయుం డగుమైనాకభూధరేశ్వరుండు శోభిల్లు చుండెను.

మహర్షులును, లోకపాలకులును, ఆదిత్యులును, మరుద్గణంబులు ను శూలపాణి యగుమహాదేవుని వివాహమండపమును నిర్మించిరి. విశ్వ కర్మ స్వయముగాఁ గనకమణితోరణమయంబగు కల్యాణవేదికను ని ర్మాణంబు గావించెను. అయ్యాశ్వరేశ్వరుని కల్యాణమహోత్సవసం దర్శనార్థమై సురభి, నందిని, నంద, సునంద, కామదోహిని, సముద్ర ములు, నదులు, నగరాజములు, ఓషధులు, లోకమాతృగణంబు లును, వనస్పతులును సకలదేవతలునుగూడ వచ్చియుండిరి. భూదేవి భూసంబంధక్రియలను, ఓషధు లన్నక్రియలను, వరుణుండు పానక్రి యలను, ధనదుండు దానక్రియలను నిర్వహించుభారమును వహించి యుండిరి. అగ్నిదేవుండు స్వయముగా నభీష్టాన్నంబులఁ బచనము సే యుచుండెను. విష్ణుదేవుండు పూజాకార్యంబుల నిర్వర్తించుచుండెను. సరహస్యంబులగువేదంబులు గానముచేయ నారంభించెను. గంధర్వా ప్సరోగణంబులును, కిన్నరగణంబులును నృత్యగీతహాస్యాలాపంబులఁ గావించుచుండిరి. మైనాకుండు లాజహోమంబునకునియుక్తుం డయ్యెను.

కల్యాణమండపంబునఁ బుణ్యాహవాచనము లారంభ మయ్యె

ను. సురదంపతులు వివాహవేదిక నలంకరించి యుండిరి. అప్పుడు యథావిధిగ నగ్నిప్రతిష్ఠాపనంబును, లాజహోమంబును, నగ్నిప్రదక్షిణంబును సంపన్నంబు లయ్యెను. అనంతరము విష్ణుదేవునిప్రేరణంబున శంభుండు ప్రస్తరస్పర్శనంబు సేయుచు దేవిపాదాంగుష్ఠమును స్పృశించెను.

మునివరులారా ! అప్పుడు హోమకార్యంబుల నిర్వర్తించుచున్న నేను దేవదేవుని సమీపంబున నున్నజగన్మాతయగుపార్వతిం గాంచినంతనే దుష్టబుద్ధివశంబున మదీయం బగువీర్యంబు నిపతితం బయ్యెను. ఆ కారణంబుచే లజ్జాకలుషితుండ నగునేనప్పుడు మద్వీర్యంబు నొక్కచో నిక్షేపించితిని. అమోఘంబగునా తేజమునుండి వాలఖిల్యమునిగణంబు లుద్భూతు లగుటయు దేవతాసంఘంబున హాహాకారంబు పుట్టెను. నేనును లజ్జాక్రాంతహృదయుండనై చటాలునఁ బీఠమునుండి లేచిపోవుటయు దేవతలు మహాశ్చర్యనిమగ్నులై నావంకనే చూడఁదొడంగిరి.

అప్పుడు భగవానుం డగుమహాదేవుం డట్లు పోవుచున్ననన్నుం గాంచి నందీశ్వరునిం బిలిచి నీవుపోయి యవ్విరించి నిటకుఁ దీసికొని రమ్ము ! నేనాతని పాపవిముక్తునిం గావించెద నని యాజ్ఞాపించెను. సాధుసత్తము లపరాధులయెడలఁ గృపార్ద్రహృదయు లయ్యెదరు. విషయంబులు విద్వాంసులకైనను మోహోత్పాదనంబు గావించును— పరమేశ్వరుం డగునుమాపతి నాయెడల నిట్లు ప్రసన్నుండై భూమియును జలంబును పాపమోచనంబునకుఁ బ్రధానోపాయములు. నేనిప్పుడు వానియందలిసారంబును సంగ్రహించెద ననిచెప్పి మహాదేవుండు లోకమంగళంబుకొఱకు భూజలంబులయందలిసారమును దీసి భూసారంబునఁ గమండలునిర్మాణంబు చేసి యందు జలసారమును నిక్షేపించి

పావమాన్యాదిసూక్తంబులచే నభిమంత్రించి యందుఁ ద్రిలోకపావని యగుశక్తిని ధ్యానంబు చేసి నన్నుంగాంచి యోవిరించీ! నీవీకమండ లువును బరిగ్రహింపుము. భూజలదేవతలు జగన్మాతలు. ఉత్పత్తిస్థి తినాశహేతువులు వారియందే ప్రతిష్ఠితములై యున్నవి. జలభూసార మయంబగునీకమండలుమధ్యంబున సనాతనధర్మంబులును, యజ్ఞంబు లును, భుక్తిముక్తులును, స్థావరజంగమంబులును నిలిచి యున్నవి.

ఈజలస్మరణంబున మానసికపాపంబులును, వర్ణనంబున వాచి కపాతకంబులును, స్నానపానాభిషేచనంబులవలనఁ గాయికకలుషంబు లును వినష్టంబు లగును. ఈజగంబునందు జలమే పరమపావనం బగు నమృతస్వరూపము. ఓవిధాతా! నేను దీని నభిమంత్రింబు గావించితి ని. నీవీకమండలువును బరిగ్రహింపుము. ఈకమండలుజలంబుల స్మ రించుటవలనను, గీర్తించుటవలనను మానవులు సర్వాభీష్టసిద్ధు లగుదు రు. కావున నీవు దీనిం గైకొనుము. పంచభూతంబులలో జలమే శ్రేష్ఠం బైనది. అట్టిజలరాశిమధ్యంబున నీకమండలుజలము సర్వోత్కృ ష్టం బైనది. కావున నీవీకమండలువును గ్రహింపుము. శుభకరంబును, బుణ్యదంబు నగునిందలిజలమును స్పృశించుటయు, స్మరించుటయు, సందర్శించుటయుఁ బాపమోక్షణంబునకుఁ బ్రధానసాధనములు. అని బోధించి మహాదేవుండు పరమానుగ్రహంబున నాకాకమండలుప్రదా నంబు గావించెను. అప్పుడు సకలదేవతలును బరమాహ్లాదంబున జయ జయశబ్దంబుల నుచ్చరించుచు దేవదేవేశ్వరుండగు నమ్మహాదేవునుద్దే శించి "సర్వలోకనాథా! మీవివాహోత్సవసమయంబున నీపంకజా సనుండు జగన్మాత యగు దేవిపాదాంగుష్ఠముం గాంచి పాపభావనం బుచేసి పతితుండై నను జగజ్జనకుండ వగునీవాతనిమెడలఁగరుణించి యా తనిఁ బవిత్రుం జేయుటకై స్మరణమాత్రంబున సకలపుణ్యప్రదాయిని

యుఁ బుణ్యమయకమండలునివాసినియు నగుగంగాదేవిని బ్రసాదించి యనుగ్రహించితి వని యనేకవిధంబుల వినుతింప నారంభించిరి.

వామనావతారము.

అని యిట్లు బ్రహ్మదేవుండు చెప్పుటయు నారదుండు దేవా! గంగాదేవి నీకమండలుమధ్యంబున నిల్చి నీపుణ్యవర్ధనంబునకుఁ గారణ మైనది. ఆదేవి మర్త్యధామంబున కెట్లు లభించినదో యానతీయవల యు నని ప్రార్థించెను. అప్పుడు బ్రహ్మదేవుం డిట్లు చెప్పందొడంగెను. వత్సా! పూర్వకాలంబున దేవతలకుఁ బరమశత్రుండై బలినామంబు చే నొకమహాదైత్యుండు చక్రవర్తియై యుండెను. ఆతని కెందును బ రాజయంబు లేదు. ఆతనిమహోన్నతిం గాంచి దేవతలు చింతితులై యందఱు నేకీభవించి యాతని నెట్లయిన జయింపవలయు నని మంత్రా లోచనంబులు సేయ నారంభించిరి.

ఆబలిదైత్యుని రాజ్యశాసనసమయంబునఁ ద్రైలోక్యంబును నిష్కంటకమై యుండెను. ఆతనిపరిపాలనంబునం దాధివ్యాధులు గా ని, శత్రుభయంబులుగాని, ఈతిబాధలుగాని, అధర్మముగాని, అభా వముగాని, ఆర్తనాదములుగాని, దుర్జనోపద్రవములుగాని యెవ్వరికిని స్వప్నంబులందైనను ననుభూతంబులు గాక యుండెను. అప్పుడు దేవ త లాతనిమహోన్నతి యనుశరంబుచే భగ్నచిత్తులును, కీర్తియనుఖడ్గం బుచే ద్విధాకృతులును, శాసనశక్తిచే భిన్నాంగులునై యెందును శాం తి యనుమాటలేక పరితపించుచు నాతని యశఃపావకజ్వాలలచేఁ బ్ర తప్తగాత్రులును, భయవిహ్వలులునై మాత్సర్యవశంబున విష్ణుదేవుని శరణంబు గోరి వచ్చి ప్రార్థనాపూర్వకంబులగుదీనస్వరములతో దేవ దేవా! శంఖచక్రగదాధరా! ఆర్తులమును, గతపత్త్వులము నగుమమ్ముఁ

గటాక్షింపుము. జనార్దనా! నీవు మారక్షణంబుకొఱకే యాయుధధారివైతివి. జగన్నాథా! నీవంటిరక్షకునిప్రాపు గాంచియుండియు మేమిట్టికష్టముల ననుభవింపవలసివచ్చినది. దేవా! నీప్రణామస్తవంబులకు వినియోగింపఁదగినమావాక్కుల నిప్పు డాదైత్యుని నమస్కారస్తవంబులకై యెట్లుపయోగింపఁగలుగుదుము? మేము మనోవాక్కర్మంబులచే భవదేకశరణ్యులమై యున్నాము. మీచరణకమలంబులనాశ్రయించియున్నమే మాదనుజున కెట్లు నమస్కరింపఁగలము? అచ్యుతా! మేమనేకయజ్ఞంబులయందు నిన్నేయర్చించుచు నుదారవచనంబులతో నిన్నేకీర్తించుచుందుము. నీవంటిదేవదేవునియాశ్రితుల మగుమేమాతని నెట్లాశ్రయింతుము. ఇంద్రప్రముఖులగుదేవతలందఱును నీబలమే రక్షణంబుగా నీచే నున్నతపదాభిషిక్తులై యున్నారు. అట్టివారొక్క దైత్యునకుఁ లోఁబడియుండుట యవమానకరము గాదా? నీవుబ్రహ్మరూపివై సృష్టియు, విష్ణురూపివై పాలనంబును, రుద్రరూపివై లయంబును గావించుచుందువు. మేము నీకుభిన్నుండగుదైత్యునకు నమస్కరించుట యెట్లు? దేవా! ఈజగంబునం దైశ్వర్యమే ప్రధానమైనది. అది లేకున్న దో లాభ మేమున్నది? హృతైశ్వర్యులమగుమేమిప్పుడాతని కెట్లు నమస్కరింపఁగలము? ఆదిమధ్యాంతరహితుండవును, జరాచరగురుండవు నగు నీవుండఁగా వినశ్వరుండును, శత్రుండును నగుదైత్యునకు మేము నమస్కరించుటయా? దేవా! మేమందఱమును నీయైశ్వర్యబలంబుచేఁ బరిపుష్టులమై యెప్పటికైనఁ ద్రిభువనవిజయంబు గావించి స్వాస్థ్యలాభంబు నందుదుముగాని యాదైత్యునకు వినతులమై యుండఁగలమా?

అని యిట్లనేకవిధంబుల దేవతలు ప్రార్థించుటయు గదాధరుండు కరుణాళుండై సురవరులారా! దైత్యేశ్వరుండగుబలి మద్భక్తుండు.

ఆతఁడు సురాసురగణంబులకవధ్యుఁడు. ఆబలీంద్రుఁడు నాచే నిగ్రహి
ంపఁదగినవాఁడో యట్లే మీరును బరిభవింపఁదగినవారై యున్నా
రు. నేనెట్టియుద్ధమును గావింపకుండఁగనే యుక్తమైనయుపాయంబున నాత
నిరాజ్యంబును గైకొని బంధించి యారాజ్యమును మీకొసంగెదను.
అని యనుగ్రహించుటయు దేవతలు పరమానందహృదయములతో
నమ్మహాదేవునికడ సెలవుగైకొని నిజనివాసంబులకుం బోయిరి.

అనంతరము భగవానుం డగు పరమేశ్వరుం డదితిగర్భంబునఁ బ్ర
వేశించి యజ్ఞేశ్వరుండును, యజ్ఞపురుషుండు నగునాతఁడు వామనుండై
యవతరించెను. దేవతలందఱును మహోత్సవములఁ గావించుచు ను
త్సాహముతో భావిఫలోదయంబున కెదురు సూచుచుండిరి. అంతఁ
గొంతకాలమునకు బలిశ్రేష్ఠుం డగుబలి యశ్వమేధదీక్షితుం డయ్యె
ను. అనేకులగుమహర్షులు యజ్ఞార్థమై వచ్చియుండిరి. వేదవేదాంగవేది
యగుశుక్రాచార్యుండు పురోహితుం డయ్యెను. ఆతఁడు ఋత్విక్కు-
ర్మనిరతుం డైనంతనే హవిర్భాగహారణార్థమై దేవగంధర్వాదులు లేతెం
చిరి. "దీయతామ్, భుజ్యతామ్" అనుధ్వనులు చెలరేఁగెను. ఈవిధ
ముగా సకలయజ్ఞక్రియలును సంపూర్ణప్రాయము లగుచున్నసమయం
బునఁ బ్రతికుండలమండితుం డగువామనమూర్తి సామగానంబు సేయు
చు యజ్ఞశాలం బ్రవేశించి యయ్యజ్ఞంబునుగూర్చి యనేకవిధములఁ
బ్రశంసించెను.

అప్పుడు భృగునందనుం డగుశుక్రాచార్యుండు దైత్యాధినాథ
నుండును, బ్రహ్మరూపధరుండు నగునవ్వామనమూర్తిం గాంచి యా
తఁడే సకలయజ్ఞంబులకును, దపంబులకును ఫలదాత యనియు, రాక్ష
సకులంబునకు నిహంత యనియు స్పష్టముగా గ్రహించెను. తోడనే
యాతఁడు సంభ్రమముతో విజయుండును, బలిశ్రేష్ఠుండును, దానశీ

లుండును, సత్రస్త్రుండును, యజ్ఞదీక్షితుండు నగుబలిచక్రవర్తిం గాంచి యోరాజా! వామనాకృతి యగువిప్రపుత్రుండు నీయజ్ఞశాలం బ్రవేశించియున్నాఁడు. ఈతఁడు నిజముగా బ్రాహ్మణుండు గాఁడు. యజ్ఞవాహనుండును, యజ్ఞేశ్వరుండు నగువాసుదేవుఁడే దేవహితార్థమై యదితిగర్భంబున శిశురూపంబున నుదయించి యీవిధముగా నిప్పుడు నిన్ను యాచించుటకై వచ్చియున్నాఁడు. కావున నోప్రభూ! శాంతో నాలోచింపకుండ నీవితని కిట్టిదానంబును గావింపవలదని బోధించెను.

అరిందముం డగుబలిచక్రవర్తి యాచార్యునివచనంబులాకర్ణించి గురువరా! యజ్ఞేశ్వరుఁడే యీరీతిగా నవతరించి మద్గృహంబునఁ బ్రవేశించుటచే నేను ధన్యుండనైతిని. అతఁ డేమివాంఛించునో దాని నొసంగుట కింకను నాలోచన లేల? అని చెప్పి సతీపురోహితసహితుండై వామనమూర్తి కూర్చుండియున్నతావునకుం బోయి ప్రణామంబు చేసి చేతులు జోడించుకొని నిలిచి మహాత్మా! నీకేమికావలయునో యర్థింపుమని కోరుటయు వామనుండు పదత్రయపరిమితంబగుభూదానముకంటె నాకన్యవాంఛితం బేదియును లేదని చెప్పెను. బలిచక్రవర్తియుఁ దక్షిణము మణికలశంబునందలి జలంబులచే ధారాపూర్వకంబుగ నవ్వామనదేవునకు మూఁడడుగులభూమిని దానము చేసెను.

సమస్తమహర్షిగణంబులును, స్వయముగఁ బురోహితుండగు శుక్రాచార్యుండును, ప్రధానులగుదైత్యగణంబులును జూచుచుండఁగనే వామనమూర్తి కావిధముగా భూదానము గావింపఁబడియెను. అప్పుడు వామనమూర్తి మృదుమధురస్వరంబుతో స్వస్తివచనంబుల నుచ్చరించుచు రాజా! నీవు సుఖవయ్యెదవుగాక! నాభూమిని నాకు సంప్రదానంబు సేయుము. నేను పోవలయుననుటయు బలీంద్రుం డిట్లే

యని చెప్పి యూతనివంకఁ దిలకించుచు నిలువఁబడియెను. అట్లు చూచుచుండఁగనే వామనుండు విరాణ్మూర్తిధారణముం గావించి చంద్రసూర్యులు స్తనాంతరాళంబునను, గగనంబు మస్తకంబునను నిలుచు నంతటిదూరంబుగాఁ బెరిఁగి నిలిచెను. యజ్ఞపురుషుండును, అచ్యుతుండు నగునాతనివిక్రమాకృతి కంతంబు లేకుండెను.

అప్పుడు దైత్యేంద్రుండగు బలి పత్నీసహితుండై యమ్మహాదేవునకుఁ బ్రణామంబు చేసి వినయమధురభాషణంబులతో శ్రీహరీ! జగన్నాథా! విష్ణుదేవా! నీవు నీశక్త్యనుసారంబుగా నీయిచ్చవచ్చినంతదూరమువఱకును నీపదంబులచే నాక్రమింపుము. దేవా! ఆకారణంబుచే నేనుగూడ నెల్లవిధంబుల మహోన్నతపదలాభంబు నందఁగలుగుదును. అని విజ్ఞాపనంబు చేయుటయు మహాక్రతుమూర్తియగు విష్ణుమూర్తి యట్లే యని చెప్పి కూర్మపృష్ఠంబువఱకు గలయధోలోకంబు లన్నియు నేకపాదంబుచేతను, బ్రహ్మలోకపర్యంతముం గల యూర్ధ్వలోకములన్నియు నేకపాదంబుచేతను నాక్రమించి యసురేశ్వరా! నాతృతీయపాదంబు నుంచుటకు స్థానం బెచ్చట నున్నది? ఈసమస్తప్రపంచమును నా రెండడుగులకొలతకు సరిపోయినది. నీవన్నయట్లుగా మూఁడవయడుగునకుఁ దగినతావు నొసంగుమని యడిగెను.

అంత బలిదానవేంద్రుండు మందహాసంబు సేయుచు దేవాదిదేవా! నేను సృష్టికర్తను గానుగదా! ఈవిశ్వంబంతయును నీచేతనే కల్పింపంబడినది. జగన్మయా! నీదోషంబుచేతనే యిది యంతయు నల్పంబై పోయినది. ఇట్టిచో నేనేమి చేయుదును? కేశవా! అయినను నేనెన్నటికి నసత్యమాడువాఁడను గాను. కావున నీమూఁడవపదంబును నాపృష్ఠమునం దుంచి నన్ను సత్యప్రతిజ్ఞునిగా ననుగ్రహింపుమని ప్రార్థించుటయు వేదమూర్తి యగుభగవానుండు ప్రసన్నుండై

త్యరాజా! నీనిర్మలభక్తిభావంబునకు నేను ప్రీతుండనైతిని. నీయభీష్టవరప్రదానంబు గావించెద నర్థింపు మని గ్రహించెను.

కాని బలిచక్రవర్తి యట్టివరంబును గోరుకొనఁడయ్యెను. అప్పుడు జగన్నాథుండును, త్రివిక్రముండు నగువిష్ణుదేవుండు సంతోషించి యమ్మహాదానశీలుండగు నసురేశ్వరునకు రసాతలాధిపత్యంబును, అత్యాధిపత్యంబును భావికాలంబున నింద్రపదంబును, అవినశ్వరం బగు మహాయశంబును బ్రసాదించి సస్త్రీకుం డగుబలిదానవేంద్రుని రసాతలరాజ్యసింహాసనంబునఁ బ్రతిష్ఠించి యథాపూర్వంబుగా స్వర్గరాజ్యమును దేవేంద్రునకుఁ గరగతంబు గావించెను.

—♦ గంగాదేవికి హరజటాజూటప్రాప్తి. ♦—

అని చెప్పి జలజసంభవుండు మరల నిట్లు చెప్పం దొడంగెను. నారదా! ఆసమయంబున మజ్జనంబునకుఁ గారణుం డగువిష్ణుదేవుని సకలదేవతార్చితం బగుద్వితీయపాదము మదీయం బగు మందిరంబు నలంకరించుటయుఁ ద్రిభువనప్రశస్తం బగునవ్విష్ణుపాదము నేవిధముగా నర్చింపవలయునని భావించుచు నేనివిశ్వంబంతయును బరికించితిని. అప్పుడునాకు సకలవస్తునిచయంబులకంటెను నాకమండలువే పవిత్రంబైనదనియుఁ, ద్రిపురాసురారి యగుదేవదేవునిచే నిక్షేపింపఁబడినయందలి జలమే పవిత్రతమంబనియు నిశ్చయంబుగాఁ దోఁచుటయు వరంబును, వరణీయంబును, వరదంబును, శాంతికరంబును, పరమంబును, శుభంబును, శుభదంబును, నిత్యంబును, భుక్తిముక్తిప్రదంబును, మాతృస్వరూపంబును, భవరోగామృతౌషధంబును, పవిత్రంబును, పావనంబును, పూజ్యంబును, జ్యేష్ఠంబును, శ్రేష్ఠంబును, గుణాన్వితంబును నగు మదీయకమండలుజలంబుచే ముందుగ నేనుపవిత్రుండనై మజ్జనకుండను

విష్ణుదేవున కర్ఘ్యకల్పనంబు గావించితిని.

నేనట్లు కమండలుజలంబు నతిపవిత్రంబుగా భావించి యర్ఘ్యసంకల్పంబు గావించినంతనే కమండలుగర్భమునుండి సుమంత్రితంబగు నర్ఘ్యజలంబు వెలువడి యావిశ్వమూర్తిచరణకమలంబు నభిషేకించుటయు నవ్వారిధార క్రమముగా మేరుశైలశిఖరంబునఁ బతితంబై నాల్గుభాగములుగా విభక్తంబై భూతలంబునఁ బూర్వదక్షిణపశ్చిమోత్తరదిశల ననుసరించి ప్రవహింపఁదొడంగెను. అప్పుడు దక్షిణముగాఁ బ్రవహించుచున్నజలధారను మహేశ్వరుండు తనజటాజూటంబున ధరియించెను. పశ్చిమవాహిని మరల మత్కమండలుమధ్యంబుననే ప్రవేశించెను. ఉత్తరవాహినిని విష్ణుదేవుండు పరిగ్రహించెను. సుఖప్రదంబగు పూర్వవాహినిని మహర్షులును, పితృగణంబులును, లోకపాలకులును బరమాదరంబున స్వీకరించిరి. అందుచేతనే యాజలంబునకు శ్రేష్ఠత్వంబు గలిగెను.

విష్ణుపాదంబునుండి విగళితంబై దక్షిణాభిముఖంబుగఁ బ్రవహించి మహాప్రభావసంపన్నుండగుమహేశ్వరునిజటాజూటంబు నలంకరించియున్న జగత్పవిత్రంబగువారిధారయే సకలలోకంబులకును మాతృస్వరూపంబైనది. ఆదివ్యగంగాప్రభావమును స్మరించినంతమాత్రముననే సర్వాభీష్టంబులును సిద్ధింపఁగలవు.

గౌతమచరిత్రము.

వత్సా ! నారదా ! మహేశ్వరజటాజూటంబు నలంకరించి విరాజిల్లుచున్న త్రిలోకపావనియగు గంగాదేవి యిరువురు మహాపురుషుల వలన రెండుభాగములుగా భూతలంబునకుఁ దీసికొనిరాఁబడియెను. అందొకభాగమును గౌతముఁ డనునొకబ్రాహ్మణుఁడు వ్రతదానజపతపం

బులచే మహేశ్వరు నారాధించి తత్ప్రసాదంబుచే భూమండలమునకుఁ గొనితెచ్చెను. రెండవభాగంబును మహాబలవంతుండగు భగీరథుం డనురాజేంద్రుండు తపోనియమంబులచే శంకరునిమెప్పించి తదనుగ్రహంబున నవనీతలంబునకుఁ గొనితెచ్చెను. ఈరీతిగా గంగాదేవికి ద్వైరూప్యంబు సంకల్పితం బయ్యెను. ఆచరిత్రంబు సవిస్తరంబుగాఁ జెప్పెద నాకర్ణింపుము.

ఉమాదేవి మహేశ్వరున కర్ధాంగియై యాతని కనంతప్రణయినియై యున్నసమయంబునందే గంగాదేవికూడ నాదేవదేవుని యమూల్యప్రేమలాభముం గాంచెను. పూర్వము గౌరీకల్యాణసమయంబున నాయెడలం గలిగినమనఃకాలుష్యంబు కారణంబుగా సంభవించిన నామహాదోషమును నివారణంబు గావించుటకై దీనదయాపరుండును, శ్రీమంతుండు నగుశివుండు చింతాన్వితుండై పార్వతీదేవివంక దృష్టిప్రసరణంబు గావించుచు విశేషరూపంబున రసవృత్తి నవలంబించుటయు సమ్మహాదేవునియం దత్యుత్తమంబగురసోదయం బయ్యెను. అట్టిరసస్వరూపిణి యగుగంగాదేవియందు రసికత్వమును, ప్రియత్వమును, స్త్రీత్వమును, పావనత్వమును విశేషించి యుండుటం జేసి యాపరమేశ్వరున కన్నిటికంటెను గంగాదేవియే యధికప్రియపాత్రురాలై యుండెను. కావుననే యద్దేవదేవుం డాదేవిని నిరంతరమును ప్రేమతో భావించుచుండును. మఱియుఁ గొండొకకారణంబున గంగాదేవి యాశంకరుని జటాజూటంబునఁగూడ నుత్పన్నం బయ్యెను. ఈశ్వరేశ్వరుండగుశివుం డాగంగాదేవి నతిగోపనంబుగా జటాజూటమధ్యంబున ధరించి యుండెను.

అట్లు శివజటాజూటంబున నిత్యానపాయినియై విరాజిల్లుచున్న గంగాభవానిం గాంచి భవానీదేవి యెంతమాత్రమును సహింపఁజాల

క నిరంతరమును జింతించుచుండెను. మఱియు నయ్యుమాదేవి యమి
ర్షవశంబున నప్పుడప్పుడు గంగను బరిత్యజింపవలయు నని గంగాధరు
నింగూర్చి యనేకవిధముల బలనంతపఱుచుచుండెను. కాని రసికశేఖ
రుండగు శంభుండుమాత్రి మేవిధముచేనైనను రసపరిత్యాగంబు సేయఁ
జాలక గంగాదేవి నట్లే జటాజూటమధ్యమునందు రహస్యముగాఁ దా
ల్చి యుండెను.

భవానీదేవి యిదియంతయుం గాంచి విచారించి యొకప్పు డే
కాంతముగా నుండి గజాననస్కందులను, జయను బిలిపించి వారితో
నిట్లయెను. చూచితిరా! కాముకుండగు కైలాసనాథుం డెంతచెప్పినను
గంగను విడువఁజాలకున్నాఁడు. ఆగంగ చంద్రశేఖరున కేకాంతప్రి
యురాలై యుండుట నామనశ్శల్యంబుగా నున్నది. ఇఁక నయ్యిరువు
రి సంబంధమునకును శాశ్వతవిభేదముం గల్పించుట కుపాయ మేమి
యుం దోఁచకున్నది. అనియనేకవిధంబుల వారితో మంత్రాలోచనం
బు సేయుచు వినాయకు నుద్దేశించి వత్సా! నాప్రాణేశ్వరుం డగుశం
కరుండు గంగను నెత్తిపైఁబెట్టుకొని నిరంతరము నాదరించుచుండుట
నాకు విచారకరముగా నున్నది. దేవాసురయక్షగంధర్వాదులును, మ
ఱియే యితరరాజన్యులును, మీరును, నేనునుగూడ నెంతప్రయత్నిం
చినను మహేశ్వరుండా గంగను బరిత్యజించునని తోఁచుట లేదు. కా
వున నేను మరల హిమాలయంబునకుం బోయి నాయుద్దేశముసిద్ధించుట
కై ఘోరతపంబు గావింపవలసియున్నది. అట్లు గాదేని మహాపుణ్య
మూర్తి యగుబ్రాహ్మణుం డెవ్వఁడైన దారుణతపంబు చేసి శంకరజ
టాజూటంబు నలంకరించి యున్న యాగంగనర్థించి భూతలంబున కవ
తరింపఁజేయుటకైనఁ బ్రయత్నింపవలయును.

అని చెప్పుటయు విఘ్ననాయకుండు తల్లివచనంబుల నాలకించి

అమ్మ! ఈవిషయంబున నన్నయు, నేనును, జయయును బాగుగ నాలోచించి కర్తవ్యంబు నిశ్చయించి మజ్జనకుండు గంగాదేవిని బరిత్యజించునట్టివిధానంబు గావించెదను. నీవీవిషయంబు నింక విచారింపవలదని నివేదించుటయుఁ బార్వతీదేవి యూఱడిల్లి యక్కార్యభారమును వినాయకునియందుంచి నిశ్చింతురాలై యుండెను.

ఇట్లుండ మర్త్యలోకంబునఁ బదునాలుగు వత్సరంబులపర్యంతము నతిఘోరం బగు ననావృష్టిసంభవించుటయు, స్థావరజంగమాత్మకంబగుజగంబంతయును దల్లడిల్లిపోవుచుండెను. అట్టివిపత్సమయంబునందుఁగూడ ధర్మనిష్ఠుం డగుగౌతమమునీంద్రుని సర్వకామప్రదంబగు పుణ్యాశ్రమంబున నెట్టికష్టంబును గానరాకుండెను. పూర్వకాలంబున నేను సమస్తప్రపంచమును మరలసృష్టింప సంకల్పించి దేవగిరియందొకమహాయజ్ఞమును గావించితిని. అందుచే నాశైలేంద్రమునకు బ్రహ్మగిరి యనునామంబు విఖ్యాతం బయ్యెను. గౌతమమునీంద్రుం డాపర్వతరాజము నాశ్రయించి సర్వదా నివసించుచుండెను.

ఆబ్రహ్మగిరియందలి మంగళమయంబును, బుణ్యమయంబు నగునమ్మునీంద్రుని పావనాశ్రమంబున నాదివ్యాధులును, దుర్భిక్షంబును, అనావృష్టియు, శోకభయంబులును, దారిద్ర్యదుఃఖంబులును గానరాకుండెను. అయ్యనావృష్టిసమయంబున నాతనిపుణ్యాశ్రమమునందు దక్క మఱియెందును హవ్యకవ్యాదులు లేకుండెను. ఆగౌతమమునీంద్రునివంటిదాతలును, హోతలును, యజ్వలును, మఱియెందును లేరు. ఆకాలంబున గౌతముని సత్కార్యంబులచే స్వర్గస్థితు లగుసకలదేవతలును సంప్రీతు లగుచుండిరి. అందుచే దేవమానవలోకంబులయందంతటను గౌతమునిపవిత్రనామము సంకీర్తితం బగుచుండెను. అప్పటిమానవసంఘమునం దాతఁడొక్కఁడే నిరంతరాయముగ స్వధర

రతుఁడై! విరాజిల్లుచుండెను.

క్రమముగా సకలాశ్రమవాసులగు మునీంద్రులకందఱకును గౌతమునిమహాప్రభావముం గూర్చి తెలియవచ్చుటయు వారందఱును గలసి వెదకికొనుచు నయ్యాశ్రమంబునకు వచ్చి యమ్మునీంద్రునియాశ్రయముం గాంచి సుఖోపవిష్టులై యుండిరి. గౌతముండును వారినందఱ నాదరించి కొందఱిని శిష్యులవలెను, గొందఱిని బుత్రులవలెను, గొందఱిని దండ్రులవలెను భావించి యుచితరీతిని బరిపోషించుచుండెను. ఎవ్వరు దేనిని వాంఛింతురో, దేని గైకొందురో, దేనిననురూపముగ భావింతురో యట్టిభోజ్యపదార్థములన్నియు వారికి సమర్పించుచు గౌతముండు తనయాశ్రమసమాగతులగు మునీంద్రులందఱకు ననేకవిధంబులఁ బరిచర్యలం గావించుచు సర్వదా సంతృప్తులఁ గావించుచుండెను. ఆగౌతమమునీంద్రునియాదేశముచే నోషధులన్నియును దల్లులం బోలి యాశ్రమవాసులనందఱను నిత్యమును దనియించుచుండెను.

ఆసంయమీంద్రుండు త్రిమూర్తులను నిరంతరము నారాధించుచుండెను. ఆతనితపఃప్రభావముచే నోషధులన్నియు నేకకాలమునందే మొలకలెత్తి ఫలించి భావిఫలంబులకై మరల నంకురితంబు లగుచుండెను. అందుచే నాతనికి సకలాభీష్టపదార్థములును సర్వదా సంసిద్ధము లగుచుండెను. గౌతముండును బ్రతిదినంబును దనయాశ్రమవాసులక్షేమమును బరిశీలించుచుఁ బ్రియపూర్వకంబుగ వారి నాదరించుచుఁ జాలకాలమువఱకు నందఱను స్వకుటుంబములోనివారిగా భావించి పోషించెను. సకలమునిజనంబులు నీవిధముగా నాతనియాశ్రమంబున సంతర్పితులగుటంజేసి మునిసార్వభౌముం డగుగౌతమునికీర్తి క్రమముగాఁ ద్రిభువనవిఖ్యాతం బయ్యెను.

అప్పుడు వినాయకుండు తల్లిని గుమారుని జయను నొక్కచోఁ

జేర్చి యాలోచించి తల్లీ! దేవభవనంబున నిరంతరమును గౌతమమునీంద్రునిదివ్యప్రభావము సంకీర్తింపఁబడుచున్నది. దేవతల కసాధ్యంబు లగుకార్యములనుగూడ సాధించుట కాతపోధనుండు సమర్థుం డని నేను విని యుంటిని. మహాతపోబలసంపన్నుం డగునాగౌతముం డెట్లయినను బరమేశ్వరు నారాధించి సంప్రీతుం గావించి యద్దేవదేవుని జటాజూటవిహారిణి యగుగంగాదేవిని భూతలంబున కవతరింపఁజేయఁ గలఁడని నాకు సంపూర్ణమగు విశ్వాసమున్నది. కావున నాతం డెట్లైన గంగకొఱకు గంగాధరుని బ్రార్థించునట్టియుపాయము నాలోచించి యట్టిప్రయత్నముం గావించుట మనకిప్పు డవశ్యకర్తవ్యము. ఆతని మూలముననే గంగాదేవి భూతలంబున కవతరింపఁగలదు.

అని విన్నవించి వినాయకుండు జననియనుగ్రహంబు వడసి యప్పుడే బ్రహ్మసూత్రధరుండును, గృశశరీరుండు నగు గౌతమమునీంద్రుని యాశ్రమంబునుగూర్చి ప్రయాణంబు సాగించి యథాకాలంబున నయ్యాశ్రమంబును జేరి యచ్చటిమునిగణంబులతోఁ గలసి తానును గొంతకాలం బందుండి యొకనాఁ డమ్మునివరుల నందఱం బిలిచి విప్రశేఖరులారా! చిరకాలమునుండి మనమీయాశ్రమంబున గౌతమమునియనుగ్రహంబుచే నెట్టికొఱంతయును లేకుండఁ గాలక్షేపము గావించి యున్నాము. ఇఁక మనము స్వస్థానంబులకుం బోవుట యుచితవిధానంబై యున్నది. కావున మనల నింతకాలంబు సంతసమున నాదరించి పోషించిన గౌతమమునీంద్రునకు మనయుద్దేశముల నెఱింగించి యాతనికడ సెలవు గైకొని పోవుదము. అని ప్రబోధించెను.

ప్రజ్ఞానిధియును, సకలసమ్మతుండు నగువిఘ్ననాయకునివచనంబుల కమ్మునివరులందఱు నంగీకరించి తమప్రయాణముంగూర్చి గౌతమున కెఱింగించుటయుఁ బ్రేమమయుం డగునమ్మునీంద్రుండు వారి

శోకము సమ్మతింపక మునిశ్రేష్ఠులారా! నేను కృతాంజలినై వినయ భావంబున మీయందఱకును జరణశుశ్రూషలం గావించెదను. పుత్త్రి తుల్యుం డగునావంటిపరిచారకుం డిందుండఁగా మీవంటిభూసురాగ్రేసరు లన్యాశ్రమంబునకుం బోవుట యుచితంబు గాదు. మీనివాసంబుచేతనే పుణ్యమయంబై యున్నయీయాశ్రమము మీదేయని భావింపుఁడు. ఎల్లవిధంబుల స్వకీయంబై యెందును గొఱంతలేకయున్న యీయాశ్రమంబును విడిచి మీరన్యస్థలమునకుం బోవలసినయావశ్యకత యేమున్నది? కావున నాయెడల ననుగ్రహించి మీరందఱు నిందే సుఖంబుగ నివసించి యుండుఁడని ప్రార్థించెను.

ఇట్లు చెప్పుచున్నగౌతముని ప్రశాంతవినయమధురవచనంబుల నాలకించి గణేశ్వరుండు తనప్రధానకార్యంబున కంతరాయంబు తట స్థింపనున్నదని విచారించి మరల నాబ్రాహ్మణులనందఱ నొక్కచోఁ జేర్చి మునివరులారా! మనమందఱమునుగూడ నీగౌతమున కన్నదాసుల మైపోయితిమి. ఇట్టిమనలను స్వార్థపరుం డగుగౌతముం డూరక విడిచిపుచ్చునా? మఱ యెట్లు సామవచనంబులచే నాతనియనుమతిం బడసి స్వస్థానంబులకుఁ బోవఁజాలము. ఇంతకాలంబువఱకును మనల నెల్లవిధంబులఁ బోషించిన ద్విజశ్రేష్ఠుండగు గౌతముండు దండార్హుఁడు గాఁడుగదా! అందుచేతనే యీతని నెట్లయినఁ దప్పించుకొనిపోవుటకు నాకొకయుపాయంబు దోఁచుచున్నది. మీరందఱు నంగీకరించినచో నేనట్టికార్యంబు నిర్వహించుటకుఁ బ్రయత్నించెద నని చెప్పెను.

అప్పుడమ్మునివరులందఱును వినాయకుని యాలోచనంబున కంగీకరించి మహాత్మా! సాధుసత్తముండగు నీగౌతముమునీంద్రునకును, సకలలోకంబులకును, సమస్తబ్రాహ్మణసంఘంబులకును శ్రేయోలాభం

బు సిద్ధించునట్టి పరమోపాయంబును గావింతుము. అని ప్రార్థించుట యు గణేశ్వరుండు భూసురేంద్రులారా! పుణ్యచరిత్రులగు నీగౌతమ మునీంద్రునకు మహోపకారం బగునట్టిమార్గమునే యనుసరించెద నని చెప్పి వారినందఱను మఱునాటికిని సమ్మతింపఁజేసి యీబ్రాహ్మణప్ర వరులకందఱకును బ్రణామంబు చేసి జగజ్జననియగు నిజజననికార్యం బును నిర్విఘ్నంబుగా నిర్వహింప నిశ్చయించి జయం బిలిచి యోశు భానవా! నీవితరు లెవ్వరికి నెఱుంగరానివిధంబున నొకయుత్తమకార్యం బును దీర్పవలయును. నీవు గోరూపధారిణివై గౌతమాశ్రమంబునఁ బ్రవేశించి విశృతరూపంబున నందలిసస్యక్షేత్రమును విధ్వస్తంబు గావిం చుచుండుము. ఆసమయంబు నెవ్వఁడువచ్చి నిన్నొకచిన్నదెబ్బకొట్టిన ను దోడనే యంబా యని యఱచుచు జీవితావస్థయును, మృతావస్థ యును గాని భావముతో నీవు నిలిచినచోటనే కూలఁబడిపోవలయును.

అని బోధించుటయుఁ బార్వతీప్రియపరిచారిక యగుజయాదేవి వినాయకునిమతంబు ననుసరించి గోరూపముం దాల్చి గౌతమమునీంద్రు నిశాలిక్షేత్రంబునఁ బ్రవేశించి యందలిసకలసస్యంబులను భక్షించుచు యథేచ్ఛావిహారంబు సేయుచుండెను. విప్రవరుం డగుగౌతముండు విశృ తాకారంబుననున్న యాధేనువుం గాంచి యదలించి యొకజీర్ణతృణం బుతోఁ బ్రహరించుటయుఁ దక్షణమందే చీత్కారంబు సేయుచు నా యావుభూపతితంబై పోయెను. ఇట్లాగోవు కూలఁబడిపోయినంతనే బ్రా హ్మణసంఘంబునం దొక్కపెట్టున హాహాకారంబుపుట్టెను. అప్పుడు బ్రాహ్మణులందఱును వినాయకపురస్సరంబుగా గౌతమునిచెంత కరుదెం చి ఓమునిపుంగవా! మేమింక నీయాశ్రమంబున నిలువఁజాలము. మే మన్యస్థానంబులకుం బోయి నివసించి యుండెదము. ఇంతకాలంబువఱ కును నీవు మమ్మందఱను బుత్త్రులంబోలి పరమాదరంబునఁ బరిపాలిం

చితివి. కావున మేమిప్పు డేకగ్రీవముగా నీయనుమతికొఱకుఁ బ్రార్థించుచున్నాము.

అని మునివరులందఱు నేకవాక్యంబుగాఁ బలుకుటయు గౌతమ మునీంద్రుండు వజ్రాహతంబగు ఘోరమహాగజకుంభస్థలి నిశ్చేష్టుండై [illegible] యు నయ్యబ్రాహ్మణులయెదుట నిలువునఁ గూలఁబడిపోయెను. అప్పుడు బ్రాహ్మణులందఱును సాంత్వనవచనంబులతో మునీంద్రా! చూచితివా! రుద్రజననియు, జగత్పావనియు నగుగోదేవి నీచవిత్రాశ్రమంబునఁ బడిపోయినది. తీర్థదేవతాస్వరూపిణి యగు గోమాత యిందుఁ బతితయైపోవుట కారణంబుగా మేమిటనుండి వెడలిపోవుటయే యవశ్యకర్తవ్యం బైనది. ఇంకను మేమియ్యాశ్రమము నందే నివసించి యుంటిమేని మాయొనరించుసత్కర్మానుష్ఠానంబు లన్నియును నిష్ఫలంబులై పోవును. కేవలతపోధనంబుకంటె మాకిక నన్యంబగుధనం బేమున్నది? అదియే మాకుఁ బ్రధానంబైనది.

అని మునివరులందఱు నేకవాక్యంబుగాఁ బలుకుటయు మునివరుండగుగౌతముండు వారియెదుట వినయవినమితుండై నిలిచి మహాత్ములారా! మీరందఱు నిప్పుడు నాకు సహాయులై నిలిచియుండి నన్నెట్లో పవిత్రునిం గావింపుఁడు. అని ప్రార్థించుటయు బ్రాహ్మణపరివృతుండును, భగవానుండు నగువిఘ్నేశ్వరుం డప్పుడు గౌతముం గాంచి సంయమీంద్రా! ఈధేనువిప్పుడు మరణించునో, జీవించునో యెట్లు నిశ్చయించుటకు నవకాశము గానవచ్చుట లేదు. ఇట్టిస్థితిలో నీపాపకార్యంబునకు నిష్కృతినిగాని, గతిని గాని నిర్ణయించి చెప్పుట కుపాయ మేమున్నది? అని ప్రశ్నించుటయు గౌతముండు మహాత్మా! నేనేమిచేసినచో నీధేనువు జీవించి మరల లేచునో, ఎట్టిప్రాయశ్చిత్తంబువలన నాపాపంబునకు నిష్కృతిలాభం బగునో దయయుంచి నిర్ణయిం

చుటకు మీకంటెను సమర్థులగువా రెవ్వరున్నారు? నాయెడల ననుగ్రహించి యిట్టిదోషాపనోదనంబునకై మీరువిధించినకార్యమును మనఃపూర్వకంబుగా నిర్వహించుటకు నేను సంసిద్ధుఁడనై యున్నాఁడను.

అని యీవిధముగాఁ దపఃప్రభావసంపన్నుఁడును, శాంతమూర్తియు, సచ్చరిత్రుఁడు నగుగౌతముఁడు ప్రార్థించుటయు బ్రాహ్మణరూపధరుండగువినాయకుం డాతనిం గాంచి గౌతమమునీంద్రా! నేనిమ్మునివరులమతంబుల ననుసరించి యొకయుపాయమును జెప్పుచున్నాను. దీనిని నీవును వీరునుగూడ నంగీకరించి తీర్పవలయును. అవ్యక్తుండగు బ్రహ్మదేవునికమండలుమధ్యగతంబగుజలంబు మహేశ్వరజటాజూటము నలంకరించియున్నవిషయము మనమందఱము నెఱింగియే యున్నాము. మునివరుండ వగునీవు మహాతపంబు గావించి నియమపూర్వకంబుగ నాజలము నిచ్చటికిం దెచ్చి భూపతితయైయున్న యీగోమాత నభిషేకింపఁగలిగినచో నెల్లవిధంబులఁ బరిశుద్ధుండవు గాఁగలవు. అప్పు డెట్టిసంకోచంబును లేక మేమందఱమును నీయాశ్రమంబున నివసించి యుందుము. అని వినాయకుండు చెప్పినంతనే స్వర్గమునుండి విజయధ్వనులు చెలరేఁగెను. పుష్పవర్షంబు గురిసెను.

అంత గౌతముండు కృతాంజలియై భూసురవరులారా! మదీయం బగుతపోబలంబుచేతను వైశ్వానరుని యనుగ్రహంబుచేతను, బ్రాహ్మణ్యులకృపారసంబుచేతను, మీయందఱప్రసాదంబుచేతను నాయుత్తమసంకల్పం బవశ్యంబుగ సంసిద్ధం బగుఁగాక! యనుటయు బ్రాహ్మణులందఱు నట్లే యగుఁగాక యని యేకవాక్యంబుగాఁ బలికి గౌతముని యనుమతివడసి యన్నజలసమృద్ధంబు లగుతమతమయాశ్రమంబులకుం బోయిరి. గణనాథుండును గృతకృత్యుండై జయాసహితంబుగ వెడలిపోయెను. మునిప్రవరుం డగుగౌతముండు నిజతపోబలంబుచే

నిష్పాపుండై యావిచిత్రసంఘటనముంగూర్చి యనేకవిధంబులభావించి ముహూర్తమాత్రంబున జ్ఞానదృష్టిచే సర్వంబును గ్రహించి యాత్మపాపనోదనమిషంబున దేవకార్యసాధనంబును, గౌరీదేవి కభీష్టసంపాదనంబును, సకలలోకోపకారంబు నగునని నిశ్చయించి గంగానయనం బెల్లవిధంబుల శ్రేయస్కరంబని భావించి తనకెట్టిపాపంబును నిజంబుగ సంభవింపలేదని యెఱింగి ప్రీతుండై త్రిలోచనుండగు వృషభవాహనుండును, జగత్పతియు నగుదేవదేవు నారాధించుటకై యాబ్రహ్మగిరి నుండి సకలసురాసురసంపూజితంబును, ఉమామహేశ్వరసంశోభితంబు నగుకైలాసశైలంబునకుఁ బ్రయాణ మయ్యెను.

గౌతమ్యానయనము

వత్సా! నారదా! ప్రకృష్టజ్ఞానసంపన్నుం డగుగౌతమమునిచంద్రుం డట్లు కైలాసంబుఁ జేరి మౌనియై కుశాస్తరణంబున శుచియై యుపవసించి యీవిధంబునస్తోత్రము సేయ నారంభించెను. ఈశ్వరా! నీవు భోగార్థులగుజీవుల కభీష్టభోగప్రదానంబు సేయుటకై గుణవంతంబులును, మహత్తమంబులు నగుఅష్టమూర్తులను ధరించి యుంటివి. సోమమూర్తివగు నిన్నెల్లరును సర్వదామహాదేవనామంబున సంకీర్తనంబు సేయుచుందురు. సకలలోకసుఖసంపాదనంబుకొఱకును, సమస్తచరాచరభరణంబుకొఱకును, సంపదభివృద్ధిసంపాదనంబుకొఱకును మహేశ్వరుండ వగునీవు మహీమయరూపంబుల విరాజిల్లుచుందువు. దేవా! నీవు జలస్వరూపుఁడవై సృష్టిస్థితిలయంబులను గల్పించుచు భూమండలంబున కాధారుండవై యుందువు. శివుండవు, శాంతస్వరూపుండవును నగునీవు లోకంబులకు శర్మధర్మంబులను బ్రసాదించుచుందువు. దేవా! ఈజగంబంతయును నీచేతనే ప్రతిష్ఠితం బైనది. చంద్రార్క

మయం బగునీరూపము కాలవిభాగంబును, అమృతవర్షణంబును, సృష్టిస్థితివినాశంబులను, గావించుచు జీవులకు హర్షసౌఖ్యోన్నతులను కల్పించుచుందువు. త్రిలోచనా! నీవు వృద్ధి, గతి, శక్తి, జీవవ్యవస్థప్రమోదంబులను, బ్రసాదించుటకై వాయుమూర్తివై యుందువు. కాని వస్తుతః నీ వాత్మైకవేద్యుండవు. నీదివ్యతత్త్వము నెఱింగినవా రెవ్వరును లేరు. దేవా! నీవు వ్యోమమూర్తివై విరాజిల్లుచుందువు. కార్యంబులును, ధర్మంబులును, దిక్కులు, నంతరిక్షంబును, ద్యావాభూములును, భుక్తిముక్తులును మఱియేవియు నీకంటె నన్యంబులు గావు. ధర్మవ్యవస్థకొఱకు ఋగ్యజుస్సామంబులను తదితరంబు లగు వివిధవేదశఖలను, వివిధలౌకికగాథలను, శ్రుతిస్మృతిపురాణాదులను,వివిధశాస్త్రములను విభాగించి, అందు నీవు శబ్దస్వరూపధారివై యుందువు. శంభూ! యష్టయు, యజ్ఞంబులును, వివిధసాధనంబులును, ఋత్విక్కులును, యజ్ఞస్థానంబులును, యజ్ఞఫలంబులును, యాజ్ఞికంబులగు దేశకాలపాత్రాదులును నీస్వరూపంబులు. నీయజ్ఞమయశరీరము పరమార్థతత్త్వంబుగా నిర్దేశింపఁబడియెను. నీవు జగత్కర్తవు, ప్రతిభుండవు, ప్రదాతవు, ప్రదానంబవు, సర్వజ్ఞుఁడవు, సర్వసాక్షివి, పరమపురుషుండవు, ప్రత్యగాత్మవు, పరమాత్మవు నై యుందువు. వేయేల? సమస్తంబును నీవే. పరమేశ్వరా! వేదశాస్త్రంబులకును, గురూపదేశంబులకును మఱియు బుద్ధిప్రముఖంబులగు నంతఃకరణంబులకును నగోచరుండవు. అజుండవు, అప్రమేయుండవు, శివుండవు, సత్యస్వరూపుఁడవు, భగవానుండవు నగునీకు నమస్కారము.

దేవా! ప్రకృతి యంతయు ప్రకటీభూతం బై యున్నసమయంబున విశ్వాత్ముండవగు నీవు ప్రకృతినంతను స్వకీయంబగు సంపత్తిగా భావించి యయ్యహంభావంబుచే చిన్నరూపంబులఁ బ్రతిభాసి

ల్లుచుందువు. బహువిశ్వమూర్తి వగు నీ ప్రభావం బచింత్యంబై నది. ప్రభవంబున కాదికారణంబును, నిత్యంబును, సర్వలక్షణసంపన్నంబును, విలక్షణంబును, శివంబును నగు నీ దివ్యశక్తి వలన ననాదినుండియు ననవరతంబును సృష్టిస్థితి వృద్ధిలయంబులు సంభవించుచున్నవి. ఆదివ్యశక్తి నీ కభిన్నంబైనది. దాని కసాధ్యం బగునది యేదియును లేదు. మారుండ వగు నీ కాశక్తియే ప్రియురాలు. నిఖిలజగజ్జనయిత్రియు, మహాయశస్వినియు, సోమప్రియయు నగు నయ్యంబాదేవి ప్రీతికొఱకు జీవులు నిరంతరమును పరమాన్న ధనాదిదానంబులును, ధర్మాచరణంబులును తపోనుష్ఠానంబులును గావించుచుందురు. ఏదేవికృపాపాంగమును దేవేంద్రుఁడుకూడ నపేక్షించుచుండునో, ఏతల్లినామోచ్చారణంబుచే సకలమంగళంబులును సంప్రాప్తంబు లగునో, ఏజనని సమస్తజగంబులయందును వ్యాపించి విరాజిల్లుచుండునో అట్టిచంద్రికావిమలకాంతిస్వరూపిణి యగు నమ్మహాదేవి నిరంతరమును విశ్వమండలమును విమలీకృతమును జేయుచున్నది. బ్రహ్మాదిస్తంబపర్యంతమునుగల చరాచరప్రపంచమునందలి జీవుల బుద్ధినయనచైతన్యంబులును, మనఃప్రముఖాంతఃకరణంబులును స్వప్రసాదంబున సఫలంబులుగాఁ జేయు జగద్గురుస్వరూపిణి యగు నాసుందరీమూర్తియే నిశ్చయముగా నావాగీశ్వరి. ఇతరులమాటయేల? చతుర్ముఖునకుఁగూడ మనోమాలిన్యమును గల్పింపంజాలిన జగన్మాత యగు నవ్విశ్వేశ్వరియే అనేకవిధంబుల నాలోచించి పరమోపాయంబు నిశ్చయించి సమస్తప్రపంచంబును బవిత్రంబుగాఁ జేయుటకై గంగావతారంబు నంగీకరించియున్నది.

దేవా! విశ్వావాసు లగు సకలజీవులును శ్రుతివాక్యంబులచేఁ బరమేశ్వరుని ప్రభుత్వముంగూర్చి యాలోచించి వివిధప్రమాణపూర్వకంబుగా సకలధర్మంబుల ననుష్ఠించి నానాభోగంబుల ననుభవింపఁగ

లుగుచున్నారు. పరమేశ్వరా! అవి యన్నియును నీవిభూతికంటె న న్యంబులు గావు. సమస్తవైదికలౌకికకార్యంబులును క్రియలును కారణంబులును గూడ ననాదికర్తవగు నీసిద్ధు లనియే నిర్దిష్టంబు లైనవి. సారభూతంబును, ఏకమాత్రోపాసితవ్యంబును, పరమంబును బ్రహ్మపదంబు నగునిన్ను భావించి నిన్ననుగమించి యోగిగణంబులు ముక్తులగుచుందురు. అట్టివారి కిలం బునరావృత్తి లేదు. సాక్షాన్ముక్తి యనిన నుమాపతి వగు నీవే. భగవానుండ వగు నీవు మాయావశంబున నేయేరూపంబుల ధరించుచుందువో జగన్మాతయగు నీశ్వరిగూడఁ ద దనురూపంబు లగునవతారంబుల నెత్తుచుండును. తల్లి యగునామె యందే పతివ్రతాధర్మము ప్రతిష్ఠితంబై యున్నది. జగత్పితరులగు నో పార్వతీపరమేశ్వరులారా! మీకు నమస్కారము.

అని యిట్లు గౌతముండు ప్రార్థించుటయు, వృషభధ్వజుం డగు మహేశ్వరుండు భవానీ సహితంబుగఁ బ్రమథగణపరివృతుండై యాగౌత మునియెదుట సాక్షాత్కరించి ప్రసన్నచిత్తంబున వత్సా! గౌతమా! నీ యుత్తమభక్తికిని స్తోత్రంబునకును వ్రతాచరణంబునకును నేను బరితుష్టుండ నైతిని. దేవగణంబులకు దుర్లభంబై నదైనను నీయభీష్టంబును దీర్చుటకు సంసిద్ధుండ నైతిని. వరప్రార్థనంబు గావింపు మనుటయు వాక్యవిశారదుం డగు గౌతముండు విశ్వవిధాత యగునీశ్వరుని వాక్యశ్రవణంబునఁ బ్రహర్షితపులకాంకితవిగ్రహుండై యానందబాష్పంబుల విడుచుచు ఆహా! ఏమి! నాభాగ్యంబు! నాధర్మము సార్థకం బైన ది. నావిప్రపూజనము ఫలించినది. లోకగతి యెంతవిచిత్ర మైనది! అని భావించి మహాదేవా! నీవు నాయెడలఁ బరితుష్టుండనైతివేని భవదీయం బగు జటాజూటంబున నివసించి యున్న సుఖసంపాదని యగు గంగాదేవిని నాకుఁ బ్రసాదింపుము. సర్వదేవేశా! త్ర్యంబకా! నీకు నమస్కారము.

అని గౌతముండు ప్రార్థింపఁగాఁ ద్రిలోచనుండు ప్రీతుండై మునికులతిలకా! నీయుపకారంబుకొఱకును త్రిలోకప్రియంబుకొఱకును నిస్సంశయముగా నీవు గంగాదేవి నర్థింపఁగలిగితివి. ఇంకను నీకేమి గావలయును? అని యనుగ్రహించినంతనే గౌతముండు మదీయంబగు నీస్తోత్రరాజముచే నేభక్తుండైనను నిన్ను సంకీర్తనంబు గావించినంతనే యాతనిసకలాభీష్టంబులును సంపన్నంబులగునట్లు చేయుము. జగన్నాథా! నీజటాజూటనివాసినియు, లోకపావనియు, ప్రేయసియు నగుగంగాదేవిని బ్రహ్మగిరినుండి యవతరింపఁజేయుము. ఆదేవి సహస్రనదులయందు నుత్తమతీర్థంబై సాగరాభిముఖంబుగఁ బ్రవహించుఁగాక! అంజలిజలంబులయందు స్నానమాత్రంబుననే మనోవాక్కాయికంబులగు బ్రహ్మహత్యాదిమహాపాతకంబు లన్నియును నశించుగాక!

శంకరా! చంద్రసూర్యగ్రహణములు, అయనములు, విషువద్వైధృతిప్రముఖంబులగుపుణ్యసమయములును దటస్థించినప్పుడు సర్వతీర్థస్నానంబు గావించినఫల మీతీర్థంబును స్మరించినంతనే లభింపవలయును. సత్యయుగంబునఁ దపంబును, త్రేతాయుగంబున యజ్ఞానుష్ఠానంబును, ద్వాపరంబున యజ్ఞదాననిర్వహణంబును, కలియుగంబునఁ గేవలదానంబును శ్లాఘ్యంబు లని నిర్దేశింపఁబడినవి. ఇట్టి సమస్తదేశధర్మంబులును, దేశకాలయోగంబుచేఁ బ్రసిద్ధంబులగు నఖిలోత్తమధర్మంబులును, సకలతీర్థస్నానంబులును, దానంబులును, వ్రతంబులును సంపూర్ణముగా నిర్వహించినచో నెట్టిపుణ్యంబు లభించునో యట్టిపుణ్యం బంతయు నీగంగాదేవిని స్మరించునంతనే, సిద్ధింపవలయును. సాగరగామిని యగునీసురతరంగిణి ప్రవహించుచున్నప్రదేశములం దన్నిటియందును మీరధిష్ఠించి యుండవలయును. మఱియు నీనదీతీర

మునుండి వది యోజనపరిమితం బగుభూభాగమధ్యంబున నివసించువా రెల్లరును ముక్తులు గావలయును. ఈతీర్థస్నానంబు గావింపకున్నను వారిపితృగణంబులకు మోక్షలాభంబగుఁగాక! స్వర్గమర్త్యపాతాళంబులంగలసకలతీర్థంబులలోకమెత్తును, ఈదివ్యతీర్థంబొక్కటియు నొకయెత్తు నగుంగాక! దేవా! ఇదియే నాయభీష్టము. నేనింక నర్థింపఁదగిన దేదియును లేదు.

అని గౌతమమునీంద్రుం డర్థించుటయు దేవదేవుండు సకలతీర్థంబులకంటె నీతీర్థమే ప్రధానంబై యుండును. దీనినిమించిన తీర్థములెందు నెన్నఁటికిని లేకుండుఁగాక! సకలనదీనదంబులకంటె నీగౌతమీతీర్థము యుత్తమంబై నదని ముమ్మాటికిని వచించుచున్నాను. అని యనుగ్రహించి యంతర్హితుం డగుటయుఁ బుణ్యకాముండగు గౌతముండు సకలసురగణపరివృతుండై మహేశ్వరజటాజూటవినిర్గత యగు గంగాదేవిని వెంటబెట్టుకొని యెప్పటివలె బ్రహ్మగిరి కేతెంచుచుండ సకలదేవతలు నమ్మహామునీంద్రునిపైఁ గుసుమవర్షంబులఁ గురియించిరి. దేవర్షిగణంబులును, మహాభాగులగు బ్రాహ్మణగణంబులును, క్షత్రియగణంబులును జయజయారావములచే దశదిశలఁ బ్రతిధ్వనితంబులుగాఁ జేయుచు విప్రవరుండగు నాగౌతము ననేకవిధంబుల నర్చింపఁదొడంగిరి.

గౌతమీమాహాత్మ్యము.

వత్సా! నారదా! గౌతముం డిట్లు శుచియై, నియతచిత్తంబున గంగను గొనితెచ్చి దేవగంధర్వాదులచేతను బ్రహ్మగిరివాస్తవ్యులచేతను బూజితుం డయ్యెను. అతఁడు హరజటాఖండమును బ్రహ్మగిరిశిఖరంబున స్థాపించి త్రిలోచనుం డగు దేవదేవుని స్మరించుచుఁ గృతాంజలియై గంగాదేవి నుద్దేశించి, ఓహరజటాసంభూతా! సర్వకామప్రదా

యునీ! జననీ! నీవు నన్ను క్షమింపుము. శాంతురాలవు గమ్ము. సకలహితసాధకంబునకై సుఖగమనంబు సేయుము. అని ప్రార్థించుటయు, గంగాదేవి దివ్యమాలికాలంకృతయు, దివ్యసుగంధానులేపితయు, దివ్యాలంకారవిభూషితయు నగు దివ్యాకృతిం దాల్చి, వత్సా! గౌతమా! నీవు సత్యవచనుండవైతివి. నేనిప్పుడు దేవభవనంబునకైనను, బ్రహ్మకమండలుమధ్యంబున కైనను, రసాతలంబున కైనను బ్రయాణంబు గావించెద ననుటయు, గౌతముండు ‘ఓతల్లీ! త్రిలోకోపకారార్థమై నేను నీకొఱకుఁ ద్రిలోచను నర్చించితిని. దేవీ! దయామయుం డగు శంకరుండు నాకు నిన్ననుగ్రహించెను. ఇవ్విషయంబున నీవు నాప్రార్థనంబు నన్యథా గావింపకుము’ అని వేఁడుకొనుచున్న గౌతమునివచనంబు లాలకించి గంగాదేవి యించుక యాలోచించి తన్ను మూఁడుభాగంబులుగా విభజించుకొని స్వర్గమర్త్యపాతాళంబులకుఁ బ్రచారంబు గావించెను. త్రిలోకగామిని యగు నాగంగాధార స్వర్గంబునఁ జతుర్భాగంబులుగను మర్త్యలోకంబున సప్తభాగంబులుగను, రసాతలంబునఁ జతుర్భాగంబులుగ విభక్తయయ్యెను. ఈవిధముగాఁ బంచదశభాగములై గంగాదేవి త్రిభువనంబులయందును బ్రవహించుచుండెను.

సర్వభూతస్వరూపిణియు, సర్వపాపవినాశినియు, సర్వాభీష్టప్రదాయినియు నగుగంగాదేవి నిత్యపావని యని వేదంబులును గీర్తించుచున్నవి. మర్త్యులు భూమండలంబునఁ బ్రవహించుచున్న యాదేవీమూర్తినేకాని స్వర్గరసాతలంబులనున్న యామెదివ్యమూర్తుల సందర్శింపఁజాలరు. గౌతమునిచే నిట్లవతారితంబైన గంగాదేవి సర్వదేవతాస్వరూపిణియై పూర్వార్ణవాభిముఖంబుగఁ బ్రవహించుచుండెను.

అనంతరము మునిశార్దూలుం డగుగౌతముండు సకలదేవర్షిగణ

సేవితయుఁ,ద్రిలోకపావనియు, జగన్మాతయు నగు గంగాదేవికిఁ బ్రదక్షిణంబు సేసి సురేశ్వరుం డగు త్రిలోచను నర్చించి తదుభయతీరంబులను స్నానము సేయవలయు నని భావించినంతనే కరుణాసాగరుం డగు శివుం డచ్చట సాక్షాత్కరించుటయు, గౌతముండు కృతాంజలియై భక్తివినమ్రభావంబున నా దేవదేవునియెదుట నిలిచి, మహాదేవా! జగద్ధితంబు నకై యీతీర్థస్నానవిధానంబును సవిస్తరంబుగా నుపదేశింపవలయు నని ప్రార్థించెను.

అంతట సదాశివుండు సంప్రీతుండై మహర్షిశేఖరా! ఈగోదావరీస్నానవిషయంబున సమస్తవిధులు నీకెఱింగించెద నాకర్ణింపుము. తీర్థసేవాతత్పరుం డగువాఁడు ప్రప్రథమమున నాందీముఖంబు నిర్వర్తించి దేహశుద్ధిఁ గావించుకొని యనంతరము బ్రాహ్మణసంతర్పణంబు చేసి వారియాదేశంబున బ్రహ్మచర్యవ్రతంబు నవలంబించి పాపాత్ములతోడి వాక్యాలాపంబుల విసర్జించి తీర్థస్నానంబునకుఁ గడంగవలయును. హస్తద్వయంబును పదద్వయంబును మనంబును సుసంయతంబులు గావించుకొనఁగలవారును, జ్ఞానవంతులును, తపోధనులును, కీర్తిసంపన్నులు నగువారే తీర్థఫలంబును గాంచఁగలరు. స్వధర్మైకనిష్ఠులును దుష్టభావపరిత్యక్తులును నగుతీర్థసేవనులు, అకించను లగుసాధువులకు అన్నవస్త్రాదిదానంబులఁ గావించిఁ గంగోత్పత్తివిషయకంబు లగు దివ్యచరిత్రంబుల నాలకింపవలయును. ఇట్లు విధివిధానంబునఁ దీర్థసేవనంబు గావించువారికి విశేషఫలలాభం బగును.

గౌతమమునీంద్రా! ఈగంగయందలి ద్విహస్తపరిమితం బగు స్థానంబున సమస్తతీర్థంబులును విరాజిల్లుచుండును. సర్వకామప్రదుం డ నగు నేనును ఈగంగయం దెల్లయెడల సన్నిహితుండనై యుండుదును. గంగాద్వారంబును, ప్రయాగంబును, సాగరసంగమంబును నను

నీస్థానత్రయమునందు భాగీరథీదేవి మానవులకు భుక్తిముక్తిప్రదాయిని యై యుండును. అమరకంటకశైలంబున సరిల్లలామం బగు నర్మదానది ప్రవహించుచున్నది. ఈమహానది దానితో సమ్మిళితం బగుచున్నది. ప్రభాసతీర్థంబున సరస్వతీనది ప్రవహించుచున్నది. కృష్ణా, భీమరథీ, తుంగభద్రల సంగమస్థానమును, పయోష్ణీసంగమస్థానంబును ముక్తిప్రదంబులు. వత్సా! నాయాదేశంబుచే నీగోదావరీనది ప్రవహించుచున్నస్థానంబులయం దంతటను మానవులకు స్నానమాత్రంబున సకలాభీష్టంబులును సిద్ధించును. కొన్నితీర్థంబులు కాలవిశేషవశంబునను, మఱికొన్ని దేవసమాగమవశంబునను బుణ్యమయంబులై యుండును గాని యీగౌతమమీనదిమాత్రము సర్వకాలంబులయందును సర్వస్థానంబులయందును బుణ్యతమంబై యుండుననుటకు సందియంబులేదు. మునిశ్రేష్ఠా! ఈదివ్యవాహిని ప్రవహించుచున్న ద్విశతయోజనమధ్యంబునను సార్ధత్రికోటితీర్థంబులు విరాజిల్లుచుండును.

ఈనదీమతల్లి గంగా, మాహేశ్వరి, వైష్ణవి, బ్రాహ్మి, గోదావరి, నంద, సునంద అను నామంబులచేఁ గీర్తింపఁబడుచుండును. బ్రహ్మతేజంబుచే సమానీతయైనయీగోదావరీనది కామదాయినియు, పాపనాశినియు నైనది. నాకు నిరంతరము నతిప్రియం బగు నీగోదావరి స్మరణమాత్రంబుననే సకలపాపంబులను నశింపఁజేయును. పంచభూతంబులయందును జలమే శ్రేష్ఠమైనది. దానితరువాతనే తక్కినభూతము లన్నియుఁ దీర్థభూతము లగుచున్నవి. ఈజలంబులలో భాగీరథి శ్రేష్ఠమైనది. దానికంటెను గోదావరీనది శ్రేష్ఠమైనది. హరజటాసహితం బుగ నానీతంబయిన దీనికంటె శుభావహంబు లగుతీర్థంబు లెవ్వియును లేవు. స్వర్గమర్త్యాదిలోకంబులయం దంతటను గౌతమీతీర్థమే సర్వార్థసాధక మైనది. అని గౌతమునకుఁ జెప్పి దేవదేవుం డగుమహేశ్వరుం డంతర్హితుం డయ్యెను.

భాగీరథీనద్యవతరణము

వత్సా! నారదా! పూర్వకాలంబున వైవస్వతమనువంశంబున నిక్ష్వాకుకులంబున యజ్ఞనియతుండును, స్వధర్మనిరతుండును, దానశీలుండును నగుసగరుఁ డను మహారాజు భూమండలమును బరిపాలించు చుండెను. అతనికిఁ బతిభక్తిపరాయణు లగు నిరువురు భార్యలు, గలరు. అయినను నమ్మహారాజు సంతానవిహీనుండై విచారించుచు నొకనాఁడు నిజపురోహితుం డగు వసిష్ఠుని దనమందిరంబునకుఁ బిలిపించి విధివిధానంబునఁ బూజించి యపత్యలాభంబున కుపాయంబు నిర్దేశింపవలయు నని ప్రార్థించుటయు వసిష్ఠుం డించుక యాలోచించి రాజా! నీవు సర్వదా సస్త్రీకుండవై ఋషిగణంబుల నారాధించుచుండు మని నిజస్థానంబునకుఁ బ్రస్థానంబు గావించెను. సగరుండును వసిష్ఠానుమతంబున నియతవ్రతుండై మెలంగుచుండ నొకప్పుడు దపోనిధి యగు నొకమునీంద్రుం డాతనిచెంత కరుదెంచి రాజర్షి యగు సగరునిచే యథావిధిగఁ బూజితుండై సంతుష్టచిత్తంబుతో నీ కేమి గావలయునో యర్థింపు మని యనుగ్రహించుటయు సగరుండు సంతానమును వాంఛించెను. అంత నమ్మునీంద్రుండు రాజా! నీకొకభార్యవలన వంశధరుం డగు నొకపుత్త్రుండును మఱియొక పత్నివలన నఱువదివేల మంది తనయులును గలుగుదు రని వరంబిచ్చి వెడలిపోయెను. కొంత కాలంబునకు నమ్మహారాజున కట్లే మునివచనానుసారంబుగ సంతానం బుద్భవించెను.

రాజర్షియగుసగరుండు భూరిదక్షిణాన్వితంబు లగు ననేకాశ్వమేధంబులను గావించెను. ఆతం డొకప్పు డశ్వమేధయాగదీక్షితుండై పుత్త్రుల నశ్వరక్షణంబునకు నియోగించియుండ, శతక్రతుండు, ఇతరుల

కొనుంగరానుండ నమ్మహాశ్వము నపహరించి కొంపోకచో నుంచెను. రణకోవిదు లగు సగరసుతు లయ్యశ్వంబునకై భూమండల మంతయు నన్వేషించుచుండఁ గొందఱు రాక్షసు లాయశ్వమును రసాతలంబునకుఁ గొనిపోయిరి. మాయావు లగు నాక్రవ్యాదులను సగరసుతులు గనుంగొనఁజాలకపోయిరి. వారు క్రమంబునఁ బర్వతములు సరోవరములు వనములు మొదలగుప్రదేశములయం దెల్ల వెదకి యయ్యశ్వంబు నెందును గానక దేవలోకంబునకుఁగూడఁ బోయి యందెల్లయెడల నన్వేషించిరి గాని ఆయాగహయం బెందును గోచరింపకుండెను.

ఇట మహాత్మా జగుఁడగు సగరుండు ఋత్విగ్గణంబులచేఁ గృతస్వస్త్యయనుండును, గృతమంగళుండును నై యజ్ఞాశ్వంబు గానంబడకుండుటకై చింతించుచుండెను. స్వధర్మపరాయణు లగుసగరసుతు లెల్లు యజ్ఞహయాన్వేషణంబు గావించుచు నెందునుం గానక పరితపించుచున్న సమయంబున మీయజ్ఞాశ్వంబు రసాతలంబున బంధింపఁబడిన దని యాకాశవాణి పలికెను. సగరనందను లామాట లాలకించి తత్క్షణమందే రసాతలగమనంబున కుద్యమించి భూతలంబును ద్రవ్వ నారంభించిరి. ఆసమయంబున వారు క్షుధార్తులై వృత్తికాభక్షణంబుననే శాంతు లగుచు రాత్రిందివంబులు భూఖననంబు గావించి రసాతలంబునఁ బ్రవేశించిరి. బలవంతులును గృతకృత్యులును నగు సగరనందను లీరీతిగా రసాతలంబునకు వచ్చి రను వార్త నాలకించి రాక్షసు లందఱును భయభ్రాంతులై మహానిద్రాముద్రితుండై యున్న కపిలమహాముని సమీపంబున కమ్మఖాశ్వమును గొనిపోయి యాతనిశిరోదేశంబున దానిని బంధించిరి.

పూర్వకాలంబునఁ గపిలమునీంద్రుండు నిద్రయనుమాట నెఱుంగకుండ, బహుకాలంబు శ్రమపడి ప్రధానం బగు నొకదేవకార్యంబు

సాధించి శాంతుండై, యాతండు సురగణంబుల నవలోకించి నాకు సుఖనిద్రాస్థానంబును బ్రసాదింపుఁ డని కోరుటయు, దేవత లాతనికి రసాతలంబును బ్రసాదించిరి. అప్పుడు కపిలుండు దేవతలం గాంచి నాని ద్రాభంగంబు గావించువాఁ డెవ్వండైనను దక్షణంబు భస్మీభూతుండు గావలయును. అట్లగుటకంగీకరించిన దో నేను నిరంతరాయముగ సుఖనిద్రం గాంచెదను. కాకున్న దో నాకీనిద్రవలనఁ బ్రయోజనంబు లేదు. అని యర్థించి దేవతలసమ్మతిం గైకొని యాతఁడు రసాతలంబునఁ జేరి శయనించి యుండెను. మాయావు లగురాక్షసులు కపిలమునీంద్రుని మహాప్రభావం బెఱింగినవారుగావున యుద్ధంబు సేయకుండఁగనే సగరనం దను లందఱును నొక్కసారిగ నమసిపోవుట కిదియే యుపాయ మని నిశ్చయించి యయ్యశ్వమును గపిలునిసమీపంబునఁ గట్టిపెట్టి యేమి జరుగునో చూత మని యందఱును మౌనభావముతో దూరంబున నిల్చి యుండిరి.

సగరసుతులు రసాతలంబునఁ బ్రవేశించినంతనే తమయశ్వము ను, దానిసమీపమున శయనించియున్నపురుషునిఁ గాంచి యాతఁడే యజ్ఞహారకుఁడై యశ్వము నపహరించె ననియు, నీతని వధించి తమ యశ్వమును గొనిపోవలయు ననియు నిశ్చయించిరి. అందు గొందఱు మనము యజ్ఞాశ్వమునే కొనిపోవలయునుగాని యాతనితోఁ బనియేమి యనిరి. మఱికొందఱు, ఇదేమి మాట? మనము శూరులమును, శాసనకర్తలమును, రాజులము నై యుంటిమి. కేవలమును దుర్వృత్తుల ను విడిచిపెట్టుట క్షత్రియోచితస్వభావము గాదు. మనబలప్రభావం బుచే నీతనివినాశవిధానంబు గావించితీరవలెను. అని యుగ్గడించి యం దఱు నేకమతంబుగ నంగీకరించి పరుషవాక్యంబులచే నమ్మునీంద్రునిఁ దిట్టుచుఁ బదతాడనంబులఁ గావింప నారంభించిరి. అప్పుడు కపిలము

నీంద్రుండు కోపభరంబున మేల్కాంచి యాసగరనందనులవంక దృష్టిప్రసారణంబు గావించినంతనే వారందఱును భస్మీభూతు లై పోయిరి.

యజ్ఞదీక్షితుం డగుసగరున కీవృత్తాంత మేమియును దెలియనే లేదు. అప్పుడు మహాత్ముం డగునారదుండు సగరునిచెంతకుం బోయి కపిలసంస్థానంబును, యజ్ఞాశ్వస్థితియు, రాక్షసకృత్యంబును, సగరనందనులవినాశంబును స్పష్టంబుగా నెఱింగించెను. అప్పుడు సగరుండు చింతాక్రాంతచిత్తుండై కర్తవ్యంబు నిశ్చయింపఁజాలక విచారించుచుండెను. అతని కసమంజసుం డనునింకొకపుత్రుం డుండెడివాఁడు. మూర్ఖుం డగునాతఁడు పురజనులబిడ్డల నెత్తికొనిపోయి జలంబులం దకారణముగఁ బాఱవైచుచుండెను. నగరజనులందఱు నీయత్యాచారమును సగరునకు విన్నవించుటయు నాతఁడు క్రుద్ధుండై యమాత్యులం బిలిచి దురాత్ముండగు నీయసమంజసుని రాజ్యమునుండి వెడలనడపవలయునని యాజ్ఞాపించెను. రాజశాసనంబున నమాత్యు లారాజకుమారుని బలవంతముగఁ ద్రోసివైచుటయు నాతఁడు వనవాసి యైపోయెను. ఇఁక మిగిలిన యఱువదివేలపుత్రులు నీవిధముగాఁ గపిలకోపానలంబున దగ్ధీభూతులై పోయిరి. ఇట్టిస్థితిలో నసహాయుం డగుసగరుం డేమిచేయఁగలఁడు ?

ఆతఁడనేకవిధముల విచారించి యయ్యసమంజసునితనయుం డగునంశుమంతునిం దెచ్చి సకలరాజకార్యభారంబును నాతనిపై నుంచెను. అంశుమంతుం డప్పటికి బాలుండయ్యును ప్రౌఢునివలెఁ బోయి కపిలమునీంద్రు నారాధించి మరల నయ్యశ్వంబును గొనితెచ్చి పితామహునికర్పించి యాతనిచే నశ్వమేధయాగమును బూర్తి సేయించెను. ఆయంశుమంతునకుఁ దేజస్వియు, బలవంతుం డగుదిలీపుండను తనయుఁ డుదయించెను. ఆతనికి మతిమంతుం డగుభగీరథుండుపుట్టెను.

అభగీరథుండు వయఃప్రాప్తుండై తనపితామహగణంబులదుర్గ
తింగూర్చి యాకర్ణించి చింతాకులితహృదయుండై వినయభావంబున
వృద్ధమహారాజగుసగరునిసన్నిధికిం బోయి తనపితామహులకుసద్గతిగలు
గునుపాయము దెలుపవలయు నని ప్రార్థించుటయు సగరుం డాతనిం
గాంచి వత్సా! ఈవిషయంబున నేమిచేయవలయునో రసాతలస్థితుండ
గు నాకపిలమునీంద్రునకే తెలియగలదు. నీవాతనివలననె తెలిసికొ
మ్మనుటయు నాబాలకుం డప్పుడే రసాతలంబునకుం బోయి కపిలునిం
దర్శించి ప్రణామపూర్వకంబుగఁ గృతాంజలియై వినయమధురభాషణం
బులతోఁ దనయుద్దేశము నాతనికి నివేదించెను. అంతఁ గపిలుం డిం
చుకయాలోచించి యోనృపకుమారా! నీవుమహాతపంబుగావించి శం
కరు నారాధించి యాతనిజటాజూటనివాసిని యగుగంగ మీపితామ
హులభస్మంబుపైఁ బ్రవహించునట్టి వరంబు నర్థింపుము. అట్లయిన
చో నీవు నీపితృదేవతల నుద్ధరించినవాఁడ వగుదువు.

అని యుపాయంబు చెప్పినంతనే భగీరథుం డమ్మునీంద్రునకు
నమస్కరించి నేనెచ్చటికిఁ బోయి యేమి చేయవలయునో యెఱింగింప
వలయునని ప్రార్థించుటయుఁ గపిలుండు ప్రీతుండై వత్సా! నీవు కై
లాసంబునకుం బోయి యచ్చటఁ బరమేశ్వరనామకీర్తనంబు సేయుచు
యథాశక్తిని దపంబు గావించినచో నీయభీష్టసిద్ధి కాఁగలదని చెప్పె
ను. భగీరథుం డయ్యుపదేశమును దలఁదాల్చి నమస్కారపూర్వకం
బుగా నమ్మునిచంద్రునికడ సెలవు గైకొని కైలాసంబునకుఁ బ్రయా
ణంబై పోయి శుచియై బాల్యమునందే మహాతపంబు గావించుటకు
సంకల్పించి యోబాలచంద్రికళావతంసా! ప్రభూ! నేను బాలకుండ
ను. నాబుద్ధికూడ నట్టిదియే. నేను నీదివ్యతత్త్వము నించుకంతయు
నెఱింగినవాఁడను గాను. మనోవాక్కర్మంబులచే నెవ్వఁడైన నా కుప

కారంబు గావించినవాఁడున్నవో నాహితంబును గోరుచుండువాఁ డెవ్వడైన నున్నచో నేను వారిహితంబునుగోరి యమరేశ్వరుండవు, సురాసురపూజ్యుండవు, సోమశేఖరుండవు నగునీకు నమస్కరించుచున్నాను.

మఱియును భగవంతుండ వైనయోశంకరా! నాయుత్పత్తికిని నాయభివృద్ధికిని హేతుభూతులైనవారును సమానగోత్రులును, సమానధర్ములును నైన నావారింగూర్చిన యభీష్టవరప్రదానంబును గావింపుమని బాలేంద్రుధరుండవైన నీచరణకమలములకు హృదయపూర్వకముగా నమస్కరించుచున్నాను.

భగీరథుం డీరీతిని స్తోత్రము చేయుటయుఁ గరుణాసముద్రుండగు శివుం డాతనియెట్టయెదుట సాక్షాత్కరించి, అతిశయప్రేమముతో మహామతివైన యోభగీరథా! సురగణంబుల కసాధ్యమైనవరమునైనను నీకిప్పుడు ప్రసాదించుటకు సంసిద్ధుండనై యున్నాఁడను. శంకారహితచిత్తుండవై నీయభీష్టమును వేఁడుకొనుము. అని వక్కాణించినంతట భగీరథుండు సంతుష్టమానసుండై దేవా! శంకరా! అధోలోకంబునం బడి గతులు గానక యున్న నాపితృదేవతలనెల్ల నుద్ధరించి పరిత్రాణంబు గావించుటకై నీజటాజూటంబున నధివసించియున్న గంగాదేవిని నాకుఁ బ్రసాదింపుము. ఈవరము నాకుఁ బ్రసాదించెదవేని నాకు సమస్తవరంబుల ననుగ్రహించినట్లు భావించెదను.

ఇట్లు ప్రార్థించుచున్న భగీరథుం గాంచి శంకరుండు సహాస్యవదనుండై వత్సా! నీకోరికననుసరించి సురతరంగిణి యైన గంగాదేవిని నీకు దానముచేసెదను. ఆమె నొక్కసారి ప్రార్థించెదవేని యామె నీకు లభించును. అనిపలుకుటయు భగీరథుం డాదేవదేవునివచనంబుల నాలకించి సంప్రీతచిత్తుండై భక్తిభావంబుతో గంగాదేవిప్రీతికొఱకుఁ గఠోరతపంబును సంస్తవంబును గావించెను. ఆతఁడు బాలకుండయ్యును

అబాలకోచితం బగు నధ్యవసాయంబున గంగామహాదేవి ప్రసన్నతను గాంచినవాఁ డయ్యెను.

ఇవ్విధంబున మహేశ్వరునిచేఁ బ్రసాదింపఁబడిన నిర్జరతరంగిణి ని దీసికొని మహాత్ముం డగు భగీరథుండు రసాతలంబునకుం జని కపిల మునీంద్రుని సందర్శించి యాతనికి సకలవృత్తాంతమును నివేదించి య థావిధిగ గంగను సంస్థాపించి ప్రదక్షిణనమస్కారంబులు గావించి కృ తాంజలియై దేవీ! కపిలశాపంబుచే మత్పితృగణంబులు దుర్గతులై యున్నారు. తల్లీ! నీవు వారినందఱ నుద్ధరింపవలయు నని ప్రార్థించు టయు సకలలోకహితైషిణి యగు సురనదీమతల్లి సుప్రసన్నయై యనుగ్ర హించి సగరనందనుల నుద్ధరించుటకును, అగస్త్యునిచేఁ బానముచేయఁ బడిన సాగరమును మరలఁ బూరించుటకును, సకలజీవపాపనోదనం బుకొఱకును స్వర్గమునుండి భూలోకమున కవతరించి భగీరథప్రార్థనా నుసారంబుగా సగరసుతులను బవిత్రులుగాఁ జేసి సాగరఖాతమును నిం డించి యనంతరము సుమేరుశైలమును బ్లావితంబుఁజేసి హిమాలయం బును జేరి యటనుండి భారతవర్షంబున కవతరించి తన్మధ్యభాగమునుం డి మరలఁ బూర్వసాగరాభిముఖంబుగాఁ బ్రవహించెను. ఇది గంగా వతరణవృత్తాంతము.

ఈగంగాదేవి మాహేశ్వరి, వైష్ణవి, బ్రాహ్మి, పావని, హి మాలయశిఖరాశ్రిత, భాగీరథి యను నామంబులచేఁ గీర్తింపఁబడుచుం డును. ఈవిధముగా మహేశ్వరజటాజూటమునందలి దివ్యజలము ద్వి భాగములుగాఁ జేయఁబడి వింధ్యశైలంబునకు దక్షిణముగాఁ బ్రవహిం చున్న భాగము గౌతమీగంగానామముచేతను, ఉత్తరదిశనుండి ప్రవ హించుచున్న భాగము భాగీరథీగంగానామముచేతను వ్యవహరింపఁబడు చుండెను.

వరాహతీర్థవృత్తాంతము

అని యిట్లు బ్రహ్మదేవుండు చెప్పుటయు నారదుండు దేవా! నీవదనకమలంబులనుండి వెలువడుచున్న పుణ్యకథల నాకర్ణించుచున్న కొలందియుఁ దనివితీరుట లేదు. ఇంకను విభిన్నంబులగు తీర్థమాహాత్మ్యములంగూర్చి నీవలన వినవలయు నని నేనెంతయుఁ గుతూహలపడుచున్నాను. లోకవిధాతా! నీవు ముందుగా బ్రాహ్మణానీతం బగు గోదావరీగంగయందలి విభిన్నతీర్థంబులంగూర్చిన యితిహాసంబులను సవిస్తరంబుగఁ దెలుపవలయు నని ప్రార్థించెను.

బ్రహ్మదేవుం డిట్లనియెను. కుమారా! సకలతీర్థభేదంబులును, వానిమాహాత్మ్యంబులును సవిస్తరముగా వర్ణించుటకు నాకుఁ గాని, యాకర్ణించుటకు నీకుఁగాని సామర్థ్యము లేదు. అయినను నేనిప్పుడు వానింగూర్చి సంక్షేపముగాఁ జెప్పెద నాలకింపుము. నేను త్రిలోచనుండగు దేవదేవునకు నమస్కారంబు గావించి శ్రుతికీర్తితంబులగుతీర్థమాహాత్మ్యంబులఁ బ్రశంసించెదను. ఎందెందు భగవానుండగు శంకరుండు సాక్షాత్కరించి యుండునో యవి యన్నియును భుక్తిముక్తిప్రదాయకంబు లగుత్ర్యంబకతీర్థములు. విష్ణునామంబుచే విఖ్యాతంబై త్రిలోకపూజ్యంబై యున్నవరాహతీర్థంబునుంగూర్చి మున్ముందు ప్రశంసించుచున్నాను వినుము.

పూర్వకాలంబున సింధుసేనుం డనునొకరాక్షసుండు సకలదేవతలను బరాజితులం గావించి యజ్ఞమూర్తి నపహరించి రసాతలంబునకుం గొనిపోయెను. అందుచే మహీమండలమంతయును నిర్యజ్ఞంబై పోయెను. యజ్ఞం బిట్లు వినష్టం బగుటచేఁ బరలోకగతి వినాశంబు గాఁగల దని భావించి దేవతలందఱును గలసి శత్రువిజయంబునకై రసాతలంబునఁ బ్రవేశించి యారక్కసునితో నతిభీకరంబగుమహారణంబు గావిం

చిరి గాని తుద కాతని జయింపఁజాలకపోయిరి. అప్పుడు నిరుపాయు లగునింద్రాది దేవత లందఱును బురాణపురుషుండగు విష్ణుదేవునిసన్నిధికిం బోయి రాక్షసకృతంబగుయజ్ఞధ్వంసవృత్తాంతమును సవిస్తరంబుగా నెఱింగించుటయు శంఖచక్రగదాధరుం డగు నారాయణుండు ప్రసన్నుండై నేను వరాహరూపధరుండనై రసాతలంబునఁ బ్రవేశించి యాదుష్టరాక్షసుని సంహరించి పుణ్యమయం బగునయ్యజ్ఞంబును మరలఁ గొని తెచ్చెదను. మీరు విచారంబు విడిచి స్వర్గంబునకుం బోయి సుఖంబుగా నుండుఁ డని యాశ్వాసించి వారిని బంపివైచెను.

అనంతరము చక్రధరుండగు విష్ణుదేవుండు గంగాదేవి రసాతలంబునఁ బ్రవేశించియున్నమార్గమును భేదించుకొని వరాహరూపములోఁ బాతాళంబునకుం బోయి మహారణంబు చేసి యటనున్న దుష్టరాక్షసుల నందఱను సంహరించి యజ్ఞమూర్తినుద్ధరించి తనముఖంబునందు నిలిపికొని యెప్పటివలెఁ బోయినత్రోవనే బహిర్గతుం డయ్యెను. దేవతలందఱు నాదేవదేవునిరాకకై బ్రహ్మగిరియందు నిలిచి ప్రతీక్షించుచుండిరి. వరాహమూర్తియగు గదాధరుం డీవిధముగా మరలివచ్చి గోదావరీతీరంబున రుధిరమయంబులగు సర్వాంగములను బ్రక్షాళితంబులుగాఁ జేసికొనియెను. అప్పటినుండియు నచ్చటితీర్థమునకు వరాహకుండం బనునామము విఖ్యాతం బయ్యెను.

శ్రీహరి యీవిధంబుగా నాగంగాజలంబులయందుఁ గృతావగాహుండై వచ్చి యాత్మముఖస్థం బగునమ్మహాయజ్ఞంబును మరల దేవగణంబుల కర్పించెను. ఆవరాహమూర్తిముఖంబునుండి యజ్ఞం బప్పు డుత్పన్నం బయ్యెనుగావున నప్పటినుండియు యజ్ఞాంగంబులలోఁ బ్రధానం బగుస్రువంబునకు వరాహరూపంబు ప్రకల్పితం బయ్యెను. ఆవరాహతీర్థం బతిపవిత్రంబును, బుణ్యమయంబును, సర్వకామప్రదం

బు నైనది. అందవగాహనంబు సేయువారికి సకలయజ్ఞఫలంబులును సమకూఱంగలవు. ఆతీర్థంబునకుం బోయి యేపుణ్యాత్ముండు పితృదేవతలను స్మరించునో యాతని పితృగణంబులు సకలపాపవిముక్తులై శాశ్వతస్వర్గావాసు లగుదురు.

—♦ కపోతతీర్థమాహాత్మ్యము. ♦—

నారదా! కుశావర్తతీర్థంబును గూర్చి సంపూర్ణముగఁ గీర్తించుట కెవ్వరికిని సాధ్యంబుగాదు. ఆతీర్థస్మరణమాత్రంబుననే మానవులు కృతకృత్యు లగుదురు. అది సకలాభీష్టప్రదాయకం బగుపుణ్యతీర్థము. మహాత్ముం డగుగౌతముండు గంగాదేవిని కుశలచే నావర్తితంబు గావించి యచ్చటికిఁ గొనితెచ్చుటచేతనే యాతీర్థమునకుఁ గుశావర్తంబను నామము గలిగెను. అందు స్నానదానంబులవలనఁ బితృదేవతలు తరింపఁగలరు. సలిలారామ మగునీలగంగ నీలాచలమునుండి ప్రవహించుచున్నస్థానమునందు నియమితచిత్తంబుతో స్నానము చేసి యేకొలఁదిసత్కర్మంబు నిర్వర్తించినను మహాఫలంబు లభించుటయే కాక యట్టివానిపితృదేవతలందఱు నుద్ధరింపఁబడుదురు.

ఉత్తమంబగుకపోతతీర్థము త్రిలోకవిఖ్యాతంబైనది. మహాఫలదాయకం బగునాతీర్థముంగూర్చినయితిహాసమును వర్ణించెద నాకర్ణింపుము. పూర్వకాలంబున బ్రహ్మగిరితటంబున దారుణప్రకృతియగు నొకవ్యాధుండు నివసించియుండి నిరంతరమును విప్రులను, సాధువులను, పశువులను, మృగంబులను సకలజీవులనుగూడ ననేకవిధంబుల హింసించుచుండెను. పాపాత్ముండగునవ్యాధుడు మిగులఁ గోపశీలుండును, అసత్యవాదియు, భీషణాకారుండును, అత్యుగ్రుండును, వికృతదేహుండును, హ్రస్వభావుండును, నీలనేత్రుండును, ఉన్నతదంతుండును,

హ్రస్వచరణుండును, హ్రస్వోదరుండును, గద్గదస్వరుండును, పాశహస్తుండును, క్రూరచిత్తుండును, దారుణచరిత్రుండునై యెల్లప్పుడును ధనుర్బాణములను ధరించి జీవహింసాపరతంత్రుండై సంచరించుచుండును. ఆతనిభార్యయుఁ బుత్రులునుగూడ నాతనికనురూపచరిత్రులే యై యుండిరి.

ఒకనాఁ డక్కిరాతుండు భార్యచేఁ బ్రేరేపింపఁబడి వేఁటకై సాంద్రారణ్యమధ్యంబునఁ బ్రవేశించి వెదకి వెదకి యనేకమృగంబులను, బక్షులను సంహరించి మఱికొన్నిటిని బ్రాణములతోనే పట్టుకొని జాలమధ్యంబున బంధించి మహానందముతో నమ్మహారణ్యంబునఁ బరిభ్రమించుచుండెను. ఇట్లుండ వేళయతిక్రమించుటయు క్షుత్పిపాసల వలన నాతనికి దేహదౌర్బల్యంబు తటస్థించెను.

అది వైశాఖము. అపరాహ్ణము తిరిగిపోవుచుండెను. వ్యాధుండు మహారణ్యంబునఁ జాలదూరమువఱకును దిరిగితిరిగి పరిశ్రాంతుండై యిఁకవేఁటయందలియుత్సాహంబు విడిచి గృహాభిముఖుండై బయలుదేఱెను. చూచుచుండఁగనే యంతలో నీలమేఘములు బయలుదేఱి యాకాశమంతయు నావరించుకొనియెను. తోడనే విద్యుల్లతలును, భీకరగర్జారావంబులును వెలువడియెను. ఝంఝామారుతములు చెలరేఁగి దెసలఁ బ్రకంపితములుగాఁ జేయఁదొడంగెను. ఆవెంటనే భీకరకరకాపాతంబులతో వర్షధారాపాతం బారంభమయ్యెను. అతిదుస్సహం బగువానసమయంబునఁగూడ నాలుబ్ధకుండు జలధారలందోఁగుచు నింటిమొగంబై పోవుచునే యుండెను. కాని కొంతసేపటి కాతఁడు త్రోవదప్పిపోయెను. మేఘములు కుంభవృష్టిగా వర్షించుచుండెను. వనప్రదేశం బంతయు జలమయమై యుండెను. అందుచే నాతనికి మిట్టపల్లములును, గోతులును, ముండ్లపొదలునుగూడ గోచరింపవు

ను. ఆపాపాత్ముని కచ్చటఁ దలదాఁచుకొనుట కెట్టియాశ్రయము నగ పడకయ్యెను.

ఇట్టిస్థితిలో నాతఁడు తనలోఁ దానే ‘‘ నేనేమిచేయుదును ? ఎచ్చటికిఁ బోవుదును? అంతకునిం బోలిన సకలజీవహంతకుండనగు నాకుఁ గూడ నీశిలావర్షము భయంకరముగా నున్నది! ఇచ్చట నాకాశ్రయం బిచ్చువా రెవ్వరు నగపడుటలేదు. ఒక్కచెట్టయినను, మెట్టయైనను గూడఁ గానరాకున్నది.ఏమిచేయుదును?అతివేగముగ నేచెట్టుక్రిందికైన ను బోయి యీవర్షావేగము శాంతించువఱకును దలదాఁచుకొనియెదఁ గాక ! ’’ అని భావించుకొనుచు ద్రుతగమనంబుతో ముందటికిం బోయి కొలఁదిదూరంబునం దొకమహావృక్షముం గాంచి పెన్నిధింగన్న పేదవలె దానిక్రిందికిం బోయి నిలువఁబడియెను. విశాలశాఖావిలసితంబును, బల్లవకుసుమఫలభరితంబు నగు నమ్మహాభూరుహము నక్షత్రములలోఁ జంద్రునివలె, మృగంబులలో సింహమువలె, నాశ్రమంబులలో గృహస్థాశ్రమమువలె, ఇంద్రియంబులలో మనంబువలె శ్రేష్ఠంబై సకలభూతంబులకాశ్రయస్థానం బగుపర్వతరాజముంబోలి విరాజిల్లుచుండెను.

ఆతరువరము నాశ్రయించి యున్నయక్కిరాతునివసనంబులన్నియును వర్షధారలచేఁ దడిసి ముద్దలై యుండెను. ఆయాసముచే దేహమంతయు నవసన్నంబై యుండెను. అయవస్థలో నాతఁడు తనదారపుత్రులక్షేమముంగూర్చి భావించుకొనుచు వికలహృదయుండై యెప్పుడు వర్షము శాంతించునా, యెప్పుడింటికిఁ బోవుదునా యని యావేగపడుచుండెను. క్రమముగా నాదిత్యుం డస్తంగతుండయ్యెను.

ఆవృక్షరాజమునం దొకకపోతము భార్యతోడను, పుత్త్రపౌత్త్రులతోడను గలసి మహానందంబున సకలభోగంబుల ననుభవించుచు ని

శ్శంకచిత్తముతోఁ జాలకాలమునుండి యెంతో సుఖముగాఁ గాపురము సేయుచుండెను. పతివ్రతయైన యాతనియిల్లాలు జలానిలవహ్నిభయ వినర్జితం బగు నాతరుకోటరమునందు పతిసహితయై యతిప్రియంబు గఁ గాలక్షేపమొనర్చుచుండెను. కపోతము సర్వదా బిడ్డలతోఁ గూడి యచ్చటనే ప్రొద్దుపుచ్చుచుండెను. దైవవశంబున నీనాఁడు కపోతీక పోతంబులు రెండునుగూడ నాహారసంగ్రహంబునకై యావాసంబు విడిచిపోయెను. అందు కపోతముమాత్రము యథాసమయంబున గూఁటికి వచ్చి చేరెను గాని దౌర్భాగ్యముచేఁ గపోతి యక్కిరాతునిజాలంబునఁ దగిలికొనియెను. దాని నాలుబ్ధకుండు ప్రాణములతోనే పట్టుకొని వలలో బంధించి తెచ్చియుండెను.

అప్పు డక్కపోతము గృహిణీశూన్యం బగు గృహంబును మాతృహీనం బగు సంతానమును భయంకర మగు వర్షాపాతమును, నాక్రాంతంబగు నంధకారంబును దిలకించి యట్టిదుస్సహసమయంబున భార్యావియోగంబును భావించుకొనుచు ననేకవిధంబులఁ బలవింపఁ దొడంగెను. పాపము తనయెచ్చెలి యగుకపోతి యాచెట్టుక్రింద నున్న కిరాతునివలలోఁ దగులుకొనియున్న దన్నసంగతి యెఱుంగఁజాలక, ముక్తకంఠముతోఁ బ్రియురాలిగుణముల నీరీతిగాఁదలపోయుచు విలపింపం గడంగెను.

నాహర్షవర్ధనియు, కల్యాణియు నగునిల్లా లింకను నింటికి రాలేదు. ఆదేవి నాధర్మంబునకు జనని. నాప్రాణంబుల కధీశ్వరి. ధర్మార్థకామమోక్షంబులను పురుషార్థంబులకు నిత్యసహచరి. ప్రియురాలగు నామె నేను సంతోషముతో నున్నపుడు నగుమొగముతో నలరారుచుండును. కష్టముతో నున్నపుడు నాదుఃఖమును దూరముసేయుచుండును. నాయిల్లాలగు నామె నాయాలోచనములయందు సఖియై సర్వదా

నావచనానుసారంబుగఁ బ్రవర్తించుచుండును. అయ్యో! ఆదిత్యుండస్తంగతుండయ్యెఁ జాలసేపయినది. కల్యాణి యగునామె యింకను రాలేదు. నాప్రేయసి, నాకంటె నతిరిక్తంబు లగు వ్రతంబులనుగాని మంత్రంబులనుగాని దైవక్రియలనుగాని ధర్మములనుగాని యర్థములనుగాని యెఱింగినది గాదు. ఆమె నిరంతరమును పతిప్రాణయు, పతివ్రతయు, పతిమంత్రియు పతిప్రియయు నై యుండును. ఏకారణముననో శుభానన యగునామె యింకను నిల్లు చేరలేదు. నే నేమి సేయుదును? ఎచ్చటికిఁ బోవుదును? గృహిణీవిహీనంబగు నీగృహము భయంకరారణ్యము వలెఁ గానంబడుచున్నది. లక్ష్మీస్వరూపిణి యగు నామె యున్నప్పుడు భయంకరసమయములయందుగూడ నీగృహము శోభాయుక్తమై విరాజిల్లుచుండెడిది. గృహిణియే గృహ మని చెప్పఁబడుచున్నది. ఆమె యింకను నిలుఁ జేరకుండుటకు హేతు వేమై యుండునో! భార్యావియుక్తుండనై నే నొకనిముసమైనను ప్రాణములను భరింపఁజాలకున్నాను. ప్రియకరంబు లగు నీప్రాణములను బరిత్యజించెదనుగాక! అయ్యో! నోరెఱుంగని యీపసిబిడ్డల కేగతి గల్పించి ప్రాణములను విడువగలను? అని యనేకవిధంబుల వాపోవుచుఁ గపోతము దుఃఖింపందొడంగెను.

అప్పు డక్కిరాతునివలలోఁ దగులుకొని నిరుపాయమై పడియున్న కపోతి భర్తృవిలాపంబుల నాలకించి శోకగద్గదస్వరముతోఁ దనభర్తంగూర్చి ఖగరాజా! నే నీవ్యాధునిజాలమధ్యంబునఁ జిక్కుకొని వివశనై పడియున్నదానను. మహామతీ! హింసాపరుం డగు నీలుబ్ధకుండు నన్నుఁ బాశములచే బంధించి తెచ్చియున్నాఁడు. ఏమైన నేమి? నేను ధన్యురాలను. నీచే ననుగ్రహింపఁబడి నాజీవితము సఫలమైనది. ఏమనిన, నాపరోక్షమునందు మద్గుణకీర్తనంబు గావించుచున్న ప్రాణేశ్వరుని ప్రణయమధురవచనంబులను వినఁగలిగితిని. నాయం దట్టిగు

ణంబు లున్నను లేకున్నను నేను గృతార్థురాల నైతి ననుట కెట్టిసంశ యంబును లేదు. ప్రాణనాథుండు పరితుష్టుం డగుటకంటెం బతివ్రతల కు భాగ్య మేమున్నది? పతి సంతుష్టుం డగునేని సతులమెడ సకలదే వతలును సంతుష్టు లగుదురు. స్వామి యసంతుష్టియే సతులకు నిశ్చ యముగా సర్వనాశనకారణమైనది. నీవే నాస్వామివి. నీవే నాదేవత వు. నాప్రభుండవును మిత్రుండవును పరమాశ్రియస్థానంబును నీవే. వ్రతంబును, పరబ్రహ్మంబును, స్వర్గంబును, మోక్షంబును నాకు నీ కంటె నన్యంబులు గావు. కల్యాణమూర్తీ! నీవు నాకొఱ కెంతమా త్రంబును దుఃఖింపవలదు. నీమనంబును, నీధర్మమునందే సుస్థిరంబు గాం జేసికొనుము. నేను నీయనుగ్రహంబుచే నఖిలసుఖభోగంబులును ననుభవించితిని. ఇంక నాకొఱకు విచారించుటవలనం బ్రయోజనం బే మియును లేదు. స్వధర్మనిర్వహణంబునకై సర్వేశ్వరుని ధ్యానించుచుం గాపాడుకొనుచుండుము.

అని యివ్విధంబున నాశ్వాసించుచున్నప్రియురాలి యుపదేశ వాక్యంబుల నాలించి చటాలునం గొమ్మపై నుండి యక్కపోతము క్రిం దికి వ్రాలి పంజరమధ్యవర్తిని యగు తనహృదయేశ్వరిచెంత కరుదెంచి మృతప్రాయుండై పడియున్న యమ్మెకముకొఱకును, బంధింపంబడియు న్నభార్యను వీక్షించి ప్రియసీ! ఇప్పు డిక్కిరాతుం డచేతనప్రాయుం డై యున్నవాండు. కావున నిదియే మంచిసమయము. నీకు బంధ మోక్షణంబు గావించెదను. అని వక్కాణించుటయుం గపోతి తనప్రా ణనాథునిం గాంచి మహాభాగా! నీవు నాబంధమోచనంబునకై ప్రి యాసపడవలదు. ప్రాణిగణంబుల యన్యోన్యసంబంధము చిరస్థాయి గాదుగదా! ఖేచరంబు లగు విహంగగణంబులు వ్యాధులకు నాహార స్వరూపంబులుగా నిర్దేశింపంబడినవి. జీవులకు జీవులే యాహారంబులు.

నాశీస్వీట్టిన వ్యాధునియందు దృష్టిదోషమును గోచరించుట లేదు. కావున నీవు ధర్మతత్పరుండవై యుండుము. ద్విజాతిగణంబుల కగ్నిదేవుం డును, సకలవర్ణంబులకు బ్రాహ్మణుండును సతీగణంబులకుఁ బతియు నఖిలజనంబులకు నభ్యాగతుండును గురుస్వరూపులై యుందురు. అ భ్యాగతుండగు వానిని మధురవచనంబులచేఁ బరితుష్టుం గావించినవా నియెడల వాగ్దేవి సుప్రసన్నయై యుండును. అభ్యాగతుని కన్నప్రదా నంబు గావించినవానివిషయంబున సమరేంద్రుండు పరితృప్తుం డగును. మఱియు నట్టియభ్యాగతునకుఁ బాదోదకంబుల నర్పించినచోఁ బితృగ ణంబులును, నన్నాదిదానంబులఁ గావించినయెడలఁ బ్రజాపతియు, నుపచారాదులు చేసినచో నారాయణసహితంబుగా లక్ష్మీదేవియుఁ బ్రీతు లగుదురు. అభ్యాగతునకు సుఖశయనంబు గల్పించుటవలన స కలదేవతలును సంతోషింతురు. కావున నతిథి యగువాఁడు సర్వదా పూజ్యుఁడు. సూర్యాతపతాపంబున నలసి గృహంబున కేతెంచిన య తిథి దేవతామూర్తియే యని పెద్దలు చెప్పుదురు. అతని నారాధించు టవలన నఖిలయజ్ఞఫలంబులును లభించును. సకలదేవతలును సకలపి తృగణంబులును సకలాగ్నిగణంబులును శాంతుండు నభ్యాగతుండును నగునతిథి ననుగమించి యుందురు. అయ్యతిథిసంతుష్టివలన వారికిఁ దృప్తియు, నాతనియసంతుష్టివలన వారి కతృప్తియుఁ గలుగుచుండు ను. కావుననోనాథా! నీవు దుఃఖంబును బరిత్యజించి సర్వదా శాంతుం డవై యుండుము. నీవిమలమతి కల్యాణకారిణి యగుఁగాక! నీధర్మ మును నీవు పాలింపుము. ఉపకారులు, నపకారులునుగూడ శ్రేష్ఠులే. ఉపకారుల కందఱును నుపకారముచేయుదురు. కాని యపకారుల కుప కారంబు సేయు సాధువులే పుణ్యాత్ము లని కీర్తింపఁబడుదురు.

అని యారీతిగ గృహిణియు, గృహస్థధర్మపరాయణయు నగు

కపోతి ప్రబోధించుటయు, కపోతంబు సంతోషించి ప్రియా! నీవు భార్యాభర్తలగు మనవంటివారి కనురూపంబులగు వాక్యంబులనే వచించితివి. నీమధురవచనంబులు మంతవ్యములును, సాధుసమ్మతంబులు ననుట కెట్టిసందియంబును లేదు. కాని నేనుగూడ నించుక చెప్పవలసియున్నది. బుద్ధిమతివగునీవుగూడ నాలోచింపుము. ఈలోకమునందలి జీవులలోఁ గొందఱు సహస్రపోషకులును, గొందఱు శతపోషకులును, గొందఱు దశపోషకులునై ప్రకృష్టజీవమును సార్థకముగాఁ జేసికొనుచుందురు. కొందఱు సుఖంబుగ నాత్మపోషణంబు చేసికొనుటకుమాత్రమే సామర్థ్యము గలిగియుందురు. కొందఱుపాత్రలయందలిధాన్యంబులచేతను, కొందఱు గాదెలయందలిధాన్యంబుచేతను, కొందఱు ఘటనిక్షిప్తంబు లగు ధాన్యంబులచేతను ధనవంతులై యుందురు. కాని మనమో—చంచునిక్షిప్తపదార్థముమాత్రమే ధనముగాఁ గలవారమై యున్నారము. ఇట్టిమనము పరిశ్రాంతుం డగునీయతిథి నెట్లర్చింపఁగలుగుదుము?

అని కపోతంబు ప్రశ్నించుటయు ధర్మశీలయగుకపోతి యిట్లనియెను. నాథా! ఇప్పుడీలుబ్ధకుండు శీతార్తుండై కొయ్యవడిన యంగకంబులతో నవశుండై పడియున్నవాఁడు. ఈతని కిట్టి యవస్థలోఁ గావలసినవి యించుక యనలంబును, శుష్కకాష్ఠంబులును, జలంబును, మధురవచనంబులునుమాత్రమే. కావున నీవీసమయంబున వానిం జేకూర్చి గృహాగతుం డగునీయతిథి కుపచారంబు గావింపుము. అని ప్రియురాలు ప్రబోధించినంతనే యాపక్షీంద్రుండు వృక్షారోహణంబు చేసి నలుదెసలఁ బరికించి దూరదేశంబునందొకచో మండుచున్న యనలంబును దిలకించి తోడనే యాస్థానంబున కెగిరిపోయి జ్వలించుచున్న యొకమండుపుల్లను ముక్కుతోఁ బట్టుకొని నిమిషములో మరలి

వచ్చి యొజ్జ్వలకాష్ఠంబును గిరాతునిసన్నిధినుంచి శుష్కతృణపర్ణంబుల దానిపై నైచి పక్షంబులచే విసరుచు నగ్నిని బ్రజ్వలింపఁజేసెను. అప్పు డయ్యనలజ్వాలలవలన శీతపీడితంబులై యనళంబులై యున్న యాలుబ్ధకుని యంగకంబు లన్నియును దేఱుకొనియెను.

అట్లు సచేతనుం డయ్యును నాఁకలిబాధచేఁ దూలిపోవుచున్న యావ్యాధుం గాంచి కృపారసతరంగితాంతరంగ యగుకపోతి జాలిపడి పావనచరిత్రుం డగుతనప్రాణేశ్వరుం గాంచి మహాభాగా! కర్తవ్యకుశలుండ వగునీవిప్పుడు నేర్పుతో నాబంధవిమోచనంబు గావింపుము. నేను నాదేహముచే క్షుధార్తుం డగునీయభ్యాగతునకుఁ దృప్తివిధానంబు నాచరించెదను. ఓసువ్రతా! ఇట్లు చేసితివేని లోకంబునం దతిథిపూజనంబు గావించుపుణ్యాత్ములకుఁ గరతలామలకంబు లగుపుణ్యఫలంబు లన్నియు నీకు లభింపఁగలవు.

అని కపోతి విన్నవించుటయుఁ గపోతంబు, శుభాననా! మదీయసహధర్మిణి వగునీవు, నేను జీవించియుండఁగనే స్వతంత్రముగ ధర్మాచరణంబు సేయుట యుచితము గాదు. ఇయ్యతిథికిఁ బ్రియానుష్ఠానంబు గావించుటకు నేనే యర్హుండను. సకలధర్మవేదిని వగునీవింతియు లకను మతింపవలయును. అని చెప్పి ప్రత్యుత్తరంబు నపేక్షింపకుండఁగనే కపోతం బయ్యనలంబునకు ముమ్మాఱు ప్రదక్షిణంబు సేసి చతుర్భుజుండును, విశ్వాత్మకుండును, శరణ్యుండును, భక్తవత్సలుండు నగుమహావిష్ణువును సంస్మరించుచు, సాక్షాద్విష్ణుస్వరూపుండవగునోయభ్యాగతా! నన్నాహారంబుగాఁ బరిగ్రహింపు మని ప్రార్థించి యగ్నిప్రవేశం బొనర్చెను. అగ్నిజ్వాలామధ్యంబున నాక్షణంబునందే నిర్జీవమై పడియున్న యక్కపోతముం గాంచి నిరంతరహింసాపరాయణుండును, వజ్రకఠోరహృదయుండును నగునక్కిరాతుండు, ఛీ! ఛీ! మానవదేహధారణము

గాంచియున్న నాజీవితము నిరర్థకమైనది. కలుషదూషితం బగు నాకాయపోషణంబుకొఱకు నీపక్షిరాజము తనపవిత్రజీవితము నిచ్చుచు ప్రాణప్రాయముగా విసర్జించినది. ఆహా! మానవుండ నయ్యును నేనెంతటిక్రూరకర్ముఁడ నైపోయితిని! అని యనేకవిధంబులఁ బశ్చాత్తాపదుఃఖతుండై లుబ్ధకుండు పరితపించుచున్న సమయంబునఁ గపోతి యాతనిం గాంచి ఓమహాభాగా! సత్వరముగ నాబంధవిమోచనంబుఁ గావింపుము. అదిగో! స్వర్గాభిముఖంబుగఁ జనుచున్న నాస్వామి యప్పుడే చాల దూరమైపోవుచున్నాఁడు. అని హృదయావేగముతో నెలుంగెత్తి ప్రార్థించుటయుఁ, గిరాతుండు భీతుండునుంబోలెఁ దత్క్షణంబ పక్షిరమణిబంధవిమోచనంబుం గావించెను.

తోడనే యక్కపోతి విదగ్ధంబైన విభునిదేహమునకుఁ బ్రదక్షిణంబుసేసి యగ్నిసన్నిధానంబు గావించుకొని పతితోడియనుగమనమే పతివ్రతలకుఁ బరమధర్మము. సతుల కిదియే ప్రశస్తమార్గం బని వేదంబులు కీర్తించుచున్నవి. ఈసహగమనము జగమంతటను సమాదృతంబై యున్నది. పాములవాఁడు పుట్టలోనుండి పామును బలముకొలఁది నైకెఁ దీయునట్లే భర్త [illegible] సహధర్మిణి స్వర్గమున కాకర్షించుకొనును. పతి ననుగమించిన పతివ్రత సార్థకోటివత్సరంబులపర్యంతము స్వామితోఁ గలసి స్వర్గంబున సకలోపభోగంబుల ననుభవించుచుండును. అని ప్రశంసించుచుఁ గపోతి భూదేవికిని గంగాదేవికిని తన నివాసం బగు వనస్పతిరాజంబునకును బ్రణామంబుల నాచరించి, తన సంతానంబునకు సమాశ్వాసపూర్వకంబుగా 'మహాభాగా! నీప్రసాదంబుచే నాకిప్పుడు సతీధర్మనిర్వహణసౌభాగ్యము లభించినది. నీవిఁక నా సంతానమును క్షమింపుము. నేను నాభర్తతోఁ గలిసి స్వర్గధామంబునకుఁ బోవుచున్నాను. అని పతివ్రత యగు నాశకుంతసతీమణి పలుకు

చు పావకజ్వాలాప్రవేశంబుం గావించెను.

ఆసమయంబున వ్యోమమండలమునుండి జయజయధ్వానంబులు దశదిశలం బ్రతిధ్వనితంబు లయ్యెను. తత్క్షణమే యావిహంగదంపతులు విబుధదంపతులం బోలి సూర్యసన్నిభం బగు సుందరవిమానారూఢులై యాకాశంబున వెలుంగుచు హర్షావిష్టుండును, విస్మయవిహ్వలుండును నగు నావ్యాధు నవలోకించి మహామతీ! మే మిప్పుడు దివ్యధామంబునకుఁ బోవుచున్నారము. సెలవొసంగుము. నీవు మా కతిథివి. మాస్వర్గగమనంబునకు సోపానస్వరూపుఁడవు. నీకు నమస్కారము. అని పలుకుచున్న విమానారూఢు లగునవ్విహంగదివ్యదంపతుల నవలోకించి ప్రాణిహింసాపరాయణుం డగు నావ్యాధుండు తత్క్షణంబ ధనుశ్శరాదిమృగయాపరికరంబుల నన్నిటిని దూరంబుగ విసరి పాఱవైచి కృతాంజలియై ఓదివ్యదంపతులారా! మీరు నన్నిచ్చటఁ బరిత్యజించి పోవలదు. అజ్ఞానుండగు నిమ్మానవాధమునియెడల నించుక సత్కృపాప్రదానంబు గావించుట సాధువు లగు మీకవశ్యకర్తవ్యము. నేనిప్పుడు మీకు మాననీయుండ నగునతిథిని. నాపాపనిష్కృతి కుపాయం బుపదేశించి మఱిపోవలయును.

అని పశ్చాత్తప్తహృదయుండగు లుబ్ధకుండు ప్రార్థించుటయుఁ బక్షిదంపతులు పరమాదరంబున నీవుగౌతమీతీరంబునకుం బొమ్ము. నీ కచ్చట శుభం బగుఁగాక. నీచేసినపాపంబు లన్నియును పరమపావనియగు గోదావరినదిసన్నిధిని నివేదింపుము. అచ్చట నీవొకపక్షంబు వఱకు నిలిచి ప్రతిదినంబు నందలి పవిత్రజలంబులలో నవగాహనంబు సేయుచుండితివేని నీసర్వపాపంబులును భస్మీభూతంబు లగును. అనంతరము మరల నొకసారి యాగంగావగాహనముం గావించితివేని ముక్తపాపుండవై పవిత్రుండవగు నీ కశ్వమేధఫలంబు లభించుటయేకాక

నీవు పుణ్యాత్ముండ వయ్యెదవు. సరిద్వరయగు గౌతమీదేవి బ్రహ్మ విష్ణుమహేశ్వరులనుండి సముత్పన్న మైనది. కావున నందు మఱియు నొకసారి స్నానముచేసితివేని కలుషితంబగు నీదేహమును బరిత్యజించి శ్రేష్ఠంబగు విమానంబు నధిరోహించి నిశ్చయముగా స్వర్గధామము ను జేరఁగలవు.

అని యానతిచ్చుటయు లుబ్ధకుండు సంప్రీతుండై పక్షిదంపతు లవచనానుసారంబుగ సకలకర్మంబులను నిర్వర్తించి దివ్యవిమానారూ ఢుండును దివ్యరూపధరుండును దివ్యమాల్యాంబరభూషితుండును ది వ్యాప్సరోగణసేవితుండును నై పూర్వగతులగుకపోతదంపతులంబోలి యాతండును గౌతమీప్రభావంబున స్వర్గగతుం డయ్యెను. అప్పటినుం డియు నచ్చటి పావనతీర్థము కపోతనామంబునఁ బ్రసిద్ధంబయ్యెను. ఆ తీర్థరాజమునందు, స్నానదానపితృపూజనజపయజ్ఞాదిసకలకర్మంబులును గూడ నక్షయఫలదాయకంబులు కాఁగలవు.

కుమారతీర్థప్రశంస

కుమారా! కార్తికేయంబు, కౌమారంబు నను నామంబులచేఁ బ్రసిద్ధం బగు నొకతీర్థము విరాజిల్లుచుండును. ఆతీర్థనామశ్రవణమా త్రంబుననే మానవులు కులవంతులు, పుత్త్రవంతులు నగుదురు. పూ ర్వకాలంబున తారకాసురుండు నిహతుండై దేవతలు స్వస్థచిత్తులై యున్నసమయంబునఁ బార్వతీదేవి సంప్రీతచిత్తముతో జ్యేష్ఠపుత్త్రుం డగు కార్తికేయుం గాంచి కుమారా! ఈత్రిభువనమధ్యంబున నీకు మ నఃప్రియంబు లగుభోగ్యపదార్థంబుల నన్నిటిని నాయాజ్ఞచేతను నీజన కుం డగుమహాదేవుని యనుగ్రహంబువలనను యథాసుఖంబుగ నను భవింపు మని యానతిచ్చుటయు మాతృవచనానుసారంబుగఁ గార్తికే

యుండు, మహోత్సాహంబుతో బలవంతముగా మనస్సుఖంబుకొఱకు దేవపత్నీగణంబుల ననుభవింపఁదొడంగెను. అమరరమణీమణులుగూడఁ నట్లే యక్కుమారునియెడల సమాసక్తహృదయులై సంచరింపందొడంగిరి.

ఓనారదా! అప్పుడు సమస్తదేవతాపత్నులును కార్తికేయునిచే ననుభుక్తలగుటం గాంచి సురగణంబులాతనియకార్యంబును సహింపఁజాలక త్రిలోకమాత యగు పార్వతీదేవిచెంతకుం బోయి కుమారుని దుండగంబులను సవిస్తరంబుగా నివేదించుటయు, నద్దేవి మిగుల విచారించి కుమారునిం బిలిపించి యెన్నియో విధంబుల మందలించెనుగాని మదోన్మత్తుండగు నాతండు మాతృమాట వినక మిగుల దుర్మార్గంబునకు దిగఁబడియెను. అప్పుడు కుమారవత్సల యగు భవానీదేవి సాధుశాపవశంబున నాత్మనందనుం డెట్టి యనర్థంబు వాటిల్లునో యని పుత్త్రస్నేహంబునఁ జింతాకులితహృదయయై దేవకార్యంబు నిర్వర్తించుటకును దేవపత్నీగణంబుల రక్షించుటకును బహుప్రకారంబుల నాలోచించి యొక్కయుపాయంబు నిర్దేశించి జగన్మయి యగు నాదేవి మదోన్మత్తుండు కామించు నమరకాంతలయం దావహించియుండెను. అంతఁ గుమారుండు తాను కామించియున్న యేదేవతరుణీమణిచెంతకుం బోయి తిలకించినను ఆదివ్యకాంతయందు మాతృదేవత యగు నంబికామూర్తియే దృగ్గోచరంబగుచుండుటయు నాతఁడు లజ్జితుండై యామెకు నమస్కారంబు సేయుచు వెడలిపోవలసినవాఁ డగుచువచ్చెను. ఇట్లాతనికి సకలదేవాంగనామూర్తులయందును నిజమాతృమూర్తియే కానవచ్చుచుండుటం జేసి జగం బంతయు మాతృదేవతామయం బయియున్నట్టు లాతనికిఁ దోఁచినంతనే వైరాగ్యోదయం బయ్యెను. అప్పు డాతనికి భోగప్రవృత్తినుండి నివృత్తి గలిగించుటయే తల్లియుద్దేశ మని యాతనికిఁ దోఁచెను.

తల్లి యుద్దేశ మదియే నైయున్నయెడలఁ దొలుదొల్తఁ దనకు భోగప్రవృత్తి గలిగించుటకుఁ గారణ మేమైయుండు ననుసంశయముకూడ నాతనికిఁ గలిగెను. తల్లి తనయెడలఁ గావించిన యీసమస్తవిషయంబులును హాస్యాస్పదంబుగా నుండె నని యాతఁడు భావించుకొనెను.

కుమారుం డివ్విధంబుగ ననేకాలోచనంబులు గావించుకొని లజ్జితుండై గౌతమీతీరంబునకుం బోయి నదీగర్భంబునఁ బ్రవేశించి, తల్లీ! నాప్రార్థనము నాకర్ణింపుము. ఈక్షణమునుండి స్త్రీరూపధారిణు లగు సకలజీవులును నాకు మాతృసమాన లగుదురుగాక! అని వచించునంతలో సర్వజ్ఞుం డగు శంకరుండు పార్వతీసహితుండై సాక్షాత్కరించి, ఆఁగు మాఁగు మని నివారించుచుఁ బుత్త్రుని కెట్టివరప్రదానంబు గావింపవలయు నని యాలోచించుచుండఁ గృతాంజలిపుటుండగు స్కందుండు తండ్రిం జూచి యిట్లనియెను. దేవదేవా! నేను దేవసేనానాయకుండనై దేవేంద్రునివలె విరాజిల్లుచున్నాను. నీతనయుండగు నట్టిభాగ్యమే నాకుఁ జాలును. అన్యవరంబులతో నా కిఁకఁ బ్రయోజనం బేమి యున్నది? కాని, నీవు నా కొకవరంబును బ్రసాదింపవలయు నని భావించుచున్నాను. కావున నోదేవా! నే నిప్పుడు నాకొఱకుఁ గాదు—జగద్ధితంబును గోరి ప్రార్థించుచున్నాను. ప్రసన్నుండవై నీ వామోదింపవలయును. గురుపత్నీగమనంబు గావించిన మహాపాతకు లీగౌతమీజలంబుల నవగాహనంబు గావించినంతనే ధౌతపాతకు లయ్యెదరుగాక! ఈనదియందు దోలలాడిన తిర్యగ్జాతులు గూడ నుత్తమజన్మంబులం గాంచి రూపగుణసంపన్నులు లగుంగాక! ఇదియే నాప్రార్థనము.

అని కుమారస్వామి గోరుటయు నంబికానాథుం డట్లే యగుంగాక యని యనుగ్రహించెను. అప్పటినుండియు నాపుణ్యతీర్థము కౌ

ర్తికేయతీర్థంబు నాఁ బ్రఖ్యాతం బయ్యెను. అందు గావించిన స్నాన దానాదులు సకలయజ్ఞఫలదాయకంబులు.

కృత్తికాతీర్థవృత్తాంతము.

కార్తికేయతీర్థంబునకుఁ దరువాత కృత్తికాతీర్థము ప్రసిద్ధమైనది. అందు మజ్జనం బాచరించినంతమాత్రమున సోమపానఫలంబు లభించును. పూర్వకాలంబునఁ దారకాసురసంహారణార్థమై హుతాశనుండు భగవానుం డగుమహేశ్వరుని యమోఘవీర్యమును బానము గావించెను. అమ్మహాతేజము నాస్వాదించుటవలన దివ్యతేజుం డగు వైశ్వానరు నవలోకించి యరుంధతి తక్కఁ దక్కినఋషిపత్నులందఱును గామసంచలితహృదయ లైరి. అప్పు డయ్యగ్నిదేవునివలన నయ్యార్యవరును గర్భవతులై తపోనిష్ఠలును, వరిష్ఠలు నగుటంజేసి తమకావించిన యసత్కార్యంబునకుఁ బశ్చాత్తాపహృదయలై యేమియు నుపాయంబు గానక విచారించుచుఁ బోయి గంగాజలంబులఁ బ్రవేశించిరి. తోడనే వారిగర్భంబులు నిస్స్రావంబులై గంగాజలోపరిభాగంబున విలక్షణాకృతితోఁ దేలియాడుచు వాయువశంబున ఫేనాకృతితోనున్న యవి యన్నియుఁ గలిసికొనుటంజేసి వానినుండి యేకమూర్తియు, షడాననుండు నగుకుమారుం డుదయించెను.

ఋషిభార్యలివిధంబుగా గర్భపాతంబులు గావించుకొని తమ తమమందిరంబులఁ బ్రవేశించినంతనే వికృతరూపములతోఁ గానంబడుచున్నవారిం గాంచి ఋషులు సంశయించి "యోచంచలహృదయలారా! సతీజనంబున కెన్నటికిని స్వేచ్ఛాచరణంబు సమంజసంబు గానేరదు. కలుషమతులగు మీయాశ్రమంబుల నిలుచుట కెంతమాత్రము నర్హత లేదు. శీఘ్రముగ మీయిచ్చవచ్చినచోటికిఁ బొండు"

అని గర్హించి పరిత్యజించుటయు ఋషిపత్నులు చేయునది లేక తమయకృత్యంబును నిందించుకొనుచు నతికరుణంబుగా దుఃఖించుచుండ నారదుండు వారిచెంత కరుదెంచి రమణీమణులారా! మీరూరక యేల దుఃఖించెదరు? మహేశ్వరాత్మజుండును, దారకాంతకుండును నగుపావకాత్మజుండు గాంగేయుండును, ఆగ్నేయుండును నై విరాజిల్లుచున్న వాఁడు. మీరందఱు నేకమై పోయి యాతని నాశ్రయించినచో మహాత్ముండగు నాతఁడు మీయభీష్టఫలదాయంబు గావింపఁగలఁ డని యుపదేశించెను.

దేవర్షి యగు నారదుం డిట్లు నిష్కృతిమార్గంబు నిరూపించుటయు నారమణీమణు లించుక యూఱడిల్లి ప్రసన్నమై యందఱుం గలసి బయలు దేఱి యక్కుమారుని చెంతకుం బోయి తమవృత్తాంతం బంతయు సవిస్తరంబుగా నాతనికి నివేదించిరి. అప్పుడు కుమారుండు వారియెడలఁ గరుణించి యోతల్లులారా! మీరందఱును గలసి గౌతమీతీరంబునకుం బోయి యందలిపవిత్రజలంబులలో స్నానంబు సేయుచు మహేశ్వరుని నిరంతరము నారాధించుచుండుఁడు. నేనచ్చటికి వచ్చి మిమ్మందఱును స్వర్గంబునకుఁ బంపించెదను.

అని చెప్పుటయుఁ గృత్తికాగణంబులు కార్తికేయుని వచనానుసారంబుగా గౌతమీగంగం జేరి యందు మజ్జనంబులు గావించుచు మహేశ్వరునర్చించి పరమేశ్వరుప్రసాదంబునఁ బవిత్రులై సురమందిరగమనంబు గావించిరి. అప్పటినుండియు నాతీర్థమునకు కృత్తికాతీర్థంబను నామంబు గలిగెను. కార్తికమాసంబునఁ గృత్తికానక్షత్రసంకలితంబగు శుభదినంబున నందవగాహనంబు సేయువారికి సకలయజ్ఞఫలంబులును సిద్ధింపఁగలవు. ఆతీర్థమును స్మరించుచుండువారును, దన్మాహాత్మ్యంబు

సాక్షించుచుండువారును సర్వపాపవిముక్తులై దీర్ఘాయుష్మంతు లగు దురు.

—♦ దశాశ్వమేధతీర్థసంకీర్తనము. ♦—

బ్రహ్మదేవుం డిట్లు చెప్పందొడంగెను. మునివరులారా! దశాశ్వమేధతీర్థస్మరణంబున నశ్వమేధఫలలాభం బగును. విశ్వకర్మకు శ్రీమంతుం డగు విశ్వరూపుం డనుతనయుండు గలండు. అతనికిం బ్రథముండనుపుత్రుండు గలిగెను. ఆపృథమునకు భౌవనుం డనునందనుం డుదయించి సర్వశాస్త్రజ్ఞుండును సార్వభౌముండు నయ్యెను. ఆమహాత్ముం డొకప్పుడు తనపురోహితుం డగుకశ్యపు నవలోకించి యోముని చంద్రా! ఒక్కసారిగాదశాశ్వమేధంబులు నిర్వర్తింపవలయు నని నాకు మిగులం గుతూహలముగానున్నది. కాని యీయజ్ఞంబులనన్నిటి ని గావించుటకుం దగినపుణ్యస్థలంబేదియో యాలోచించి నిశ్చయింప వలయు నని వేడుకొనియెను.

అప్పుడు కశ్యపుండు బాగుగ నాలోచించి మహీపాలశేఖరా! పూర్వకాలమునుండియు నేస్థలంబున మహాక్రతువులన్నియును నిర్వర్తింపంబడుచుండెనో యాపవిత్రస్థానమే మనయజ్ఞానుష్ఠానంబునకును గూడ ననుకూలంబైనది. అని బోధించుటయు భౌవనుండు సమ్మతించి కశ్యపుండు నిర్దేశించినపావనస్థలమునందే యజ్ఞారంభంబు గావించెను. అనేకులగుమహర్షులు ఋత్విక్కర్మంబులయందు నియుక్తులై పని చేయుచుండిరి. పురోహితోపదేశానుసారంబుగా దశాశ్వమేధంబులును బ్రివృత్తంబు లయ్యెను కాని యెంతప్రయత్నించినను నయ్యజ్ఞంబులు సంపూర్ణంబులు గాక యుండెను.

అందుచే భౌవనుండు చింతాక్రాంతుండై యాస్థలంబున బరి

త్యజించి మఱియొకప్రదేశమున మఖారంభంబు గావించెను గాని యు చ్చటఁగూడ ననేకము లగునంతరాయంబులు తటస్థించెను. ఎంతయు త్సాహముతోఁ గార్యనిర్వహణంబు సేయుచున్నను యజ్ఞంబు లపరి పూర్ణంబులగుటంజేసి భావనుండు మిగులవిచారించి పురోహితుం డగు కశ్యపుంగాంచి మహాత్మా! మదీయంబులగునీయజ్ఞంబులు దేశకాలదో షంబుననో, నీదోషంబుననో, నాదోషంబుననో గాని సంపన్నంబులు గాక యున్నవి. ఇఁక నుపాయాంతర మేమున్నది! అని విచారముతోఁ బలుకుటయుఁ గశ్యపుండును జాలచింతించి భావనసహితుండై బృహ స్పతికి జ్యేష్ఠభ్రాత యగుసంవర్తునిపాలికింబోయి మహాత్మా! మేమొ క్కసారిగా దశాశ్వమేధంబులు గావింప సంకల్పించి యుంటిమి. అట్టి సత్కార్యనిర్వహణంబున కనురూపం బగునుత్తమప్రదేశం బెయ్యది యో, యట్టిసత్కర్మంబును సామర్థ్యముతోఁ దీర్పంగలగురుం డెవ్వరో యానతీయవలయు ననిప్రార్థించెను.

ఋషిశ్రేష్ఠుం డగుసంవర్తకుం డప్పుడించుకసేపు ధ్యాననిష్ఠుండై యాలోచించి పూజ్యులారా! మీరు త్రిలోకగురుం డగుబ్రహ్మదేవుని చెంతకుం బోయి యీవిషయంబును నివేదింపుఁడు. అద్దేవుండు మీ యుత్తమ కర్మానుష్ఠానంబునకుఁ దగిన పుణ్యస్థలంబును నిర్దేశించి మీ కెఱింగింపఁగలఁడు. అని యుపాయంబు నిరూపించుటయు నప్పు డారా జపురోహితులిరువురును నాచెంతకు వచ్చి ప్రణామపార్థనంబులు గా వించి సమస్తవృత్తాంతంబును సవిస్తరంబుగా నివేదించుటయు నేను బా గుగ నాలోచించి భావను నుద్దేశించి, రాజేంద్రా! మీ రివ్వాను గౌత మీతీరంబునకుం బొండు. పుణ్యంబు లగు యజ్ఞకర్మంబు లాపవిత్రప్రదే శంబునఁ బరిపూర్ణంబులు గాఁగలవు. మీ కిఁక వేఱొకగురునితో నా వశ్యకంబు లేదు. వేదపారగుం డగునీకశ్యపుఁడే గురుశ్రేష్ఠుండై మీ

యజ్ఞకర్మంబుల సంపన్నంబులుగాఁ జేయుఁగలఁడు. ఈగురుని యనుగ్రహంబునను, గౌతమీప్రసాదంబునను నీ వచ్చటఁ గావించు నేకాశ్వమేధంబువలననే దశాశ్వమేధఫలంబు లభింపఁగలదు.

అని యుపదేశించుటయు, భౌవనుండు సంప్రీతుండై ప్రణామపూర్వకంబుగా నాకడ సెలవు గైకొని కశ్యపసహితుండై గౌతమీతీరంబునకుం బోయి యచ్చట నశ్వమేధయాగదీక్షితుం డయ్యెను. అప్పు డయ్యజ్ఞరాజం బగు హయమేధము సముచితారబ్ధంబై యథాకాలంబునఁ బరిపూర్ణం బయ్యెను. అప్పుడు రాజగుభౌవనుండు భూదానంబు గావించుట కుద్యుక్తుండు కాఁగా, ఋత్విగ్గణంబులును, బ్రాహ్మణులును, సభాసదులును గూడ నత్యాశ్చర్యముతో నాకర్ణించుచుండ నాకాశవాణి, ‘ ఓరాజా! నీవు మీపురోహితుఁ డగుకశ్యపునకు సమస్తభూమండలంబును సంప్రదానంబు గావించుటకై సంకల్పించితివి. నీసత్సంకల్పమాత్రంబుననే సమస్తంబును సంపన్నంబైనది. కావున నీవిఁక భూదానసంకల్పమును బరిత్యజించి మహాఫలజనకం బగు నన్నదానంబును గావింపుము. ఈగంగాపులినతలంబునఁ గావించిన యన్నదానఫలము త్రిలోకమధ్యంబున మఱియెందును లభింపఁబోదు. శ్రద్ధాసహితంబుగ నన్నప్రదానమును గావించినచో నెట్టిపుణ్యంబు లభించునో ప్రశంసించు సామర్థ్య మెవ్వరికున్నది? బహుదక్షిణాన్వితంబగునీయశ్వమేధముం గావించి నీవు కృతకృత్యుండ వైతివి. నీకు భద్రం బగుఁగాక.

అని యాకాశవాణి బోధించినను, మహారాజగు భౌవనుండు మహీదానసంకల్పంబును విడువకుండుటచే భూదేవి స్వయముగా నాతని నుద్దేశించి సార్వభౌమా! మాటిమాటికి నన్ను దానముసేయవలదు. నేను జలమధ్యంబున నిమగ్ననై యుందును. కావున నీవు నన్నెట్లును

దానముచేయఁజాలవు. నీసంకల్పమును విడువు మని పల్కుటయు, భావనుండు భీతుండై, దేవి ! నే నెట్టిదానమును గావింపవలయు నని యడుగుటయు, భూదేవి మరల సకలబ్రాహ్మణసముఖంబున నోరాజా! ఈగౌతమీతటంబునఁ దిలలు, గోవులు, ధనము, ధాన్యములు మొద లగు మఱియే యితరవస్తువులు దానముచేసినను అక్షయఫలప్రాప్తిగాఁగ లదు. ఇట్టిచో నీవు నన్నేల దానముచేయవలయును? ఈగౌతమీతీ రంబునకు వచ్చి యేకగ్రాసమాత్రంబైన నన్నదానంబును గావించిన వాఁడు సమస్తదానంబులును గావించినవాఁ డగును. ఇఁక భూదాన ముతోఁ బ్రయోజన మేమున్నది? అని చెప్పుటయు సార్వభౌముం డగు భావనుండు, పృథ్వీదేవివచనంబులు పుణ్యసంగతంబు లని భావిం చి బ్రాహ్మణులకుఁ బ్రచురాన్నదానంబులను గావించెను. అప్పటి నుండియు నాతీర్థము దశాశ్వమేధిక మని ప్రసిద్ధం బయ్యెను. అం దవ గాహనంబు గావించువారికి దశాశ్వమేధఫలంబు లభియించును.

పైశాచికతీర్థప్రస్తావము.

బ్రహ్మదేవుండు మరల నిట్లనియెను. పైశాచికతీర్థము బ్రహ్మ వాదులగు మునిగణంబులచే నిత్యపూజితం బైనది. గౌతమీదక్షిణ తటంబునం గల యాతీర్థస్వరూపమును వర్ణించెదను. బ్రహ్మగిరిపా ర్శ్వంబున నంజననామకం బగు నొకశైలంబు గలదు. ఆపర్వతంబు న నంజన యనునొక యప్సరస శాపభ్రష్టయై నివసించుచుండెను. ఉ త్తమాంగముంబట్టి యామె వానరవలెఁ గానవచ్చుచుండెను. ఆమెభర్త కేసరి. ఆతని కద్రిక యను నింకొకభార్య గలదు. ఆమెయును శాపభ్ర ష్టయగునప్సరయే. ఆమె యుత్తమాంగము మార్జాలముం బోలియుం డును. అయ్యద్రికకూడ నంజనశైలమందే నివసించుచుండెను. ఒక

వ్వుడు ప్రఖ్యాతి నొందినట్టి కేసరి గౌతమీనదీస్నానమునకుం బోయి యుండెను.

ఆసమ [illegible] కే తెంచుటయు [illegible] నమ్మునిస [illegible] డు వారియెడలఁ బ్రస[illegible] బు గాపింపుఁ డని వేడ్కా ణించుటయు, నారమణీమణులలో నొక్కతె సర్వోత్కృష్టబలుం డగునొ కకుమారుని, రెండవయామె సర్వలోకహితుం డగునొక్కపుత్త్రునిఁ గోరుకొనిరి. అగస్త్యుండును నట్లే యగు నని యనుగ్రహించి దక్షిణాభి ముఖుండై వెడలిపోయెను.

అనంతరము గొంతకాలమున కొకనాఁడు, పర్వతోపరిభాగంబు న నంజనయు, నద్రికయు సవిలాసంబుగ నృత్యగీతవినోదంబులును, హా స్యాలాపంబులును గావించుచు సంచరించుచుండ వాయుదేవుండును, నిర్‌ఋతియు వారిం గాంచి కామావిష్టహృదయులై మందహాసవదనం బులతో సత్వరంబుగ వారిచెంత కరుదెంచి, ఓకాంతామణులారా! మేము వరప్రదుల మగుదేవతలము. మీ యిరువురును మాయిద్దఱకు ను భార్యలు గావలయును. అని కోరుటయు, నక్కాంతామణు లిరు వురును సమ్మతించిరి. అనంతర మంజనాదేవిగర్భంబున వాయుదేవుని వలన హనుమంతుండును, అద్రికాగర్భంబున నిఋతివలన నద్రినామ కుం డగు నొకపిశాచప్రవరుండును జనియించిరి. అప్పుడారమణీమణులు వారిం గాంచి దేవతాప్రవరులారా! మునివరప్రభావంబున మీయను గ్రహంబుచే మా కీయిరువురుతనయులును లభియించినారు. కాని, దే వేంద్రునిశాపంబుచే మాయుత్తమాంగంబులు వికృతంబులును దూషి తంబులు నై యున్నవి. కావున మీరిప్పుడు మాదోషహాళనంబున

క్షుపాయంబు నిర్దేశించి యుద్ధరింపవలయును.

అని ప్రార్థించుటయు వాయుదేవుండును, నిబుతియు సతీమణు లారా! మీరు గౌతమీతీరంబునకుం బోయి యందు స్నానదానంబు లం గావించినచో శాపవిముక్త లయ్యెదరు. అని యుపదేశించి వారిని సంప్రీతచిత్తులం గావించి యంతర్హితు లైరి.

అప్పుడు పైశాచమూర్తియు, అద్రికకుమారుండును నగుఅద్రి, భ్రాతయగు హనుమంతునిప్రీతికొఱకు విమాతయగు నంజనాదేవిని దీసికొనిపోయి పావనగౌతమీజలంబులయం దవగాహనము చేయించె ను. ఇట్లే హనుమంతుండును, మార్జాలరూపిణియు, సవతితల్లియు నగు నద్రికను గోదావరీజలంబులలో స్నానముసేయించెను. అప్పటినుండి యు నాతీర్థము పైశాచం బనియు, ఆంజనం బనియు నుభయనా మంబులచేఁ బ్రఖ్యాతం బయ్యెను. సర్వకామప్రదం బగుబ్రహ్మగిరి నుండి తూర్పుగాఁ ద్రిపంచాశత్ యోజనపర్యంతముం గల ప్రదేశము మార్జాలం బనియు, తత్పరస్థానంబు హనూమంతం బనియుఁ బ్రథితం బు లయ్యెను. గౌతమీనదియందలి యీఫేనాసంగమస్థానము సర్వకా మప్రదంబును శుభకరంబు నై యుండును. ఆప్రదేశంబున కప్పటి నుండియు శుభనామము గలిగెను.

—◆క్షుధాతీర్థోత్పత్తికథనము.◆—

ఓనారదా! భూలోకవిఖ్యాతం బగుక్షుధాతీర్థము మహాపుణ్య ఫలదాయకంబును మనోభీష్టదాయకంబు నైనది. పూర్వకాలంబున వేదవిద్వరుండును, తపోధనుండును, మహర్షియు నగుకణ్వుండు క్షుధా తురుండై యనేకాశ్రమంబులఁ దిరిగి తిరిగి క్రమంబుగా నన్నపానసమృ ద్ధంబును నతిపవిత్రింబును నగుగౌతమాశ్రిమంబుం జేరికొనియెను. ఆ

య్యాశ్రమంబునఁ జేరినంతనే కణ్వుండు తాను నిరంతరక్షుధార్తుండై యుండుటయు, గౌతముండు సకలసంపత్సమృద్ధుండై యుండుటయుఁ గాంచి తత్కాలముననందే తన్నాశ్రయించిన విషమవైరాగ్యవశంబున నిట్లు భావించుకొనియెను.

ఏమిది? ద్విజశ్రేష్ఠుండగు నీగౌతముండును, నేనునుగూడఁ దపోనిష్ఠులమేకదా! నాకెల్లవిధంబుల సమానుండై యున్న యీతనిసమీపమునకుం బోయి నే నెట్లు యాచింపఁగలను? ఈయాఁకలివలనఁ జచ్చుటకైన నంగీకరించెదను గాని యీగౌతము నాశ్రయించి యుదరపోషణంబు గావించుకొనుటకు నెంతమాత్రము సహింపఁజాలను. కావున నిప్పుడు నేను గౌతమీతీరంబునకుం బోయి యచ్చట నెట్లయిన నర్థోపార్జనంబుఁ జేసికొని జీవింతును. అని మేధావి యగుకణ్వుండు నిశ్చయించుకొని గౌతమీనదికడకుం బోయి యందవగాహనంబు చేసి శుచియై నిశ్చలచిత్తంబుతోఁ గుశాసనంబున నుపవసించి పతితపావని యగుగంగను పరమాపత్స్వరూపిణి యగుక్షుధను సంస్మరణంబు గావించి యిట్లు స్తవంబుసేయ నారంభించెను.

పరమానందకారిణీ! గంగాతరంగిణీ! సర్వజనక్లేశకారిణీ! క్షుధాదేవీ! మీకు నమస్కారము. లోకపావనీ! నీవు మహాజటాజూటమునుండి యావిర్భవించితివి. త్రిలోకవాహినీ! నీవు మహామృత్యుముఖగహ్వరమునుండి వినిర్గతవైతివి. ఓగోదావరీ! నీవు పుణ్యాత్ములకు శాంతస్వరూపిణివి. ఓక్షుధా! నీవు దురాత్ములకుఁ గ్రోధస్వరూపిణివి. మీలో నొకరు సదాకారుణ్యంబున సకలజనంబులకును బాపతాపనివారణంబు గావింతురు. మఱియొకరు పీడారూపంబున సకలజీవులకును బాపతాపంబులను గల్పింతురు. అట్టిమీయిరువురకును నమస్కారము. శ్రేయస్కారిణీ! పాపవినాశినీ! శాంతిదాయినీ! దారిద్ర్యధ్వంసినీ!

గంగాదేవీ! నీకు మరల మరల నమస్కరించుచున్నాను.

అని యిట్లు కణ్వమునీంద్రుండు స్తోత్రంబు చేయుచుండ మనోహారిణి యగు గంగాదేవియు, భీషణాకారిణి యగు క్షుధాదేవియు నాతని యెదుట సాక్షాత్కరించుటయు ద్విజశ్రేష్ఠుం డగు మునివరుండు కృతాంజలియై నమస్కరించి ఓ సర్వమంగళమాంగళ్యా! బ్రాహ్మీ! మాహేశ్వరీ! వైష్ణవీ! త్రిలోచనీ! దేవీ! గోదావరీ! నీకు నమస్కారము. నీవు శివుని జటాజూటమునుండి బయలువెడలి గౌతమపాపహారణంబు గావించి సప్తవాహినులుగా విభక్తవై సాగరాభిముఖంబుగఁ బ్రవహించుచున్నావు. తల్లీ! గౌతమీ! నీకు నమస్కారము. సమస్తపాపాత్ములకును పాపస్వరూపిణీ! ధర్మకామార్థవిధ్వంసినీ! దుఃఖలోభమయీ! క్షుధాదేవీ! నీకు నమస్కరించుచున్నాను. అని ప్రార్థించెను. అప్పు డాదేవు లిరువురుఁ బ్రసన్నలై యేకవాక్యంబుగా నో మునిసత్తా! కల్యాణమూర్తీ! నీయభీష్టంబు తెలుపు మని యనుగ్రహించినం తనే కణ్వుండు ప్రీతుండై వారిం గాంచి యథాక్రమంబుగా, ఓ దేవీ గంగా! నీవు నాకు మనోజ్ఞంబు లగు కామ్యపదార్థంబులను, అపార వైభవంబును, ఆయుర్వృత్తంబులను, భుక్తిముక్తులను బ్రసాదింపుము. పాపతరమూర్తీ! రాక్షసస్వరూపిణీ! దారిద్ర్యదాయినీ! తృష్ణాజననీ! క్షుధా! నీవు నాయందుగాని, నావంశములో నెవ్వరియందుగాని యెన్నండు నావేశింపవలదు. క్షుధాతురులైనవా రెవ్వరైన మత్కృతం బగు నీస్తవంబుచే నిన్నుఁ గీర్తించినంతనే వారిదారిద్ర్యదుఃఖంబులు వదలిపోవుఁగాక! మఱియు, మహాపుణ్యమయం బగు నీతీర్థరాజమునం దు భక్తిభావముతో స్నానదానజపాదులం గావించువారు లక్ష్మీసంపన్ను లగుదురుగాక! ఈతీర్థంబునం దైనను స్వగృహంబునం దైనను.

ఈస్తోత్రమును బఠించువారు దారిద్ర్యదుఃఖదూరులై భయవిముక్తు లయ్యెదరుగాక !

అని వేడుకొన్నంతనే గంగాక్షుధాదేవు లిద్దఱును గణ్వునికి నట్లే వరప్రదానంబు గావించి నిజస్థానంబులకుఁ బ్రస్థానంబుసేసిరి. అ ప్పటినుండియుఁ గణ్వగంగ యనియు, క్షుధాతీర్థం బనియు నీతీర్థము పేరందెను. సర్వపాపహారం బగునీతీర్థము పితృగణంబుల కతిప్రియ మైనది.

చక్రతీర్థచరిత్రము.

చక్రతీర్థనామంబున నింకొకమహాతీర్థము విఖ్యాతంబై యున్న ది. అందు భక్తిపూర్వకంబుగ మజ్జనంబు సేయువారు విష్ణులోకప్రాప్తు లగుదురు. శుక్లైకాదశీదినంబున నుపవసించి యోగనికాసంగమతీర్థంబు న స్నానంబు చేసినచో నక్షయపదలాభం బగును. పూర్వకాలంబున బహుధనసంపన్నుండగు విశ్వధరుండను నొకవైశ్యుఁ డుండెడివాఁడు. ఆతనికి ముసలితనమునందుఁ బుత్రసంతానముకలిగెను. అక్కుమారుఁ డు రూపవంతుఁడును గుణవంతుఁడును విలాసవంతుఁడును బ్రియదర్శ నుఁడునై యుండెను. విశ్వధరుం డాతనిఁ బ్రాణములకంటె నధికునిగ భా వించి పెంచుకొనుచుండఁ గొంతకాలంబున నక్కుమారుండు మృత్యు ముఖపతితుం డయ్యెను. ఆకారణముచే దుఃఖపీడితులై యున్న వైశ్య దంపతులు జీవములను భరింపఁజాలక పుత్త్రునితోఁగూడ మరణించు టకుఁ గృతనిశ్చయులై యార్తనాదంబు సేయుచుఁ గుమారా! గుణ సాగరా! నీవు మాప్రాణములకంటెను దుర్లభుండవై యుంటివి. దు రాత్ముఁడును, పాపచిత్తుండునగు కాలుఁడు యౌవనమునందే నిన్నప హరించియున్నాఁడు. దయావిహీనుం డగునాతని నేమనినిందింపఁగల

ము. అని యనేకవిధంబులఁగరుణరసంబు దొలుకాడఁ బలవించుచున్న యాదంపతులశోకంబు నాకర్ణించి యమధర్మరాజు కృపాకులితహృదయుండై యామృతపుత్రు నచ్చటనే పరిత్యజించి రమణీయంబగు గోదావరీతీరంబునకుం బోయి యందొకపులినతలంబున నుపవసించి జనార్దనధ్యానంబుఁ గావించుచుఁ గాలక్షేపంబు సేయుచుండెను.

అత్యల్పకాలంబునందే భూమండల మంతయును బ్రజాసంఘముచేఁ బ్రవృద్ధం బైపోయెను. అప్పుడు భూదేవి ఏమిది? ఇంతమందిప్రజలను నాయందు నిండించినవా రెవరు? ఇప్పు డొక్కజీవియైనను మృత్యుగ్రస్తం బగుటలేదు. ఈభార మెంతకాలము నేను మోయఁగలను? అనివిచారించుచు సురగణసహితుండై యున్న దేవేంద్రునొద్దకుం బోవుటయు భారాక్రాంతయగుభూదేవింగాంచి దేవేంద్రుండు ప్రణిపాతపూర్వకంబుగ, తల్లీ! నీయాగమనంబునకుం గారణం బేమనిప్రశ్నించెను. అప్పుడు వసుధాదేవి విబుధేశ్వరా! ప్రజ లెవ్వరును మరణించుటలేదు. నేనీభారముచే నిరంతరమును బీడిత నగుచున్నాను. దీనికిఁ గారణం బేమో యెఱుంగవలయునని నీచెంత కరుదెంచితిని. అని చెప్పుటయు నింద్రుండు, దేవీ! దీనికిఁ గారణం బొండుగలదు. దానిని నే నిదివఱకే గ్రహించియుంటిని. సురేంద్రుండ నగు నే నెఱుంగనివిషయంబు లెవ్వియునులేవు. అని చెప్పినంతనే భూదేవి యింద్రుంగాంచి అట్లయినచో నీవిప్పుడే యము నాహ్వానించి ప్రజాసంహారమునకై యాతని నియోగింపుము. అని ప్రార్థించుటయు నమరనాథుండు సత్వరంబుగ శమనుం దోడ్కొనిరావలయు నని సిద్ధకిన్నరాదుల కాజ్ఞాపించెను.

దేవేంద్రునానతిని దలందాల్చి వా రతిత్వరితంబుగ యమపురంబునకుంబోయి యన్వేషించిరిగాని యముం డచ్చటఁ గానరాఁడయ్యె

ను. తోడనే వారు మరలి వచ్చి దేవేంద్రునకు సమస్తవృత్తాంతమును నివేదించిరి. అప్పుడు శతమఖుండు శమనజనకుండగు సవితృనిం గాంచి కాలుం డెచ్చటనున్నాఁడని ప్రశ్నించెను. అప్పుడు సూర్యభగవానుండు సురేంద్రా ! కృతాంతుం డిప్పుడు గోదావరీతీరంబునఁ దీవ్రతపంబుఁ గావించుచున్నాఁడు. దానికిఁ గారణం బేమియో నేనెఱుంగను. అని చెప్పినంతనే నిర్జరేశ్వరుండు శంకితుండై, ఎంతకష్టమెంతకష్టము. ఇంక నాయమరాధిపత్య మంతరించు నని తోఁచుచున్నది. అక్కాలుండు నిశ్చయంబుగా మత్పదంబును గాంక్షించియే గౌతమీతీరంబున మహాతపంబు సేయుచున్నాఁడు. దేవతలారా ! ఈవిషయంబున నా కిట్లు తోఁచుచున్నది. అనివచించి యింద్రుండు తత్క్షణమే అప్సరోగణంబుల నాహ్వానించి ఓసురసుందరీమణులారా ! నాశత్రుండగు కృతాంతుం డిప్పుడు తపోనిరతుండై యున్నవాఁడు. ఆతనితపోభంగంబుఁ గావించుటయందు సామర్థ్యముకలవా రెవ్వరైన మీలో నున్నయెడల నాకుఁ బ్రత్యుత్తరంబిండు. అని సురేంద్రుండు వక్కాణించుటయు అప్సరస్సుందరులలో నొక్కతెయును మాఱుమాటఁ జెప్పఁజాలకపోయెను. అందుచే శక్రుండు క్రుద్ధుండై మీలో నెవ్వరును నామాటకు బదులు చెప్పరా ? మంచిది. మీరు మీయిండ్లకుం బొండు. దేవతలారా! మీరందఱును ససైన్యముగ నిప్పుడే సన్నద్ధులు కండు. మనమే స్వయముగా నచ్చటికిఁ బోయి తపోబలంబుచే స్వర్గపదంబును బడయఁగోరుచున్న యాశత్రువును వినాశంబుసేయుదము.

అని యింద్రుం డాజ్ఞాపించినంతనే దేవసేన లన్నియును సజ్జితంబులయ్యెను. లోకరక్షకుండగు శ్రీహరి యాదేవేంద్రుని యభిప్రాయంబు నెఱింగి శమనరక్షణార్థంబునకై స్వకీయంబగు చక్రమును బ్రేరణం

బుఁ గావించెను. ఆచక్రింబుపోయి నివసించినస్థానమే చక్రతీర్థనామం బున విఖ్యాతం బయ్యెను.

అనంతరము మేనక శంకితస్వాయై శతముఖుంగాంచి సురేశ్వరా! కాలునివంకఁ గటాక్షపాతంబుఁ గావించుట కేకామిని సాహసింపఁగల దు? దేవా! నీచేతులలోనైన మరణింపఁగలము గాని, కాలయముని కన్నులఁబడి నిలువఁజాలము. ప్రభూ! రూపయావనగర్వితయగు నీగణి కయొక్కతె యున్నది ఈమెకూడ నీయధికారమునకు లోఁబడినది యే. ఈమె యమసమీపమునకుఁ బోవుటకై నిన్నుఁ బ్రార్థించుచు న్నది. కావున నీ వంగీకరింపవలయును. అనుటయు సర్వదేవతా ప్రభుండగు శక్రుండు మేనకావాక్యంబుల నంగీకరించి లతాంగియు నబ లయు నగు గణికను సత్కరించి ఓసుందరీ! గణికా! నీవు శీఘ్రముగఁ బోయి మత్కార్యసాధనంబుఁ గావింపుము. కృతకృత్యవై మరలి వచ్చినంతనే నీవు శచీదేవివలె మదేకప్రణయిని వయ్యెదవు.

అని యుత్సాహపఱిచి సెలవిచ్చినంతనే ఆగణిక యాకాశగమ నంబున నచిరకాలంబుననే యమసన్నిధానంబునకుం బోయెను. అ చ్చట నామె మెల్లమెల్లఁగఁ దనదేహకాంతులచే దశదిశలును వెలుం గుచుండ విలాసవిహారంబులు సేయుచుఁ దండంబు సల్పుచున్న కాలుని చెంత సంచరింపఁదొడంగెను. అప్పుడా మోహనభావ విలాసచేష్టితము లం గాంచినంతనే కాలుని మనంబును గలఁగిపోయెను. కాలుం డప్పు డు కామాగ్నిపూరిత నేత్రద్వయంబు నున్మీలితంబుగఁజేసి గణికాభిము ఖంబుగఁ గటాక్షపాతంబుఁ గావించెను. తోడనే యాగణికారత్నము నిలువున నీరై సరిదాకారంబున గౌతమీజలంబుల సంగమించి యాతీ ర్థమాహాత్మ్యంబున మరల గణికారూపముం దాల్చి యితరగణికాకిన్న

రగణాగీయమానయై స్వర్గధామంబునకుఁ బ్రస్థానంబుఁ గావించెను.

అట్లు దివ్యవిమానంబు నధిరోహించి యాకాశమార్గంబునఁ బోవుచున్న యాగణికామణివంకఁ జంచలకటాక్షంబులు పఱగించుచు శమనుండు నిర్విణ్ణుండై యున్న సమయంబున నాతనిజనకుం డగు సవిత్రుం డచ్చట సాక్షాత్కరించి కుమారా! ప్రజాక్షయంబుఁ గావించుటయే నీకర్తవ్యధర్మము. నీవు స్వకర్మనిరతుండవగుము. చూచితివా! వాయువు నిరంతరమును బ్రవహించుచుండును. బ్రహ్మ యెప్పుడును బ్రజాసృష్టిసేయుచుండును. నేనెల్లప్పుడును ద్రిలోకపర్యటనంబుఁ గావించుచుందును. భూమిదేవి యెప్పుడును బ్రజాభరణంబు సేయుచుండును. ఇట్లే యెల్లవారికిని స్వధర్మనిర్వహణం బవశ్యకర్తవ్యంబు.

అని యాదిత్యుండు ప్రబోధించుటయు యముండు తండ్రీ! తపంబు సేయుట గర్హితకార్యంబు గాదుగదా! నేనెల్లపుడును దపోనుష్ఠానంబుం గావింపవలయు నని నిశ్చయించుకొన్నాఁడను. ప్రజాక్షయరూపంబగు మహాక్రూరకర్మంబునందు నీవు నన్నేల నియోగించెదవు? నాప్రార్థనంబు మన్నింపుమని వేఁడుకొనుచున్న కుమారుంగాంచి సూర్యభగవానుం డిట్లనియెను. ప్రియనందనా! గర్హితకార్యం బననేల? నీవొనరింపఁజాలని యసాధ్యకార్యం బేమున్నది. నీవు చూడలేదా? ఇంతకుఁ బూర్వమే యొక గణికారత్న మీగౌతమీజలంబులయం దవగాహనంబు సేసి యాక్షణమునందే కిన్నరస్తూయమానయై స్వర్గధామంబు చేరినది. అనఘా! కుమారా! నీవిచ్చట నతికఠోరంబుగఁ దపంబుఁ గావించితివి. స్థానమాహాత్మ్యముచే నట్టి నీతపం బక్షయంబైనది. అనంతంబగుదానిసీమ నాకును గోచరించుటలేదు. ఇంకను నీకుఁ దపంబుతోఁ బ్రయోజనం బేమున్నది? నిజపురగమనంబు గావింపుము.

ఇట్లాదిత్యుండు బోధించినంతనే కృతాంతుండు నిశ్శంకుండై

నిజనివాసంబునకుం బోయెను. యముం డిట్లు పోవుచుండుటం గాంచి విష్ణుచక్రింబు భగవానుండును వనమాలియు నగుగోవిందుండు నివసించియున్న దివ్యస్థానంబునకుం బ్రస్థానంబు గావించెను.

—♦ అహల్యాసంగమతీర్థమాహాత్మ్యము. ♦—

కుమారా! పూర్వకాలంబున నేను కుతూహలాక్రాంతహృదయుండనై రూపగుణవతు లగు ననేకసుందరీమణులను సృష్టించియుంటిని. వారిలో నొకరమణీమణి సర్వోత్కృష్ట సౌందర్యశాలినియై యుండెను. రూపగుణవిలాసినియు, మనోహారిణియు నగుకన్యం గాంచి నామనంబునందు దీనిని భరించుటకును, వరించుటకును దగిన సమర్థుం డెవ్వం డున్నాఁడు? దేవదానవులలోఁగాని మునిమానవగణంబులలోఁగాని యీమెకుఁ దగిన వరుం డెచ్చటను నాకు గోచరించుటలేదు. అని యనేకప్రకారంబుల నూహించి యతి లోకరూపవతి యగు నక్కన్యకను దపోనిష్ఠుండును సర్వలక్షణసంపన్నుండును, వేదవేదాంగవేదియు, గుణజ్యేష్ఠుండును, ధీమంతుండును నగు గౌతమమునీంద్రునకు సమర్పించి ఓమునిశ్రేష్ఠా! యౌవనాగమం బగునంతవఱకును నీ వీమెను బరిపాలించుచుండుము. ఎప్పు డీమె యువతి యగునో యప్పు డీసాధ్వీమణిని నాచెంతకుఁ దీసికొనిరమ్ము. అని చెప్పి యాబాలిక నాతని కొప్పగించితిని.

మహాతపోనిష్ఠచే నిర్మలహృదయుండును, మునిశ్రేష్ఠుండును నగుగౌతముండు, యథోచితంబుగ నాబాలికను బోషించుచు నిర్దిష్టకాలంబున సాలంకృత యగు నయ్యువతీమణిని నిర్వికారచిత్తముతో నాచెంతకుఁ గొనితెచ్చెను. ఆకన్యకామణినామ మహల్య. అయహల్యం గాంచి యింద్రాగ్నివరుణప్రముఖు లగుదేవగణంబులు మత్సన్నిధానంబున కేతెంచి యీసుందరీమణిని మాకుఁ బ్రసాదింపవలయు

నని యనేకవిధంబుల వేఱువేఱుగాఁ బ్రార్థించిరి. ఇట్లే మునిగణంబులును సిద్ధసాధ్యగణంబులును, యక్షరక్షోగణంబులును గూడ నామె కొఱకు [illegible] త్రిలోకములకలంకారమణిని బ్రార్థించు చుండుటయు, విశేషించి యయ్యింద్రుం డామెయెడల నత్యధికానురాగంబును బ్రకటించుటయు నా కప్పు డారమణీమణి నెవ్వరి కొసంగుట కును నిష్టము లేకపోయెను. ఇంతమంది యిట్లడుగుచున్నను గౌతముఁడు నన్నడుగనే లేదు. అప్పుడు నేను మహాత్ముం డగు గౌతముని ధైర్యగాంభీర్యాదులను జూచి విస్మితుండనై శుభానన యగు నీసుందరీమణి కన్య లెవ్వరును ననురూపవరులు గాఁజాలరు. దీనిని గౌతమునకే యర్పించెదను.

అని నిశ్చయించియు సకలసురాసురగణంబులును ఋషిగణంబులును గూడ నీమెను వాంఛించియున్నారు. అందఱహృదయంబుల నీమె కలఁచివైచినది. ఇందఱను గాదని గౌతమునకీమె నర్పించుట యెట్లు? ఇట్టి స్థితియందు వీరిని సమాధానపఱుచుట యెట్లు? అని యనేకవిధంబుల నాలోచించి, యా దేవసంఘంబుల నొక్కసారి విలోకించి యో మహాపురుషులారా! ఎవ్వఁ డీభూమండలము నంతయును బ్రదక్షిణంబు గావించి యందఱికంటె ముందుగ నాచెంత కరుదెంచునో యాతనికి నానందన యగు నీసుందరీమణి నహల్యను సంప్రదానము సేయుచున్నాను. ఇకార్యంబున నసమర్థులయినవారి కెన్నఁడును నీరమణీమణి లభియింపఁబోదు.

అని నేను నిర్దేశించినంతనే సకలదేవతలును గూడ నహల్యాలాభలాలసులై భూప్రదక్షిణంబు సేయ బహిర్గతులైరి. సకలదేవతలు నిట్లు ప్రస్థానంబు గావించుటయు నహల్యాలాభమునకై మునివరుం డగు గౌతముండును బ్రయత్నంబు గావింపఁదలంచెను. ఆసమయంబు

న సర్వకామప్రదాయినియు, అర్ధప్రసూతయు నగునొకదివ్యసురభి యచ్చట గోచరించుటయు గౌతమునం తానింగాంచి యాగోవునే భూదేవిగా భావించి యాధేనువునకును నచ్చటనున్న దేవదేవుని దివ్యలింగమునకును బ్రదక్షిణంబు గావించి తనలో సమస్తదేవతాగణంబులునుగూడ నొక్కసారి సమస్తభూమండలమునకును బ్రదక్షిణంబుసేసి వచ్చుటకుముందుగనే నేను రెండుసారులు సకలభూమండలప్రదక్షిణంబు నొనర్చితి నని నిశ్చయించుకొని తోడనే నాచెంత కరుదెంచి నమస్కారంబు సేసి కమలాసనా! విశ్వాత్మా! నీకు నమస్కారము. ఓపరబ్రహ్మమూర్తీ! నే నీసమస్తవసుధామండలమును ప్రదక్షిణంబు గావించి వచ్చితిని. దేవేశ్వరా! ఈవిషయంబున నేది యోగ్యమో యది యంతయును నీవే స్వయముగా నెఱుంగుదువు. అని విన్నవించుటయు దివ్యదృష్టిచే నే నది యంతయు నెఱింగి గౌతమునిం గాంచి మునీంద్రా! నీవు నిశ్చయంబుగా భూప్రదక్షిణంబు సేసితివి. కావున మత్కుమారిక యగు నీయహల్యను నీకర్పించుచున్నాను. ఓవిప్రర్షీ! ఏనిర్మలధర్మము నిగమంబులకుఁగూడ నవేద్యం బైనదో యట్టిదాని నీవొక్కఁడవే యెఱుంగఁగలిగితివి. అర్ధప్రసూత యగు సురభి సప్తద్వీపవతి యగు సాక్షాత్పృథ్వీస్వరూపిణి. నీవు దానిని ప్రదక్షిణంబుసేసి పృథ్వీప్రదక్షిణంబు నొనర్చినవాఁడ వైతివి. అంతియకాక దేవదేవుని దివ్యలింగమునకుఁ బ్రదక్షిణంబు గావించి ద్విగుణీకృతఫలసిద్ధుండ వైతివి. కావున సుప్రితుం డవగు నోగౌతమమునీంద్రా! నీశౌర్యంబునకును విజ్ఞానంబునకును దపఃప్రభావంబునకును నేను సర్వాంతఃకరణంబులచే సంప్రీతుండ నైతిని. ఋషిశ్రేష్ఠా! త్రిలోకరమణీలలామ యగు మదీయకన్యకారత్నమును నీకే యర్పించుచున్నాఁడను. అని చెప్పి యహల్యను గౌతమునికరంబుల యం దర్పించితిని.

అహల్యాగౌతముల కల్యాణమహోత్సవములు జరుగుచున్న సమయంబున భూప్రదక్షిణంబు గావించి దేవతలొక్కరొక్కరే యక్కడకు వచ్చి వివాహశుభక్రియలను బ్రత్యక్షముగాఁ గాంచి ప్రీతిదాయక మగు వారిదాంపత్యమునుగూర్చి వినుతించుచుఁ, దమతమనివాసంబులకుం బోయిరి. శచీపతి యగుదేవేంద్రుండుమాత్ర మహల్యం గాంచి మాత్సర్యము నహించి యేమియుఁ జేయఁజాలక నిజస్థానంబునకుం బోయెను. అహల్యాగౌతముల వివాహము జరిగినతరువాతఁ బ్రీతిచిత్తుండ నగునేను సర్వకామసుఖావహంబును పవిత్రంబును మదీయంబు నగు బ్రహ్మగిరిని మహాత్ముం డగుగౌతమున కొసంగితిని. మునివరుం డగు గౌతముండును భార్యాసహితుండై రమణీయం బగు నగ్గిరిరాజంబునకుం బోయి యచ్చట నివాసంబును గల్పించుకొని సుఖోపభోగంబుల ననుభవించుచుండెను.

ఇట్లుండ నొకప్పుడు స్వర్గనాయకుం డగుశచీనాథుండు గౌతమమునీంద్రుని పవిత్రచరిత్రంబు నాకర్ణించి యాతనిపుణ్యాశ్రమంబును, అమ్మునిచంద్రుని, ననిందితచరిత్ర యగునాతనిభార్యను దర్శింపవలయు ననుకుతూహలముతో భూలోకంబున కేతెంచి గౌతమాశ్రమంబును రూపలావణ్యవతి యగునాతనిప్రియసిని, వారివైభవంబును గనుంగొని విస్మయవిహ్వలుండై పాపాక్రాంతహృదయుం డయ్యెను. వీక్షామాత్రంబుచేతనే శతక్రతుం డహల్యయెడలఁ గామాకృష్టచిత్తుం డయ్యెను. అప్పు డాతనికి స్వపరతారతమ్యంబును, దేశకాలభేదంబును ఋషిశాపభయంబునుగూడ నించుకంతయు గోచరింపదయ్యెను. సురాధిపత్యగర్వితుం డగు నాతండు నిత్యము నహల్యను ధ్యానించుచుండెను. దానంజేసి యాతనిసర్వాంగంబులు కామసంతప్తంబు లగుచునే యుండెను. అప్పు డయ్యమరేశ్వరుండు తానాబు

హల్యాశ్రమంబునఁ బ్రవేశించియుండుట కుపాయం బేమి యని యాలోచించి బ్రాహ్మణవేషముతో వచ్చి యమ్మునీంద్రునకు శిష్యత్వముం గాంచి యయ్యాశ్రమంబున నివసించియుండెను. అట్లున్నను, అతని యభీష్టసాధనంబున కవకాశంబు లభింపదయ్యెను.

ఒకప్పుడు మహాప్రాజ్ఞుం డగు గౌతముండు పూర్వాహ్ణికక్రియలను నిర్వర్తించుటకై శిష్యసహితంబుగా నాశ్రమంబును వదలి చనియెను. ఆనాఁ డమ్మునీంద్రుం డాశ్రమప్రాంతంబులను గౌతమీతరంగిణిని అందుండు నితరవిప్రవర్గంబులను వివిధాశ్రమసస్యక్షేత్రంబులను బరీక్షించుటకై నిశ్చయించుకొనియెను. దేవేంద్రుం డిదియే సమయం బని భావించుకొని తనమనోభీష్టసాధనంబున కుద్యుక్తుండై యాక్షణమునందే గౌతమరూపంబును ధరియించి రమణీమణి యగు నహల్యం గాంచి ప్రియా! నీగుణంబులచే నే నాకృష్టుండ నైతిని. నీరూపస్మరణంబుచే నాయనుగముగునందును వైకల్యము ఘటిల్లుచుండును. అని మందహాసంబుసేయుచు నహల్యాకరగ్రహణంబు గావించి శతక్రతుండు గృహాంతరంబునఁ బ్రవేశించెను.

కాని, అమాయికయగు నాయహల్య యీకుతంత్రమును గ్రహింపఁజాలక జారుండగు నింద్రుండు నిజముగ గౌతముండే యని భావించి యాతనితో విహరించుచుండెను. ఆసమయంబున మహర్షియగు గౌతముండు శిష్యసహితుండై యాశ్రమంబునఁ బ్రవేశించెను. గౌతమమునీంద్రుండు ప్రతిదినంబును గృహంబున కేతెంచునప్పటికిఁ బ్రియభాషిణియగు నహల్య యెదురేఁగి కేలూతయొసంగి యుపచారంబులచే నాతని సంతుష్టుంగావించి ప్రియవచనంబులతోఁ బ్రొద్దుపుచ్చుచుండుట వాడుకయై యుండెను. నేఁడట్లు జరుగకుండుటంగాంచి మహాప్రజ్ఞుండగు గౌతముండు విస్మయాక్రాంతచిత్తుం డయ్యెను. ఆశ్రమ

వాసు లందఱును జూచుచుండిరి. మునిశ్రేష్ఠుండగుగౌతముండుద్వారదేశంబున నిల్చియుండెను. అప్పు డగ్నిహోత్రశాలారక్షకగణంబులు భీతులును విస్మితులునై యమ్మునివరునింగాంచి మహాత్మా! ఇదియేమివిచిత్రవ్యాపారము! నీవీయాశ్రమకుటీరంబునకు లోపలను వెలుపలనుగూడఁ గానంబడుచున్నావు! లోపలఁబ్రవేశించి.ప్రియాసహితుండవైయున్నావు. మఱియు వెలుపల శిష్యసహితుండవై నిలిచియున్నావు. ఆహా! ఏమి! నీదివ్యతపఃప్రభావము! నీవేమిటి కనేకరూపములం దాల్చియుంటివి?

అని ప్రశ్నించుటయు, గౌతమమునివరుండు గృహమధ్యంబున నేదియో విశేష మున్న దని భావించి విస్మయముతో లోపలఁ బ్రవేశించి ‘ప్రియా! అహల్యా! నాతో మాటాడ వేమి?’ అని పలికినంతనే యహల్య, యెవ్వఁడో కృత్రిమరూపధరుండై వచ్చి పాపాచరణంబు గావించె నని తలంచి భయప్రకంపితయై సత్వరంబున శయ్యనుండి చటాలున లేచి నిలువఁబడియెను. పాపాత్ముం డగునింద్రుండును మునిభయంబునఁ దత్క్షణమే మార్జాలరూపంబు ధరించెను. అప్పుడు మునీంద్రుండు భయవిహ్వలయు, వికృతయు, దూషితయు నైయున్నప్రియం గాంచి క్రోధభరంబున, ఓసీ! ఎంతసాహసము చేసితివి! అని గర్జించి పలికినంతనే లజ్జితయగు నమ్మానవతి మాఱుమాటాడఁజాలకపోయెను. అప్పు డమ్మునీంద్రుండు తదీయజారాన్వేషణంబు గావించుచు సమ్ముఖంబున బిడాలరూపంబున నున్న యింద్రుం గాంచి, “ఎవరు నీవు? సత్యమును జెప్పుము. అసత్యము చెప్పినచో భస్మీభూతునిం గావించెదను.” అని ధిక్కరించుటయు, నింద్రుండు కృతాంజలియై సవినయంబున నోతపోధనా! నేను శచీపతిని, సురపతిని, పురుహూతుఁడను. సత్యము చెప్పుచున్నాను. ఈపాపకార్యమును నేనే చేసితిని. ని

శ్చయముగా నాకావించినదుష్కార్య మతిగర్హితమైనది. స్మరశరవిభిన్నహృదయులు చేయని యకార్యము లేమున్నవి? బ్రహ్మతేజోమయా! కరుణానిధీ! మహాపాపాత్ముండ నగు నన్ను క్షమింపుము. సాధుగణంబులు కృతాపరాధులయెడలనైనను రూక్షభావం బెన్నంటికిని జూపంజాలరు. అని యీవిధంబుగా కారుణ్యభిక్షంబు నర్థించుచున్న యింద్రునియెడల నమ్మునీంద్రునికోపము ప్రశమితంబు గాదయ్యెను. గౌతముం డప్పుడు రోషావేశంబున నింద్రునిం గాంచి దురాత్మా! భగానురక్తిచే నింతటినీచకృత్యముం గావించిన నీవు సహస్రయోనివై సర్వదా గర్హితుండ వయ్యెదవుగాక! అని శపించి యింకను గోపంబు దీఱక యహల్యం గాంచి నీవు శుష్కనదివై యుండు మని శపియించెను. అప్పు డహల్య మునివరునిం బ్రసన్నుం గావించుకొనుటకై మహాత్మా! మనంబుననైన నన్యపురుషస్మరణంబు గావించుకామిను లక్షయనరకప్రాప్తు లగుటయే కాక తమపూర్వపురుషులకుం గూడ దుర్గతులం గూర్తురు. నీవు నాయెడలం బ్రసన్నుండవై నావాక్యంబుల మన్నింపుము. ఈతఁడు నీరూపంబున వచ్చి నన్నుఁ గలసియున్నాఁడు. ఈయగ్నిశాలాదక్షిగణంబు లెల్లరును దీనికి సాక్షులు. అని చెప్పినంతనే వారందఱును సత్యము! సత్యము! అని యుద్ఘోషించిరి.

అప్పు డమ్మునివరుండు సత్యవృత్తాంతంబు సమస్తంబు నెఱింగి శాంతుండై పతివ్రత యగు నహల్యం గాంచి భద్రా! నీవు నావచనానుసారంబుగ నదివై భగవతియగు గౌతమితోఁ గలిసికొన్నప్పుడు మరల నీకు మత్ప్రియం బగురూపంబు ప్రాప్తం బగుఁగాక! అని యనుగ్రహించినంతనే యహల్య నదీరూపధారిణియై ప్రవహించిపోయి గౌతమితోఁ గలసికొని మరలఁ బూర్వరూపంబును ధరించెను.

అప్పుడు దేవేంద్రుండు కృతాంజలియై మునివరా! నేను భవద్గృహాగతుండను. పాపాత్ముండను. నన్నుఁ బరిత్రాణంబుసేయుము

అని ప్రార్థించుచు మహర్షిపదకమలంబులకడఁ బతితుం డయ్యెను. అప్పుడు గౌతముండు కృపాన్వితుం డై, పురందరా! నీవు పోయి గౌతమీజలంబుల నవగాహనంబు గావింపుము. తత్క్షణమందే పాపవిముక్తుండ వై సహస్రాక్షుండ వయ్యెదవు, అని యనుగ్రహించెను.

అప్పటినుండియు నీయహల్యాసంగమతీర్థంబు పవిత్రతీర్థంబుల లోఁ బ్రధానం బయ్యెను. దీని కింద్రతీర్థం బనునామంబుగూడఁ గలదు. తీర్థసేవనుల కిది సర్వకామప్రదం బైనది.

——♦ జనస్థానతీర్థవర్ణనము. ♦——

అహల్యాసంగమతీర్థమునకుఁ దరువాత జనస్థానతీర్థము గలదు. చతుర్యోజనవిస్తీర్ణం బగునాతీర్థము స్మరణమాత్రంబుననే ముక్తిప్రదమైనది. పూర్వకాలంబున వైవస్వతాన్వయభూషణుం డగు జనకుం డనునొకమహారా జుండెను. వరుణనందన యగునాతనిసతీమణి ధర్మార్థకామమోక్షపురుషార్థంబుల కాధారస్వరూపిణియై గుణార్ణవనామంబునఁ బతిభక్తిపరాయణయై విరాజిల్లుచుండెను. ఆమహారాజునకు యాజ్ఞవల్క్యుండు పురోహితుండై యుండెను.

ఒకనాఁ డమ్మహీపాలుండు పురోహితునిం గాంచి మహాత్మా! మునిసత్తములు బాగుగఁ బరీక్షించి భుక్తిముక్తులు రెండును శ్రేష్ఠములైనవే యని నిర్ణయించి యున్నారు. అందు దాసదాసీజనంబులతోడను, రథగజతురంగాదివాహనంబులతోడను, ధనధాన్యాదులతోడను మహావైభవసంపన్నులై యిష్టోపభోగంబుల ననుభవించుటయే యత్యుత్తమం బగుభుక్తిగదా! కాని యట్టిభుక్తి పరిణామవిరసం బైనది. ఇఁక రెండవది యగుముక్తియో—కేవలము నిరత్యయమైనది. కావున నదే యది భుక్తికంటె నెల్లవిధంబుల శ్రేష్ఠతమం బైనది. ఇఁక నిప్పుడు మనము విమర్శింపవలసినవిషయ మేమనిన—భుక్తిమూలమున ముక్తిలాభముం బడయఁ గలుగుట యెట్లనువిషయమే- ముక్తి యెప్పు

మను సర్వసంగపరిత్యాగంబువలనను, గరోరదుఃఖభోగంబులవలనను మాత్రమే లభించుచుండును. విజ్ఞాననిధులగు మీరిప్పుడు బాగుగ నాలోచించి సుఖమార్గమున ముక్తి లభించునట్టియుపాయమును నిర్దేశింపవలయును.

అని జనకుండు వేడుకొనుటయుఁ బురోహితుండగుయాజ్ఞవల్క్యుండించుక యాలోచించి రాజా! జలపతి యగువరుణదేవుండు నిత్యంబును నీప్రియంబు గోరు శ్వశురుండై యున్నాఁడు. నీవిప్పు డాతనిచెంతకుఁ బోయి ప్రార్థించినచో నిశ్చయముగా నమ్మహాత్ముఁడు నీకు హితోపదేశము సేయఁగలఁడు. అని బోధించుటయు జనకుండు పురోహితసహితుండై వరుణుపాలికిం బోయి యథాక్రమంబుగా ముక్తిమార్గంబునుగూర్చి యుపదేశింపవలయు నని ప్రార్థించెను.

అప్పుడు వరుణదేవుండు వత్సా! శ్రద్ధాసహితముగ నాకర్ణింపుము. కర్మపథము, అకర్మపథమునని ముక్తికి రెండుమార్గంబులు గలవు. అకర్మమార్గముకంటెఁ గర్మమార్గమే యుత్తమం బైన దని వేదంబులు చెప్పుచున్నవి. పురుషార్థచతుష్టయము సంపూర్ణముగాఁ గర్మబద్ధమై యుండును. కేవల మకర్మమూలంబుననే ముక్తిప్రాప్తి యగుననుట పట్టికల్ల. కర్మమువలననే సర్వధర్మంబులును సిద్ధింపఁగలవు. కావున మానవులు సర్వప్రయత్నంబులచేతను వేదోక్తంబులగుకర్మంబులు నిత్యము నాచరించుచుండవలయును. సత్కర్మానుష్ఠానమువలననే జీవులకు భుక్తిముక్తులు ప్రాపించుచుండును. కావున నకర్మంబుకంటెఁ గర్మమే శుభావహమైనది. కర్మము జాతిభేదములను, ఆశ్రమభేదములను ననుసరించి యుండును. చతురాశ్రమంబులును గర్మంబునకు ద్వారరూపములై యున్నవి. అయ్యాశ్రమంబులలో గృహస్థాశ్రమము పుణ్యమయంబైనది. దానివలననే భుక్తిముక్తులు ఘటిల్లుచుండును.

అని వరుణుం డుపదేశించుటయు బుద్ధిమంతుం డగుజనకుండును, బురోహితుం డగు యాజ్ఞవల్క్యుండును సంప్రీతచిత్తులై జలపతి యగువరుణునకుఁ బ్రణామార్చనంబులు గావించి మహాత్మా! సర్వజ్ఞుం డవగు నీవు మాయెడలఁ బ్రసన్నుండవై యేదేశంబున నేతీర్థము భుక్తిముక్తిప్రదం బై నదియో తెలియింపవలయు నని ప్రార్థించుటయుఁ బ్రచేతస్వరుం డగువరుణుండు మహాభాగులారా! భూమధ్యంబున భారతవర్షము పుణ్యప్రదమైనది. అందును దండకారణ్యము సర్వోత్తమం బై నది. ఆక్షేత్రంబునం గావించిన ప్రతిసత్కర్మంబును భుక్తిముక్తిప్రదాయకమై యుండును. తీర్థసమూహంబులలో గౌతమీగంగయే మానవులకు సర్వప్రధానమై ముక్తిదాయినియై విరాజిల్లుచున్నది. అందు గావించు స్నానదానాదులు భుక్తిముక్తిప్రదంబులు.

అని బోధించుటయు జనకుండును, యాజ్ఞవల్క్యుండును బరమానందభరితాంతఃకరణులై రి. కొంతకాలంబునకు జనకుండు గౌతమీతీరంబునకుం బోయి యచ్చట నశ్వమేధయాగానుష్ఠానంబు గావించెను. విప్రవరుం డగు యాజ్ఞవల్క్యుఁడే యందలి సకలకర్మంబులను సక్రమంబుగా నిర్వర్తించెను. ఆయజ్ఞఫలంబువలన నారాజేంద్రుండు ముక్తుం డయ్యెను. జనకమహారాజు గావించిన యాయజ్ఞప్రభావమువలన గౌతమీప్రసాదముచే నింకను జాలమంది మహాపురుషులు ముక్తిలాభంబు నందఁగలిగిరి.

అప్పటినుండియు నాదివ్యతీర్థము జనస్థాననామంబున విఖ్యాతం బయ్యెను. అది జనకవంశస్థులకందఱకును యజ్ఞక్షేత్రం బయ్యెను. చతుర్యోజనవిస్తీర్ణం బగునాక్షేత్రము స్మరణమాత్రంబున సర్వపాపహరం బై నది. అందలి స్నానదానాదులును, పితృతర్పణంబులును, ఆతీర్థస్మరణసేవనంబులును మానవులకు సర్వకామప్రదంబు లైనవి.

పురాణగ్రంథమాలిక, పిఠాపురము.

ఇందు పురాణగ్రంథములు తెలుఁగువచనరూపముగా రెండేసి నెలల కొక్కొక్క సంపుటముచొప్పున 200—250 పుటలవంతు డెమ్మీసైజునఁ బ్రకటింపఁబడుచుండును.

నిబంధనలు.

1. ఇందు చందాదారులగువారు రు 0-4-0 ప్రవేశరుసుము చెల్లి లయును.
2. చందాదారులకు పోస్టేజిమనిఆర్డరుకర్చులు మేమే భరించి ఒక్కొక్కసంపుట మొకరూపాయకుమాత్రమే పంపుచుందుము. (చందాదారులుకానివారికి పోస్టేజీగాక రు 1-8-0 లు.)
3. నైజాము ఇలాకాగ్రామములవారికి వి. పి. సౌకర్య కావున నట్టివారు ప్రవేశరుసుముసహా రు 5-4-0 ముందుగాఁ జెల్లించినచో వారికి ఆయాసంపుటములు ప్రకటింపఁబడినపుడెల్ల రిజస్టర్డు బుక్కుపోస్టుగాఁ బంపుచుందుము.

సహాయులు:—సంవత్సరమునకు ముందుగ రు 10 లు నొసగువారిని సహాయులుగాఁ జేర్చుకొని వారినామములను సహాయులపట్టిలోఁ బ్రకటించుచు వత్సరమున వెలువడు ఆయాసంపుటములను రిజస్టర్డుపార్సెలుగాఁ బంపుచుందుము.

పోషకులు:—ఒక్కసారిగ నూటపదియాఱురూప్యములు గ్రంథమాలికకు విరాళముగనొసగిన భాషాభిమానులను పోషకులుగాఁ జేర్చుకొని వారినామములను గ్రంథములలోఁ బ్రకటించుచు నీగ్రంథమాలికనుండి వెలువడు గ్రంథములన్నిటి నెప్పటికప్పుడు ఆన్ రిజస్టర్డు పార్సెలుగాఁ బంపుచుందుము.

రాజపోషకులు:-ఒక్కసారిగ రెండునూటపదార్లనుగాని అంతకుఁ బైగ వారియుదారహృదయమునకుఁదోఁచునంతటిద్రవ్యముగానిదయచేయుశ్రీమంతులను జమీందారులను రాజపోషకులుగాఁజేర్చుకొనియిందు ప్రకటింపఁబడుగ్రంథములన్నిటినిరిజస్టర్డుబుక్కుపోస్టుగానంపుచుందుము.

పురాణగ్రంథమాలిక, పిఠాపురము, తూర్పుగోదావరిజిల్లా. } నడకుదుటి వీరరాజుపంతులు, సంపాదకుఁడు.

స్త్రీల వ్రతకథలు.

(బాలాంత్రపు వేంకటరావుచే రచింపఁబడినవి.)

ఇవి బాలికలకును స్త్రీలకందఱకును అత్యంతోపయుక్తములుగ నుండునట్లు రచింపఁబడినవి. ఆంధ్రులలో నోములు పట్టని స్త్రీలుండరు. పూర్వమువలె కథలు వచ్చిన పెద్దముత్తయిదువలు లేని యీయిరువదియవశతాబ్దిని, స్త్రీలలో విద్య వ్యాపించుచున్న యిప్పుడు, స్త్రీ లందఱును సులభముగఁ జదువుకొని యీనోములు పట్టుటకై సులభశైలిని రచింపఁబడినవి. ఎంతకాలముక్రిందటనో 1–2 కూర్పులు చెల్లిపోయినవి. మరల మూఁడవకూర్పు ముద్రించినాము.

ఇవి రెండుభాగములుగ, భాగమునకు 32 నోములు (ఉద్యాపనములసహా) చొప్పున రెండుభాగములలోను 64 నోములు కలవు. వెల భాగము 1 కి 0—6—0 పోస్టేజి కొనువారే భరింపవలెను. 1—2 భాగములు వెలకు సిద్ధముగ నున్నవి.

ప్రథమ భాగము.

1 మోచేటిపద్మము(మూఁగనోము) 2 వదారుకుడుముల తద్దెకథ, 3 ఉండ్రాళ్ళతద్దెకథ, 4 అట్లతద్దెకథ, 5 శ్రావణమంగళవారము కథ, 6 వరలక్ష్మీవ్రతకథ. 7 చిట్టిబొట్టుకథ, 8 పసుపుగౌరికథ, 9 మొగదోసిళ్ళకథ, 10 చిత్రగుప్తునినోముకథ, 11 విష్ణుకాంతకథ, 12 కందగౌరికథ, 13 ఉప్పుగౌరి, 14 గణేశునినోముకథ, 15 గోడిసెనోము కథ, 16 వావిల లక్ష్మీవారము కథ, 17 మారేడుదళముకథ, 18 సంపదశుక్రవారము నోముకథ, 19 మార్గశిరలక్ష్మీవారముకథ, 20 శోకములేనిసోమవారము కథ, 21 పూర్ణాదివారముకథ, 22 గ్రామకుంకుమనోముకథ, 23 వెలగలగౌరికథ, 24 ఆపదలేని ఆదివారముకథ, 25 ముప్పదిమూఁడు పున్నములనోము కథ, 26 కుంగేటి అమావాస్యనోముకథ, 27 దంపత్తాంబూలమునోముకథ, 28 పదహారుఫలములనోము కథ, 29 సౌభాగ్య తదియలుకథ, 30 మాఘపాదివారముకథ, 31 సూర్యపద్మముకథ, 32 నందికేశ్వర వ్రతకథ.

ద్వితీయ భాగము.

1 గాజుల గౌరీదేవికథ, 2 గ్రహణగౌరి కథ, 3 పాలిస్వర్గమువవెళ్ళుకథ, 4 పోలాలమావాస్యకథ, 5 కరుళ్ళగౌరీదేవికథ, 6 నిత్యశృంగారముకథ, 7 ఉదయకుంకుమనోముకథ, 8 కుంకుమగౌరినోముకథ, 9 చిక్కుళ్ళగౌరికథ, 10 తవుడుగౌరికథ, 11 శాకదానము కథ, 12 చద్దికూటిమంగళవారములకథ. 13 రేగులగౌరికథ, 14 పండుతాంబూలములనోముకథ, 15 మునికార్తికవ్రతము, 16 కన్నెతులసెమ్మకథ, 17 కాటుకగౌరికథ, 18 అట్లమీఁదఅవపువ్వులకథ, 19 వడపువ్వులనోముకథ, 20 కార్తికచలిమిళ్ళనోముకథ, 21 తరగనాదివారములకథ, 22 గుమ్మడిగౌరికథ, 23 పువ్వులతాంబూలములనోముకథ, 24 గంధంతాంబూలాలనోముకథ, 26 పసుపుతాంబూలములకథ, 27 మాఘగౌరికథ, 28 బాలాదివారములకథ, 29 బచ్చలిగౌరికథ, 30 ధైర్యలక్ష్మీకథ, 31 చిలుకముగ్గులనోముకథ, 32 బొమ్మలనోముకథ.

రెండుభాగములును ముద్రితమై సిద్ధముగానున్నవి. విరివిగా కొనువర్తకులకు మంచి కమీషను ఇయ్యఁబడును.

బాలాంత్రపు వేంకటరావు.

సుమనోరాజీవపుష్పము.

శివపురాణము.

(ఏడవ సంపుటము.)

వాయవీయసంహిత.

విచిత్రకథావిలసితము, శివతత్త్వప్రబోధకము, నానాధర్మప్రతిపాదకము నగు వాయవీయసంహిత రాబోవు మార్చి నెలలో బయలువెడలును.

చందాదారులకు పోస్టేజిమనియార్డరుకర్చులతో రు 1 0-0 మాత్రమే.

ఇతరులకు కర్చులుగాక 1 8 0.

[illegible] ము,

పిఠాపురము.

ప్రతులు కావలయువారు:—

[illegible] వీరరాజు పంతులుగారు,

సంపాదకుఁడు,

పురాణగ్రంథమాలిక,

పిఠాపురము.

అని వ్రాయవలయును.